సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 213

మంగళవారం 18-4-2023



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



కూలీలకు పెద్ద గొడుగు!


10 మంది కూలీలకు సరిపోయే సామూహిక గొడుగు - 11లో



మార్కెట్ ర్యాలీకి ఐటీ షేర్ల బ్రేక్!

సెన్సెక్స్ 530 పాయింట్ల పతనం.. నిఫ్టీ 121 పాయింట్లు డౌన్ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రిజిస్ట్రేషన్లు షురూ

దేశవ్యాప్తంగా పలు బ్యాంకులకు చెందిన 542 బ్రాంచీల్లో అమర్‌నాథ్ వార్షిక యాత్రకు పేర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది.

వివరాలు 6లో ▸



కస్టడీ పొడిగింపు

ఢిల్లీ లిక్కర్ స్కామ్ మనీ లాండరింగ్ కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా కస్టడీని ప్రత్యేక కోర్టు పొడిగించింది.

వివరాలు 6లో ▸



కాంగ్రెస్‌లోకి శెట్టర్

కర్ణాటక బీజేపీ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్ బెంగళూరులో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వివరాలు 6లో ▸



రష్యా జర్నలిస్ట్‌కు 25 ఏళ్ల జైలు శిక్ష

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం చేయడాన్ని తప్పు పట్టిన వ్లాదిమిర్‌కు దేశద్రోహం కింద రష్యా కోర్టు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది.

వివరాలు 6లో ▸



నోటీసులిచ్చి అరెస్టులా?

- వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐకి తెలంగాణ హైకోర్టు ప్రశ్న
- నేటి సాయంత్రం 4 గంటల తర్వాతే ఎంపీ అవినాశ్‌రెడ్డిని విచారణకు పిలవాలి
- అప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని దర్యాప్తు సంస్థకు ఆదేశం

- వివరాలు 2లో



అయినా.. సీబీఐ తీరు

మారలేదు

బృందం కొత్తదైనా... మునుపటి తప్పటడుగుల జాడల్లోనే దర్యాప్తు

గత దర్యాప్తు సమగ్రంగా సాగ లేదని భావించిన సుప్రీంకోర్టు

- అందుకే పిటిషనర్‌తో ఏకీభవించి.. అధికారిని మార్చాలని ఆదేశాలు
- తదనుగుణంగానే కొత్త బృందాన్ని నియమించిన దర్యాప్తు సంస్థ
- మునుపు విస్మరించిన అంశాల జోలికి ఈ బృందమూ దూరమే!
- పిటిషనర్ తులసమ్మ లేవనెత్తిన ఏ ఒక్క అంశాన్ని పట్టించుకోని తీరు
- రాజకీయ కోణాన్ని నిరూపించే ఒక్క ఆధారమూ లేదన్న సుప్రీంకోర్టు
- ఆ కోణంలో దర్యాప్తే చేయని కొత్త బృందం.. ఒక్క సాక్ష్యమూ లేదు
- కానీ వివేకా– భాస్కర్‌రెడ్డి మధ్య రాజకీయ విభేదాలున్నట్లు కామెంట్లు
- ఆధారాలేవీ లేకుండా రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించటం దారుణం
- కనీసం విచారించకుండానే ఉదయ్‌కుమార్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి అరెస్టు
- ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమంటున్న న్యాయ నిపుణులు
- తాము విచారణకు సహకరిస్తామని చెప్పినా వారిని ఏనాడూ పిలవని సీబీఐ
- కానీ వాళ్లు విచారణకు సహకరించలేదు కనుకే అరెస్టు చేశామని వెల్లడి
- అసలు విచారణకే పిలవకుండా సహకరించలేదనటం సరైనదేనా?
- సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా సాగుతున్న దర్యాప్తు



సాక్షి, అమరావతి: 'న్యాయం జరగటమే కాదు. న్యాయం జరుగుతున్నట్లు కనిపించాలి' 'ఈ కేసులో రాజకీయ కోణాన్ని నిరూపించే ఒక్క ఆధారాన్ని కూడా సీబీఐ సేకరించలేదు. సీబీఐ దర్యాప్తు సమగ్రంగా లేదు'... ఇవీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఇటీవల రెండు సందర్భాల్లో దేశ సర్వోన్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు. సీబీఐ విచారణ తీరుపై ఈ వ్యాఖ్యలు చేయటంతోనే సుప్రీంకోర్టు సరిపెట్టలేదు. దర్యాప్తు ఎలా చేయాలో స్పష్టత ఇస్తూ... దర్యాప్తు అధికారిని మార్చాలని సీబీఐని ఆదేశించింది కూడా. సీబీఐ అన్ని కోణాలనూ దర్యాప్తు చేయటం లేదని, కొందరిని దోషులుగా తేల్చాలన్న నిర్ణయాన్ని ముందే తీసేసుకుని దానికి తగ్గట్టుగా దర్యాప్తు చేస్తున్నట్లు కనిపిస్తోందని కేసులో నిందితుడైన శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ పిటిషన్ వేశారు. దానిపై సుప్రీంకోర్టు స్పందిస్తూ పైవ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు అధికారిని మార్చాలని సీబీఐని ఆదేశిస్తూ పిటిషనర్‌కు ఊరటనిచ్చింది. దాని ప్రకారమే ఐదుగురు సభ్యుల సీబీఐ బృందం కొత్తగా ఏర్పాటైంది. కానీ మునుపటి దర్యాప్తు అధికారి ఎక్కడైతే ఆగారో అక్కడి నుంచి

మిగతా 2వ పేజీలో ▶

కర్ణాటక ఎన్నికల్లో లింగాయత్ పవర్

కన్నడనాట వారి ఓట్లే కీలకం. ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రధాన పార్టీల ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో? 6లో

టన్ను రూ.లక్ష!

- మురిపిస్తున్న మామిడి
- మార్కెట్లో బంగినపల్లికి అత్యధిక ధర
- ఇతర రకాలకూ మంచి రేటు
- సువర్ణరేఖ రూ.62 వేలు..
- పణుకుల రకం రూ.40–50 వేలకు కొనుగోలు.. రైతులకు కాసులు కురిపిస్తున్న మామిడి



సాక్షి, విశాఖపట్నం: మామిడికి మార్కెట్లో మంచి ధర పలుకుతోంది. ఈ ఏడాది మామిడికాయల కాపు అంతంతమాత్రంగా ఉంది. పైగా కాపు ఆలస్యంగానూ వచ్చింది. దీంతో ధర ఆకాశాన్ని అంటుతోంది. పది రోజుల క్రితం బంగినపల్లి టన్ను ధర దాదాపు రూ.లక్ష వరకు పలికింది. మామిడిలో రారాజుగా బంగినపల్లికి ప్రత్యేక స్థానం ఉంది. దీంతో ఇతర రకాలకంటే బంగినపల్లినే ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం దీనికున్న డిమాండ్‌ను బట్టి టన్ను రూ.70–80 వేల మధ్య ఉంది. ఆ తర్వాత స్థానంలో సువర్ణరేఖ కొనసాగుతోంది. ఈ రకం ప్రస్తుతం రూ.62 వేల వరకు అమ్ముడుపోతోంది. ఇంకా పణుకులు రకం రూ.40–50 వేలు, రాజుమామిడి రకం రూ.32 వేల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 25 వేల ఎకరాల్లో మామిడితోటలున్నాయి. వీటిలో బంగినపల్లి, సువర్ణరేఖలతో పాటు తోతాపురి (కలెక్టర్), చెరకు రసాలు, గోవా, నీలం తదితర రకాలు పండుతున్నాయి. సాధారణంగా మార్చి మొదటి వారానికల్లా మార్కెట్లో మామిడికాయలు దర్శనమిస్తాయి. మార్కెట్లో ముందుగా కాపుకొచ్చే రకాలకు మంచి ధర లభిస్తుంది. కానీ ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల నెలన్నర ఆలస్యంగా కాపు మొదలైంది. పైగా 50 శాతం లోపే కాపు కాసింది. మరోవైపు ఆవకాయ పచ్చళ్లకు పచ్చి మామిడికాయలు కొంటారు. ప్రస్తుతం మామిడికాయలు పక్వానికి రాకపోయినా పచ్చళ్లకు పనికొస్తాయి. ఇవన్నీ వెరసి మామిడికి మార్కెట్లో డిమాండ్ ఏర్పడింది. ఇది ధర పెరగడానికి కారణమవుతోంది. ప్రస్తుతం మార్కెట్లో మామిడికి ఉన్న ధర లాభదాయకంగా ఉందని రైతులు ఒకింత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సీజను ఆరంభంలో సువర్ణరేఖ రకం టన్ను ధర రూ.85 వేలకు పైగా విక్రయాలు జరిగాయని పద్మనాభం మండలం రెడ్డిపల్లికి చెందిన మామిడి రైతు వైదా గురునాథరావు 'సాక్షి'కి చెప్పారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

ఈ ప్రాంతంలో మామిడి పళ్లు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. నేల స్వభావం రీత్యా ఇక్కడ కాసిన మామిడికి రుచి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల అక్కడి వారు ఈ ప్రాంత మామిడిని బాగా ఇష్టపడతారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ మామిడి కొనుగోలుకు ఆయా రాష్ట్రాల వ్యాపారులు ఆసక్తి చూపుతారు. కొంతమంది తమ ప్రతినిధులను ఇక్కడకు పంపించి కొనుగోలు చేస్తారు. మరికొందరు ఫోన్ల ద్వారా స్థానిక వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుంటారు. ఇక్కడ నుంచి లారీలు, రైల్వే వ్యాగన్ల ద్వారా మామిడిని రవాణా చేస్తుంటారు.

టన్ను రూ.65 వేలకు అమ్మాను..

నాకు ఏడెకరాల మామిడితోట ఉంది. అందులో ముందుగా పణుకులు రకం కోతకు వచ్చింది. పక్షం రోజుల క్రితం టన్ను రూ.45 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇటీవల సువర్ణరేఖ రకం టన్ను రూ.65 వేలకు విక్రయించాను. ప్రస్తుతం మార్కెట్లో సువర్ణరేఖ, బంగినపల్లి, రాజుమామిడి వంటి వాటికి మంచి ధర లభిస్తోంది. ఈ ఏడాది కాపు 50 శాతం కూడా లేదు. కాపు తక్కువ అయినప్పటికీ ప్రస్తుత రేటు ఊరటనిస్తోంది. **–రెడ్డిపల్లి శంకరరావు, మామిడి రైతు, శేరిఖండం, పద్మనాభం మండలం.**

రాష్ట్రాభివృద్ధికి అందరూ ప్రార్థించాలి



దేవుని ఆశీస్సులతో అందరూ బాగుండాలి

ముఖ్యమంత్రి జగన్ ఆకాంక్ష

రంజాన్ సందర్భంగా ఏపీ ప్రభుత్వం ఇఫ్తార్ విందు

- వివరాలు 14లో

విజయవాడ విద్యాధరపురంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు హాజరై దువా చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆర్బీకేల ద్వారా మిరప విత్తనం

- 35 కంపెనీలతో ఏపీ సీడ్స్ ఒప్పందం.. గతేడాది 9వేల ప్యాకెట్ల విత్తనం విక్రయం
- ఈ ఏడాది మరింత ఎక్కువగా అందుబాటులోకి..
- జర్మినేషన్ టెస్ట్, నాణ్యత పరీక్షించిన తర్వాతే ఆర్బీకేలకు

10లో

సచివాలయాల 'రెండో విడత'

ఉద్యోగులకూ ప్రొబేషన్

- 2020లో జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా 12,837 మందికి ఉద్యోగాలు
- రెండేళ్లు పూర్తి చేసి, డిపార్ట్‌మెంట్ టెస్టు పాసైన అందరికీ ప్రొబేషన్
- పే–స్కేలుతో కూడిన వేతనం.. మే నెల నుంచి వర్తింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ప్రొబేషన్‌తో ఉద్యోగుల వేతనం దాదాపు రెట్టింపు
- తొలి విడత ఉద్యోగాలు పొందిన లక్ష మందికి ఏడాది క్రితమే ప్రొబేషన్

3లో



ఇదండీ సంగతి



..కొన్ని రోజులు నన్ను కర్ణాటకకు ట్రాన్స్‌ఫర్ చేయండి సార్.. ప్లీజ్!

ఏపీపై పవన్‌కు ఎందుకంత కోపం?

కన్నతల్లిలాంటి రాష్ట్రాన్ని అవమానిస్తే ఆయనకు ఆగ్రహం రాదా?

- సొంత రాష్ట్రంపై కోపం.. పక్క రాష్ట్రానికి వకాల్తానా?
- తెలంగాణ, కేసీఆర్‌పై పవన్ విమర్శల వీడియో ప్రదర్శన
- వైజాగ్ స్టీల్‌పై ఆయనవి గాలి మాటలు
- జనసేన అధినేతపై మాజీమంత్రి పేర్ని నాని ఫైర్
- చంద్రబాబు కనుసన్నల్లోనే వివేకా కేసు విచారణ




సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌పై ఉన్న పళంగా అంత కోపం.. తెలంగాణ ప్రజలు, అక్కడి ప్రభుత్వంపై పవన్‌కు హఠాత్తుగా అంత ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చాయో అర్థంకావటంలేదని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలపైగానీ, అక్కడి ప్రభుత్వంపైగానీ తమకెలాంటి కోపంలేదని స్పష్టం చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. తెలంగాణ మంత్రి తన ప్రసంగంలో కన్నతల్లిలాంటి ఆంధ్రప్రదేశ్‌ను అవమానిస్తూ మాట్లాడారు. దానికి ప్రతిగా, బాధ్యతగల రాష్ట్ర మంత్రులు

మిగతా 14వ పేజీలో ▶

వైఎస్సార్‌సీపీ నేతలు తెలంగాణకు బేషరతుగా

క్షమాపణలు చెప్పాలి



- హరీష్ వ్యాఖ్యలపై.. ఏపీ నేతలు హద్దులు దాటి మాట్లాడారు
- తెలంగాణ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడడం నాకు మనస్తాపం కలిగించింది
- మీరందరూ నోరు అదుపులో పెట్టుకోవాలి
- జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ డిమాండ్

14లో

దోషులని నిర్ణయించుకుని.. అదే లక్ష్యంగా దర్యాప్తు

- వివేకా హత్య కేసులో సీబీఐ ఆరోపణలకు సాక్ష్యాలు లేవు
- రెండు చార్జిషీట్లలోనూ భాస్కర్‌రెడ్డి ప్రస్తావన కూడా లేదు
- కోర్టు అనుమతి లేకుండా నిందితుల జాబితాలో ఎలా చేరుస్తారు?
- కస్టడీ పిటిషన్‌లో ఏమీ లేదు.. రిమాండ్ పిటిషన్‌నే అలా మార్చారు
- సీబీఐ కోర్టులో భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ వాదనలు
- కస్టడీ పిటిషన్ కొట్టేయాలని భాస్కర్‌రెడ్డి వినతి
- బెయిల్ మంజూరు చేయాలని ఉదయ్‌కుమార్ అభ్యర్థన
- తీర్పు నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కొందరిని దోషులుగా నిర్ణయించుకుని, అదే లక్ష్యంగా దర్యాప్తు చేస్తోంది తప్ప.. అసలు నేరస్థులను పట్టుకునే ప్రయత్నం చేయడంలేదని మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌ల న్యాయవాదులు సీబీఐ కోర్టులో వాదనలు వినిపించారు. వాదనలు విన్న సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి సీహెచ్ రమేశ్‌బాబు తీర్పును మంగళవారానికి వాయిదా వేశారు. భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ కస్టడీ పిటిషన్‌తో పాటు ఉదయ్‌కుమార్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సోమవారం కోర్టులో వాదనలు జరిగాయి. భాస్కర్‌రెడ్డి తరఫున ఉమామహేశ్వర్, ఉదయ్ తరఫున రవీందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'ఏ–4 (దస్తగిరి) చెప్పాడని వైఎస్ భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేశారు. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల నాటి నుంచి భాస్కర్‌రెడ్డి, అవినాశ్, శివశంకర్‌రెడ్డితో వివేకాకు విభేదాలున్నాయని పేర్కొన్నారు. హత్య కోసం రూ.40 కోట్లకు ఒప్పందం కుదిరిందని, రూ.కోటి ఇచ్చారని చెప్పారు. ఈ ఆరోపణలకు ఎలాంటి సాక్ష్యాలు లేవు. రిమాండ్ పిటిషన్‌లోని సబ్జెక్ట్‌ను మార్చి కస్టడీ పిటిషన్‌గా వేశారు. దీనిని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను పాటించకుండా ఇష్టం వచ్చినట్లు పిటిషన్ దాఖలు చేశారు. ఒక్క కస్టడీ అన్న పదం తప్ప రెండు పిటిషన్లు ఒక్కటే. 75 ఏళ్ల వృద్ధుడైన భాస్కర్‌రెడ్డిని పలుమార్లు విచారణకు పిలిచారు. విచారణలో ఏం అడిగారు, ఆయన ఏ ప్రశ్నలకు సమాధానం చెప్పలేదో తెలపకుండా.. సహకరించలేదని అనడం సరికాదు. సీబీఐ కోరుకున్న విధంగా ఆయన సమాధానాలు వెల్లడించరు. అలాగే సీబీఐ దాఖలు చేసిన రెండు చార్జిషీట్లలోనూ భాస్కర్‌రెడ్డి ప్రస్తావన కూడా లేదు. ఇష్టం వచ్చినట్లు అరెస్టు చేసి నిందితుల జాబితాలో చేరుస్తున్నారు. ఇంకా ఎంత మందిని కోర్టు అనుమతి లేకుండా ఇలా చేరుస్తారో తెలియదు. సాక్షులు ఎవరన్నది కూడా పిటిషన్‌లో లేదు. తప్పుడు సాక్ష్యాలు సృష్టించి కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. భాస్కర్‌రెడ్డి వెన్నెముకకు సర్జరీ జరిగింది. చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. భాస్కర్‌రెడ్డి కస్టడీ పిటిషన్‌ను కొట్టివేయాలి' అని ఉమామహేశ్వర్ వాదించారు.

అరెస్టులతో హడావుడి

'ఉదయ్‌కుమార్‌ను ఏ నేరం కింద అరెస్టు చేశారో సీబీఐ ఎక్కడా చెప్పలేదు. సీఆర్‌పీసీ 173 ప్రకారం.. కోర్టు అనుమతి తీసుకున్న తర్వాతే ఏ–6 (ఉదయ్‌కుమార్), ఏ–7 (వైఎస్ భాస్కర్‌రెడ్డి)లను నిందితులుగా పేర్కొనాలి. కానీ కోర్టు నుంచి సీబీఐ ఎలాంటి అనుమతి తీసుకోలేదు. ఏ–6పై నమోదు చేసిన అన్ని సెక్షన్లు బెయిల్ ఇచ్చేవే. ఇప్పటికి 22 సార్లు సీబీఐ ఉదయ్‌కుమార్‌ను విచారించింది. అతని మొబైల్ తీసుకున్న అధికారులు రసీదు కూడా ఇవ్వలేదు. ఇన్నిసార్లు విచారణ జరిపి.. ఇంకా సహకరించలేదనడం హాస్యాస్పదం. తెలియని ప్రశ్నలకు సమాధానం చెప్పకపోవడం అతని హక్కు. సీబీఐ మూడేళ్లుగా విచారణ చేస్తున్నా రెండు చార్జిషీట్లు వేయడం తప్ప సాధించిన పురోగతి లేదు. సుప్రీంకోర్టు ఆదేశించిన గడువు దగ్గరపడుతుండటంతో అరెస్టులు చేస్తున్నారు తప్ప ఆధారాలను సేకరించడంలేదు. చట్టాలను పాటించడం లేదు. సీబీఐ విచారణాధికారి రాంసింగ్‌పై ఉదయ్ ఫిర్యాదు చేశారు. ఈ కేసు ఏపీ హైకోర్టులో విచారణ జరుగుతోంది. ఉదయ్‌ను చిత్రహింసలకు గురి చేస్తున్నారు. ఆయనపై మోపినవి నాన్–కాగ్నిజబుల్ నేరాలే. దీన్ని పరిగణనలోకి తీసుకుని ఉదయ్‌కి బెయిల్ ఇవ్వాలి' అని రవీందర్‌రెడ్డి కోరారు. '2017 ఎమ్మెల్సీ ఎన్నికల నాటి నుంచి వివేకాతో వైఎస్ భాస్కర్‌రెడ్డికి, శివశంకర్‌రెడ్డికి పలు విభేదాలు ఉన్నాయి. 2017లో ఎమ్మెల్సీగా పోటీ చేసిన వివేకా ఓడిపోయారు. ఈ ఓటమికి భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి కారణమని వివేకా తీవ్ర ఆగ్రహంతో ఉండేవారు. హత్య చేసిన వారు కూడా భాస్కర్‌రెడ్డికి, శివశంకర్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు' అని సీబీఐ పీపీ వాదనలు వినిపించారు.

వక్రమార్గంలో సీబీఐ విచారణ

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై రాజకీయం చేయడం తగదని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు హితవు పలికారు. ఎంపీ అవినాష్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఏ పాపం ఎరుగరని తెలిపారు. వివేకా హత్య కేసులో సీబీఐ విచారణ పూర్తి వక్రమార్గంలో జరుగుతోందని భావిస్తున్నామన్నారు. ఆయన సోమవారం తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ రాజకీయంగా దురుద్దేశాలను ఆపాదిస్తూ తాత్కాలికంగా వైఎస్సార్‌సీపీ నాయకుల్ని ఇబ్బందిపెట్టినా అంతిమంగా న్యాయం జరుగుతుందనే నమ్మకం తమకుందని తెలిపారు. గత దర్యాప్తు అధికారి రామ్‌సింగ్ తీరును సాక్షాత్తూ సుప్రీంకోర్టు తప్పుబట్టినా ఆ తర్వాత వచ్చిన అధికారీ అదే పద్ధతిలో ముందుకెళ్లడాన్ని ప్రజలు, విజ్ఞులు గమనిస్తున్నారన్నారు.

దస్తగిరితో డ్రామా!

అప్రూవర్ వాంగ్మూలం ఉత్త కథే

- బెంగళూరు భూ సెటిల్‌మెంట్ జరగనే లేదు
- భూమి పత్రాలు వైఎస్ వివేకా ఇంట్లో లేవు
- ఆ విషయాలు ఎర్ర గంగిరెడ్డికి తెలుసు
- సీబీఐ దర్యాప్తులోనే వెల్లడైన వాస్తవాలివీ
- అవన్నీ తెలిసినా దస్తగిరి చెప్పాడంటూ కట్టు కథల ఆధారంగా దర్యాప్తు


దస్తగిరి

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ఎంత బోగస్ అనేది బట్టబయలైంది. ఆ చార్జ్‌షీట్ ఎంత కల్పితాల కట్టుకథో స్పష్టమైంది. వివేకాను హత్య చేసిన దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఇప్పించిన అవాస్తవ వాంగ్మూలం బండారం బహిర్గతమైంది. వాంగ్మూలంలో దస్తగిరి పేర్కొన్న బెంగళూరు భూ సెటిల్‌మెంట్ వ్యవహారం పూర్తిగా ఫేక్ అని సీబీఐ దర్యాప్తులోనే నిర్ధారణ కావడం గమనార్హం. వివేకాతో ఆయన స్నేహితుడు ఎర్ర గంగిరెడ్డికి వివాదాలున్నాయని ఓ కట్టుకథను కేంద్ర బిందువుగా చేసుకుని దాన్ని వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డితో అంటగడుతూ దస్తగిరి ద్వారా సీబీఐ నడిపించిన డ్రామా గుట్టు వీడింది.

కొత్త బృందం.. పాత పాటే!

'బెంగళూరు భూసెటిల్‌మెంట్ వ్యవహారంలో ఎర్ర గంగిరెడ్డికి వాటా ఇవ్వకుండా వైఎస్ వివేకా ఎగ్గొట్టారు. దీంతో ఎర్ర గంగిరెడ్డి కక్ష పెంచుకుని వివేకాను హత్య చేయాలని నాతో చెప్పారు..!' ఇదీ వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన నిందితుడు దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలంలో కీలక అంశం. 'వివేకాను హత్య చేసిన తరువాత ఆ ఇంట్లో భూమి పత్రాల కోసం ఎర్రగంగిరెడ్డి గాలించారు..' అని కూడా అందులో పేర్కొన్నారు. 2019 మార్చి 14న అర్ధరాత్రి దాటిన తరువాత వైఎస్ వివేకాను హత్య చేశామని దస్తగిరి చెప్పినట్టు వాంగ్మూలంలో ఉంది. దస్తగిరిని ఢిల్లీకి తరలించి కొద్ది వారాలపాటు చిత్రహింసలు పెట్టి మరీ ఇప్పించిన ఈ వాంగ్మూలం మినహా సీబీఐ వద్ద ఎలాంటి ఆధారం లేదు. పాత బృందంతోపాటు తాజాగా నియమించిన సీబీఐ కొత్త బృందం కూడా ఈ ఒక్క వాంగ్మూలం ఆధారంగానే దర్యాప్తు కొనసాగిస్తోంది. అయితే ఆ వాంగ్మూలం కట్టుకథేనని స్పష్టమైంది.

డాక్యుమెంట్లు ఫేక్... సెటిల్‌మెంట్ ఫేక్

బెంగళూరు యలహంక ప్రాంతంలోని 8.6 ఎకరాల భూమి విషయంపై వై.రాధాకృష్ణ మూర్తి, హిమాచలపతి అనే వ్యక్తుల మధ్య విభేదాలున్నాయి. ఈ విషయం తెలిసి వైఎస్ వివేకానందరెడ్డి తన స్నేహితుడు ఎర్ర గంగిరెడ్డితోపాటు లక్ష్మీకర్, మరికొందరితోపాటు వై.రాధాకృష్ణమూర్తిని కలసి తాము ఆ వివాదాన్ని పరిష్కరిస్తామన్నారు. భూమి వివాదం పరిష్కరిస్తే రూ.8 కోట్లు ఇస్తానని రాధాకృష్ణమూర్తి చెప్పారు. యలహంక ఎమ్మెల్యేగా ఉన్న అప్పటి కర్ణాటక హోంమంత్రి ద్వారా ఆ భూ వివాదాన్ని పరిష్కరించేందుకు వైఎస్ వివేకా ప్రయత్నించారు. ఈ క్రమంలో హోంమంత్రి పోలీసు అధికారులను పిలిచి ఆ భూ వివాదంపై చర్చించడంతో రాధాకృష్ణమూర్తి ఇచ్చిన భూమి పత్రాలు ఫోర్జరీవని తేలింది.

బెడిసికొట్టిన బ్యాంకు రుణం

భూమి పత్రాలు ఫోర్జరీవని తెలిసినప్పటికీ వైఎస్ వివేకా వాటి ఆధారంగా సొమ్ము చేసుకునేందుకు రియల్ ఎస్టేట్ బ్రోకర్ పీటర్ క్యాండీని సంప్రదించారు. ఫోర్జరీ పత్రాలను బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం ఇప్పించాలని కోరారు. బ్యాంకు రుణం వస్తే అందులో 60 శాతం వివేకా, రాధాకృష్ణమూర్తి పంచుకోగా మిగిలిన 40 శాతాన్ని బ్రోకర్ పీటర్ క్యాండీ తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. లీగల్ ఖర్చుల కోసం పీటర్ క్యాండీకి మల్లిశెట్టి వెంకటరమణ అనే వ్యక్తి ద్వారా వైఎస్ వివేకా రూ.24 లక్షలు ఇప్పించారు. అయితే ఏడాది దాటినా రుణం ఇచ్చేందుకు ఏ బ్యాంకు కూడా సమ్మతించలేదు. దీంతో తాను ఇచ్చిన రూ.24 లక్షలు తిరిగి ఇవ్వాలని వివేకా, పీటర్ క్యాండీని మల్లిశెట్టి వెంకటరమణ ఒత్తిడి చేశారు. లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో 2019 ఫిబ్రవరి, మార్చిలో నాలుగు డిమాండ్ డ్రాఫ్ట్‌ల రూపంలో రూ.24 లక్షలు తిరిగి చెల్లించారు. చివరి డిమాండ్ డ్రాఫ్ట్‌ను 2019 మార్చి 12న అంటే వివేకా హత్యకు రెండు రోజుల ముందే చెల్లించారు. పీటర్ క్యాండీ తన వద్ద ఉన్న ఫోర్జరీ పత్రాలను సైతం రాధాకృష్ణమూర్తి కుమారుడు వెంకట ప్రసాద్‌కు తిరిగి ఇచ్చేశారు. ఇక ఆ భూమి సెటిల్‌మెంట్ చేయడం, బ్యాంకు రుణం తీసుకోవడం సాధ్యం కాదని తేలడంతో ఆ వ్యవహారాన్ని వదిలేశారు. ఈ సెటిల్‌మెంట్ చేసేందుకు యత్నించిన వైఎస్ వివేకా స్నేహితుడు ఎర్ర గంగిరెడ్డికి మొత్తం వ్యవహారం తెలుసు. అంటే బెంగళూరు భూ సెటిల్‌మెంట్ అన్నదే లేదని, భూమి పత్రాలు సైతం వివేకా వద్ద లేవని ఎర్ర గంగిరెడ్డికి స్పష్టంగా తెలుసు. ఇదంతా సీబీఐ దర్యాప్తులోనే వెల్లడైంది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న రాధాకృష్ణమూర్తి, హిమాచలపతి, వెంకట ప్రసాద్, పీటర్ క్యాండీలను సీబీఐ అధికారులు విచారించి మరీ దీన్ని నిర్ధారించుకున్నారు.

జరగని సెటిల్‌మెంట్.. లేని పత్రాల కోసం హత్య ఏమిటి?

అసలు బెంగళూరు భూసెటిల్‌మెంట్ అనేది జరగలేదని ఎర్ర గంగిరెడ్డికి తెలుసు. అటువంటప్పుడు వైఎస్ వివేకా తనకు వాటా ఇవ్వలేదని కక్ష ఎందుకు పెంచుకుంటారు? అంటే ఈ కారణంతో వివేకాను హత్య చేయాలని ఎర్ర గంగిరెడ్డి తనకు చెప్పినట్లు దస్తగిరి పేర్కొనడం పూర్తిగా అవాస్తవం అని తేటతెల్లమవుతోంది. వైఎస్ వివేకాను హత్య చేసిన తరువాత ఆయన ఇంట్లో బెంగళూరు భూమి పత్రాల కోసం ఎర్ర గంగిరెడ్డి, తాము గాలించినట్లు దస్తగిరి చెప్పాడు. కానీ ఆ భూమి పత్రాలను అప్పటికే రాధాకృష్ణమూర్తి కుమారుడికి తిరిగి ఇచ్చిన విషయం ఎర్ర గంగిరెడ్డికి తెలుసు. దీన్నిబట్టి దస్తగిరి చెప్పింది అవాస్తవమే అని స్పష్టమవుతోంది. ఇక బెంగళూరు భూ సెటిల్‌మెంట్ అన్నదే లేదని ఎర్ర గంగిరెడ్డికి తెలిసినప్పుడు ఆ కారణంతో వైఎస్ వివేకాను హత్య చేయమని చెప్పడంగానీ, తనకు అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి సహకారం ఉందనడం కూడా అవాస్తవం అని నిర్ధారణ అవుతోంది. అంటే అప్రూవర్ దస్తగిరి వాంగ్మూలం పేరిట సీబీఐ పూర్తిగా కల్పిత కథనాలను అల్లినట్లు తేలిపోతోంది. అసలు ఆ వాంగ్మూలమే అవాస్తవం అయినప్పుడు దాని ఆధారంగా భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డిని విచారణ పేరిట సీబీఐ వేధించడం దురుద్దేశపూరితమేనని స్పష్టమవుతోంది.

అయినా.. సీబీఐ తీరు మారలేదు

▶ మొదటి పేజీ తరువాయి

దర్యాప్తు చేస్తున్నట్టుగా ఈ బృందం నేరుగా వైఎస్ అవినాశ్ రెడ్డిని, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నట్టు గడిచిన రెండుమూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలు చెప్పకనే చెబుతున్నాయి. మరి ఇలాగైతే సుప్రీంకోర్టు తీర్పువల్ల పిటిషనర్‌కు ఏం ఊరట కలిగినట్టు? అసలు పిటిషనర్ లేవనెత్తిన అంశాలను పరిశీలించాలన్న ఉద్దేశంతోనే కదా సుప్రీంకోర్టు కొత్త బృందాన్ని ఏర్పాటు చేయమన్నది. మరి ఆ బృందం కనీసం ఆ అంశాలవైపు చూడకుండా పాత దర్యాప్తుకు కొనసాగింపుగా చేసుకుంటూ పోతే ఏమనుకోవాలి? సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తిని సీబీఐ ఖాతరు చేయాల్సిన అవసరం లేదా? వివేకానంద రెడ్డి హత్యకు బలమైన కారణాలుగా భావిస్తూ తులసమ్మ లేవనెత్తిన నాలుగు కీలక కోణాలను అసలు పట్టించుకోవడమే లేదెందుకు? ఇలాగైతే బాధ/ తులకు న్యాయం జరుగుతుందా?

దర్యాప్తు అసమగ్రం.. దర్యాప్తు బృందాన్ని మార్చడమే నిదర్శనం

ఓ కేసులో దర్యాప్తు అధికారిని మార్చాలని సుప్రీంకోర్టు ఆదేశించడం అత్యంత అరుదు. వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తులో సుప్రీంకోర్టు అటువంటి అసాధారణ నిర్ణయాన్నే తీసుకుంది. ఈ కేసు దర్యాప్తు సమగ్రంగా లేదని భావించటంతో... న్యాయసూత్రాల ఆధారంగా దర్యాప్తు ఎలా చేయాలో చెప్పటమే కాక, దర్యాప్తు అధికారిగా ఉన్న అదనపు ఎస్పీ రామ్‌సింగ్‌ను తొలగించమని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో డీఐజీ కేఆర్ చౌరాసియా నేతృత్వంలో ఎస్పీ వికాస్ సింగ్, అదనపు ఎస్పీ ముకేశ్ కుమార్‌లతో కొత్త బృందాన్ని సీబీఐ నియమించింది.

పాత బృందం తప్పటడుగుజాడల్లోనే...

పాత దర్యాప్తు బృందాన్ని మార్చమని సుప్రీంకోర్టు చెప్పిందంటేనే ... ఆ బృందం చేసిన దర్యాప్తు సక్రమంగా లేదని కదా!. వివేకాను హత్య చేసిన దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి, అతని వాంగ్మూలం ఆధారంగానే పాత దర్యాప్తు బృందం విచారణ కొనసాగించింది. ఆ దర్యాప్తు నివేదికలో ఎలాంటి ఆధారాలూ లేవని సుప్రీంకోర్టు చెప్పింది. దానర్థం అప్పటివరకు దర్యాప్తులో పట్టించుకోని కొత్త కోణాలను గుర్తించి, తగిన సాక్ష్యాలను సేకరించమని సుప్రీం కోర్టు చెప్పినట్టే కదా!. కానీ అది సీబీఐకి వినిపించ లేదు. సీబీఐ కొత్త దర్యాప్తు బృందం కూడా హంతకుడైన దస్తగిరి వాంగ్మూలం చుట్టూనే దర్యాప్తును పరిమితం చేస్తోంది. అసలు వాస్తవాల జోలికి పోవటమే లేదు. దానికి తార్కాణాలివిగో...

ఉదయ్ కుమార్‌రెడ్డిని కూడా అదే రీతిలో..

ఈ కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ప్రమేయం ఉన్నట్టుగా చెప్పాలని దర్యాప్తులో భాగంగా రామ్‌సింగ్ తనను వేధించారని గతంలో ఉదయ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలో కొత్త దర్యాప్తు బృందం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఎవరైనా భావిస్తారు. కానీ కొత్త బృందం ఉదయ్‌ని కనీసం విచారించకుండా... ఆయన ఆరోపణకు ఆధారం ఏమిటో అడగకుండా పులివెందులలోని ఆయన ఇంటికి నేరుగా వచ్చి... తమతో కడప రావాలని చెప్పి దార్లో అరెస్టు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌కు తరలించారు.

ఒక్క కొత్త ఆధారాన్ని సేకరించనే లేదు...

సుప్రీం కోర్టు కొత్త దర్యాప్తు బృందాన్ని నియమించమని ఆదేశించిందంటే... పాత దర్యాప్తు బృందం సరిగా విచారించ లేదని తేల్చినట్టే. కాబట్టి కొత్త బృందం ఈ కేసులో అప్పటివరకు విస్మరించిన కోణాలేమైనా ఉంటే వాటిని పరిశీలించాలి. అప్పటివరకు వెలుగుచూడని సాక్ష్యాలుంటే వెలికితీయాలి. కానీ డీఐజీ చౌరాసియా నేతృత్వంలో బృందం ఈ అంశాలు వేటినీ పట్టించుకోనే లేదు. ఈ కేసులో ఒక్క కొత్త ఆధారాన్నీ సేకరించలేదు. సాక్షులెవరినీ విచారించనేలేదు. అంతకుముందు రామ్‌సింగ్ బృందం ఏకపక్షంగా చేసిన దర్యాప్తునకు కొనసాగింపుగానే వ్యవహరిస్తోంది. ఆ తప్పటడుగుల్లోనే నడుస్తోంది. అంటే సుప్రీం కోర్టు తీర్పు స్ఫూర్తిని బేఖాతరు చేస్తోంది.

రాజకీయ కోణానికి ఆధారాలేవి?

వివేకా హత్య వెనుక రాజకీయ కోణం ఉందని నిరూపించే ఒక్క ఆధారాన్నీ సీబీఐ చూపించలేకపోయిందని సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పింది. కొత్త దర్యాప్తు బృందం కూడా ఆ దిశగా ఒక్క సాక్ష్యాన్ని కూడా సేకరించనే లేదు. కానీ భాస్కర్‌రెడ్డి అరెస్టు రిమాండ్ రిపోర్ట్‌లో మాత్రం రాజకీయ అంశాలను ఏకపక్షంగా ప్రస్తావించేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయిన వైఎస్ వివేకానందరెడ్డి గతంలో భాస్కర్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారని పేర్కొనడం హాస్యాస్పదమే. పాత బృందం ఇదే మాట అంటే అసలు రాజకీయ కోణం ఉన్నదనడానికి ఆధారాలేవని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దానికి ఒక్క ఆధారమూ చూపకుండానే ఈ బృందం కూడా అవే వ్యాఖ్యలను ఏకంగా రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించిందంటే ఏమనుకోవాలి?

భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యమూ లేదు...

ఈ కేసులో భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఒక్కరు కూడా సాక్ష్యం చెప్పనే లేదన్నది కీలకం. పైగా వైఎస్ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిల ప్రమేయం ఉన్నట్టుగా చెప్పాలని తమను సీబీఐ వేధిస్తోందని పలువురు సాక్షులు పేర్కొన్నారు. భాస్కర్‌రెడ్డిని ఏ ప్రాతిపదికన అరెస్టు చేశారంటే... దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలాన్నే చూపిస్తుండటం చిత్రాతిచిత్రం. ఎందుకంటే వివేకానందరెడ్డిని స్వయంగా హత్య చేసింది దస్తగిరి. 'నేనే నరికి చంపా' అని అంగీకరించింది దస్తగిరి. అలాంటి దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడమే సీబీఐ చేసిన పెద్ద పొరపాటు. ఇక దస్తగిరిని ఢిల్లీ తీసుకువెళ్లి చిత్రహింసలు పెట్టి మరీ అప్రూవర్‌గా మార్చారని ఈ కేసులో మరో నిందితుడైన ఎర్ర గంగిరెడ్డి గతంలోనే చెప్పారు. మరోవైపు ఈ కేసులో ఇతర నిందితులను అరెస్టు చేస్తూ... వారికి బెయిల్ ఇవ్వడానికి వీల్లేదని వాదిస్తున్న సీబీఐ... వివేకానందరెడ్డిని స్వయంగా హత్యచేశానని ఒప్పుకున్న నిందితుడు దస్తగిరి బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకించకపోవడం విడ్డూరమే. ఈ అంశాలన్నింటినీ కొత్త దర్యాప్తు బృందం కనీసం విశ్లేషించనే లేదు. హంతకుడైన దస్తగిరి బయట తిరుగుతుంటే... అప్రూవర్‌గా అతనిచ్చిన అహేతుకమైన వాంగ్మూలం ఆధారంగా పలువురిని అరెస్టు చేస్తుండటమే విస్మయకరం.

కనీసం విచారించకుండానే అరెస్టులా...!?

ఉదయ్ కుమార్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిలను సీబీఐ అరెస్టు చేసిన తీరు సహజ న్యాయసూత్రాలకు పూర్తిగా విరుద్ధం. ఎందుకంటే ఏ నిందితుడినైనా విచారించకముందు అరెస్టు చేయటమనేది ఉండదు. కానీ ఈ దర్యాప్తు బృందం వారిని విచారించకుండానే అరెస్టు చేసేసింది. తాను విచారణకు సిద్ధంగా ఉన్నానని, పూర్తిగా సహకరిస్తానని భాస్కర్‌రెడ్డి మొదటి నుంచీ చెబుతున్నారు. పాత దర్యాప్తు బృందం ఓసారి ఆయన్ను విచారణకు రావాలని ఫోన్ చేసి పిలిచింది. దాంతో కడప జైలు వద్ద సీబీఐ అధికారుల కార్యాలయానికి వెళ్లారు. చాలాసేపు నిరీక్షించినా సీబీఐ ఆయన్ని విచారణకు పిలవ లేదు. పైగా నోటీసులివ్వకుండా ఎందుకు వచ్చారన్నట్టు మాట్లాడారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి పుట్టినరోజు, పెళ్లి రోజు ఒకేరోజు. గత 20ఏళ్లుగా ఆ రోజున తీర్థయాత్రకు వెళుతున్నారు. ఈ ఏడాది కూడా సీబీఐ అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకుని వెళ్లారు. అంటే సీబీఐ అధికారుల విచారణకు ఆయన మొదటి నుంచీ పూర్తిగా సహకరిస్తూనే ఉన్నారు. అటువంటి భాస్కర్‌రెడ్డిని కొత్త దర్యాప్తు బృందం కనీసం విచారించకుండానే నేరుగా వచ్చి అరెస్టు చేయడం విస్మయపరుస్తోంది. నోటీసులిచ్చి విచారించిన తరువాతే తదుపరి చర్యలు తీసుకోవాలన్న కనీస నిబంధనను కూడా పట్టించుకోలేదు. పైగా ఆయన విచారణకు సహకరించడం లేదని కోర్టులో చెప్పటం చూస్తే... విచారణ ఏ రీతిన సాగుతోందో అర్థమవుతుంది. అసలు ఆయన్ని విచారించేందుకు నోటీసే ఇవ్వని సీబీఐ ఆయన విచారణకు సహకరించడం లేదని ఎలా చెబుతుంది? పైగా వైఎస్ భాస్కర్‌రెడ్డిని ఏకపక్షంగా అరెస్టు చేశాక.. విచారణ కోసం 10 రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరడం ఉద్దేశపూర్వకంగా వేధించటానికేనని స్పష్టంకాక మానదు.

ఆ నాలుగు కోణాల్లో దర్యాప్తే చేయని సీబీఐ!

ఈ కేసులో సీబీఐ అరెస్టు చేసిన శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ కీలకమైన నాలుగు అంశాలను ప్రస్తావిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ కోణాల్లో దర్యాప్తు జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న ఆమె వాదనను న్యాయస్థానం నమోదు చేసింది కూడా. ఆమె లేవనెత్తిన అంశాలు ఇవీ..

1. వైఎస్ వివేకానందరెడ్డి రెండో వివాహంతో ఆ కుటుంబంలో ఆర్థిక విభేదాలు తలెత్తాయి.
2. వివేకానందరెడ్డికి కొందరితో ఉన్న ఆర్థిక లావాదేవీలు, సెటిల్‌మెంట్ వ్యవహారాలున్నాయి.
3. వివేకానందరెడ్డి అక్రమ లైంగిక సంబంధాలున్నాయి. దీనిపై ఆయన పట్ల కొందరు వ్యక్తిగత కక్ష పెంచుకున్నారు.
4. వివేకా రాజకీయ వారసత్వం కోసం ఆయన సొంత కుటుంబ సభ్యుల మధ్య విభేదాలున్నాయి.

కాకపోతే ఈ అంశాలపై కొత్త సీబీఐ బృందం కనీసం దృష్టి కూడా పెట్టలేదు.

నోటీసులిచ్చి అరెస్టులా?

- విచారణకు సహకరిస్తున్నా సీబీఐ తప్పుడు ప్రచారం చేస్తోంది
- వివేకా హత్యకు ప్రధానంగానాలుగు కారణాలున్నాయి..
- ఆర్థిక విభేదాలు, కుటుంబ తగాదాలు, మహిళలతో అక్రమ సంబంధాలు, రాజకీయ అంశాలు
- హైకోర్టుకు నివేదించిన అవినాశ్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని మంగళవారం సాయంత్రం 4 గంటల తర్వాతే విచారణకు పిలవాలని, అప్పటివరకు ఆయనపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని సీబీఐని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. 160 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చి ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించింది. వాదనలు విన్న అనంతరం అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను నేటికి వాయిదా వేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐ విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో సీబీఐ తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోరుతూ ఎంపీ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సురేందర్ సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. వైఎస్ వివేకా హత్యకు ప్రధానంగా నాలుగు కారణాలున్నాయని న్యాయస్థానానికి నివేదించారు. ఒకటి.. ఆర్థికపరమైన విభేదాలు, రెండు.. కుటుంబ తగాదాలు, మూడోది.. మహిళలతో అక్రమ సంబంధాలు, నాలుగు.. రాజకీయ అంశాలున్నట్లు తెలిపారు.

ఇతర కోణాలు చాలా ఉన్నాయి..

'కిరాయి హంతకుడు దస్తగిరి వాంగ్మూలం మినహా ఎలాంటి ఆధారం లేకుండా అరెస్టులు చేయడం చట్టవిరుద్ధం. ఇప్పటివరకు మెటీరియల్‌ను మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టలేదు. 2021 అక్టోబర్ 26న సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఏ–1 నుంచి ఏ–4 వరకు నిందితులుగా పేర్కొంది. 2022 జనవరి 31న అనుబంధ చార్జిషీట్ దాఖలు చేస్తూ ఏ–1 నుంచి ఏ–5 వరకు నిందితులుగా పేర్కొంది. సీఆర్‌పీసీ 160 కింద పిటిషనర్‌కు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే జనవరి 28, ఫిబ్రవరి 24, మార్చి 10, మార్చి 14వ తేదీల్లో 160 సీఆర్‌పీసీ కింద విచారణకు హాజరైన పిటిషనర్ వాంగ్మూలాన్ని సీబీఐ రికార్డు చేసింది. తనను సీబీఐ చిత్రహింసలకు గురి చేస్తోందని నిజం చెబుతానని దస్తగిరి పేర్కొనడంతో గంగిరెడ్డి వారించారని, భయపడాల్సిన పనిలేదని, మన వెనుక అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి ఉన్నారని చెప్పినట్లు సీబీఐ పేర్కొంది. అంటే దస్తగిరిని చిత్రహింసలకు గురి చేసినట్లు తెలుస్తోంది. అందుకే సీబీఐ చెప్పినట్లు వాంగ్మూలం ఇచ్చాడు. 2022 ఆగస్టులో సీబీఐకి అనుకూలంగా దస్తగిరి వాంగ్మూలం ఇవ్వడంతో రెండు నెలలు తిరగకుండానే అక్టోబర్‌లో ముందస్తు బెయిల్‌కు పూర్తిగా సహకరించింది. పిటిషనర్ పార్లమెంట్ సభ్యుడు. ఆయన పరువుకు భంగం కలిగేలా దర్యాప్తు సంస్థ వ్యవహరిస్తోంది. నిందితుడిగా పేర్కొంటూ మీడియాకు స్టేట్‌మెంట్లు ఇస్తోంది. పిటిషనర్ తండ్రి భాస్కర్‌రెడ్డి 75 ఏళ్ల వయసులో ఆరోగ్యం సహకరించకున్నా కడపలో సీబీఐ విచారణకు హాజరయ్యారు. స్పష్టమైన ఆధారాలు లేనప్పుడు నిందితులకు బెయిల్ ఇవ్వాలని గత తీర్పులు చెబుతున్నాయి. అసలు ఈ కేసులో ఆర్థిక, కుటుంబ, ఇతర తగాదాలు చాలా ఉన్నాయి. ఆ కోణంలో సీబీఐ కనీసం పరిశోధన చేయడం లేదు. వివేకా చాలా కాలం నుంచి రాజకీయాల్లో ఉన్నారు. ఇందులో ఆయన వ్యతిరేకుల హస్తం కూడా ఉండవచ్చు' అని నిరంజన్‌రెడ్డి నివేదించారు.

రంగన్న స్టేట్‌మెంట్ ఎందుకు పరిగణనలోకి తీసుకోరు..?

'వివేకా వాచ్‌మెన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను సీఆర్‌పీసీ సెక్షన్ 161, 164 కింద దర్యాప్తు సంస్థ రికార్డ్ చేసింది. దాని ప్రకారం హత్య జరిగిన రోజు రంగన్న నిద్రలో ఉండగా ఆకస్మాత్తుగా పాత్రలు, ఇనుప రాడ్ పడిపోవడం లాంటి శబ్దాలు వినపడటంతో పార్క్ వైపు ఉన్న ద్వారం పక్క కిటికీ నుంచి లోపలికి చూశాడు. ఎర్ర గంగిరెడ్డి, షేక్ దస్తగిరి, సునీల్ యాదవ్‌ను అతడు గుర్తించాడు. నాలుగో వ్యక్తి పొడవుగా, సన్నగా ఉన్నట్లు చెప్పాడు. వారంతా వెళ్లాక రంగన్న లోపలికి వెళ్లి చూడగా బాత్రూమ్‌లో రక్తపు మడుగులో వివేకా పడి ఉన్నారు. ఇదే విషయాన్ని రంగన్న స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నాడు. విచారణ స్థలంలో దొరికిన ఆధారాలు రంగన్న చెప్పిన వివరాలతో సరిపోలడంతో పాటు బలాన్ని చేకూర్చింది. దీన్ని సీబీఐ పరిగణనలోకి తీసుకోవడం లేదు. సీసీ కెమెరాల్లో నమోదైన వీడియో ఫుటేజీని, పోలీసులు సేకరించిన మెటీరియల్‌ను సీబీఐ పరిశీలించలేదు. సీబీఐ కౌంటర్‌ను పరిగణనలోకి తీసుకుని దస్తగిరికి ముందస్తు బెయిల్ ఇవ్వడం, అప్రూవర్‌గా అనుమతించడం చట్ట వ్యతిరేకం. విచారణకు సహకరించేందుకు అవినాశ్ సిద్ధంగా ఉన్నారు. ఆయన్ను అరెస్టు చేయవద్దని సీబీఐని ఆదేశించాలి' అని నిరంజన్‌రెడ్డి కోరారు. అనంతరం సీబీఐ పీపీ వాదనలు వినిపించారు. 160 కింద నోటీసులు ఇచ్చి ఎలా అరెస్టు చేస్తారు? అని ఈ సందర్భంగా సీబీఐని న్యాయమూర్తి ప్రశ్నించారు. 'ఇప్పటికే నాలుగుసార్లు విచారణకు హాజరయ్యారు. అరెస్టు చేయలేదు. ఇప్పుడు అందుకు అవకాశం ఉందా?' అని ప్రశ్నించగా దీనికి పీపీ బదులిస్తూ.. విచారణకు హాజరయ్యారని, విచారణ మేరకు అదుపులోకి తీసుకునే చాన్స్ ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

దస్తగిరి బెయిల్‌పై సునీత మౌనం..

'వివేకాను హత్య చేసేందుకు నగదు తీసుకున్నానని, గొడ్డలి కూడా కొనుగోలు చేశానని దస్తగిరి ఒప్పుకున్నాడు. హంతకుడైన దస్తగిరిని కనీసం కస్టడీలోకి తీసుకుని విచారించకుండానే క్షమించడం చట్ట విరుద్ధం. అతడికి ముందస్తు బెయిల్ ఇచ్చినా, అప్రూవర్‌గా పేర్కొన్నా వివేకా కుమార్తె సునీత కలుగజేసుకోవడం లేదు. అవినాశ్, భాస్కర్‌రెడ్డి దాఖలు చేసే పిటిషన్లలో మాత్రమే ఆమె ఇంప్లీడ్ అవుతోంది. సీబీఐ చెప్పినట్లుగా ఆమె వ్యవహరిస్తున్నారు. వివేకా తన వారసుడిగా రెండో భార్య కుమారుడిని ప్రకటించారు. ఈ విషయంలో మొదటి భార్య, సునీత, అల్లుడితో తీవ్ర మనస్పర్థలు చోటుచేసుకుని తారాస్థాయికి చేరాయి. గంగిరెడ్డితో వివేకాకు నగదుకు సంబంధించిన విభేదాలు ఉన్నాయి. తన తల్లిని వివేకా లైంగికంగా వేధించారని సునీల్ యాదవ్ చెప్పాడు. ఆ క్రమంలో వివేకాపై సునీల్‌కు పగ ఉంది. ఇలాంటి వివాదాల నేపథ్యంలో జరిగిన హత్యపై ఏ ఒక్క అంశాన్ని సీబీఐ నిర్ధారణ చేసుకోలేదు. ఈ కేసులో సీబీఐ గత దర్యాప్తు అధికారిపై కూడా తీవ్ర ఆరోపణలు వచ్చాయి. విచారణను తప్పుదారి పట్టిస్తున్నారంటూ ఆయనపై స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. ఇది అక్కడి కోర్టులో పెండింగ్‌లో ఉంది' అని నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ప్రాథమిక దశలోనే నోటి క్యాన్సర్ గుర్తింపు

- స్క్రీనింగ్ చేపట్టిన వైద్యశాఖ
- డబ్ల్యూహెచ్‌వో సర్టిఫై చేసిన వెల్‌స్కోప్ మిషన్‌ల ద్వారా స్క్రీనింగ్
- ఐదు ప్రభుత్వ బోధనాస్పత్రులకు పరికరాలు
- జనవరి నుంచి ఇప్పటివరకు 5 వేలమందికి పరీక్షలు
- వ్యాధి నిర్ధారణ అయితే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నియంత్రణ, నివారణపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించింది. బాధితులు చికిత్స కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లే పనిలేకుండా ప్రభుత్వాస్పత్రుల్లో వసతులు మెరుగుపరుస్తోంది. మరోవైపు ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించడానికి చర్యలు చేపట్టింది. దేశంలో 75 వేల మంది నోటి (ఓరల్) క్యాన్సర్‌తో మరణిస్తున్నట్టు అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో నోటి క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడంతో పాటు వైద్యం చేయడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించడానికి వైద్యశాఖ అధునాతన విధానంలో స్క్రీనింగ్‌ను ప్రారంభించింది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) సర్టిఫై చేసిన వెల్‌స్కోప్ పరికరం ద్వారా ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం కడప, విజయవాడ డెంటల్ బోధనాస్పత్రులు, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రభుత్వ బోధనాస్పత్రులకు వెల్‌స్కోప్ పరికరాలను సమకూర్చారు. ఈ తరహా అధునాతన పరికరాలు రాష్ట్రంలోని ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం చాలా అరుదుగా అందుబాటులో ఉన్నాయి. పుణె నుంచి నిపుణులను రప్పించి మన వైద్యులకు వెల్‌స్కోప్ పరికరాల ద్వారా స్క్రీనింగ్ నిర్వహించడంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ పరికరం ద్వారా నోటి క్యాన్సర్‌కు దారితీసే (ప్రీ క్యాన్సర్) లక్షణాలను పసిగట్టడానికి వీలుంటుంది. వెల్‌స్కోప్ పరికరాలు సమకూర్చిన ఐదు ఆస్పత్రులకు చుట్టుపక్కల జిల్లాల్లోని ప్రభుత్వాస్పత్రులను ట్యాగ్ చేశారు. దీంతో ఆయా బోధనాస్పత్రులతో పాటు, ట్యాగ్ చేసిన ప్రభుత్వాస్పత్రుల్లోను క్యాంప్‌లు నిర్వహిస్తూ జనవరి చివరి వారం నుంచి పరీక్షలు ప్రారంభించారు.

ఫిబ్రవరిలో 11 మందికి వ్యాధి నిర్ధారణ

ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఐదువేల మందికి పరీక్షలు నిర్వహించారు. ఒక్క ఫిబ్రవరి నెలలో చేసిన స్క్రీనింగ్‌లో 392 మందిలో అనుమానిత లక్షణాలున్నట్టు గుర్తించారు. వీరిలో 142 మంది ప్రీ క్యాన్సర్ దశలో ఉన్నట్టు నిర్ధారించారు. బయాప్సీ అనంతరం 11 మందిలో వ్యాధి నిర్ధారణ అయింది. వ్యాధి నిర్ధారణ అయిన వారిని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి ఉచితంగా క్యాన్సర్ చికిత్స అందిస్తున్నారు. మరోవైపు ప్రీ క్యాన్సర్ లక్షణాలున్న వారితో సిగరెట్, బీడీ, ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని మాన్పించి, ఇతర జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధి బారినపడకుండా ఉండేలా కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

భవిష్యత్‌లో విలేజ్ క్లినిక్స్ ద్వారా

గ్రామస్థాయిలో వైద్యసేవలను చేరువ చేస్తూ ప్రభుత్వం 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటిలోను ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను అందుబాటులోకి తేవాలని వైద్యశాఖ అధికారులు యోచిస్తున్నారు. ఈ క్రమంలో పైలట్‌గా పలు విలేజ్ క్లినిక్స్‌లో వెల్‌స్కోప్ ద్వారా స్క్రీనింగ్‌ను త్వరలో ప్రారంభించనున్నారు.

వ్యాధి భారం తగ్గుతుంది

చాలావరకు నోటి క్యాన్సర్‌లు రెండు, మూడు దశల్లో బయటపడుతుంటాయి. దీంతో వైద్యానికి అయ్యే ఖర్చు పెరగడంతో పాటు ప్రాణాపాయం పెరుగుతుంది. వెల్‌స్కోప్ పరికరంతో స్క్రీనింగ్ చేపట్టడం ద్వారా క్యాన్సర్‌కు దారితీసే చిన్నచిన్న పుండ్లు, ఇతర సమస్యలను గుర్తించడానికి వీలుంటుంది. దీర్ఘకాలంగా నోట్లో పుండ్లు, ఇతర సమస్యలతో బాధపడేవారితో పాటు పొగాకు ఉత్పత్తుల వ్యసనాలున్న వారు స్క్రీనింగ్ చేయించుకోవాలి.

– డాక్టర్ ప్రశాంత్, ఓరల్ హెల్త్ రాష్ట్ర ప్రత్యేకాధికారి

క్లుప్తంగా...

సచివాలయాల్లో నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ గ్రామ వార్డు సచివాలయాల్లో సోమవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు కొనసాగనున్నాయి. ఆధార్ సేవలు అందుబాటులో ఉన్న అన్ని సచివాలయాల్లో 18, 19, 20, 26, 27 తేదీల్లో ఐదు రోజుల పాటు ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపుల నిర్వహణకు తగిన చర్యలు చేపట్టాలంటూ గ్రామ వార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ భావన అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా డీఎల్‌డీవోలకు ఆదేశాలు జారీ చేశారు. ఆధార్ తీసుకున్న తర్వాత పదేళ్లయినా ఒక్కసారి కూడా అప్‌డేట్ చేసుకోనివారు రాష్ట్రంలో 1.53 కోట్ల మంది ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

డీఎంఈగా నరసింహం బాధ్యతలు స్వీకరణ

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశారు.

'ఎస్‌ఆర్‌పీసీ' చైర్‌పర్సన్‌గా విజయానంద్

సాక్షి, అమరావతి: 2023–24 సంవత్సరానికి సదరన్ రీజనల్ పవర్ కమిటీ (ఎస్‌ఆర్‌పీసీ) చైర్‌పర్సన్‌గా రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్ నియమితులయ్యారు. ఈ మేరకు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మెంబర్–సెక్రటరీ అసిత్ సింగ్ సోమవారం ఆదేశాలు జారీచేశారు. ఎస్‌ఆర్‌పీసీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలు సభ్యులుగా ఉన్నాయి. అంతర్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ, పవర్ గ్రిడ్ ఆపరేషన్, వినియోగం, అంతర్ రాష్ట్ర విద్యుత్ బిల్లుల చెల్లింపులను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది.

జూలై నాటికి ఆప్కాబ్, డీసీసీబీల్లో కొత్త మాడ్యూల్స్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: నూతన కోర్ బ్యాంకింగ్ విధానం ప్రకారం రాష్ట్రంలోని అన్ని ఆప్కాబ్, డీసీసీబీల్లో కొత్త మాడ్యూళ్ల అనుసంధాన కార్యక్రమాన్ని జూలై నెలాఖరు నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సోమవారం నాబార్డ్ రెండో ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ఆప్కాబ్, డీసీసీబీల్లో నూతన కోర్ బ్యాంకింగ్ విధానం ఇప్పటికే అమలు చేస్తున్నప్పటికీ.. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వంటి మాడ్యూళ్ల అనుసంధానం పనుల్ని పూర్తిచేసి బ్యాంకు పనితీరును మరింత మెరుగుపర్చాలన్నారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పైలట్ ప్రాజెక్ట్ అమల్లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాకినాడ, కడప, కర్నూలు, అనంతపురం డీసీసీబీల పనితీరు మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం ప్రతి మండలంలో డీసీసీబీ బ్రాంచ్ సత్వరమే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆగస్టు 4న ఆప్కాబ్ డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్న సందర్భంగా సహకార పరపతి విధానం ఫేస్ లిఫ్ట్‌పై, బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలు, పీఏసీఎస్‌ల ద్వారా బంగారు ఆభరణాలపై రుణాలు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో నాబార్డు సీజీఎం గోపాల్, వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి, కమిషనర్ ఆఫ్ కో–ఆపరేటివ్స్ ఎ.బాబు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో వృద్ధుడి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



మధురవాడలో ఓ ఇంటి గోడకు స్టిక్కర్ అంటిస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



నెల్లూరు రూరల్ పరిధిలోని గుండ్లపాలెంలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ఇంటింటా అభిమానం

'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి 11వ రోజూ నీరాజనం

సీఎం జగన్ సుపరిపాలన అందిస్తున్నారంటూ అన్ని వర్గాల ప్రశంసలు

ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 55 లక్షల కుటుంబాల ప్రజలు మిస్డ్‌కాల్స్

సాక్షి, అమరావతి/పాణ్యం (నంద్యాల): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. 11వ రోజు సోమవారం కార్యక్రమానికి కూడా అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు, ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులకు ప్రతిఇంటా ఆ కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. గత 46 నెలలుగా సీఎం వైఎస్ జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అందిస్తున్న సుపరిపాలన గురించి ప్రతిఇంటా జగనన్న సైన్యం వివరించింది. టీడీపీ సర్కార్‌కూ.. జగన్ ప్రభుత్వానికి మధ్యనున్న తేడాలను వివరిస్తూ కరపత్రాలు అందించారు. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు మోసంచేశారని.. సీఎం జగన్ వైఎస్సార్ ఆసరా పథకం కింద ఆ రుణాన్ని వడ్డీతో సహా చెల్లించి మాట నిలబెట్టుకున్నారని అక్కచెల్లెమ్మలు జగనన్న సైన్యానికి వివరించారు. ఇక జన్మభూమి కమిటీలోని టీడీపీ నేతలకు లంచం ఇచ్చినా అప్పట్లో పింఛన్ మంజూరు చేసేవారు కాదని.. సీఎంగా జగన్ అధికారంలోకి వచ్చాక ఎవరి వద్దకు వెళ్లకుండానే.. లంచాలకు అతీతంగా పింఛన్ మంజూరు చేశారన్నారు. అలాగే, ప్రతినెలా ఒకటో తేదీన ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి రూ.2,750ల చొప్పున పింఛన్ అందిస్తూ ఆదుకుంటున్నారని అవ్వాతాతలు ప్రశంసించారు. ఏ నోట విన్నా ఇదే మాట. మళ్లీ వైఎస్సార్‌సీపీనే గెలిపించి.. సీఎంగా వైఎస్ జగన్‌నే చేసుకుంటామని.. మా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినదించారు.

పొలమంతా 'అభిమానం'



నంద్యాల జిల్లా పాణ్యం మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామానికి చెందిన బిరవోలు శివ అనే రైతు తన ఎడ్లకు సీఎం వైఎస్ జగన్ స్టిక్కర్ అతికించి పొలాన్ని దున్నడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇటీవల గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పర్యటించారు. రైతు ఇంటి బయట స్టిక్కర్ అతికించేందుకు శివ అనుమతి కోరగా.. అభిమాన నాయకుని ఫొటో బయటకాదని, ఇంట్లో ఉండాలనడం విశేషం. వ్యవసాయంపై ఆధారపడ్డ కుటుంబం కావడంతో మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నట్లు తెలిపాడు. ఈ మేరకు రైతుభరోసా కింద ఏటా రూ.13,500 తన ఖాతాలో జమవుతోందన్నారు. పంటనష్టం కింద కూడా డబ్బు జమవుతోందని.. భార్య పొదుపు గ్రూపులో ఉండటంతో ఆసరా కింద డబ్బులు వస్తున్నాయన్నాడు. తల్లికి చేయూత ద్వారా సాయం అందిందని సంతోషం వ్యక్తంచేశాడు. ఎవ్వరినీ అడగకుండా, ఎక్కడికి వెళ్లకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్ అంటే తమ కుటుంబానికి ప్రాణమన్నాడు. అందుకే వ్యవసాయంలోనూ ఆయన తోడుగా ఉన్నట్లుగా భావించేందుకు ఎడ్లకు స్టిక్కర్లు అతికించుకున్నట్లు శివ తెలిపాడు.

73 లక్షల కుటుంబాలతో మమేకం

మరోవైపు.. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పదోరోజు ముగిసే నాటికి అంటే ఆదివారానికి జగనన్న సైన్యం 73 లక్షల కుటుంబాలను నేరుగా కలిసింది. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు నిర్వహిస్తున్న మెగా ప్రజాసర్వేలో జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 55 లక్షల కుటుంబాల ప్రజలు 82960–82960 నెంబర్‌కు మిస్డ్‌కాల్స్ ఇచ్చారు. గృహ సారథులను అడిగి మరీ వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను తీసుకుని.. ఇంటి తలుపులకు, మొబైల్ ఫోన్లకు అతికించుకుని అభిమానాన్ని చాటుకుంటున్నారు.



శ్రీకాకుళం జిల్లా బాపడుగూడలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ప్రకాశం జిల్లా చట్లమిట్లలో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

అడవుల పెంపకానికి ప్రత్యేక చర్యలు

- కాంపా నిధులు రూ.225 కోట్ల అంచనాతో అడవుల సంరక్షణ, కొత్త అడవుల పెంపకం
- అటవీకరణతో పాటు అడవుల పునరుద్ధరణ కార్యకలాపాలపై దృష్టి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రస్తుతం ఉన్న అడవులను సంరక్షించడంతో పాటు పరిహారపు అడవుల పెంపకం (కాంపన్సేటరీ అఫారెస్టేషన్–కాంపా) కింద కొత్తగా అడవుల పెంపకానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో కాంపన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (సీఏఎంపీఏ) సమావేశం జరిగింది. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంపా కింద రూ.225 కోట్ల అంచనా వ్యయంతో అటవీకరణకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పరిశ్రమలు, డ్యామ్‌లు, వివిధ ప్రాజెక్టులు, గనుల తవ్వకం, అటవీ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి అటవీ భూములను వినియోగించిన ప్రాంతాల్లో.. వినియోగించిన భూముల స్థానే పెద్దఎత్తున అడవుల పెంపకం చేపట్టడమే కాంపా ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. అటవీయేతర కార్యకలాపాలకు వినియోగించిన అటవీ భూముల స్థానే పెద్దఎత్తున కాంపన్సేటరీ అఫారెస్టేషన్, అడిషనల్ కాంపన్సేటరీ అఫారెస్టేషన్, పీనల్ కాంపన్సేటరీ అఫారెస్టేషన్, సేఫ్టీ జోన్ అఫారెస్టేషన్, కేచ్‌మెంట్ ఏరియా ట్రీట్మెంట్, ఇంటిగ్రేటెడ్ వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ ప్లాన్ కింద పెద్దఎత్తున అడవుల పెంపకానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అడవుల్లో తెగుళ్లు, అగ్ని ప్రమాదాల నివారణ, భూసార పరిరక్షణ చర్యలు, రక్షిత అటవీ ప్రాంతాల నుంచి స్వచ్ఛందంగా ఆయా గ్రామాలను రీలొకేట్ చేయడం, వన్యమృగ ఆవాస సంరక్షణ, వన్యమృగ కారిడార్ల పరిధిలో పెద్దఎత్తున చెట్ల పెంపకంతో అటవీ పునరుద్ధరణ, వన్యమృగ సంరక్షణ చర్యల్లో భాగంగా యానిమల్ రెస్క్యూ, వెటర్నరీ ట్రీట్మెంట్ సౌకర్యాల కల్పన, మేనేజ్‌మెంట్ ఆఫ్ బయోలాజికల్ డైవర్సిటీ, బయోలాజికల్ రిసోర్సెస్ వంటి చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మధుసూదన్‌రెడ్డి, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (కాంపా) బీకే సింగ్, ఆర్థికశాఖ, అటవీ పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్ఎస్ రావత్, నీరబ్‌కుమార్ ప్రసాద్ పాల్గొన్నారు.

సమన్వయంతోనే జల వివాదాల పరిష్కారం

కృష్ణా బోర్డు చైర్మన్ శివనందన్ కుమార్

విజయపురి సౌత్: తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు చాలా చిన్నవని, రెండు రాష్ట్రాల సమన్వయంతో పరిష్కారమవుతాయని కృష్ణా నది యాజమాన్య బోర్డు చైర్మన్ శివనందన్ కుమార్ అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు అధికారులతో కలిసి సాగర్ ప్రధాన ఆనకట్ట, స్పిల్‌వే, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం, గ్యాలరీలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్ గుప్తాతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రా–తెలంగాణ ప్రభుత్వాలు, సంబంధిత అధికారులు స్నేహపూర్వకమైన వాతావరణంలో సమావేశమై సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కేటాయించిన నీటికన్నా ఎక్కువగా వినియోగించుకున్నారని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం తగదన్నారు. ఇరు రాష్ట్రాల అధికారులు నిజాయితీతో వ్యవహరించాలన్నారు. ఏటా కృష్ణా జలాల వినియోగం విషయంలో ఇదే సమస్య తలెత్తడం ఇరు రాష్ట్రాలకు మంచిది కాదన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు సమస్యను పరిష్కరించుకోవడం ఉత్తమమైనదిగా భావిస్తున్నామని.. లేకుంటే తామే ఇరు రాష్ట్రాల వారిని ఒకచోట చేర్చి సమస్యలను పరిష్కరించి వివాదాలు లేకుండా చేస్తామని చెప్పారు. మంగళవారం కుడి కాల్వ హెడ్ రెగ్యులేటర్‌తోపాటు విద్యుదుత్పాదన కేంద్రం టెలిమెట్రీలను పరిశీలించనున్నట్టు తెలిపారు. వీరి వెంట కృష్ణా యాజమాన్య బోర్డు ఎస్ఈ అశోక్ కుమార్, ఈఈ శివశంకర్, సాగర్ డ్యామ్ ఎస్ఈ ధర్మానాయక్, ఈఈ మల్లికార్జునరావు, డీఈలు పరమేశ్, శ్రీనివాసరావు, సుదర్శన్, జేఈలు సత్యనారాయణ, కృష్ణయ్య, హనుమంతరెడ్డి ఉన్నారు.

సచివాలయాల 'రెండో విడత' ఉద్యోగులకూ ప్రొబేషన్

సాక్షి, అమరావతి: రెండో విడత నోటిఫికేషన్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు పొందిన వారికి కూడా ప్రొబేషన్ ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2020 సంవత్సరంలో జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన వీరు ప్రస్తుతం రూ.15 వేల గౌరవ వేతనంతో పనిచేస్తున్నారు. ప్రొబేషన్ ఖరారు అనంతరం దాదాపు రెట్టింపు జీతం అందుకుంటారు. గ్రామ వార్డు సచివాలయాల్లో మొత్తం 19 రకాల విభాగాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రొబేషన్ ఖరారైన గ్రేడ్ –5 పంచాయతీ సెక్రటరీలు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు ఇప్పుడు కనీస బేసిక్ వేతనం రూ.23,120 కాగా, డీఏ, హెచ్ఆర్ఏ కలుపుకున్న తర్వాత రూ. 29,598 అందుకుంటారు. మిగిలిన 17 విభాగాల ఉద్యోగులు ఇప్పుడు కనీస బేసిక్ వేతనం రూ.22,460కు డీఏ, హెచ్ఆర్ఏ కలుపుకొని రూ. 28,753 అందుకుంటారని అధికారవర్గాలు తెలిపాయి. పట్టణ ప్రాంతాల్లో హెచ్ఆర్ఏ స్లాబు ప్రకారం కొంత మందికి కొంచెం ఎక్కువ వేతనం వస్తుంది. పెరిగిన వేతనాలు మే 1 నుంచి (అంటే జూన్ ఒకటిన ఉద్యోగులకు అందే జీతం) అమలులోకి వస్తాయని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రొబేషన్ ఖరారు ఉత్తర్వుల విడుదల నేపథ్యంలో.. జిల్లాల్లో వేర్వేరుగా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అర్హులైన ఉద్యోగుల జాబితాలతో కూడిన ప్రొసీడింగ్స్ జారీ చేస్తారు. నిబంధనల ప్రకారం.. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసి, డిపార్ట్‌మెంట్ టెస్టులో ఉత్తీర్ణత సాధించి, ఎటువంటి నేర చరిత్ర లేదని పోలీసు రిపోర్టుల్లో తేలిన వారికి జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రొబేషన్ ఖరారు ప్రక్రియ కొనసాగుతుంది.

1.34 లక్షల మందికి కొత్త ఉద్యోగాలిచ్చిన సీఎం జగన్

సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన రోజునే ప్రజల గడపవద్దకే ప్రభుత్వపాలన తీసుకొచ్చేందుకు రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. దీని ద్వారా 1.34 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను సృష్టించారు. జిల్లా సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) విధానంలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 1,26,728 ఉద్యోగాలకు, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మరో 9,600 ఎనర్జీ అసిస్టెంట్ ఉద్యోగాలకు 2019 జూలైలో నోటిఫికేషన్ జారీచేశారు. నాలుగు నెలల్లోనే రాత పరీక్షలు, నియామక ప్రక్రియ పూర్తిచేశారు. పంచాయతీరాజ్‌శాఖ నోటిఫికేషన్ ద్వారా 1,05,497 మంది ఉద్యోగాలు పొందగా.. అందులో నిబంధల ప్రకారం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసి, డిపార్ట్‌మెంట్ టెస్టు పాసైన 1,00,724 మంది (ఎనర్జీ అసిస్టెంట్లు కాకుండా)కి గత ఏడాది జూన్ నెలాఖరుకే ప్రభుత్వం ప్రొబేషన్ ఖరారు చేసింది. వారందరికీ గత ఏడాది జూలై ఒకటి నుంచి పే–స్కేలుతో కూడిన వేతనాలను ఇస్తోంది. మొదటి విడత నోటిఫికేషన్ ద్వారా భర్తీ కాకుండా మిగిలిపోయిన పోస్టులకు వెంటనే 2020లో నోటిఫికేసన్ జారీ చేయగా, మరో 12,837 మంది ఉద్యోగాలు పొందారు. వీరు ఇప్పుడు ప్రొబేషన్ పొంది మే 1 నుంచి పే స్కేలుతో కూడిన వేతనాలు అందుకోబోతున్నారు. మొదటి విడత ఉద్యోగుల్లో మిగిలినవారు నిబంధనల ప్రకారం అర్హత పొందిన వెంటనే ప్రొబేషన్ పొందుతారని అధికారులు వెల్లడించారు.

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు

గ్రామ, వార్డు సచివాలయాలు సృష్టించి ఒకే విడతలో 1.34 లక్షల ఉద్యోగాలిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారు. సీఎం జగన్‌కు మేమెప్పుడూ కృతజ్ఞతతో ఉంటాం.

– గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు

సీఎం జగన్ రుణం తీర్చుకుంటాం

ఉద్యోగ సంఘాల హర్షం

గ్రామ, వార్డు సచివాలయాల్లో రెండోవిడత ఉద్యోగాలు పొందిన వారికీ ప్రొబేషన్ ఖరారు చేసినందుకు ఉద్యోగసంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల మీద ముఖ్యమంత్రి జగన్‌కున్న అభిమానానికి ఈ నిర్ణయాలే నిదర్శనమని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలందించి ప్రభుత్వ ప్రతిష్ట పెరిగేలా సచివాలయాల ఉద్యోగులు కష్టపడి పని చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రుణం తీర్చుకుంటారని చెప్పారు.

వన్స్ ఎగైన్ థాంక్యూ సీఎం సార్

రెండో విడత నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లేర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. వన్స్ ఎగైన్ థాంక్యూ సీఎం సార్.

– గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జాని పాషా, ప్రధాన కార్యదర్శి పుట్టి రత్నం, ఉపాధ్యక్షులు జి.హరీంద్ర, కె.రామకృష్ణా రెడ్డి, కె.కిరణ్

'శిల్పం.. వర్ణం.. కృష్ణం'.. సర్వం సిద్ధం

- నేడు రామప్ప ఆలయంలో ప్రపంచ వారసత్వ దినోత్సవం
- హాజరుకానున్న పలువురు మంత్రులు, కళాకారులు

సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రపంచ వారసత్వ వేడుకలకు రామప్ప ఆలయం ముస్తాబైంది. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మంగళవారం 'శిల్పం.. వర్ణం.. కృష్ణం..'పేరిట ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఇక్కడ కూచిపూడి, పేరిణి నృత్యకళాకారులు తమ ప్రదర్శనలతో ఆహుతులను అలరించనున్నారు. ప్రముఖ సంగీత దర్శకులు, కళాకారులతో నిర్వహించే సంగీత విభావరికి వేదికకానుంది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. 800 ఏళ్ల నాటి రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు లభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని ఈసారి ఘనంగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ముఖ్యఅతిథులుగా మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ హాజరుకానున్నారని నిర్వాహకులు వెల్లడించారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, ప్రముఖ డ్రమ్స్ వాయిద్యకారుడు శివమణి, సింగర్ కార్తీక్, ఫ్లూటిస్ట్ నవీన్‌తోపాటు పలువురు కళాకారులతో సంగీత విభావరి నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. 250 మంది కూచిపూడి కళాకారులతో నృత్య ప్రదర్శన, 75 మంది అరబీ ఇన్‌స్టిట్యూట్ వారి వయోలిన్‌తోపాటు పేరిణి నృత్యం, రావణ అన్ టోల్డ్ స్టోరీ ఆఫ్ ది టెవన్ హెడ్, బెంగళూరుకు చెందిన సూర్య.ఎస్.రావు, హెరిటేజ్ ఆఫ్ ఇండియా శ్రావ్య మానస ప్రదర్శనలు ఉంటాయి. కాగా, గార్డెన్‌లో వేదిక, వీవీఐపీ, వీఐపీలకు ప్రత్యేకంగా, సామాన్యులకు మరోవైపు గ్యాలరీలు సిద్ధం చేశారు.

తెలంగాణ

సపర్యలు చేయలేక.. చీరతో ఉరేసి..

కన్నతల్లినే చంపిన కొడుకు

సదాశివనగర్: నవమాసాలు మోసి కనిపెంచిన తల్లి.. వృద్ధాప్యంలో భారమనిపించింది. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లికి సేవలు చేయలేక చీరతో ఉరేసి చంపి, ఖననం చేశాడో కొడుకు. మూడు రోజుల కిందట జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ సీఐ రామన్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్‌కు చెందిన ఇట్టవోయిన బాలవ్వ(80) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమెకు సపర్యలు చేయడం భారంగా భావించిన కుమారుడు బాలయ్య.. ఈనెల 13న తల్లికి చీర కొంగుతో ఉరి బిగించి చంపాడు. అనంతరం రాత్రి వేళలో గ్రామ శివారుకు తీసుకెళ్లి ఖననం చేశాడు. ఈనెల 13నుంచి తల్లి బాలవ్వ కనిపించడం లేదని, ఆమె పడుకున్న గదికి గొళ్లెం పెట్టి ఉందని ఊళ్లోవాళ్లకు చెప్పాడు. బాలయ్య ప్రవర్తనపై అనుమానం వచ్చిన ఎంపీటీసీ సభ్యుడు బీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరాన్ని అంగీకరించాడని సీఐ రామన్ తెలిపారు. అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న తల్లికి సేవలు చేయలేక చీరతో ఉరి బిగించి చంపానని, అదే రోజు రాత్రి మృతదేహాన్ని గ్రామ శివారుకు తీసుకువెళ్లి ఖననం చేశానని అంగీకరించాడని వెల్లడించారు.

ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యుడు షుత్తరీ కన్నుమూత

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ మతగురువు, తెలుగు రాష్ట్రాల దర్గాల సజ్జాదగాన్‌ల అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మహ్మద్ ఖుబ్బుల్ బాదేషా ఖాద్రీ షుత్తరీ (82) సోమవారం ఉదయం 8గంటలకు కన్నుమూశారు. కొన్ని రోజులుగా శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతూ, ఒవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. భౌతికకాయాన్ని ప్రజల సందర్శన కోసం డబీర్‌పూరాలోని ఆయన నివాసంలో ఉంచారు. ఖుబ్బుల్ పాషా మరణం ముస్లిం సమాజానికి తీరనిలోటని ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆయన మరణంతో ముస్లిం సమాజం ప్రముఖ ధార్మికవేత్తను కోల్పోయిందని హోం మంత్రి మహమూద్ అలీ చెప్పారు. ఖుబ్బుల్ పాషా పలు ధార్మిక సంస్థల్లో కీలక పదవుల్లో పనిచేశారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యుడిగా, మజ్లిస్ ఉలేమాయే దక్కన్ అధ్యక్షుడిగా, రుహియతే హిలాల్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈయన యాకుత్‌పురా ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీకి పెద్దన్నయ్య. ఖుబ్బుల్‌పాషాకు ఒక కుమారుడు, నలుగురు కూతుళ్లున్నారు. డబీర్‌పురాలోని షుత్తరీయా మసీదులో ఖననం చేశారు.

బండి సంజయ్ బెయిల్ రద్దు చేయండి

- కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన పోలీసులు

వరంగల్ లీగల్: పదోతరగతి హిందీ పేపర్ లీకేజీ, కాపీకుట్ర కేసులో మొదటి నిందితుడయిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌కు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. ఈ కేసులో ప్రత్యేక పీపీగా నియమితులైన ఎం.సత్యనారాయణగౌడ్ ప్రాసిక్యూషన్ తరఫున హనుమకొండ నాలుగో మున్సిఫ్ కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో బండి సంజయ్‌కి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడం, అనంతరం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. బెయిల్ మంజూరు సమయంలో నిందితుడు సాక్ష్యాధారాలను మాయం చేయకూడదని, విచారణకు పోలీసులకు సహకరించాలని కోర్టు షరతులు విధించింది. అయితే సంజయ్‌కు మార్ విచారణకు సహకరించడం లేదని, మొబైల్‌ను తమ స్వాధీనం చేయాలని పోలీసులు కోరినా, ఇప్పటివరకు అందజేయలేదని పీపీ తెలిపారు. దీనివల్ల విచారణ వేగవంతం చేయలేకపోతున్నారని, షరతులను ఉల్లంఘిస్తున్నందున సంజయ్‌కు జారీ చేసిన బెయిల్ రద్దు చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే నిందితుడిని పోలీసులు కస్టడీకి కోరినప్పటికీ కోర్టు అనుమతించలేదని, బెయిల్ మంజూరులో కూడా సహేతుకమైన కారణాలు లేవని కోర్టుకు నివేదించారు. ఈ కేసులో ఇంకా నలుగురు నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

బిల్లులు చెల్లిస్తారా.. ఆత్మహత్యలు చేసుకోమంటారా?

ఇల్లంతకుంట (మానకొండూర్): రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి పనుల బిల్లుల జాప్యంపై సర్పంచులు నిరసనకు దిగారు. గ్రామాల్లో చేసిన పలు అభివృద్ధి పనులకు నెలలు గడిచినా బిల్లులు రావడం లేదంటూ.. 'బిల్లులు చెల్లిస్తారా.. ఆత్మహత్యలు చేసుకోమంటారా..' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ వెంకటరమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఇల్లంతకుంట ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో సర్పంచులు నిరసన గళం వినిపించారు. గతేడాది అక్టోబర్ నుంచి చేసిన పనులకూ బిల్లులు రాలేదని, పంచాయతీ ఖాతాల్లోని నిధులు కూడా రాకుండా ప్రభుత్వం ఫ్రీజ్ చేయడంతో పంచాయతీ సిబ్బందికీ వేతనాలిచ్చే పరిస్థితి లేదన్నారు. ఇక అప్పులు తెచ్చి పనులు చేసే ఓపిక తమకు లేదని సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ అన్నారు. ఎంపీపీ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ వీలైనంత త్వరగా సర్పంచులకు బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు.

హాత్విక్‌ను దత్తత తీసుకుంటా..: ఎంపీ కోమటిరెడ్డి

మద్దిరాల(తుంగతుర్తి): హైదరాబాద్‌లోని కుషాయిగూడలో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన నరేశ్, అతడి భార్య సుమ, కుమారుడు జస్విత్ మృతదేహాలకు సోమవారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. నరేశ్ స్వగ్రామం.. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం రెడ్డిగూడెంలో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. కాగా, ప్రమాదంలో తల్లిదండ్రులతో పాటు సోదరుడిని కోల్పోయిన నరేశ్ పెద్ద కుమారుడు హాత్విక్‌ను దత్తత తీసుకుంటానని భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఢిల్లీలో ఉన్న ఆయన తన పీఏ సైదులుతో హాత్విక్ పేరిట బ్యాంకులో రూ.లక్ష డిపాజిట్ చేయించారు. ఖర్చుల నిమిత్తం నరేశ్ తల్లిదండ్రులకు రూ.25వేలను అందజేయించారు. నరేశ్ తల్లిదండ్రులను ఫోన్‌లో ఓదార్చారు. కొడుకు పోయిన బాధ ఎలా ఉంటుందో తనకు తెలుసని, అధైర్య పడొద్దని, అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. నరేశ్ కొడుకును ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదివిస్తానని, పూర్తి బాధ్యత తానే తీసుకుంటానని, ఢిల్లీ నుంచి రాగానే, గ్రామానికొచ్చి కలుస్తానని నరేశ్ కుటుంబసభ్యులకు మనోధైర్యం కల్పించారు.

హైదరాబాద్‌లో మతసామరస్యం నెలకొల్పింది టీడీపీయే: చంద్రబాబు

సాక్షి, హైదరాబాద్: ఘర్షణలు, అల్లర్లు నిండిన హైదరాబాద్ నగరంలో ప్రశాంత వాతావరణాన్ని, మతసామరస్యాన్ని నెలకొల్పిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రాబాబు నాయుడు అన్నారు. ఎన్టీఆర్ భవన్లో సోమవారం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. కర్ఫ్యూ సిటీని వ్యాక్సిన్ తయారు చేసే కేంద్రంగా అభివృద్ధి చేశామన్నారు. తెలుగుదేశం పాలనకు ముందు, ఆ తరువాత హైదరాబాద్‌ను విడదీసి చూడాలని చంద్రబాబు సూచించారు. టీడీపీ పాలనలో 14 జిల్లాల్లో ఉర్దూను రెండో భాషగా అమలు చేశామని ఆయన గుర్తు చేశారు. అంతకుముందు ముస్లింలు హజ్ యాత్రకు వెళ్లాలంటే.. బొంబాయి వెళ్లాల్సి వచ్చేదని, టీడీపీ హయాంలో అసెంబ్లీ ఎదురుగా హజ్ హౌజ్‌ను నిర్మించి ఇక్కడి నుంచే హజ్‌కు వెళ్లటానికి విమాన సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశామని, ముస్లింలకు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన.. దుకాన్ మకాన్లు, షాదీఖానాల ఏర్పాటు, మసీదులకు ఆర్థిక సహాయం వంటివాటిని ఆయన గుర్తు చేశారు. అన్ని మతాలను, కులాలను అభివృద్ధి చేసింది టీడీపీయేనన్నారు. కార్యక్రమంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బక్కని నర్సింహులు, పార్టీ రాష్ట్ర సమన్వయకర్త కంభంపాటి రామ్మోహన్ రావు, క్రమశిక్షణ సంఘం జాతీయ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న, ఉపాధ్యక్షుడు అలీ మస్కతీ తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనలో హృదయం లేని మాటల కంటే,
మాటలు లేని హృదయం నయం.
– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, ఏప్రిల్, 18

తూటాలతో తక్షణ న్యాయం?

కంటికి కన్ను... పంటికి పన్ను లాంటి డైలాగులు, వెంటాడి వేటాడడాలు తెరపై చూస్తాం. నిజ జీవితంలో పదులకొద్దీ సాయుధ పోలీసుల కళ్ళెదుట, టీవీ కెమేరాల ముంగిట అలా జరగడం ఒళ్ళు జలదరించే అనుభవం. రాజకీయాల్లోకొచ్చిన నేరసామ్రాజ్యనేత అతీక్ అహ్మద్, ఆయన తమ్ముడు ఖాలిద్ అజీమ్ అలియాస్ అష్రాఫ్‌లు యూపీలో పోలీస్ కస్టడీలో ఉండగా, మీడియా ముసుగులో వచ్చి ముగ్గురు కుర్రాళ్ళు చంపిన తీరు అలాంటిదే. హత్యలు, అపహరణలకు పాల్పడి నూటికిపైగా కేసు లున్న నేరగాడిగా పేరుమోసిన అతీక్ జీవితంలో హింసను నమ్మి, చివరకు హింసలోనే చనిపోవడం కవితాత్మక న్యాయంగా కనిపించవచ్చు. కానీ కరడుగట్టిన నేరస్థుణ్ణి సైతం చట్టబద్ధంగా విచారించి కోర్ట్‌లో కఠినశిక్ష విధించాలి. తక్షణశిక్షలతో సత్వరన్యాయం జరపాలనిచూస్తే అన్యాయమే.

'మాఫియా కో మిట్టీ మే మిలా దూంగా' (మాఫియాను మట్టిలో కలిపేస్తాను) అని అసెంబ్లీ సాక్షిగా గర్జించిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ నెలలోనే కనీసం 3 ఎన్‌కౌంటర్లకు మౌనసాక్షి. విషాదం ఏమిటంటే, ఈ సర్కారీ ప్రేరేపిత హింసను పౌర సమాజం సైతం అభ్యంతర పెట్టకుండా, ఆమోదిస్తూ ఉండడం. పరారీలో ఉన్న అతీక్ కుమారుడు 'ఆత్మరక్షణకు పోలీసుల ఎదురుకాల్పుల్లో' గురువారం ఝాన్సీలో చనిపోతే, శనివారం రాత్రి ప్రయాగరాజ్‌లో పోలీసుల ఎదుటే కాల్పుల్లో అతీక్ ప్రాణాలు విడిచాడు. రాజకీయ ప్రత్యర్థి ఉమేశ్‌పాల్ హత్యలో తండ్రీ కొడుకులిద్దరూ నిందితులు. అతీక్ హత్యపై రిటైర్డ్ జడ్జీ సారథ్యంలో కమిషన్ వేశారు యోగి. తీరా మంత్రులే ఈ మరణాలు 'కర్మ ఫలిత'మనీ, 'దేవుడి న్యాయ'మనీ వ్యాఖ్యానిస్తుంటే ఇక విచారణలో ఏం తేలుతుంది!

అతీక్‌ను ఎవరో చంపారనీ, వ్యవస్థ ప్రమేయం లేదనీ నమ్మలేం. చట్టప్రకారం ఏప్రిల్ 13న కస్టడీకి కోర్టు అప్పగించిన వెంటనే వైద్యపరీక్షలు జరపాల్సిన పోలీసులు 15వ తేదీ రాత్రి దాకా ఎందుకు ఆలస్యం చేశారు? సాధారణ పరీక్షలకు అసాధారణంగా ఆ రాత్రివేళను ఎందుకు ఎంచుకున్నారు? సంకెళ్ళు వేయరాదని కోర్టు తీర్పులున్నా సరే ఎందుకు వేశారు? కాలిస్తే ఒకరికొకరు దూరం జరిగే వీలైనా లేకుండా హతులిద్దరికీ కలిపి ఒకే పొడవాటి సంకెల ఎందుకేశారు? ప్రాణహాని ఉన్న నేరస్థులని తెలిసినా బందోబస్తులో ఎందుకు నిర్లక్ష్యం వహించారు? ఆ సమయానికి వారు అక్కడికలా నడుచుకుంటూ వస్తారని కాల్పులు జరిపిన కుర్రాళ్ళకెలా తెలిసింది? ఘోర నేర చరిత్రలేమీ లేని వారి చేతికి ఆధునిక విదేశీ తుపాకీలెలా వచ్చాయి? ఇలా ఎన్నో ప్రశ్నలు. వెరసి, యూపీలో శాంతిభద్రతలకు టీవీ ప్రత్యక్షప్రసారాలకు చిక్కిన ఈ హత్యలే ప్రతీక. కస్టడీలోని వారికైనా కనీస భద్రత కల్పించలేని పోలీసు వ్యవస్థ ఘనతకు ఉదాహరణ.

ఇంతకీ నకిలీ ఎన్‌కౌంటర్లు, సర్కారీ ప్రేరేపిత హత్యల ద్వారా యూపీ సర్కార్ ఏ సంకేతాలు పంపాలని చూస్తోంది? పట్టుమని 17 ఏళ్ళకే కేసులకెక్కి, 60 ఏళ్ళ వయసులో ఇప్పుడు ప్రాణాలు పోగొట్టుకున్న అతీక్ ఇన్నేళ్ళుగా రాజకీయపార్టీల్లో కొనసాగుతూ, ఇష్టారాజ్యంగా దందా కొనసాగించడం 1990ల నుంచి మన రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థల పుణ్యమే. జైలుకెళ్ళినా చక్రం తిప్పిన అతీక్‌ను 2019లో గుజరాత్‌లో జైలుకు మార్చారు. ఇటీవలే యూపీకి పట్టుకొచ్చారు. తాజా ఘటనతో ఈ డాన్ కథ ముగిసింది. కానీ, చేసిన నేరాలూఘోరాలూ ఎన్నయినా, ఎంత పెద్దవైనా కావచ్చు. విచారణ లేకుండా తక్షణన్యాయమే పరిష్కారమనే ప్రభుత్వాల ధోరణి రాజ్యాంగ విహిత న్యాయసూత్రాలకే విరుద్ధం. సమదృష్టితో సాగాల్సిన వ్యవస్థలపై విశ్వాసానికి విఘాతం.

యూపీలో యథేచ్ఛగా సాగుతున్న ఎన్‌కౌంటర్లపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నాలుగేళ్ళ క్రితమే 2019 జనవరిలో ఆందోళన వ్యక్తం చేసింది. 2017 మార్చిలో యోగి సర్కార్ ఏర్పాటైనప్పటి నుంచి అలాంటి 15 కేసుల పూర్తి సమాచారాన్ని అప్పట్లోనే భారత ప్రభుత్వానికి పంపింది. ఆ కేసుల్లో బాధితులందరూ నిరుపేద మైనారిటీలే. తాజా డేటా ప్రకారం గత ఆరేళ్ళ యోగి పాలనలో 10,900కు పైగా పోలీస్ ఎన్‌కౌంటర్లు జరిగాయి. నిందితులు 183 మంది పోలీసు తూటాలకు ప్రాణాలు కోల్పోయారు. నిజానికి, నకిలీ ఎన్‌కౌంటర్లపై ఆందోళనతో జాతీయ మానవ హక్కుల సంఘం ఎప్పుడో మార్గదర్శకాలిచ్చింది. కానీ గద్దె మీది పెద్దలు తలుచుకున్నప్పుడల్లా అవి గాలికి పోతున్నాయి. వెరసి నేర న్యాయవ్యవస్థ కుప్పకూలి, పోలీస్, న్యాయ వ్యవస్థల్లో సంస్కరణలు అవసరమని గుర్తు చేస్తున్నాయి.

ఇక, గత నవంబర్‌లో అమృత్‌సర్‌లో ఓ హిందూ రాజకీయ నేత ఇలాగే మీడియా ముందు కాల్పులకు గురై చనిపోయినప్పుడు సోకాల్డ్ మేధావులు ఇంత రచ్చ చేయలేదేమిటన్నది ఓ వాదన. జరిగిన దారుణాన్ని బట్టి కాక, మతాన్ని బట్టి గగ్గోలు పెడుతున్నారనీ వారి ఆరోపణ. చిత్రంగా మారణకాండలో సైతం మతం చొచ్చుకొచ్చిన రోజులివి. అతీక్ కుమారుడు ఎన్‌కౌంటరైనప్పుడు అధికార పార్టీ యువజన విభాగం టపాసులు కాల్చి, సంబరాలు చేసుకుంది. అది ఆందోళన రేపే ధోరణి. అది మరవక ముందే ప్రాణహాని ఉందంటూ అతీక్ సుప్రీం కోర్ట్‌లో భయపడినట్టే జరిగింది. అంతకన్నా భయపడాల్సిందేమిటంటే – హతులు ముస్లిమ్‌లైనప్పుడల్లా హంతకులు జైశ్రీరామ్ నినాదాలు చేయడం. ప్రజలను వర్గాలుగా చీల్చే ఈ ప్రయత్నాలు, దేవుడి పేరు అడ్డంపెట్టి దారుణాలకు ఒడిగట్టే తీరు సమాజానికి క్యాన్సర్ కన్నా ప్రమాదకరం. ఏ వర్గం ఇలాంటి దుశ్చర్యలకు దిగినా గర్హనీయమే. 'డబుల్ ఇంజన్', 'బుల్‌డోజర్' లాంటి మాటలతో మళ్ళీ కేంద్రంలో గద్దెనెక్కదలచిన పార్టీలూ, కాబోయే ప్రధానిగా ప్రచారమవుతున్న యూపీ నేతలూ అది గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు. చైత్ర మాసం, **తిథి:** బ.త్రయోదశి ప.12.54 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.12.51 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ప.11.06 నుండి 12.38 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.05 వరకు తదుపరి రా.10.48 నుండి 11.34 వరకు.
అమృతఘడియలు: రా.8.14 నుండి 9.45 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం : 6.12
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఆపత్కాలంలో ఐక్యతా రాగం!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

దేశంలో వామపక్షాలు బలహీనమై పోతున్న కాలమిది. ఇదే సమయంలో మతతత్త్వ శక్తులు బలపడిపోతుండటం ప్రగతి శీల ప్రజాస్వామ్యవాదులకు ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఉభయ కమ్యూనిస్టు పార్టీల (సీపీఐ, సీపీఎం) జాతీయ నాయకత్వాలు హైదరాబాద్‌లో సమావేశమై వామపక్షాల ఐక్యత అవసరంపై చర్చించాయి. ఈ పార్టీల్లో సీపీఐ తాజాగా 'జాతీయ పార్టీ' హోదాను కోల్పోయిన సంగతి తెలిసిందే. మొత్తం మీద ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాలు వామపక్షాలు ఐక్యమైతేకాని మతతత్త్వ శక్తులను అడ్డుకోవడం సాధ్యం కాదని ప్రకటించాయి. వామపక్షాల ఐక్యత అవసరాన్ని ఎనభై ఏళ్ల క్రితమే భారత కమ్యూనిస్ట్ పార్టీ ప్రమాణ పత్రం ఒకటి నొక్కి వక్కాణించడం గమనార్హం.

"భారతదేశాన్ని 'హిందూ దేశం'గా మార్చేందుకు, భారత సెక్యులర్ రాజ్యాంగం స్థానంలో దేశాన్ని విభజించి కేవల 'హిందూ' దేశంగా మార్చే 'మను స్మృతి'ని అమలు పరిచేందుకు ఆరెస్సెస్, బీజేపీలు ప్రయత్నిస్తు న్నాయి. మితవాద రాజకీయాలపై శక్తిమంతంగా పోరాడాలంటే దేశంలో వామ పక్షాల మధ్య ఐక్యత మరింత అవసరం. దేశంలోని మితవాద రాజకీయాలపై నిరంతర పోరుకు వామపక్షాల ఐక్యత నేడు తక్షణావసరం. ఈ ఐక్యత పరస్పర విశ్వాసం ద్వారానే సాధ్యం".
– సీపీఐ, సీపీఎం పార్టీలు హైదరాబాద్‌లో తొలిసారిగా జరిపిన సంయుక్త సమావేశంలో (10.4.2023) తీసుకున్న నిర్ణయం.

వామపక్షాలైన సీపీఐ, సీపీఎంల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి 'యూనిటీ' సమావేశం వామపక్ష అభిమానులలో నూతనోత్తేజానికి కారణమయింది. ఉభయపక్షాల ఐక్యత తక్షణావసరాన్ని ఇరు పక్షాల నాయకులు, కార్యకర్తలు గుర్తించడం ముదావహం. నిజానికి ఉభయ పార్టీలూ కలవ వలసిన అవసరాన్ని కొత్తగా ఇప్పుడు గుర్తించారని చెప్పనవసరం లేదేమో. ఎనిమిది దశాబ్దాల క్రితమే కాన్పూర్ కేంద్రంగా భారత కమ్యూనిస్ట్ పార్టీ కార్యదర్శి ఎస్. సత్యభక్త కమ్యూనిస్టుల ఐక్యత కోసం తొలి ప్రమాణ పత్రాన్ని వెలువరించారు. హైదరాబాద్ కేంద్రంగా వెలువడిన ఉభయ పార్టీ (సీపీఐ, సీపీఎం)ల సంయుక్త సమావేశంలో ప్రసంగించిన సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిలు ఉగ్గడించిన 'ఉభయ పక్షాల ఐక్యత అవసరం' గుర్తించడానికి ఇన్నేళ్ల సమయం పట్టడం... ఉభయ వామ పక్షాల ఉమ్మడి వార సత్వానికి ఒక రకంగా 'మచ్చ'గానే భావించాలి. అయినా ఇప్పటికైనా ఏకపక్షంగా ఉభయపక్షాల ఐక్యతావాంఛ... అనేక సమస్యల పరిష్కారానికి ఎదురుచూస్తున్న దేశానికి శుభసూచకంగా భావించాలి.

ఈ సందర్భంగా కాన్పూర్ తొలి పార్టీ ప్రమాణ పత్రాన్ని ఎందుకు ప్రస్తావించవలసి వచ్చిందంటే, ఆ పత్రం ఆనాటికే కాదు, ఎప్పటికీ పోరాట పటిమ గల పార్టీకి ఒక బలమైన దిక్సూచిగా ఎలా నిలబడి పోయిందో గుర్తించడం కోసమే! అందులో పేర్కొన్న ప్రమాణాలలో కొన్నింటిని ఒక్కసారి పరిశీలిద్దాం:

ప్రజా శ్రేయస్సు లక్ష్యంగా లేని రాజకీయ పార్టీలు అధికారంలోకి రావాలనుకొనేది సంపాదన కోసం, అది వీలు చిక్కకపోతే ప్రజలపై నిర్బంధ విధానాల ద్వారా ఒడుపుకోవడం కోసమే గానీ ప్రజల ప్రయోజనాలను గుర్తించి వారిని సకాలంలో ఆదుకోవడానికి కాదు; ఈ పరిస్థితుల్లో వామపక్షాల బాధ్యత పెట్టుబడిదారీ శక్తుల తరపున కొమ్ము కాయడం కాదు, ఆ కొమ్ములను విరిచి ప్రజాబాహుళ్యం మౌలిక అవసరాలైన తిండి, బట్ట, వసతి, ఉపాధి సౌకర్యాలను కల్పించడం. తద్వారా ప్రజలు తమ కష్టార్జితాన్ని తాము స్వేచ్ఛగా

రెండో మాట



అనుభవించడానికి దోపిడీకి తావు లేకుండా చేయడం కమ్యూనిస్టుల విధిగా ఉండాలి. ఇదీ స్థూలంగా 1924 నాటి కాన్పూర్ డాక్యుమెంట్ ఆదేశించింది. ఆ 'ప్రమాణ పత్రం' మకుటం కూడా 'సత్యభక్త, భారతీయ సామ్యవాది దళ్' (ది ఇండియన్ కమ్యూనిస్ట్ పార్టీ) అనీ, 'సత్యవాది' అనీ! 1924 నాటి భారత కమ్యూనిస్ట్ పార్టీ కొన్ని సమస్యల్ని ఎంతగా మనసు విప్పి బాహాటంగా ప్రకటించిందో చూడండి:

'సమాజంలో నాయకులకు, రాజకీయవేత్తలకు, మత ప్రవక్తలకు, సంఘ సంస్కర్తలకు కొదువ లేదు వీరంతా ప్రజలకు చేసే మార్గ నిర్దేశానికి కొదవ లేదు. కానీ వీరు చూపే అనేక మార్గాలు ఉన్న 'జబ్బు'ను పెంచేవే కానీ తుంచేవి కావు. పైగా చాలామంది మార్గదర్శకులు తమ పొట్టలు నింపుకోవడం కోసం ప్రజల్ని బుద్ధి పూర్వకంగానే అగాథంలోకి నెట్టేస్తారు. కానీ, ఇలా అగాథంలోకి నెట్టే వాళ్లనుంచి ప్రజల్ని రక్షించడానికే భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టింది. ప్రజలు ఎదుర్కొనే అన్ని సమస్యల నుంచీ వారిని తామే రక్షిస్తామన్న హామీ ఏ పార్టీ ఇవ్వదు. ఎందుకంటే, ఏ పార్టీ వ్యవస్థా అలా ఉండదు కనుక. ప్రజలంతా ఏకమై తమ కాళ్లమీద నిలబడి సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి. ధనికులకు, పేదలకు మధ్య దారుణంగా పేరుకు పోయిన సమస్యల్ని తగ్గించడం పార్టీ లక్ష్యంగా ఉండాలి. సమానత్వాన్ని ప్రేమించేవారికి పార్టీలో నిస్సందేహంగా స్థానం ఉంటుంది. అంతేగాని తాము మాత్రమే అన్ని సౌకర్యాలు అనుభవించాలనుకొనే వారికి పార్టీలో స్థానం ఉండదు. ఎవరైతే ప్రజల్ని మోసం చేస్తూ, ఇతరులను దోచుకుంటూ అనుభవించగోరతారో... వారికి పార్టీలో స్థానం ఉండదు. తమ చెమటోడ్చి సంపాదించుకుంటూ, తప్పుడు మార్గాల ద్వారా సంపాదనకు ఒడిగట్టని పేద రైతులు, కార్మికులు, నిరుపేద గుమస్తాలు, చిన్నచిన్న ప్రభుత్వోద్యోగులు, రైల్వే సిబ్బంది, స్కూలు మాస్టర్లు, చిన్నచిన్న వ్యాపారులు, చిన్నస్థాయి పోలీస్ కానిస్టేబుల్స్, ప్రెస్ ఉద్యోగులు – వంటి వారు మాత్రమే మా పార్టీలో సభ్యత్వానికి అర్హులు' అని పార్టీ ఈ పత్రం ద్వారా చాటింది.

అయితే పెట్టుబడిదారీ (కాపిటలిస్ట్) వర్గానికి, వారి ప్రయోజనాల కోసం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పనిచేసే సంస్థలను పార్టీ సహించదని చెప్పింది. అందుకనే శ్రమ జీవులంతా ఏకైక భారత కమ్యూనిస్టు పార్టీ పతాకం కింద సమకూడి, తుది శ్వాస వరకూ నిలబడాలని ప్రమాణ పత్రం నిర్దేశించింది. అంతేగాదు, రంగంలో ఉన్న పెక్కు రాజకీయ పార్టీలు వర్గ ప్రయోజనాలను ప్రతిబింబించేవి కాబట్టి... వీటన్నింటిలో ఏకైక పెద్ద కార్మికవర్గ శక్తి కమ్యూనిస్టు పార్టీ కాబట్టి అందరూ ఐక్య శక్తిగా సమీకృతం కావాలని ఆ మానిఫెస్టో ప్రకటించింది. బహుశా అందుకనే సుభాష్ చంద్రబోస్ రానున్న రోజుల్లో భారతదేశ భవిష్యత్తు మౌలికంగా వామపక్ష శక్తుల పోరాటం, త్యాగాల మీదనే ఆధారపడి ఉంటుందని జోస్యం చెప్పారు. ఎందుకంటే, విప్లవోద్యమం అనేది అరాచక ఉద్యమం కాదు, టెర్రరిస్టుల ఉద్యమమూ కాదు. భారత స్వాతంత్ర్యోద్యమంలో దేశ భక్తులైన అనేకమంది మేధావులను, నాయకులను, యువకులను, రచయితలను 'దేశద్రోహులు'గా వలస పాలకులు ముద్రవేసి జైళ్లలో పెట్టారు. అందులో వామపక్ష భావాలు ఉన్నవారు అనేకమంది ఉన్నారు. 'మనల్ని దేన్నీ చదవకూడదని బ్రిటిష్ పాలకులు కోరుకున్నారు' (బ్యాన్డ్ అండ్ సెన్సార్డ్: వాట్ ది బ్రిటిష్ రాజ్ డిడిన్ట్ వాంట్ అజ్ టు రీడ్') అనే గొప్ప చారిత్రిక విశ్లేషణా గ్రంథాన్ని తాజాగా అందించిన చరిత్రకారిణి దేవికా సేథి... అప్పటి వలస భారతంలోని 'సెన్సార్‌షిప్' నిబంధనల మాలోకం గురించీ వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన దాదాపు 75 ఏళ్ల తర్వాత రాసిన ఆ గ్రంథం ఎన్నో మరుగున పడిన విషయాలను తెలియచేస్తోంది.

ఇంతకూ 'దేశద్రోహి' అంటే ఎవరు, అన్న ప్రశ్నకు టర్కీ ప్రసిద్ధ ప్రజా మహాకవి హిక్మెట్‌ను అడిగితే చెబుతాడు:

"ఔను, నేను దేశద్రోహినే –
మీరు దేశభక్తులైతే
మీరే మన మాతృభూమి పరిరక్షకులైతే
నేను నా మాతృభూమికి దేశద్రోహినే
దేశభక్తి అంటే మీ విశ్వాసాల వ్యవసాయ క్షేత్రాలే అయితే
దేశభక్తి అంటే మీ బొక్కసాల్లో సంపదలే అయితే
దేశభక్తి అంటే మీ బ్యాంకు ఖాతాల్లో నిధులే అయితే
దేశభక్తి అంటే దారి పక్క దిక్కులేని ఆకలి చావులే అయితే
దేశభక్తి అంటే జనాలు కుక్కపిల్లల్లా చలికి వణికిపోవడమే అయితే
ఎండా కాలంలో మలేరియాతో కునారిల్లడమే అయితే
మతగ్రంథాలను వల్లించడమే దేశభక్తి అయితే
పోలీసు చేతి లాఠీయే దేశభక్తి అయితే
మీ కేటాయింపులూ, మీ జీతభత్యాలు మాత్రమే దేశభక్తి అయితే
మూఢ విశ్వాసాల అజ్ఞానపుటంధకారపు మురికి గుంట నుంచి
విముక్తి లేకపోవడమే దేశభక్తి అయితే – నేను దేశద్రోహినే!"

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

శుభవార్త



ఛోటూ 25 ఏళ్ల నుంచి నాతో ఉంటున్నాడు. పెళ్లి చేసుకున్నాడు. పాప నామకరణం నాతో చేయించుకున్నాడు. పేరు 'షామ్లీ' అని పెట్టాను.
– ధర్మేంద్ర, నటుడు

సమయానికి...



బాడీగార్డు చురుగ్గా స్పందించడం వల్ల హత్యా ప్రయత్నం నుంచి జపనీస్ ప్రధాన మంత్రి (ఫ్యూమియో కిషీదా) సురక్షితంగా బయటపడ్డారు. బాడీగార్డు హ్యాండ్‌బ్యాగులు మోయకూడదు. కానీ ఇక్కడ మాత్రం అదే పనికొచ్చినట్టుంది.
– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

చంపే ఆట



ఇండియా ఇప్పుడు ఒక పెద్ద కొలోజియం. తోటి మనుషులను జాంబీలు (కదిలే మృతజీవులు) చంపుతుంటే మనమందరం ప్రేక్షకులుగా ఉంటున్నాం. మధ్యలోని బారికేడ్లు మనల్ని సురక్షితమైన దూరంలో ఉంచుతున్నాయని నమ్ముతూ, జాంబీలను ఉత్సాహపరుస్తాం. కానీ ప్రతి ఆటా మనల్ని కూడా జాంబీలుగా మార్చుతున్నదని గ్రహించం. మనం ఒకరికి ఒకరం ఆహారంగా మారుతున్నాం.
– గజాలా వహాబ్, సంపాదకురాలు

వర్తమానం



మూర్ఖత్వం మీద ఏ ఒక్క భావజాలానికో గుత్తాధిపత్యం లేదు. అయినప్పటికీ, కొన్ని భావజాలాలకు మూఢులను ఆకర్షించడంలో స్వాభావికమైన శక్తి ఉంది. వర్తమాన ఉదారవాద 'ఆలోచన' అనేది ఇప్పుడు ఈ జాబితాలో టాప్‌లో ఉంది.
– అనింద్యో చక్రవర్తి, జర్నలిస్ట్

వ్యవహారం నడిపింది



శివాజీ మరణించిన తర్వాత, ఒడయార్లకు వ్యతిరేకంగా గోల్కొండ ముస్లింలతో మరాఠాలు జట్టుకట్టారు. ఐదేళ్ల తర్వాత, మరాఠాలకు వ్యతిరేకంగా ఔరంగజేబుతో ఒడయార్లు జట్టుకట్టారు. భారత చరిత్రను చాలావరకు నిర్దేశించిన వ్యవహార జ్ఞానపు స్ఫూర్తిని తగ్గించిచూడటం దుర్బుద్ధితో కూడినదే!
– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

డిన్నర్‌కు 12 లక్షలు



బాలి (ఇండోనేషియా)లో అత్యంత గందరగోళ విషయం ఏమిటంటే, కరెన్సీ. డిన్నర్ బిల్లు 1200.000 వచ్చింది. కార్డును స్వైప్ చేసి, భారతీయ రూపాయల్లో చెల్లిస్తే అది దాదాపు 6,400 అయింది. అప్పుడుగానీ బాలినీస్ ప్రజలు కామాకు బదులుగా పాయింట్ వాడతారనీ, మొత్తం బిల్లు 12 లక్షల ఇండోనేషియా రుపియాలని అర్థం కాలేదు. 1 ఇండియన్ రూపాయి= 187 ఇండోనేషియా రుపియాలు.
– దీపక్ కృష్ణమూర్తి, కార్డియాలజిస్ట్

ఇంత యాంత్రీకీకరణా?



అమెరికా, టెక్సాస్‌లోని ఒక డైరీఫామ్‌లో జరిగిన పేలుడులో 18,000 ఆవులు చనిపోవడం తీవ్రమైన దుర్ఘటన. యాంత్రీకీకరణ లోపం వల్ల ఇది జరిగింది. ఇంకా భయానకం ఏమిటంటే, ఈ మొత్తం 18,000 ఆవుల పెడ్డులో పాలు పిండటానికి ఒకే ఒక్క మనిషి ఉండటం! కేవలం ఒక్క మనిషి!
– బెర్నీ స్పాఫోర్డ్, కామెంటేటర్

రాజీవ్ తొలగింపు కోసం సాగిన కుట్ర

కామెంట్



కరణ్ థాపర్

ఒక జ్ఞాపకాల పుస్తకాన్ని చదవడంలో సరదా అది వెల్లడించే విషయాలపై ఆధారపడి ఉంటుంది. అది ఒక ఉద్దేశపూర్వకమైన విచక్షణారాహిత్యం కావొచ్చు, దిగ్భ్రాంతి కలిగించే ఒప్పుదల కావచ్చు లేదా మనకు తెలియని సాధారణమైన వివరాలు కావచ్చు. కానీ ఉద్దేశపూర్వకంగా స్వీయ నేరారోపణ చేసుకోవడం నేను ఇదివరకు ఎన్నడూ చూడలేదు. ఈ ప్రస్తుత కేసులో, రచయిత సొంత వివరణ ప్రకారం, తన వృత్తి డిమాండ్ చేసే అత్యున్నత నైతిక ప్రమాణాలకు ఆయన ద్రోహం తలపెట్టారు. ఇంకా ఆందోళనకరమైనది ఏమిటంటే, భారత ప్రజాస్వామ్యాన్ని ఉద్దేశ పూర్వకంగా ప్రమాదంలో పడేశారు.

రాష్ట్రపతిగా జ్ఞానీ జైల్ సింగ్ పదవీ కాలానికి సంబంధించి కె.సి. సింగ్ రాసిన 'ది ఇండియన్ ప్రెసిడెంట్' అనే పుస్తకం గురించి నేను మాట్లాడుతున్నాను.

కేసీ సింగ్ 1983 నుంచి 1987 వరకు నాటి రాష్ట్రపతి డిప్యూటీ కార్యదర్శిగా వ్యవహరించారు. ఆ కాలంలో, అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీని పదవీభ్రష్టుడిని చేయాలంటూ జైల్ సింగ్‌ను ఒప్పించేందుకు జరిగిన కుట్రల్లో ఆయన ఇష్టపూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా కీలకపాత్ర పోషించారు.


కేసీ సింగ్ అలక్ష్యంగా రాశారు: "ఒక సలహాదారుగా ఉండటం నుంచి రాజకీయ క్రీడలో పాత్ర పోషించడం వరకు జరిగిన మార్పు నా స్వభావానికి సంబంధించినదే." 1987లో తన ప్రవర్తన గురించి ఆయన ఇలా చెబుతారు: "ఆ దశలో నేను రాజకీయ నాటకంలో పూర్తిగా భాగమయ్యాను... నాకు సంబంధించినంతవరకు గత నాలుగేళ్లలో జరిగిన ఘటనలు రాజీవ్ గాంధీ పాలన మీద తీవ్ర ధిక్కారం కలిగించాయి."

రాజీవ్ గాంధీని తొలగించాలంటూ జైల్ సింగ్‌కు నచ్చజెప్పేందుకు వీసీ శుక్లాకు సహకరించడంలో కేసీ సింగ్ పాత్రకు సంబంధించిన వివరాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. "శుక్లా భారత రాష్ట్రపతిని కలిసేందుకు వచ్చిన సమయంలో, అంటే 1985 చివరలో నన్ను పిలిచారు. వారిద్దరికీ మధ్య సమాచార వారధిగా నేను ఉంటానని చెప్పాను. ఇది రాష్ట్రపతి భవన్‌కు శుక్లా రావలసిన అవసరాన్ని తప్పించింది. ఎందుకంటే ఆయన సందర్శనలపై ఇంటెలిజెన్స్ బ్యూరో వేగులు పూర్తి అప్రమత్తతతో ఉండేవారు. నేను ఏం చెప్పినా దానికి రాష్ట్రపతి అధికారిక ముద్ర ఉంటుందని ఆయనకు స్పష్టంగా చెప్పడమైంది."

1987 మార్చిలో, పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ పరాజయం పొంది, న్యాయశాఖ మంత్రి అశోక్ సేన్ రాజీనామా చేసిన తర్వాత జరిగిన పరిణామాలను కేసీ సింగ్ రాశారు: "రాష్ట్రపతిని తగిన చర్య తీసుకునేలా ఒప్పించాలంటూ వీసీ శుక్లా ఎంతో ఉద్వేగంతో నన్ను కోరారు. ప్రధానమంత్రిని రాష్ట్రపతి పదవి నుంచి తొలగించాలి. ఆయన స్థానంలో అశోక్ సేన్‌తో ప్రమాణ స్వీకారం చేయించాలి.... రాజీవ్ గాంధీని ఒకసారంటూ గద్దె దింపాక ఆయన వెనుక ఉన్న మద్దతు కుప్పగూలిపోతుందని శుక్లా మొండినమ్మకంతో ఉన్నారు."

శుక్లా, అశోక్ సేన్ కలిసి కేసీ సింగ్ నివాసానికి వచ్చారు, "రాష్ట్రపతి భవన్‌కు వారిని నా కారులో తీసు కెళ్లేందుకు. నేను వారిని నా నెమలి నీలి రంగు ఫియట్‌లో తీసుకెళ్లాను". ఒక నెల తర్వాత కేసీ సింగ్ మళ్లీ వాళ్ల చోదకుడిగా వ్యవహరించారు. "ఈసారి వారిని ఫియట్ వెనుక ఒత్తుకునేలా కూర్చోబెట్టి" తీసుకెళ్లారు.

రాజీవ్ గాంధీకి వ్యతిరేకంగా అర్జున్ సింగ్‌ను మార్చడానికి కూడా కేసీ సింగ్ ప్రయత్నించారు. "ఇప్పుడు నేను దాటుతున్నది కీలకమైన లక్ష్మణరేఖ. ఇది ఇప్పటివరకూ నేను పని చేసిన 'గ్రే జోన్' లాంటిది ఎంత మాత్రమూ కాదు. కాంగ్రెస్‌లో చీలికలను మరింత పెంచడానికి ఏం చేయాలో అన్న కోరిక ముందు నా





'ది ఇండియన్ ప్రెసిడెంట్' రచయిత కె.సి. సింగ్

అప్రమత్తతను త్యజించివేశాను."

ఏదేమైనప్పటికీ ఆ సందర్భంలో కేసీ సింగ్ అత్యుత్సాహం ఆయన్ని ఉచ్చులోకి నెట్టివేసింది. కేసీ సింగ్ బ్యాచ్‌మేట్ సురేందర్ సిద్ధు, "అర్జున్ సింగ్ (తనను) కలవడానికి ఉత్సాహంగా ఉన్నాడని సూచించాడు. నేను... అర్జున్ సింగ్ వంటి జిత్తులమారి రాజకీయ నాయకుడు కూడా నన్ను వంచించడానికి నా బ్యాచ్‌మేట్‌ను ఉపయోగించబోడని నమ్మేశాను". అక్కడే కేసీ సింగ్ పప్పులో కాలేశారు.

"భవిష్యత్తులో సంప్రదించడానికి అర్జున్ సింగ్ తన డైరెక్ట్ టెలిఫోన్ లైన్ నాకు ఇచ్చారు. నా గదిలో మాత్రమే మోగే నంబరు ఆయనకు ఇచ్చాను." అర్జున్ సింగ్ తనతో 'ఆడుకుంటున్నారని' ఆయనతో తొలి సమావేశం తర్వాతే కేసీ సింగ్ అర్థం చేసుకున్నప్పటికీ, తర్వాత రెండు సార్లు కలిశారు. అప్పటికి రాజీవ్ గాంధీకి వ్యతిరేకంగా మారేలా నచ్చజెప్పడానికి కేసీ సింగ్ ప్రయత్నించారు. "నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్నికల్లో పరాజయం పొందడం, బోఫోర్స్ అవినీతి మేఘం అనేవి కాంగ్రెస్ పార్టీ నుంచి జవాబుదారీ తనం డిమాండ్ చేస్తున్నాయని నేను వాదించాను."

కాన్షీరామ్‌తో ఒక సమావేశం సహా ఇంకా ఇలాంటివి పుస్తకంలో చాలా ఉన్నాయి. కానీ నేను ఇప్పటికే చాలినన్ని చెప్పాననుకుంటున్నాను. నిజానికి, నేను లోతుగా ఆలోచించలేక పోయింది ఏమిటంటే – కేసీ సింగ్ వీటన్నింటినీ తన పుస్తకం ద్వారా ఎందుకు బయటపెట్టాలని అనుకున్నారు? ఒక సివిల్ సర్వెంటుగా ఇది తన కీర్తి ప్రతిష్ఠలను తగ్గించివేస్తుందని ఆయనకు తెలిసివుండాలి. ఇంకా ఘోరమైనది ఏమిటంటే, ఒక ప్రజాదరణ కలిగిన ప్రధానికి వ్యతిరేకంగా ఆయన కుట్ర చేశాడనడానికి ఇది రుజువు. ఎప్పుడు విచక్షణతో ఉండాలి, ఎప్పుడు నోరు మూసుకుని ఉండాలి అనే విషయంలో ఆయనకు బొత్తిగా ఏమీ తెలీదని ఇది సూచిస్తోంది. లేదా ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీనీ, ప్రభుత్వాన్నీ ఆయన మనసులో పెట్టుకున్నారా? గాంధీల మీదున్న వారి వైముఖ్యత వల్ల వారు ఈ పశ్చాత్తాప గాథ పట్ల ఆసక్తి చూపి, పైగా దాని రచయితను అభినందిస్తా రనుకున్నారా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

భారతీయ సంస్కృతీ ధార

గంగ, గాయత్రి, గోవిందుడు, గీత, గోవులను పంచ క్షేత్రాలుగా హిందూ ధర్మం చెబుతుంది. దీన్ని బట్టి భారతీయ సంస్కృతిలో గంగకున్న ప్రాధాన్యం ఏమిటో అర్థమవుతుంది. ఋగ్వేదం, శతపథ బ్రాహ్మణం, ఐతరేయ బ్రాహ్మణం వంటివాటిలో గంగానది ప్రస్తావనలున్నాయి. అదే విధంగా పద్మపురాణం, నారదీయపురాణం, అగ్ని పురాణం, మత్స్య పురాణాలలో సహితం 'గంగ'కు సంబంధించిన స్తోత్ర పాఠాలున్నాయి. భగవద్గీతలో శ్రీకృష్ణుడు 'తన అభిన్నతను గంగానదితో తెలియజేస్తాడు. 'మహాభారతం' ఆదిపర్వంలో నదీ దేవతయిన గంగ 'నరజన్మ'ను పొందినట్లుగా కథ ఉంది. 'ఒక చేతిలో



కుంభాన్ని, మరో చేతిలో కమలాన్ని ధరించి, మకర వాహనంపై ఆశీనురాలైనట్టుగా' శిల్పశాస్త్రాలు గంగ రూపాన్ని నిర్దేశించాయి.

గంగానదిలో స్నానమాచరిస్తే శరీరంతో పాటు మనస్సు శుభ్రపడుతుందంటారు. అమావాస్య, సంక్రాంతి, చంద్ర, సూర్యగ్రహణాలు; పుష్కర దినాలలో గంగా స్నానం అత్యంత విధాయికం అంటారు ధర్మవిదులు. ఉత్తర భారతంలో 'దశహరా' రోజు 'గంగ' భూమిపైన అవతరించినదని విశ్వసిస్తారు. ఈ పర్వదినాన కాశీలోని 'దశాశ్వమేధ' ఘట్టంలో స్నానం చేస్తే పదిరకాల పాపాలు హరిస్తాయని హిందువుల నమ్మకం. మరణించిన వ్యక్తి చితాభస్మాన్ని గంగలో నిమజ్జనం చేయటం వలన మృతునికి పుణ్యలోకాలు సంప్రాప్తమవుతాయని భారతీయుల విశ్వాసం.

గంగానదిని 'త్రిపథ'గా కూడా వ్యవహరిస్తారు. గంగ వృత్తాంతానికి చెందిన అనేక కథనాలు ప్రసిద్ధి చెందాయి. వామన లేదా త్రివిక్రమ అవతారంలో విష్ణుమూర్తి పాదం నుండి గంగానది ఉద్భవించినందున దీనిని 'విష్ణుపదీ' అని కూడా పిలుస్తారు. శంకరాచార్యుల వారు తన 'గంగా స్తోత్రం'లో 'ఓ గంగామాతా! నీవు శ్రీహరి పాద తీర్థంగా ఉద్భవించిన నదీమ తల్లివి. నీ తరంగముల ధవళకాంతులు చంద్రము, హిమము, ముత్యముల వలే భాసిల్లుతున్నవి. నా సకల పాపభారాన్ని తొలగించి, కృపతో నన్ను ఈ సంసార సాగరాన్ని దాటించు' అని వేడుకున్నారు.

– భమిడిపాటి గౌరీశంకర్

క్లుప్తంగా...

ఏఎన్‌యూ కళాకారుడికి అరుదైన ఆహ్వానం

- ఈ నెల 27న రాష్ట్రపతి, ప్రధాన మంత్రిని కలిసే అవకాశం
- మన్‌కీబాత్ 100 ఎపిసోడ్లు పూర్తయిన వేడుకల్లో పాల్గొననున్న కళాకారుడు



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న వీసీ రాజశేఖర్, రెక్టార్ వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ కరుణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కళాకారుడు, ఫైన్‌ఆర్ట్స్ అధ్యాపకుడు పి.శ్రీనివాస్‌కు అరుదైన ఆహ్వానం లభించింది. ఈ నెల 27వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్రమోదీలను కలిసే అవకాశం లభించింది. ప్రధాన మంత్రి నిర్వహిస్తున్న మన్‌కీ బాత్‌ను ప్రసారం చేస్తున్న డీడీ(దూరదర్శన్) సంస్థ ఈ నెల 26వ తేదీన మన్‌కీ బాత్ 100 ఎపిసోడ్ల సమావేశం నిర్వహించనుంది. ఈ ఎపిసోడ్‌లో పాల్గొనాల్సిందిగా ఏఎన్‌యూ అధ్యాపకుడు శ్రీనివాస్‌కు డీడీ ఆహ్వానం పంపింది. పాత ఇనుప వ్యర్థాలతో కళాకృతులు తయారు చేసే కళాకారుడు శ్రీనివాస్ నైపుణ్యాన్ని 2021వ సంవత్సరం మార్చి 27వ తేదీన ప్రసారమైన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. కాగా, శ్రీనివాస్‌ను సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ ప్రత్యేకంగా అభినందించారు.

వెండి సింహాల బొమ్మల చోరీ కేసు నిందితులకు ఏడాది జైలు

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వెండి రథానికి ఉండే వెండి సింహాల బొమ్మలను చోరీ చేసిన నిందితులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి డి.సత్యవతి సోమవారం తీర్పు చెప్పారు. ఆలయంలోని మహా మండపం వద్ద ఏర్పాటు చేసిన షెడ్డులో ఉండే రథానికి నాలుగు స్తంభాలు ఉంటాయి. ఒక్కో స్తంభానికి ఒక్కో వెండి సింహం బొమ్మ ఉంటుంది. వాటిల్లో మూడు సింహం బొమ్మలు చోరీకి గురయినట్లు 2020 సెప్టెంబర్ 15వ తేదీన ఆలయ అధికారులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయంలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించిన అనంతరం 2021 జనవరి 22వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన జక్కంపూడి సాయిబాబా, తణుకు గ్రామానికి చెందిన ముత్తా కమలేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 15.4 కేజీల వెండి సింహం బొమ్మలను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ వాదనలు వినిపించారు. 12 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

అసెంబ్లీలో తెలుగు రిపోర్టర్ల పోస్టులకు ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్ర అసెంబ్లీ సచివాలయ విభాగంలోని తెలుగు రిపోర్టర్ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ఏపీపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ఈ జాబితాను కమిషన్ వెబ్‌సైట్ 'https://psc.ap.gov.in' లో పొందుపరిచినట్లు కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది.

వీఐటీఈఈఈ-2023 ప్రారంభం



వీఐటీ-ఏపీలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వర్సిటీ అధికారులు

అమరావతి: వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష (వీఐటీఈఈఈ-2023) సోమవారం ప్రారంభమైంది. వెల్లూరు, చెన్నై, భోపాల్, ఏపీలోని అమరావతి క్యాంపస్‌ల్లోని బీటెక్ అడ్మిషన్ల కోసం ఈ పరీక్షను వర్సిటీ నిర్వహిస్తోంది. ఈ పరీక్ష ఈ నెల 23 వరకు ప్రతిరోజు మూడు స్లాట్‌ల్లో నిర్వహిస్తున్నట్లు వర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిషన్స్) డాక్టర్ జాన్ ప్రదీప్ తెలిపారు. ఫలితాలను ఏప్రిల్ 26న www.vit.ac.in లో పొందుపరచనున్నారు. లక్ష ర్యాంకులోపు సాధించిన విద్యార్థులకు ఏప్రిల్ 26 నుంచి జూన్ 14 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర చెప్పారు. 1-20,000 ర్యాంకుల వరకు ఏప్రిల్ 26-30 వరకు, 20,001 నుంచి 45,000 ర్యాంకుల వారికి ఏప్రిల్ 29 నుంచి మే 11 వరకు, 45,001 నుంచి 70,000 ర్యాంకుల వరకు మే 20 నుంచి 22 వరకు, 70,001- 1,00,000 ర్యాంకుల వరకు మే 31 నుంచి జూన్ 2 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. లక్ష కంటే ఎక్కువ ర్యాంకు వచ్చిన వారికి వీఐటీ-ఏపీ, వీఐటీ-భోపాల్‌ల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. వీరికి జూన్ 12 నుంచి 14 వరకు కౌన్సెలింగ్ ఉంటుంది. తరగతులు ఆగస్టు రెండో వారంలో ప్రారంభమవుతాయి.

'బంగినపల్లి'కి అరబ్ దేశాల్లో క్రేజ్

బంగినపల్లికి పుట్టినిల్లు ఉమ్మడి కర్నూలు జిల్లా



- ఇక్కడి నుంచి గతేడాది 2,500 టన్నులు విదేశాలకు ఎగుమతి
- ఈ ఏడాది 5వేల టన్నులు ఎగుమతి చేస్తారని అంచనా
- తోటల వద్దకు తరలిస్తున్న బడా వ్యాపారులు



కర్నూలు(అగ్రికల్చర్): అద్భుతమైన రుచి... ఆకట్టుకునే రూపం... గుబాళించే సువాసన... మన బంగినపల్లి మామిడి సొంతం. భారతీయులతోపాటు అరబ్, యూరోప్ దేశాల ప్రజలు కూడా ఈ మధుర ఫలాన్ని లొట్టలేసుకుంటూ ఇష్టంగా తింటారు. ముఖ్యంగా బంగినపల్లి (బేనీషా) మామిడికి పుట్టినిల్లు అయిన ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగుచేస్తున్న పండ్లకు అరబ్ దేశాల్లో అత్యంత ఎక్కువగా క్రేజ్ ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 25వేల ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. గత ఏడాది సగటున ఎకరాకు 2 నుంచి 3 టన్నుల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం 3-4 టన్నుల వరకు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద ఉమ్మడి జిల్లాలో లక్ష టన్నుల దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. దీనిలో 80 నుంచి 90 శాతం వరకు బంగినపల్లి ఉంటుంది. బంగినపల్లి రకం మామిడిని విదేశాలకు ఎగుమతి చేస్తుండటంతో రెండు, మూడేళ్లుగా రైతులు నాణ్యతపై ప్రత్యేక దృష్టిపెట్టారు. గూడూరు, ఓర్వకల్, వెల్దుర్తి, ప్యాపిలి, బేతంచెర్ల, బనగానపల్లి, కల్లూరు, కర్నూలు, దేవనకొండ, డోన్, క్రిష్ణగిరి తదితర మండలాల్లో కొంతమంది రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మామిడి సాగు చేస్తున్నారు. చీడపీడల బెడద, కెమికల్స్ ప్రభావం మామిడిపై పడకుండా ఫ్రూట్ కవర్స్ కూడా వినియోగిస్తున్నారు. దీంతో పండ్ల నాణ్యత పెరుగుతోంది. రైతులకు ఉద్యానవనశాఖ అధికారులు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

బడా వ్యాపారులు వచ్చి కొనుగోలు...

ముంబై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల నుంచి బడా వ్యాపారులు ఇక్కడికి వచ్చి మామిడి పండ్లను కొనుగోలు చేస్తున్నారు. తోటల్లోనే 20 కిలోల బాక్సుల్లో పండ్లను ప్యాకింగ్ చేసి ఆయా నగరాలకు తరలిస్తున్నారు. అక్కడ ప్రాసెసింగ్ చేసి అరబ్, యురోపియన్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ పండిన పండ్లలో 40 శాతం ముంబైకి తీసుకువెళ్లి, అక్కడి నుంచి అరబ్ దేశాలైన దుబాయ్, సౌదీ, కువైట్‌కు ఎగుమతి చేస్తున్నారు. గత ఏడాది 2,500 టన్నుల వరకు వివిధ దేశాలకు ఎగుమతి చేశారు. టన్ను ధర రూ.80 వేల నుంచి రూ.1.05లక్షల వరకు లభించింది. ఈ ఏడాది 5వేల టన్నుల వరకు ఎగుమతి అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం మామిడి కొనుగోలు కోసం మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు తరలివస్తున్నారు. ఈ సీజన్ ప్రారంభంలో మామిడికి ఎన్నడూ లేని విధంగా టన్ను ధర రూ.లక్షకు పైగా పలికింది. ఇటీవల మార్కెట్‌కు మామిడి తాకిడి పెరిగిన తర్వాత ధరలు తగ్గినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం టన్ను ధర రూ.40 వేల వరకు లభిస్తోంది.

నాణ్యత స్పష్టంగా కనిపిస్తోంది



ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాం. ఎన్నడూ లేని విధంగా ఈసారి మామిడిలో నాణ్యత పెరిగింది. 50 ఎకరాల్లో మామిడి తోటలు అభివృద్ధి చేశాం. ఇందులో 85 శాతం చెట్లు బేనీషా రకానికి చెందినవే. ఎగుమతులకు అనువైన నాణ్యత ఉండాలనే లక్ష్యంతో కొన్నేళ్లుగా రసాయనాలు వాడటం లేదు. ఇందువల్ల మామిడిలో నాణ్యత స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడి నుంచి నేరుగా విదేశాలకు ఎగుమతి కావడంలేదు. ముంబై, తమిళనాడు, హైదరాబాద్ వ్యాపారులు వచ్చి మామిడి కొంటున్నారు.

– గొల్ల శ్రీరాములు, గూడూరు

5 నెలల్లో ఫిషింగ్ హార్బర్ రెడీ

- బందరు పోర్టు అధికారి కెప్టెన్ ధర్మశాస్త్రి
- కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలో రూ.348 కోట్లతో నిర్మాణం



ప్రజాప్రతినిధులకు ఫిషింగ్ హార్బర్ పనుల వివరాలు తెలియజేస్తున్న పోర్టు అధికారులు

మచిలీపట్నంటౌన్: కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని గిలకలదిండి వద్ద రూ.348 కోట్లతో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ పనులు మరో ఐదు నెలల్లో పూర్తవుతాయని బందరు పోర్టు అధికారి కెప్టెన్ ధర్మశాస్త్రి తెలిపారు. గిలకలదిండిలోని తన కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనుల వివరాలను సోమవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మచిలీపట్నంలోని మత్స్యకారుల చిరకాల స్వప్నం మరికొద్ది నెలల్లో నెరవేరనుందన్నారు. 2009 సంవత్సరం నుంచి సముద్రమొగ పూడిక తీయించాలనే డిమాండ్ ఈ ప్రాంతంలో ఉందని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. ఈ నేపథ్యంలో మచిలీపట్నంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పది ప్రాంతాల్లో ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి, జెట్టీల నిర్మాణ పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం డ్రెడ్జింగ్ పనులు 3.5 మీటర్ల లోతున 10.50 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకం పనులు జరుగుతున్నాయని వివరించారు. ఫలితంగా రాబోయే 50 ఏళ్ల వరకు మత్స్యకారులు మొగ నుంచి చేపల వేటకు వెళ్లే సమయంలో ఎలాంటి ఇబ్బందులూ ఎదురుకాబోవని స్పష్టం చేశారు. మత్స్యకారులు ఫిషింగ్ చేశాక దిగుమతికి ఒకే సారి 600 బోట్లు నిలిపేందుకు 790 మీటర్ల వాల్ నిర్మిస్తామన్నారు. మత్స్యసంపద ఎగుమతి, దిగుమతుల కోసం మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు.

ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా చందన నాగేశ్వర్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పచ్చదనం-సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్‌గా చందన నాగేశ్వర్ సోమవారం విజయవాడలోని కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం నాగేశ్వర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ రాజమండ్రి రూరల్ కోఆర్డినేటర్‌గా నియమించారని, ఇప్పుడు అదనపు బాధ్యతగా ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం ఆనందంగా ఉందన్నారు. కార్పొరేషన్ తరఫున జగనన్న కోరుకున్న విధంగా ప్రజలకు తన సేవలు అందిస్తానని తెలిపారు. కడియం మండలం నర్సరీ పరిశ్రమకు పుట్టినిల్లు అని, రాష్ట్ర వ్యాప్తంగా సుందరీకరణ, పచ్చదనం కోసం తగిన ప్రణాళికను రూపొందించి అమలుకు కృషి చేస్తానని ఆయన వివరించారు.

ప్రాణం తీసిన ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం



నాగభూషణంరెడ్డి మృతదేహం

పలమనేరు/గంగవరం (చిత్తూరు జిల్లా): ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ ప్రాణాన్ని బలిగొంది. తన వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోతే ఎలాగని నిలదీస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గంగవరం మండల పరిధిలోని చెన్నై-బెంగళూరు హైవేపై గంగవరం బైపాస్ వైఎస్సార్ సర్కిల్ వద్ద సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మదనపల్లి అమ్మచెరువుమిట్టకు చెందిన ఆవుల నాగభూషణం రెడ్డి (50) తన బొలెరో వాహనంలో బెంగళూరుకు వెళుతున్నారు. అదే సమయంలో గంగవరం సమీపంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద దండపల్లి రోడ్డు నుంచి వచ్చిన ఓ ఇసుక ట్రాక్టర్ బొలెరో వాహనాన్ని వెనుక నుంచి ఢీకొని వేగంగా ముందుకెళ్లింది. దీన్ని గమనించిన నాగభూషణం రెడ్డి ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేసి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. డ్రైవర్ సురేష్ ట్రాక్టర్‌ను ఆపకుండా ముందుకెళ్లడంతో నాగభూషణంరెడ్డి ట్రాక్టర్ ఇంజన్ పైకెక్కి అతడిపై చేయిచేసుకున్నాడు. అయినప్పటికీ డ్రైవర్ ట్రాక్టర్‌ను ముందుకు పోనిస్తుండగా.. నాగభూషణంరెడ్డి ట్రాక్టర్ చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో హైవే మొబైల్ పోలీసులు క్షతగాత్రుడిని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించగా.. నాగభూషణంరెడ్డి కాసేపటికే మృతి చెందాడు.

తెలంగాణ

హైదరాబాద్‌లో జీ20 సమావేశాలు షురూ

సాక్షి, హైదరాబాద్: భారత్ అధ్యక్షతన జరుగుతున్న జీ20 సమావేశాల్లో భాగంగా డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూప్ రెండో దఫా చర్చలు సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. సుమారు 23 దేశాలకు చెందిన 130 మంది ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో మొబైల్ బ్రాడ్‌బ్యాండ్‌తోపాటు డిజిటల్ కనెక్టివిటీ సంబంధిత అంశాలపై చర్చించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అల్కేశ్ కుమార్ శర్మ అతిథులకు స్వాగతం పలికారు. టెలీ కమ్యూనికేషన్స్ విభాగపు కార్యదర్శి కె.రాజారామన్.. డిజిటల్ కనెక్టివిటీకీ దేశాల స్థూల జాతీయోత్పత్తికీ మధ్య ఉన్న సంబంధాన్ని, కనెక్టివిటీని పెంచాల్సిన ఆవశ్యకతను వివరించారు. కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి దేవు సింగ్ చౌహాన్ మాట్లాడుతూ అతితక్కువ కాలంలోనే దేశంలో 5జీ టెక్నాలజీని అమలు చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. దేశంలోని సుమారు 600 జిల్లాలకు కేవలం 200 రోజుల్లో 5జీ సేవలు విస్తరించగలిగామని ఆయన తెలిపారు. భారత దేశంలో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద టెలికమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ ఉన్నప్పటికీ డేటా రేట్లు మాత్రం అతి తక్కువని,ం ఇది సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఎంతో ఉపయోగకరమైన విషయమని వివరించారు. అతి తక్కువ సమయంలో భారత్ సొంతంగా 4జీ, 5జీ టెక్నాలజీలను అభివృద్ధి చేసుకోవడం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందని తెలిపారు.

హిజ్రాల జీవనంపై పరిశోధన

- ఏయూ పరిశోధకురాలు పోలిమెట్ల అమితకు డాక్టరేట్



డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరిస్తున్న అమిత

ఏయూక్యాంపస్ : సమాజంలో హిజ్రాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి జీవన విధానంపై ఏయూ సోషల్ వర్క్ విభాగం పరిశోధకురాలు పోలిమెట్ల అమిత పరిశోధన చేశారు. రాష్ట్రంలోని తీరప్రాంతం కలిగిన 9 జిల్లాల్లో 270 మంది హిజ్రాల నుంచి సమాచారాన్ని సేకరించారు. వీరిలో 268 మంది తమ వివరాలు సిద్ధాంతగ్రంథంలో పొందుపరచడానికి అంగీకరించారు. ఇద్దరు తమ వివరాలు బహిర్గతం చేయవద్దని కోరారు. సోషల్ వర్క్ విభాగం ఆచార్యులు కె.విశ్వేశ్వరరావు పర్యవేక్షణలో అమిత అధ్యయనం చేసి డాక్టరేట్ పొందారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను సోమవారం స్వీకరించారు. గతంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి హిజ్రాల సమస్యలు, చేపట్టాల్సిన చర్యల గురించి వివరించానని, ఆయన సానుకూలంగా స్పందించారని పరిశోధకురాలు అమిత తెలిపారు. తాను చేసిన పరిశోధన ప్రభుత్వానికి మరింత ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నానని చెప్పారు. సాల్వేటోరియన్ సభ సహాయంతో 'నీ తోడు' ఎన్‌జీవోను స్థాపించి హిజ్రాల సంక్షేమానికి కృషి చేస్తున్నానని ఆమె వివరించారు.

విదేశీ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత

- ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నజీర్ అహ్మద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యపై పెట్టే వ్యయం విద్యార్థుల భవిష్యత్‌కు పెట్టుబడి అనే మహోన్నత ఆశయంలో సీఎం జగన్ విద్యారంగానికి వేల కోట్లు కేటాయిస్తున్నారని ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ నజీర్ అహ్మద్ చెప్పారు. కాకినాడలోని జేఎన్‌టీయూ(కే)లో ఉన్నత విద్యామండలి, ఆప్ స్కిల్స్ ఆధ్వర్యంలో సోమవారం స్టడీ అబ్రాయిడ్ ఫెయిర్-2023 నిర్వహించారు. ప్రొఫెసర్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ.. ఈ ఫెయిర్‌లో టాప్ 200 ర్యాంకింగ్ ఉన్న విదేశీ వర్సిటీలు పాల్గొనడం సంతోషమన్నారు. విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఏవిధంగా చెల్లిస్తారు తదితర వివరాలు తెలుసుకోవడానికి ఈ ఫెయిర్ ఉపయోగపడుతుందన్నారు. జేఎన్‌టీయూ(కే) వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాద రాజు మాట్లాడుతూ దాదాపు ఎనిమిది జిల్లాల్లో ఉన్న ఇంజినీరింగ్, ఎంబీఏ ఫైనలియర్ విద్యార్థులు విదేశీ విద్య, అక్కడ వర్సిటీల విధానాలు తదితర వివరాలు తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఫెయిర్‌లో 2,500 మంది విద్యార్థులు పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకున్నారు. వర్సిటీ రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు అదనపు భద్రత కల్పించండి

- డీజీపీకి అచ్చెన్నాయుడు లేఖ

సాక్షి, అమరావతి: తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు అదనపు భద్రత కల్పించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనకు లేఖ రాశారు. మంగళవారం నుంచి చంద్రబాబు వైఎస్సార్, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో పర్యటిస్తున్నారని, ఈ సందర్భంగా అదనపు భద్రత కల్పించాలన్నారు. 18న కడప, 19న ప్రకాశం జిల్లా గిద్దలూరు, 20న మార్కాపురం, 21న ఎర్రగొండపాలెంలో ఆయన పర్యటిస్తారని తెలిపారు. 20వ తేదీన చంద్రబాబు పుట్టినరోజు కావడంతో మార్కాపురానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఆయన సమావేశాలను రాజకీయ ప్రత్యర్థులు, అసాంఘిక శక్తులు టార్గెట్ చేసే ప్రమాదం ఉందని, కాబట్టి అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు.

ఎన్‌ఐఏ దర్యాప్తులో చాలా లోపాలున్నాయి

ముఖ్యమంత్రి జగన్‌పై హత్యాయత్నం కేసులో దర్యాప్తు సరైన దిశలో సాగలేదు

- తూతూ మంత్రంగా దర్యాప్తు పూర్తి చేసింది
- అంతే హడావుడిగా చార్జిషీట్ దాఖలు చేసింది
- అనేక కీలక అంశాలను అలాగే వదిలేసింది
- అందుకే లోతైన దర్యాప్తు కోరుతున్నాం
- ఎన్‌ఐఏ కోర్టుకు నివేదించిన సీఎం తరఫు న్యాయవాది
- వాదనలకు గడువు కోరిన ఎన్‌ఐఏ న్యాయవాది
- తదుపరి విచారణ 20కి వాయిదా

సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) దర్యాప్తులో చాలా లోపాలున్నాయని సీఎం జగన్ తరఫు న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు సోమవారం ఎన్‌ఐఏ కోర్టుకు నివేదించారు. ఎన్‌ఐఏ సరైన దిశలో దర్యాప్తు చేయలేదని.. అనేక కీలక అంశాలను సమాధానాల్లేని ప్రశ్నలుగా మిగిల్చిందని ఆరోపించారు. దర్యాప్తును తూతూ మంత్రంగా పూర్తి చేసిందన్నారు. చార్జిషీట్‌ను కూడా చాలా హడావుడిగా దాఖలు చేసిందని అభ్యంతరం వ్యక్తం చేశారు. జగన్‌పై జరిగిన హత్యాయత్నంపై మొదట దర్యాప్తు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పలు కీలక సాక్ష్యాలను సేకరించిందన్నారు. అయితే ఆ తర్వాత దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఐఏ మాత్రం ఆ సాక్ష్యాలను ఏ మాత్రం పట్టించుకోలేదని తెలిపారు. అందుకే పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోర్టుకు నివేదించారు.

ఎంట్రీ పాస్ లేకుండానే విమానాశ్రయంలోకి నిందితుడు..

వైఎస్ జగన్‌పై అక్టోబర్ 25, 2018లో హత్యాయత్నం జరిగిందని.. ఘటనా స్థలంలోనే నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సీఎం తరఫు న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు కోర్టుకు తెలిపారు. ఆ మరుసటి రోజు శ్రీనివాసరావు ఇంటి నుంచి సిట్ అధికారులు విమానాశ్రయంలోకి ప్రవేశించేందుకు ఉపయోగించే ఏరోడ్రమ్ ఎంట్రీ పాస్ (ఏఈపీ)ని స్వాధీనం చేసుకున్నారన్నారు. హత్యాయత్నం జరిగిన రోజు ఎలాంటి ఎంట్రీ పాస్ లేకుండానే శ్రీనివాసరావు విమానాశ్రయంలోకి వెళ్లారని చెప్పారు. పాస్ ఇంటిలోనే ఉన్నప్పుడు శ్రీనివాసరావు ఎయిర్‌పోర్ట్‌లోకి ఎలా వెళ్లాడని ప్రశ్నించారు.

నిందితుడు కత్తిని లోపలకు ఎలా తీసుకెళ్లాడు?

జగన్‌తో కలిసి నిందితుడు ఫొటో దిగినట్లు ఉన్న ఫ్లెక్సీని కూడా సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని సీఎం తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే అసలు ఈ ఫ్లెక్సీని ఎవరు తయారు చేశారు? ఏ ఉద్దేశంతో తయారు చేశారన్న వివరాలను ఎన్‌ఐఏ పట్టించుకోలేదని కోర్టుకు నివేదించారు. ఫ్లెక్సీ విషయంలో నిందితుడు శ్రీనివాసరావు సోదరుడు ఇచ్చిన వాంగ్మూలాన్ని సిట్, ఎన్‌ఐఏ రికార్డు చేశాయన్నారు. అయితే ఈ రెండు వాంగ్మూలాలకు వైరుధ్యం ఉందన్నారు. ఇందులో ఏది నిజమో తేల్చాల్సిన బాధ్యత ఎన్‌ఐఏపై ఉందని కోర్టుకు నివేదించారు. విమానాశ్రయంలో భద్రత కట్టుదిట్టంగా ఉంటుందని గుర్తు చేశారు. లోపల ఉన్న హోటల్‌లోకి వెళ్లే సిబ్బందిని సైతం క్షుణ్ణంగా తనిఖీ చేస్తారన్నారు. మరి శ్రీనివాసరావు కత్తి తీసుకుని ఎలా లోపలికి వెళ్లారో ఎన్‌ఐఏ చెప్పడం లేదన్నారు. ఈ విషయంలో విమానాశ్రయ అప్పటి భద్రతా అధికారులను, సిబ్బందిని ఎన్‌ఐఏ విచారించలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. విమానాశ్రయంలో ఉన్న ఫ్యూజన్ హోటల్‌లో ఉద్యోగం సంపాదించేందుకు శ్రీనివాసరావు తనపై ఎలాంటి కేసులు లేవంటూ స్థానిక పోలీసుల నుంచి సర్టిఫికెట్ తీసుకున్నారన్నారు. దీన్ని ఆ హోటల్ యజమాని హర్షవర్ధన్ కూడా ధ్రువీకరించారని గుర్తు చేశారు. హర్షవర్ధన్ కారణంగానే శ్రీనివాసరావుకు అక్కడ ఉద్యోగం వచ్చిందన్నారు. శ్రీనివాసరావు హాజరు విషయంలో బయోమెట్రిక్ యంత్రాన్ని, సీసీ కెమెరాలను ఎన్‌ఐఏ సరిగా విశ్లేషించలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. వీటన్నింటి దృష్ట్యా ఈ కేసులో లోతుగా విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తమ వాదనలు వినిపించేందుకు ఎన్‌ఐఏ తరఫు న్యాయవాది సిద్ధిరాములు గడువు కోరడంతో న్యాయస్థానం అందుకు అంగీకరిస్తూ విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. సీఎం జగన్‌పై శ్రీనివాసరావు హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్‌ఐఏ దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

శకునికి మరో రూపం చంద్రబాబు

932వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల అభివృద్ధికి అడుగడుగునా అడ్డుతగులుతూ చంద్రబాబు శకునిలా తయారయ్యాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 932వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడారు. వికేంద్రీకరణ, పేదలకు ఇంగ్లిష్ మీడియం విద్య, పేదలకు ఇళ్లస్థలాలు అందకుండా చేసేందుకు కోర్టుల్లో కేసులు వేసిన చంద్రబాబుకు ప్రజలు మరోసారి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దేశంలోని అన్ని వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న చంద్రబాబు 29 కేసుల్లో స్టేలు తెచ్చుకుని విచారణ ఎదుర్కోకుండా చట్టాలను చుట్టాలుగా చేసుకుంటున్నాడని, ఆయనను విచారించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీ ఎనర్జీ ఎఫిషియెన్సీ పాలసీ భేష్

- రాష్ట్రంలో దాదాపు 16,875 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా
- బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవర ప్రశంసలు



సాక్షి,అమరావతి: ఆంధ్రప్రదేశ్ రూపొందించిన ముసాయిదా ఎనర్జీ ఎఫిషియన్సీ పాలసీకి దేశ వ్యాప్తంగా ప్రశంసలు దక్కుతున్నాయి. తాజాగా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) కొత్త సెక్రటరీగా బాధ్యత తీసుకున్న మిలింద్ దేవర సైతం ఏపీ విధానాలపై ప్రశంసల జల్లు కురిపించారు. రాష్ట్రం తయారు చేసిన పాలసీ వల్ల ఏటా 16,875 మిలియన్ యూనిట్లు (మొత్తం డిమాండ్లో 25.6 శాతం) ఆదా అవుతుందని, ఆ విలువ రూ. 11,779 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తద్వారా దాదాపు 14.34 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గే అవకాశం ఉందన్నారు. ఇంధన సామర్థ్య కార్యక్రమాలను అమలు చేయడం కోసం దేశంలోని వివిధ రాష్ట్రాలు రూపొందించిన స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీ(ఎస్‌డీఏ)లతో ఢిల్లీ నుంచి సోమవారం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఈఈ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా ఏపీలో దాదాపు రూ. 400 కోట్ల విలువైన 30 ఎనర్జీ ఎఫిషియెన్సీ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్‌లను గుర్తించామని, వాటికి సాధ్యమైనంత త్వరగా నిధులు సమకూరేలా చూస్తామని వెల్లడించారు. విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు తమ విద్యుత్ నష్టాలను తగ్గించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి దోహదపడే ఇంధన సామర్థ్య ఫైనాన్సింగ్‌పై బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే త్వరలో జాతీయ స్థాయి ఉన్నత సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మిలింద్ దేవర తెలిపారు.

ఏపీని అనుసరిస్తున్న 18 రాష్ట్రాలు

దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలు ఏపీ నియమించిన రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ నమూనాను అనుసరిస్తున్నాయని చెప్పారు. ఏపీ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) చేపట్టిన 65 సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఐఓటీ ఆధారిత ఎనర్జీ ఎఫిషియన్సీ డెమోన్‌స్ట్రేషన్ ప్రాజెక్టుల అమలు, న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఇంధన సామర్థ్య చర్యలు, పెర్ఫార్మ్, అచీవ్ - ట్రేడ్ (పాట్)లో పథకంలో 1.160 మిలియన్ టన్నుల చమురుకు సమానమైన ఇంధన పొదుపు, స్థానిక సంస్థల్లో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) అమలు వంటి కార్యక్రమాలు దేశ వ్యాప్తంగా గుర్తింపుతో పాటు మంచి ఫలితాలను వచ్చాయని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రం తరఫున ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

నిరూపిస్తే జైలుకు రెడీ

- వైఎస్ వివేకానందరెడ్డి మాజీ డ్రైవర్ దస్తగిరి

ఎర్రగుంట్ల : 'నేను సునీత వద్ద గానీ, సీబీఐ వద్ద గానీ ఒక్క రూపాయి తీసుకున్నానని నిరూపిస్తే జైలుకెళ్లడానికి సిద్ధం'.. అంటూ వైఎస్ వివేకానంద రెడ్డి మాజీ డ్రైవర్, ఆయన హత్యకేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి అన్నాడు. వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని కడప రోడ్డులో ఓ ప్రైవేటు స్థలంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడాడు. మీ పాత్ర వందకు వెయ్యి శాతం ఉంది కాబట్టే సీబీఐ మీ వైపు విచారణ కొనసాగిస్తోందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఉద్దేశించి అన్నాడు. సీబీఐపై అన్యాయంగా మాట్లాడుతున్నారని, ఇప్పుడు సమస్య తమ వరకు వచ్చింది కాబట్టే అరెస్టుచేస్తారనే భయంతో ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని వ్యాఖ్యానించాడు. తప్పుచేశాను కాబట్టే తాను అప్రూవర్‌గా మారినట్లు తెలిపాడు. తనకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల ప్రాణహాని ఉందని ఆరోపించాడు.

క్లుప్తంగా...

సునాక్‌పై పార్లమెంటరీ కమిషనర్ విచారణ!

లండన్: తన భార్య అక్షతా మూర్తి నిర్వహిస్తున్న 'కొరు కిడ్స్ లిమిటెడ్' అనే సంస్థకు లబ్ధి చేకూరేలా బడ్జెట్‌లో కొత్త పథకాన్ని ఉద్దేశపూర్వకంగా ప్రకటించారని బ్రిటిష్ ప్రధానమంత్రి రిషి సునాక్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణల్లో నిజానిజాలు నిగ్గుతేల్చడానికి 'యూకే పార్లమెంటరీ కమిషనర్ ఫర్ స్టాండర్డ్స్' విచారణ ప్రారంభించింది. అతి త్వరలో రిషి సునాక్‌ను ప్రశ్నించనుంది. కొరు కిడ్స్ లిమిటెడ్ సంస్థ చిన్నపిల్లల సంరక్షణ సేవలను అందిస్తోంది.

మనీశ్ సిసోడియా కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం మనీ లాండరింగ్ కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా కస్టడీని ప్రత్యేక కోర్టు పొడిగించింది. ఈ కేసును సీబీఐ, ఈడీలు దర్యాప్తు చేస్తున్నాయి. గతంలో ఇచ్చిన కస్టడీ గడువు ముగియడంతో సోమవారం ప్రత్యేక కోర్టు జడ్జి ఎంకే నాగ్‌పాల్ ఎదుట సిసోడియాను హాజరుపరిచారు. ఈ కేసులో సిసోడియా, సహనిందితులైన అరుణ్ పిళ్లై, అమన్‌దీప్‌లపై ఈ నెలాఖరు కల్లా ఈడీ సప్లిమెంటరీ చార్జిషీటును దాఖలు చేయనుందని ఈ సందర్భంగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నవీన్ కుమార్ కోర్టుకు చెప్పారు. ఈ సమయంలో ఆయన్ను విడుదల చేస్తే దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్న జడ్జి.. సీబీఐ కస్టడీని ఈ నెల 27 వరకు, ఈడీ కస్టడీని 29వ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలిచ్చారు. అదేవిధంగా, సిసోడియా బెయిల్ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపడతామని పేర్కొన్నారు.

స్కూల్ జాబ్స్ కుంభకోణం.. టీఎంసీ ఎమ్మెల్యే అరెస్ట్




కోల్‌కతా/ముర్షిదాబాద్: పశ్చిమ బెంగాల్‌లో స్కూల్ జాబ్స్ కుంభకోణం కేసులో అధికార టీఎంసీ ఎమ్మెల్యే జిబన్ కృష్ణ సాహాను సీబీఐ అరెస్ట్ చేసింది. ప్రభుత్వ అధీనంలోని, ఎయిడెడ్ స్కూళ్లలో ఉద్యోగాల భర్తీలో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించి సాహాను ఈ నెల 14నుంచి సీబీఐ ప్రశ్నిస్తోంది. ముర్షిదాబాద్ జిల్లా బుర్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన ఆయన ఇంట్లో సోదాలు జరిపింది. సోమవారం ఆయన్ను అదుపులోకి తీసుకుంది. అలీపోర్‌లోని ప్రత్యేక కోర్టు ఆయనకు నాలుగు రోజుల కస్టడీ విధించింది. 2014–21 సంవత్సరాల మధ్య సాహా విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో అక్రమాలకు పాల్పడినట్లు సీబీఐ ఆరోపిస్తోంది. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి.

లింగాయత్ పవర్!

కర్ణాటక రాజకీయాలతో లింగాయత్‌లది విడదీయ లేని బంధం. వారు ఎన్నికల్లో గెలుపోటముల్ని శాసించే శక్తిసామర్థ్యాలున్న సామాజిక వర్గం. ఒకప్పుడు కాంగ్రెస్‌కు గట్టి మద్దతుదారులైన లింగాయత్‌లు కొన్ని దశాబ్దాలుగా బీజేపీకి అండగా నిలుస్తున్నారు. అయితే ఆ సామాజికవర్గానికి చెందిన బలమైన నాయకుడు యడియూరప్పను సీఎం పదవి నుంచి బీజేపీ తప్పించడంతో లింగాయత్ మఠాధిపతుల్లో అసహనం మొదలైంది. అది ఎలా పరిణమిస్తుంది? లింగాయత్‌ల ఓట్ల కోసం బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయి...?

కన్నడనాట వారి ఓట్లే కీలకం
ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో బీజేపీ, కాంగ్రెస్



- లింగాయత్‌ల జనాభా: **1.5** కోట్లు
- రాష్ట్ర జనాభాలో శాతం: **17%**
- ప్రభావం చూపించే స్థానాలు: **100-120**
- ప్రస్తుత అసెంబ్లీలో లింగాయత్ ఎమ్మెల్యేలు: **54** (బీజేపీ -37)
- 1952 నుంచి లింగాయత్ సీఎంలు: **10**

ఉత్తర కర్ణాటకలో లింగాయత్‌ల ప్రాబల్యం ఎక్కువ. రాష్ట్ర జనాభాలో 17% ఉన్న వీరు కీలక ఓటుబ్యాంకు. ఒకప్పుడు కాంగ్రెస్‌కు పెట్టని కోట అయిన లింగాయత్‌లు 1990 తర్వాత బీజేపీ వైపు మళ్లారు. వీరి ఓటుబ్యాంకునే నమ్ముకున్న బీజేపీ ఇతర సామాజిక వర్గాల కోసం పెద్దగా చేస్తున్నదేమీ లేదు. తాజాగా ముస్లింల 4% రిజర్వేషన్లను తొలగించి లింగాయత్, వక్కలిగలకు చెరో 2% కట్టబెట్టింది కూడా. అయితే బలమైన లింగాయత్ నాయకుడు యడియూరప్పను సీఎం పదవి నుంచి తొలగించినప్పటి నుంచీ ఆ వర్గంలో నెలకొన్న అసంతృప్తి అంతా ఇంతా కాదు. సీఎం బసవరాజ్ బొమ్మై లింగాయతే అయినా తమ అభిమాన నాయకుణ్ని అవమానకరంగా తొలగించారన్నది వారి ఆగ్రహం.

కాంగ్రెస్ వ్యూహరచన

ఒకప్పుడు తమ కీలక ఓటుబ్యాంకు అయిన లింగాయత్‌లను మరోసారి అక్కున చేర్చుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. యడియూరప్ప విషయమై వారిలో నెలకొన్న అసంతృప్తిని అనుకూలంగా మార్చుకునే పనిలో పడింది. లింగాయత్‌లకు అత్యధిక టికెట్లు ఇవ్వడానికి కసరత్తు చేస్తోంది. ఇప్పటిదాకా ప్రకటించిన 166 మంది అభ్యర్థుల్లో 43 మంది లింగాయత్ సమాజికవర్గానికి చెందినవారే! 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాటి కాంగ్రెస్ సీఎం సిద్దరామయ్య ప్రభుత్వ కార్యాలయాల్లో లింగాయత్‌ల గురువు బసవేశ్వర చిత్రపటాన్ని ఉంచాలని ఆదేశించారు. తమను మతపరమైన మైనారిటీలుగా గుర్తించాలన్న లింగాయత్‌ల డిమాండ్‌ను కూడా కాంగ్రెస్ తలకెత్తుకుంది. తాను రాష్ట్రంలో అధికారంలో ఉండగా ఈ మేరకు కేంద్రానికి సిఫార్సు కూడా చేసింది. దీనిపై కేంద్రం మౌనాన్ని కూడా ప్రచారాస్త్రంగా చేసుకుంటోంది.

అలా బీజేపీ ఓటుబ్యాంకుగా...

లింగాయత్‌లు కాంగ్రెస్ వెన్నంటి ఉన్న రోజుల్లో ఆ పార్టీ బంపర్ మెజారిటీలు కొల్లగొట్టింది. 1990లో లింగాయత్ నేత వీరేంద్ర పాటిల్ నేతృత్వంలో కాంగ్రెస్ 224 స్థానాలకు గాను ఏకంగా 179 చోట్ల గెలిచింది! కానీ తర్వాత కాంగ్రెస్‌లో చీలికలు, బీజేపీ ఎదుగుదల తదితర కారణాలతో లింగాయత్‌లు బీజేపీ వైపు మళ్లారు. ముఖ్యంగా కర్ణాటకలో మత ఘర్షణల వేళ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీవ్ గాంధీ రాష్ట్ర సీఎం వీరేంద్ర పాటిల్‌ను తప్పించడాన్ని చారిత్రక తప్పిదంగా చెబుతారు. అప్పట్నుంచి లింగాయత్‌లు కాంగ్రెస్‌కు బాగా దూరమయ్యారు. ఆ దెబ్బకు 1994 ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం 36 స్థానాలకు పరిమితమైంది! లింగాయత్‌ల రాజకీయ ప్రాబల్యానికి ఇది తార్కాణమంటారు. ఇక బీజేపీలో యడియూరప్ప ఎదుగుదలతో లింగాయత్‌లు పూర్తిగా ఆ పార్టీవైపు మళ్లారు. అయితే అవినీతి ఆరోపణలతో యడ్డీని బీజేపీ బహిష్కరించడంతో ఆయన కర్ణాటక జనతా పార్టీ (కేజేపీ) పేరుతో వేరుకుంపటి పెట్టుకున్నారు. దాంతో 2013 ఎన్నికల్లో లింగాయత్ ఓట్లు భారీగా చీలి బీజేపీ 40 సీట్లకు పరిమితమైంది. కేజేపీ కూడా పెద్దగా సత్తా చాటలేదు. తర్వాత యడియూరప్ప తిరిగి బీజేపీ గూటికి చేరారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ చరిష్మా కూడా కలిసొచ్చి 28 ఎంపీ స్థానాల్లో బీజేపీ 17 గెలుపొందింది.

స్వాతంత్య్రోద్యమంలోనూ...

12వ శతాబ్దంలో సంఘ సంస్కర్త బసవేశ్వర లింగాయత్‌లకు నిర్దిష్ట జీవన విధానాన్ని ఏర్పాటు చేశారు. వీరు వీరశైవుల నుంచి దూరమై వేదాలను, కుల వ్యవస్థను వ్యతిరేకించేవారు. దేవాలయాలకు వెళ్లడం, బహుదేవతారాధన మాని ప్రగతిశీల భావాలు అలవర్చుకున్నారు. స్త్రీ పురుషులు సమానమని నమ్ముతారు. లింగాయత్‌లలో మహిళలకు ప్రత్యేక హక్కులున్నాయి. వారికి పెళ్లి చేసుకోకున్నా, భర్తను కోల్పోయినా పిల్లల్ని దత్తత చేసుకునే స్వేచ్ఛ ఉంది. స్వాతంత్య్ర సంగ్రామంలోనూ లింగాయత్‌లది చురుకైన పాత్ర. ప్రస్తుతం వీరశైవులు, లింగాయత్‌లు దాదాపుగా కలిసిపోయారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

లింగాయత్ మఠాల ప్రాధాన్యం...

కర్ణాటకలో 500కు పైగా లింగాయత్ మఠాలున్నాయి. వీటి చుట్టూనే రాజకీయాలు నడుస్తూ ఉంటాయి. లింగాయత్ ఉపకులాలూ కీలకమే. వీరు మఠాధిపతులు గీచిన గీత దాటరు. లింగాయత్‌లు అత్యధికంగా ఉన్న ఉత్తర కర్ణాటకలోని 22 జిల్లాల్లో బాగా పట్టున్న అఖిల భారత వీరశైవ మహాసభ రాష్ట్ర రాజకీయాల్లో బాగా చురుగ్గా ఉంది. బొమ్మై కూడా లింగాయతే అయినా ఈ మఠాల మద్దతు యడియూరప్పకే! ఆయన్ను సీఎంగా తప్పించినప్పటి నుంచీ మఠాధిపతులు గుర్రుగా ఉన్నారు. పర్యవసానం అనుభవిస్తారంటూ బీజేపీకి వారు బహిరంగంగానే హెచ్చరికలు జారీ చేశారు. దాంతో ఈసారి ఎన్నికల్లో గట్టెక్కించే బాధ్యతను బీజేపీ యడ్డీ భుజస్కంధాలపైనే ఉంచింది. దాంతో ఆయన మఠాధిపతుల్ని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

కాంగ్రెస్‌లోకి శెట్టర్

- ఉత్తర కర్ణాటకలో బీజేపీకి ఎదురుదెబ్బే!
- శెట్టర్‌ను ఆపేందుకు నేతల విఫలయత్నం
- ఇక 150కి పైగా అసెంబ్లీ సీట్లు మావే: ఖర్గే



ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న శెట్టర్

సాక్షి బెంగళూరు: కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీకి సీనియర్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్ (67) గట్టి షాకిచ్చారు. ఆదివారం పార్టీకి రాజీనామా చేసిన ఆయన సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ తనను తీవ్రంగా అవమానించిందంటూ ఈ సందర్భంగా మరోసారి నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో తాను నిర్మించిన పార్టీయే అక్కర్లేదంటూ వదిలించుకుందన్నారు. ఆత్మగౌరవం కోసమే కాంగ్రెస్‌లో చేరి కొత్త జీవితాన్ని మొదలు పెడుతున్నట్టు చెప్పారు. బెంగళూరులో పీసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్ సుర్జేవాలా, విపక్ష నేత సిద్దరామయ్య శెట్టర్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన చేరికతో పార్టీకి మరింత బలం వచ్చిందని ఖర్గే అన్నారు. ''శెట్టర్‌కు కాంగ్రెస్ సిద్ధాంతాలు తెలుసు. స్వాభిమానాన్ని కాపాడుకునేందునే ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఆయన రాకతో ఉత్తర కర్ణాటకలో పార్టీ మరింత బలోపేతమవుతుంది. 150కి పైగా సీట్లు నెగ్గుతాం'' అని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తర కర్ణాటకకు చెందిన లింగాయత్ నాయకుడైన శెట్టర్ నిష్క్రమణ బీజేపీకి గట్టి దెబ్బేనని భావిస్తున్నారు. ఇక లింగాయత్‌లంతా బీజేపీని వీడి కాంగ్రెస్‌కే మద్దతిస్తారని ఆ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ ఎంబీ పాటిల్ చెప్పుకొచ్చారు. లింగాయత్ వర్గానికే చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ్ సావాది గత వారమే బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే.

ఎత్తులు, పై ఎత్తులు

శెట్టర్ కాంగ్రెస్‌లో చేరే ముందు ఆదివారం నుంచీ నాటకీయ పరిణామాలు జరిగాయి. బీజేపీని వీడొద్దని సంఘ్ పరివార్ నాయకులు ఆయన్ను ఒత్తిడి చేశారు. మరోవైపు ఆయన్ను ఎలాగైనా చేర్చుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తూ వచ్చింది. ఆదివారం అర్ధరాత్రి దాకా బీజేపీ ఎత్తులకు పై ఎత్తులు వేసింది. అయితే, ''నాతో గౌరవంగా నడుచుకోవాలి. ఎన్నికల తర్వాత నిర్లక్ష్యం చేయొద్దు. హుబ్లీ–ధార్వాడ స్థానంలో వెంటనే నాకు బీ ఫారం ఇవ్వాలి. వచ్చే లోకసభ ఎన్నికల్లో హుబ్లీ–ధార్వాడ టికెట్ మా కుటుంబీకులకే ఇవ్వాలి'' అంటూ కాంగ్రెస్ ముందు శెట్టర్ డిమాండ్లు పెట్టి, వాటికి ఒప్పుకున్నాకే చేరినట్టు తెలిసింది. పార్టీలో చేరగానే శివకుమార్ ఆయనకు హుబ్లీ–ధార్వాడ బీ ఫారం అందజేశారు.

కృత్రిమ మేధను తలచుకొంటే నిద్రలేని రాత్రులే

గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్



వాషింగ్టన్: కృత్రిమ మేధను సరిగా వాడకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని అల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ హెచ్చరించారు. ముప్పు నుంచి బయటపడాలంటే ఏఐ సాంకేతికతపై నియంత్రణ ఉండాలని చెప్పారు. కృత్రిమ మేధ వల్ల తలెత్తే దుష్ప్రభావాల గురించి తలచుకుంటూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నానని తాజాగా ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో పిచాయ్ చెప్పారు. ఈ టెక్నాలజీ ప్రయోజనకరమైన రీతిలో ఉపయోగించుకొనేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఐతో అసత్య సమాచారాన్ని సృష్టించే వీలుందని, ఇది సమాజానికి ప్రమాదకరమని అన్నారు. అణ్వాయుధాలను నియంత్రిస్తున్న తరహాలోనే ఏఐని నియంత్రించడానికి ఒక అంతర్జాతీయ కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు.

దేశవ్యాప్తంగా ఠారెత్తిస్తున్న ఎండలు

న్యూఢిల్లీ: ఎండలు ఠారెత్తిస్తున్నాయి. దేశంలోని చాలా ప్రాంతాల్లో సోమవారం సాధారణం కంటే ఎక్కువగా 40 డిగ్రీల సెల్సియస్ చేరువలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తూర్పు, వాయవ్య భారతదేశంలో వచ్చే నాలుగు రోజుల్లో వడగాలులు వీసే అవకాశాలున్నాయని వాతావరణ విభాగం పేర్కొంది. పశ్చిమబెంగాల్, బిహార్, ఒడిశా, సిక్కిం, జార్ఖండ్ రాష్ట్రాలతోపాటు పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌ల్లో ఈ పరిస్థితులుంటాయని వివరించింది. దక్షిణ భారతంలోని ఏపీ తీరప్రాంతంలో బుధవారం వరకు భానుడి ప్రతాపం కొనసాగుతుందని తెలిపింది. దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం వరుసగా రెండో రోజు సాధారణం కంటే కనీసం 5 డిగ్రీలు ఎక్కువగా ఉష్ణోగ్రత నమోదైనట్లు వివరించింది. బుధవారం నాటికి వాతావరణం కొద్దిగా చల్లబడే అవకాశాలున్నాయంది.

స్వలింగ పెళ్లిళ్లకు చట్టబద్ధత కల్పించలేం


- సుప్రీంకోర్టులో కేంద్రం పిటిషన్
- కోర్టులు జోక్యం చేసుకోవద్దని వినతి
- నేడు విచారణ చేపట్టనున్న ధర్మాసనం



న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా తేల్చిచెప్పింది. ఆడ, మగ మధ్య జరిగే వివాహాలకు మాత్రమే వ్యవస్థ నుంచి గుర్తింపు లభిస్తుందని సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న వివాహ వ్యవస్థతో సమానంగా స్వలింగ వివాహాలను గుర్తించలేమని స్పష్టం చేసింది. ఇద్దరు పురుషులు లేదా ఇద్దరు స్త్రీల మధ్య జరిగే పెళ్లిళ్లను చట్టబద్ధంగా గుర్తించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ల విచారణార్హతను ప్రశ్నిస్తూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసింది. తమను తాము ఉన్నత నాగరికులుగా భావించుకొనే కొందరు వ్యక్తులు తమ అభిప్రాయాలను సమాజం మొత్తం అంగీకరించాలన్న ఉద్దేశంతో కోర్టులో పిటిషన్లు వేశారని ఆక్షేపించింది. వివాహాలకు చట్టబద్ధత కల్పించడం అనేది చట్టసభలకు సంబంధించిన వ్యవహారమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. ఈ అంశాన్ని చట్టసభలకే వదిలేయాలని, న్యాయస్థానాలు జోక్యం చేసుకోరాదని కోరారు. స్వలింగ వివాహాలను చట్టబద్ధంగా గుర్తించాలా? లేదా? అనేది చట్టసభలే నిర్ణయిస్తాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున ఆయన పిటిషన్ దాఖలు చేశారు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించడం అనేది వ్యక్తిగత చట్టాలు, సామాజిక ఆమోదం పొందిన విలువల మధ్య ఉన్న సున్నితమైన సమతూకాన్ని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపడతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తెలియజేసింది. ఇదిలా ఉండగా, స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలపై ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం నుంచి విచారణ ప్రారంభించనుంది. రాజ్యాంగ ధర్మాసనం వెలువరించే తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

కులగణన వివరాలేవి?

- మోదీ ప్రభుత్వానికి రాహుల్ ప్రశ్న
- నైష్పత్తిక రిజర్వేషన్లకు, 50 శాతం పరిమితి రద్దుకు డిమాండ్
- గొంతు కలిపిన విపక్షాలు



సాక్షి, బళ్లారి: రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తేయాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మరోసారి డిమాండ్ చేశారు. దళితులు, ఆదివాసీలకు వారి జనాభాకు తగ్గట్టుగా అవకాశాలు దక్కేందుకు వీలుగా నైష్పత్తిక రిజర్వేషన్ల పద్ధతి తేవాలన్నారు. 2011లో మోదీ సర్కారు చేపట్టిన కులగణన వివరాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. తద్వారా బీసీలకు మెరుగైన రిజర్వేషన్లు కల్పించేందుకు వీలవుతుందని అభిప్రాయపడ్డారు. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బాల్కి, హుమ్నాబాద్‌ల్లో ఆయన ప్రచార సభల్లో మాట్లాడారు. ఓబీసీలపై మోదీ కేవలం మాటల్లోనే ప్రమ ఒలకబోస్తారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే కులగణన వివరాలు బయట పెడతామని చెప్పారు. ప్రతి పనికి 40 కమీషన్ తీసుకుంటున్న బీజేపీ సర్కారుకు ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ''రాష్ట్రంలో బీజేపీకి 40 సీట్లు కూడా రావు. ఉద్యోగ నియామకాల్లోనూ భారీ అవినీతి జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ అవినీతి విధానాలను, మోదీ, అదానీ బంధాన్ని గురించి లోక్‌సభలో ప్రశ్నిస్తే నా సభ్యత్వం తొలగించారు. కర్ణాటక ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెబితే దేశవ్యాప్తంగా ఆ పార్టీ పతనానికి నాంది అవుతుంది'' అన్నారు.

రాహుల్ కులగణన డిమాండ్‌కు పలు విపక్షాలు మద్దతిచ్చాయి. జేడీ(యూ) నేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌తో పాటు ఎస్పీ, బీఎస్పీ, ఆప్, బీజేపీ మిత్ర పక్షం లోక్ జనశక్తి పార్టీ ఇందుకు మద్దతు పలికాయి. దేశవ్యాప్తంగా తాజాగా కులగణన చేపట్టాలంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే కూడా ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఆ లేఖను ఆయన తాజాగా ట్వీట్ చేశారు.

గుడ్డూ ముస్లిం.. బాంబు స్పెషలిస్ట్

అతీక్ నేర సామ్రాజ్యానికి వారసుడు! ● గుడ్డూపై యూపీ పోలీసుల నజర్



గుడ్డూ ముస్లిం



ఉమేశ్ పాల్‌పై బాంబు విసురుతూ

న్యూఢిల్లీ: గుడ్డూ ముస్లిం.. ఇప్పుడు ప్రముఖంగా వినిపిస్తున్న పేరు. ఎవరీ గుడ్డూ అంటూ అంతా ఆరా తీస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ శనివారం రాత్రి ముగ్గురు యువకుల కాల్పుల్లో గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్ మరణించడం తెలిసిందే. కాల్పులకు క్షణాల ముందు అష్రాఫ్ నోట వచ్చిన చివరి మాట గుడ్డూ గురించే. మెయిన్ బాత్ యే హై కీ గుడ్డూ ముస్లిం... (నేను చెప్పాలనుకుంటున్న ముఖ్యమైన విషయం గుడ్డూ ముస్లిం...) అని అంటూనే సోదరులిద్దరూ కాల్పులకు బలయ్యారు.

గుడ్డూ అతీక్ అహ్మద్ ముఖ్య అనుచరుడు. తుపాకుల బదులు బాంబులు వాడటం ఇతని స్టైల్. బాంబులు విసిరి ప్రత్యర్థులను అంతం చేయడంలో దిట్ట. ఈ ఏడాది ఫిబ్రవరి 24న ప్రయాగ్‌రాజ్‌లో పట్టపగలే ఉమేశ్ పాల్ హత్య జరిగింది. ఆ సమయంలో గుడ్డూ బైక్ వెనుక కూర్చొని నాటు బాంబులు విసురుతున్న దృశ్యం సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యింది. అతీక్ మరణానంతరం అతడి నేరసామ్రాజ్యం గుడ్డూ చేతికి వెళ్తుందని ప్రచారం సాగుతోంది. దాంతో యూపీ పోలీసుల నజర్ ఇప్పుడు అతనిపైనే ఉంది. ఉమేశ్ హత్య కేసులో 10 మంది నిందితుల్లో గుడ్డూ పేరూ ఉంది. ఆ పది మందిలో ఇప్పటిదాకా ఆరుగురు హతం కాగా గుడ్డూతో సహా మిగతా వారంతా పరారీలో ఉన్నారు. గుడ్డూ ప్రస్తుతం కర్ణాటకలో తలదాచుకుంటున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

నమ్మినబంటు

గుడ్డూ ముస్లిం ప్రయాగ్‌రాజ్‌లో పుట్టాడు. చిన్న వయసులోనే నేర సామ్రాజ్యంతో పరిచయం ఏర్పడింది. లక్నోకు మకాం మార్చి పలు నేరాల్లో పాలుపంచుకున్నాడు. బడా వ్యక్తులతో సన్నిహితంగా మెలిగాడు. ఓ టీచర్ హత్య కేసులో 1997లో అరెస్టయ్యాడు. బలమైన సాక్ష్యాల్లేక విడుదలయ్యాడు. బిహార్‌కు వెళ్లి నేరాలు కొనసాగించాడు. 2001లో మళ్లీ అరెస్టవగా అతీక్ బెయిల్‌పై బయటకు తీసుకొచ్చాడు. కొన్నేళ్ల క్రితం గుడ్డూ అనారోగ్యం పాలై పరిస్థితి విషమించగా అతీక్ రూ.8 లక్షలు ఖర్చు చేసి గుడ్డూను బతికించాడు. అందుకు కృతజ్ఞతగా ఉమేశ్‌పై గుడ్డూ బాంబులు విసిరి హత్య చేశాడు. అతీక్‌కు నమ్మినబంటుగా పేరుతెచ్చుకున్నాడు. అతీక్ కోసం పాకిస్తాన్ నుంచి పంజాబ్ మీదుగా ఆయుధాలను భారత్‌కు అక్రమంగా రవాణా చేసేవాడని పోలీసులు వెల్లడించారు.


విచారణకు సిట్

అతీక్ శరీరంలో 9 తూటాలున్నట్టు పోస్టుమార్టంలో వెల్లడైంది. 8 తూటాలు ఛాతీ, వీపు నుంచి దూసుకెళ్లగా మరోటి తలలో కనిపించింది. అష్రాఫ్ తలపై ఒకటి, వీపుపై నాలుగు తూటా గాయాలను గుర్తించారు. ఈ హత్యోదంతంపై దర్యాప్తుకు సతీశ్ చంద్ర, సత్యేంద్ర ప్రసాద్, ఓం ప్రకాశ్ సభ్యులుగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటైంది. దీనిపై విచారణకు యూపీ ప్రభుత్వం ఇప్పటికే జ్యుడీషియల్ కమిషన్ వేయడం తెలిసిందే.

అన్నీ అనుమానాలే

ప్రయాగ్‌రాజ్/లక్నో/న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్లు అతీక్, అష్రాఫ్ హత్య విషయంలో పోలీసుల తీరుపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. అంతటి కరడుగట్టిన నేరగాళ్లను రాత్రిపూట ఎందుకు ఆసుపత్రికి తీసుకొచ్చారు? పైగా వారున్న వాహనాన్ని గేటు బయటే ఆపి నడిపించుకుంటూ ఎందుకు వచ్చారు? మీడియా కంటపడకుండా ఆసుపత్రి లోపలి దాకా వాహనంలో ఎందుకు తీసుకురాలేదు? పైగా ఐఎస్ఐ ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్నట్టు విచారణలో సోదరులిద్దరూ ఒప్పుకున్నారు. నిబంధనల ప్రకారం ఇలాంటి కేసుల్లో నిందితుల్ని మీడియాతో సహా ఎవరి కంటా పడనివ్వకూడదు. దాన్నీ తుంగలో తొక్కారు. హంతకులు ముగ్గురూ విలేకరుల ముసుగులో వచ్చి కాల్పులు జరపడం తెలిసిందే. మీడియా ప్రతినిధులను తనిఖీ చేయకుండానే గ్యాంగ్‌స్టర్ల దగ్గరికి అనుమతించడం వెనక కుట్ర ఉండొచ్చంటున్నారు. వారు 20 తూటాల దాకా కాల్చినా నిందితుల వెన్నంటే ఉన్న పోలీసుల్లో మాత్రం ఎవరికీ ఏమీ కాకపోవడం నమ్మశక్యంగా లేదంటున్నారు. నిందితులను సోమవారం ప్రతాప్‌గఢ్ జిల్లా జైలుకు తరలించారు.

ఇంకెవరూ పేల్చలేరు



యజమాని మినహా మరెవరూ పేల్చడం సాధ్యంగాని 9ఎంఎం తుపాకీ ఇది. ఫింగర్‌ప్రింట్ సెన్సార్, కాల్చే వ్యక్తిని పోల్చుకునే ఫేషియల్ రికగ్నేషన్ టెక్నాలజీ దీని సొంతం. ఇలాంటి తుపాకీ ప్రపంచంలో ఇదే మొదటిది. గన్‌ను పక్కన పెట్టేయగానే లాక్ అవుతుంది. అమెరికా వంటి దేశాల్లో చిన్నారులు పొరపాటున తుపాకీ కాల్చడం, గన్ చోరీ తదితరాలకు ఇక తెర పడుతుందని యూఎస్‌కు చెందిన తయారీ సంస్థ 'బయోఫైర్' చెబుతోంది. ఈ సంస్థకు ఇంటెల్, గూగుల్, నాసాలు తోడ్పాటునందిస్తున్నాయి.

వందేభారత్ రైళ్ల సరాసరి వేగం 83 కిలోమీటర్లు

న్యూఢిల్లీ: దేశంలో వందేభారత్ రైళ్లు సరాసరిన గంటకు 83 కిలోమీటర్ల వేగంతో నడుస్తున్నాయని అధికారులు తెలిపారు. గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగంతో నడిచేలా తయారైన ఈ రైళ్లను 130 కి.మీ. వేగంతో నడపవచ్చు. రైలు మార్గాల్లో నాణ్యత లేమి వల్ల తక్కువ వేగంతోనే నడుపుతున్నట్లు సమాచార హక్కు చట్టం కింద అందిన దరఖాస్తుకు రైల్వే శాఖ బదులిచ్చింది. ''అత్యల్పంగా గంటకు 64 కి.మీ. సరాసరి వేగంతో ముంబై–షిర్డీ వందేభారత్ రైలు, గరిష్ఠంగా 95 కి.మీ. వేగంతో న్యూఢిల్లీ–వారణాసి రైలు నడుస్తోందని చెప్పారు. ఆగ్రా కంటోన్మెంట్–తుగ్లకాబాద్ రైలు మాత్రం గంటకు 160 కి.మీ. వేగంతో ప్రయాణిస్తోంది'' అని పేర్కొంది.

భటిండా కాల్పులు జవాన్ పనే

చండీగఢ్/న్యూఢిల్లీ: పంజాబ్‌లోని భటిండా సైనిక కేంద్రంలో ఈ నెల 12న నలుగురు జవాన్ల మృతికి కారణమైన కాల్పులకు దేశాయ్ మోహన్ అనే సహచర జవానే కారణమని తేలింది. అతన్ని అదుపులోకి తీసుకున్నట్టు భటిండా సీనియర్ ఎస్పీ గుల్‌నీత్ సింగ్ ఖురానా సోమవారం మీడియాకు తెలిపారు. ''కాల్పులకు వాడిన ఇన్సాస్ రైఫిల్‌ను అతని నుంచి స్వాధీనం చేసుకున్నాం. ఘటనకు రెండు రోజుల ముందే ఇన్సాస్‌తో పాటు 28 రౌండ్ల మందుగుండును దొంగిలించి దాచి పెట్టాడన్నారు. నలుగురు జవాన్లు భౌతికంగా వేధించినందుకే వారిని చంపినట్టు అంగీకరించాడు. వాస్తవ కారణాన్ని మీడియాకు తెలపలేం'' అన్నారు.

అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్లు షురూ

జమ్మూ: అమర్‌నాథ్ వార్షిక యాత్రకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సోమవారం మొదలైంది. దేశవ్యాప్తంగా పలు బ్యాంకులకు చెందిన 542 బ్రాంచీల్లో పేర్ల నమోదుకు ఆలయ బోర్డు ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది దరఖాస్తును ఆన్‌లైన్‌లో నింపాల్సి ఉంటుంది. 13 ఏళ్లలోపు, 75 ఏళ్ల పైబడిన వారిని, 6 వారాలకు పైబడిన గర్భవతులను అనుమతించరు. దక్షిణ కశ్మీర్‌లో 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న గుహాలయంలో యాత్రికుల సందర్శన జూలై ఒకటో తేదీన మొదలై ఆగస్ట్ 31తో ముగియనుంది.

రూ.3,700 కోట్ల కొకైన్ పట్టివేత



రోమ్: ఇటలీలోని సిసిలీకి సమీపంలోని సముద్ర జలాల్లో తేలియాడుతున్న కొకైన్ ప్యాకెట్లివి. సుమారు రెండు టన్నుల బరువున్న 70 బండిళ్లలో 1,600 ప్యాకెట్లలోని ఈ కొకైన్ విలువ ఏకంగా రూ.3,700 కోట్లు! స్మగ్లర్లు వీటిని బహుశా నౌకలో తెచ్చి ఇక్కడ వదిలేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. నీటిపై తేలియాడుతున్న వీటి జాడ తెలుసుకునేందుకు వీలుగా ప్యాకెట్లకు ట్రాకింగ్ డివైజ్‌ను కూడా అమర్చారని చెప్పారు. హెలికాప్టర్ ద్వారా పెట్రోలింగ్ చేస్తుండగా ఇవి కనిపించాయి.

రష్యా జర్నలిస్టుకు పాతికేళ్ల జైలు

మాస్కో: ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని తప్పుబట్టినందుకు వ్లాదిమిర్ కారా–ముర్జా జూనియర్(41) అనే జర్నలిస్టు, రాజకీయ కార్యకర్త జైలు పాలయ్యాడు. దేశద్రోహం నేరకింద రష్యా కోర్టు ఆయనకు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. సైనిక చర్యను బహిరంగంగా విమర్శిస్తున్న ఆయనపై ఇప్పటికే రెండుసార్లు విషప్రయోగం జరిగింది. జైలుశిక్షను అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు, పాశ్చాత్య దేశాలు తీవ్రంగా ఖండించాయి.



న్యూయార్క్‌లో సోత్‌బే సంస్థ త్వరలో వేలంవేయనున్న ఈ కెంపు బరువు 55.22 క్యారెట్లు. ఇంతటి బరువైన కెంపును వేలానికి పెట్టడం ఇదే తొలిసారి. కనీసం రూ.250 కోట్ల ధర పలకవచ్చని అంచనా. సోమవారం హాంకాంగ్‌లో ప్రదర్శనకు పెట్టినప్పటి ఫొటో ఇది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023

పీజీ వైద్య విభాగం అభ్యర్థులకు ప్రత్యేక యాప్

సాక్షి, చెన్నై: పీజీ మెడికల్ కోర్సులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం అలీన్ సూపర్ యాప్‌ను సోమవారం ఆవిష్కరించారు. నీట్, పీజీ, ఐఎన్ఐ–సీఈటీ, ఎఫ్ఎంజీఈ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రయోజనం కలించే విధంగా ప్రత్యేక కోర్సులు, సబ్జెక్టులతో యాప్‌ను సిద్ధం చేశామని అలీన్ నెక్ట్స్ వర్టికల్ ఎగ్జిక్యూటివ్ అమన్ మహేశ్వరి వివరించారు. సోమవారం స్థానికంగా ఈ యాప్ వివరాలను మహేశ్వరి వెల్లడించారు. వైద్యసంబంధిత కోర్సులకు సిద్ధం అవుతున్నవారికి ఈ యాప్ ఓ వేదికగా ఉంటుందన్నారు. అన్ని రకాల ప్రత్యేక ఫీచర్లు, వనరులు ఇందులో ఉన్నాయని వివరించారు. అలీన్ నెక్ట్స్ యాప్‌తో తమ లక్ష్యాన్ని విద్యార్థులు ఛేదించేందుకు వీలుగా మూడు సమగ్ర కోర్సు ప్యాకేజీలు, ఆల్ఫా, బీటా, డెల్టా తదితర కేటగిరుల్లో విద్యార్థుల విభిన్న అవసరాలను తీర్చేందుకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

న్యూస్‌రీల్

దుబాయ్‌లో ఇద్దరు తమిళుల మృతి

సాక్షి, చెన్నై: దుబాయ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు తమిళులు మరణించారు. వీరికుటుంబాలకు సీఎం స్టాలిన్ సానుభూతి తెలియజేశారు. తలా రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. వివరాలు.. కళ్లకురిచ్చి జిల్లా శంకరాపురం సర్కిల్ రామరాజపురానికి చెందిన ఇమామ్ కాసిం (43), మహ్మద్ రఫీక్ (49) బతుకు దెరువుకోసం గతంలో దుబాయ్‌కు వెళ్లారు. అక్కడ ఓ సంస్థలో పనిచేస్తున్నారు. వీరు నివాసం ఉన్న ప్రాంతంలో ఈనెల 15వ తేదీ అగ్నిప్రమాదం జరిగింది. ఇందులో ఈ ఇద్దరు మరణించారు. ఈ సమాచారంతో ఆ కుటుంబాలు శోక సంద్రంలో మునిగాయి. సీఎం స్టాలిన్ ఈ ఘటనపై స్పందించారు. దుబాయ్‌లోని తమిళ ఎన్ఆర్ఐ ప్రతినిధుల ద్వారా సంప్రదింపులు జరిపారు. భారత రాయబార కార్యాలయం ద్వారా వారి మృతదేహాలను స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి సెంజి కేఎస్ మస్తాన్ నేతృత్వంలో అధికారులు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారు. మృతుల కుటుంబాలకు తన సానుభూతి తెలియజేసిన సీఎం స్టాలిన్ తలా రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు.

అవ్వ తాతను హతమార్చిన మనవడు

సాక్షి, చెన్నై: అవ్వ తాతను ఓ మనవడు ఆహారంలో విషం కలిపి చంపేశాడు. విల్లుపురంలో ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. విల్లుపురం జిల్లా పిల్లూరుకు చెందిన కలువు(65), మణి(60) దంపతులకు ముగ్గురు కుమారులు. ఓ కుమార్తె ఉన్నారు. వీరందరికీ వివాహాలు అయ్యాయి. వీరి చిన్న కుమారుడు మురుగన్ మాత్రం బన్రూట్టిలో ఉన్నాడు. ఇతడి కుమారుడు అరుల్ శక్తి(20) మాత్రం తరచూ అవ్వతాతల వద్దకు వచ్చి అప్పుడప్పుడూ గొడవలు సైతం పడేవాడు. ఈ పరిస్థితిలో సోమవారం ఉదయం కలువు, మణి ఎంతకు ఇంటి నుంచి బయటకు రాక పోవడంతో ఇరుగు పొరుగు వారికి అనుమానం వచ్చింది. లోనికి వెళ్లి చూడగా ఆ ఇద్దరు మృతదేహంగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో ఆదివారం సాయంత్రం అరుల్‌శక్తి ఆ ఇంటికి వచ్చినట్లు తేలింది. ఆ వృద్ధులు తిన్న ఆహారంలో విషం కలిపి ఉన్నట్లు తేలింది. అరుల్ శక్తి అజ్ఞాతంలోకి వెళ్లడం, అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో అనుమానాలు నెలకొన్నాయి. అవ్వ తాతలతో తరచూ గొడవ పడే అరుల్ శక్తి వారు తిన్న ఆహారంలో విషం కలిపి చంపేసి అజ్ఞాతంలోకి వెళ్లి ఉంటాడని పోలీసులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిస్ తమిళనాడుగా నిహారిక మాధవన్



విజేత నిహారికతో సహచర పోటీదారులు

సాక్షి, చెన్నై: మిస్ తమిళనాడు పోటీల్లో బయోటెక్ ఇంజినీరింగ్ విద్యార్థిని నిహారిక మాధవన్ విజేతగా నిలిచారు. మిస్టర్ అండ్ మిస్ గ్రాండ్ తమిళనాడు-2023 పోటీలు ఎంఎం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగాయి. అలాగే ఆదివారం రాత్రి మిస్ తమిళనాడు గ్లామరస్ లుక్ –2023 అవార్డుకు పోటీలు నిర్వహించారు. ఇందులో 70 మంది యువ ఔత్సాహిక ప్రతిభావంతులు తమ ప్రతిభను చాటుకునే విధంగా ప్రదర్శనలు ఇచ్చారు. డార్లిన్ ప్రొడక్షన్స్ సహకారంతో ఎస్‌సీఏడీ, గ్లిట్టీ ఫ్యాషన్ షో నేతృత్వంలో జరిగిన ఈ పోటీల్లో సీమాట్స్ ఇంజినీరింగ్ తొలి సంవత్సరం బయోటెక్ ఇంజనీరింగ్ విద్యార్థిని నిహారిక మాధవన్ మిస్ తమిళనాడుగా నిలిచారు. మాజీ మిస్ ఇండియా వరల్డ్ అనుకీర్తి వాస్, విద్యాలయం చాన్స్‌లర్ ఎన్ఎం వీరయ్యాన్ విజేతను ఘనంగా సత్కరించారు.

కళాక్షేత్ర కేసు విచారణకు కొత్త కమిటీ

సాక్షి, చెన్నై: కళాక్షేత్ర లైంగిక వేధింపుల వ్యవహారం కేసు విచారణకు మరో కమిటీని ఏర్పాటుకు చేసే విషయంపై వివరణ ఇవ్వాలని సోమవారం మద్రాసు హైకోర్టు నిర్వాహకులకు నోటీసులిచ్చింది. వివరాలు.. ప్రముఖ నాట్య, సంగీత నిలయంలో అధ్యాపకులపై లైంగిక వేధింపుల ఆరోపణలు వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. ఇందులో హరిపద్మన్ అనే అధ్యాపకుడిని మాత్రం అరెస్టు చేశారు. మరో ముగ్గురిపై కూడా చర్యలు తీసుకోవాలన్న నినాదాలు మిన్నంటుతున్నాయి. ఈ వ్యవహారంపై కళాక్షేత్ర యాజమాన్యం ఓ వైపు, మానవ హక్కుల కమిషన్ మరో వైపు విచారణ జరుపుతోంది. అయితే, కళాక్షేత్ర కమిటీకి బదులుగా మరో కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఏడుగురు విద్యార్థినులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. తమపేర్లు, వివరాలను బయటకు తెలియజేయ వద్దు అని విద్యార్థినులు కోర్టుకు విన్నవించారు. ఇందుకు న్యాయమూర్తి దండపాణి అంగీకరించారు. కళాక్షేత్రాలో విద్యార్థినులలను బెదిరిస్తున్నారని, చర్యలు తీసుకునే విధంగా హెచ్చరికలు చేస్తున్నారని ఆ విద్యార్థినులు పిటిషన్‌లో వివరించారు. విద్యార్థినుల భద్రతకు చర్యలు చేపడుతామని అదనపు సొలిసిటర్ జనరల్ సుందరేష్ కోర్టుకు హామీ ఇచ్చారు. అలాగే విచారణ కమిటీలో కళాక్షేత్ర డైరెక్టర్ రేవతి రామచంద్రన్ ఉండ కూడదని, విద్యార్థినులు ప్రతినిధులు, తల్లిదండ్రులు కమిటీలో ఉండాలని కోరారు. దీనిని పరిగణించిన న్యాయమూర్తి ఈనెల 24వ తేదీ ఉత్తర్వులు వెలువరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ కమిటీ విషయంపై వివరణ ఇవ్వాలని కళాక్షేత్ర యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది.

స్టాంప్ డ్యూటీ.. పదింతలు!

రాష్ట్రంలో ముద్రణ చార్జీలు పదింతలు పెరిగాయి. 22 ఏళ్ల అనంతరం వీటిని పెంచుతూ అసెంబ్లీలో సోమవారం రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి మూర్తి బిల్లు ప్రవేశ పెట్టారు. ఈ పెంపుతో రూ. 20 స్టాంప్ పేపర్ రూ. 200, రూ. 100 స్టాంప్ పేపర్ రూ. 1,000గా మారనుంది. అలాగే ఇకపై అసెంబ్లీ సమాచారాన్ని వినికిడి లోపం కలిగిన వారికి సంజ్ఞల ద్వారా కూడా తెలియజేస్తామని సీఎం స్టాలిన్ వెల్లడించారు.



సీఎం సమక్షంలో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న వివిధ సంస్థల ప్రతినిధులు, అధికారులు

- ముద్రణ చార్జీలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఇకపై రూ. 20 స్టాంప్ పేపర్ రూ.200
- రూ. 100 పేపర్ రూ. 1,000
- అసెంబ్లీలో ముసాయిదా దాఖలు
- 22 ఏళ్ల తర్వాత పెరిగిన రుసుం
- సీపీఎం వ్యతిరేకత

సాక్షి, చెన్నై: రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. ఫలితంగా భూమి విలువలు రెట్టింపు అవుతున్నాయి. రిజిస్ట్రేషన్ల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో భూములు, భవనాలను రిజిస్ట్రేషన్లను సులభతరం చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. అలాగే గత కొన్నేళ్ల అనంతరం రిజిస్ట్రేషన్ చార్జీలను ఈ ఏడాది 2 శాతం మేరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అదే సమయంలో ముద్రణ చార్జీలు (స్టాంప్ డ్యూటీ) వడ్డనకు సిద్ధమయ్యారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమ విభాగానికి నిధుల కేటాయింపుపై సీఎం స్టాలిన్, సాంఘిక సంక్షేమం, మహిళా అభివృద్ధి శాఖకు నిధుల కేటాయింపులపై మంత్రి గీతా జీవన్ ప్రసంగించారు. అనంతరం రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి మూర్తి ప్రత్యేక ముసాయిదాను సభలో ప్రవేశ పెట్టారు. రాష్ట్రంలో ముద్రణా చార్జీలను 2001లో పెంచారని, ఆ తర్వాత పెంపు జరగలేదని వివరించారు. 22 ఏళ్ల అనంతరం ముద్రణ చార్జీలను మరో పదింతలు పెంచుతూ ఆయన ప్రకటన చేశారు. అయితే ప్రస్తుతం రూ. 20గా ఉన్న స్టాంప్ పేపర్ రూ. 200కు, రూ.100 స్టాంప్ పేపర్ రూ.1,000గా ధరను పెంచే విధంగా సభలో ప్రభుత్వం ప్రకటించడాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకించింది.

బెన్నీ విగ్రహంపై వివాదం

ముల్లై పెరియార్ డ్యామ్ నిర్మాణంతో బీడు భూముల్ని సస్యశ్యామలం చేసిన ఆంగ్లేయ మిలటరీ ఇంజినీర్ బెన్నీ క్విక్‌ను స్మరించుకుంటూ లండన్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం వ్యవహారం అసెంబ్లీకి చేరింది. గతంలో ఆయన స్మారకంగా తమిళనాడు ప్రభుత్వం లండన్‌లో ఈ విగ్రహం ఏర్పాటు చేసింది. అయితే, ఈ విగ్రహానికి ముసుగులు వేసినట్టు, ఇది మరమ్మతులకు గురైనట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రధాన ప్రతి పక్ష నేత పళని స్వామి సభ దృష్టికి తెచ్చారు. తక్షణం సీనియర్ మంత్రి దురై మురుగన్ స్పందించారు. లండన్‌లో ఆ విగ్రహం పరిస్థితి గురించి ఆరా తీశారు. ఆ విగ్రహం చెక్కు చెదరకుండా ఉన్నట్లు సభకు వివరణ ఇచ్చారు. ఆ విగ్రహాన్ని తమ ప్రభుత్వం పరిరక్షిస్తుందని స్పష్టం చేశారు. కాగా సభలో తమ ప్రసంగాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అన్నాడీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. ముందుగా సభలో ప్రశ్నోత్తరాల సమయంలో క్రోంపేట ఆసుపత్రిని రూ.110 కోట్లతో అభివృద్ధి చేయనున్నామని, ఇది జిల్లా కేంద్రం ఆసుపత్రిగా సేవలు అందిస్తుందని ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ తెలిపారు. అలాగే రాష్ట్రంలో త్వరలో సిద్ధ వైద్య వర్సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ముసాయిదాకు గవర్నర్ ఇంకా అనుమతి ఇవ్వలేదని సభ దృష్టికి తెచ్చారు. ఆలయ స్థలాలు, దుకాణాల లీజు, అద్దె పెంపునకు సంబంధించి కమిటీ ఏర్పాటు చేశామని, ఈ కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని దేవదాయ శాఖ మంత్రి శేఖర్ బాబు తెలిపారు. ఉత్తమ లఘు చిత్రాలతో పాటు 2015 నుంచి 2022 వరకు కళాకారులకు అవార్డులను ప్రదానం చేయనున్నామని, ఇందు కోసం కమిటీ కసరత్తులు చేస్తోందని సమాచార మంత్రి వెల్ల కోవిల్ స్వామినాథన్ తెలిపారు.

వినికిడిలోపం ఉన్న వారి కోసం..



వినికిడి లోపం ఉన్న వారికి సంజ్ఞల ద్వారా అసెంబ్లీ సమాచారం తెలిపే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

వినికిడి లోపం ఉన్న వారి కోసం సంజ్ఞల భాష (సైన్ లాంగ్వేజ్) ద్వారా అసెంబ్లీ వ్యవహారాలను తెలియజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పది నిమిషాల పాటు అన్ని అంశాలను ఈ విధానంలో ప్రసారం చేయనున్నారు. వినికిడి లోపం ఉన్న వారు అర్థం చేసుకునేలా ఏర్పాటు చేసిన శాసన సభ కార్యకలాపాల ప్రసారాన్ని అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ అప్పావుతో కలిసి సీఎం స్టాలిన్ ప్రారంభించారు. వినికిడి లోపం ఉన్న వారికి సైగ భాష ద్వారా సమాచారం అందించేందుకు వీలుగా ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ముందుగా సచివాలయంలో కళ్లకురిచ్చి సిప్ కాట్‌లో పాదరక్షల ఉత్పత్తి నిమిత్తం తైవాన్‌కు చెందిన పోచైన్ గ్రూప్‌కు చెందిన హై గ్లోరి ఫుట్‌వేర్ ఇండియా సంస్థ రూ. 2,302 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు నిర్ణయించింది. 20 వేల మందికి ఉద్యోగ కల్పన లక్ష్యంగా సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఒప్పందాలు సీఎం స్టాలిన్ సమక్షంలో జరిగాయి.

ఏఎస్పీ బల్వీర్‌సింగ్‌పై విచారణ ముమ్మరం



బల్వీర్ సింగ్

సాక్షి, చెన్నై: ఐపీఎస్ అధికారి వ్యవహార శైలిపై సీనియర్ ఐఏఎస్ అముదా నేతృత్వంలోని బృందం మలి విడతగా అంబా సముద్రంలో సోమవారం విచారణ ప్రారంభించింది. వివరాలు.. తిరునల్వేలి జిల్లా అంబా సముద్రం ఏఎస్పీ బల్వీర్‌సింగ్ విచారణ ఖైదీలతో దూకుడుగా వ్యవహరిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. విచారణ పేరుతో పట్టుకెళ్లిన వారందరికీ ఒక్కో దంతాన్ని ఆయన బలవంతంగా పీకేయడం వివాదానికి దారి తీసింది. బాధితులు రోడ్డెక్కడంతో, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించడం, కోర్టు తలుపులు తట్టడం వంటి పరిణామాలతో ఆ ఐపీఎస్ అధికారిని సస్పెండ్ చేశారు. అలాగే సమగ్ర విచారణకు సీనియర్ ఐఏఎస్ అధికారి అముదా నేతృత్వంలోని బృందాన్ని రంగంలోకి దించారు. గత వారం తిరునల్వేలిలో ఈ బృందం తన విచారణను మొదలెట్టింది. అయితే బాధితులు ఎవరూ వచ్చి ఫిర్యాదులు చేయలేదు. అలాగే అంబా సముద్రం స్టేషన్‌లో పనిచేసిన పోలీసుల నుంచి వాంగ్మూలం సేకరించారు. ఈ పరిస్థితుల్లో సోమవారం అంబా సముద్రం నుంచే మలి విడత విచారణకు ఐఏఎస్ అధికారి అముదా శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సోమవారం ఉదయం నుంచి అంబా సముద్రం ఆర్డీఓ కార్యాలయంలో విచారణ మొదలెట్టారు. ఈ విచారణకు పలువురు బాధితులు తమ కుటుంబాలతో వచ్చి ఫిర్యాదు చేశారు. తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించారు. ఇందులో నలుగురు మైనర్లు ఉన్నారు. ఇదిలా ఉండగా, ఐపీఎస్ అధికారి బల్వీర్ సింగ్‌పై పోలీసు యంత్రాంగం కేసు నమోదు చేసింది.

‘కరుప్పన్’ చిక్కాడు!



సాక్షి, చెన్నై: ఈరోడ్ తాలవాడి పరిసర వాసులకు కొన్ని నెలలుగా కంటి మీద కునుకు లేకుండా చేస్తూ వచ్చిన కరుప్పన్ ఏనుగును ఎట్టకేలకు పట్టుబడింది. చెరుకు తోటలో మత్తు ఇంజెక్షన్ వేసి, కుంకీ ఏనుగుల సాయంతో దీనిని సోమవారం బంధించారు. వివరాలు.. ఈరోడ్ జిల్లా తాలవాడి పరిధిలోని కరుప్పన్ అనే అడవి ఏనుగు గత కొంతకాలంగా వీరంగం సృష్టిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. దీని దాడిలో ఇప్పటికే ఇద్దరు మరణించారు. ఈ ఏనుగును పట్టుకునేందుకు ఈనెల మొదటివారం నుంచి అటవీ అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఆ ఏనుగుకు రెండు సార్లుమత్తు ఇంజెక్షన్ ఇచ్చారు. అయినా ఆ ఏనుగు అధికారులకు చిక్కకుండా తప్పించుకుంది. మరో మారు మత్తు ఇంజెక్షన్ ఇస్తే ఏనుగు ఆరోగ్యానికి హాని తప్పదని వైద్యాధికారులు తేల్చారు. దీంతో ఆ ఏనుగును పట్టుకునేందుకు చిన్నతంబి, మారియప్పన్ అనే రెండు కుంకీ ఏనుగులను రంగంలోకి దించారు. కరుప్పన్ వచ్చి వెళ్లేమార్గాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కదలికలను పర్యవేక్షిస్తూ వచ్చారు. సోమవారం ఉదయం ఈ ఏనుగు ఓ చెరుకు తోటలోకి ప్రవేశించింది. దీనిని చుట్టు ముట్టి బంధించే ప్రయత్నం చేశారు. అయితే ఆ ఏనుగు ఆక్రోశంతో అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసింది. చివరకు సాహసించి మరో మారు తుపాకీ ద్వారా మత్తు ఇంజెక్షన్ ఇచ్చారు. మత్తులో ఏనుగు ఒకే చోట కాసేపు ఆగడంతో కుంకీల సాయంతో చుట్టుముట్టారు. తాళ్లతో బంధించి కుంకీల సాయంతో లారీలో ఎక్కించారు. అటవీ శాఖ పరిధిలోని వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రత్యేక వైద్య బృందం కరుప్పన్ ఏనుగును పర్యవేక్షిస్తున్నారు.

అన్నామలై ఎదురు దాడి

- రూ. 501 కోట్ల నష్ట పరిహారం ఇవ్వాలని డీఎంకే నేతకు నోటీసు



మాట్లాడుతున్న అన్నామలై

సాక్షి, చెన్నై: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై డీఎంకేపై సోమవారం ఎదురు దాడికి దిగారు. డీఎంకే నేత ఆర్ఎస్ భారతి పంపిన నోటీసుకు సమాధానం ఇస్తూ , 48 గంటల్లో తనకు రూ. 501 కోట్లు నష్ట పరిహారం చెల్లించకుంటే సివిల్, క్రిమినల్ కేసులు వేయడానికి సిద్ధమని హెచ్చరికలు జారీ చేశారు. వివరాలు.. డీఎంకే నేతలు, డీఎంకే కార్యాలయం, సీఎం స్టాలిన్‌పై బీజేపీ అధ్యక్షుడు అన్నామలై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలకు ఆధారాలు చూపించాలని, నష్ట పరిహారంగా రూ. 500 కోట్లు 48 గంటల్లో చెల్లించకుంటే సివిల్,క్రిమినల్ కేసులు వేస్తామని అన్నామలైను డీఎంకే సీనియర్‌నేత ఆర్ఎస్ భారతి ఆదివారం హెచ్చరించారు. అలాగే, అన్నామలైకు నోటీసులు కూడా పంపించారు. దీనిపై అన్నామలై ఎదురుదాడికి దిగారు. డీఎంకే వర్గాల వద్ద కోట్లు కోట్ల ఆస్తులు ఉండగా, తన వద్ద రూ. 500 కోట్లు నష్ట పరిహారం కోసం ఆర్ఎస్ భారతి నోటీసులు పంపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తనపై, బీజేపీపై, కేంద్రం ప్రభుత్వంపై ఆధార రహిత ఆరోపణలు చేసిన ఆర్ఎస్ భారతి 48 గంటలలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తనకు నష్ట పరిహారంగా రూ. 501 కోట్లు చెల్లించాల్సింది నోటీసులు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని ప్రధాని నివారణ నిధికి పంపించాలని, లేనిపక్షంలో తాను కూడా సివిల్, క్రిమినల్ కేసులు వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరికలు చేశారు. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, మరో రెండు మూడు రోజులలో సీబీఐకు అవి చేరుతాయని పేర్కొన్నారు. ఆ తర్వాత అందరికీ సీబీఐ నుంచి సమన్లు వస్తాయని, అప్పటి వరకు ఆర్ఎస్ భారతి వేచి ఉంటే మంచిదని లేని పక్షంలో రూ. 501 కోట్లు ప్రధాని నివారణ నిధికి చెల్లించక తప్పదని హితవు పలికారు.

నిప్పుతో చెలగాటం ఆడొద్దు..

తమను ఢీ కొట్టాలంటే నిప్పుతో చెలగాటం ఆడినట్టే అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు అన్నాడీఎంకే సీనియర్ నేత జయకుమార్ హెచ్చరికలు చేశారు. అన్నామలై ఇటీవల డీఎంకే నేతల అవినీతి జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇది వివాదానికి దారి తీసిన నేపథ్యంలో అన్నాడీఎంకేను కూడా వదిలి పెట్టేది లేదని, ఆ పార్టీలోని నేతల అక్రమాస్తుల జాబితా ప్రకటించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు అన్నామలై వెల్లడించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన జయకుమార్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ అన్నామలైకు హెచ్చరికలు చేశారు. అన్నాడీఎంకేను తాకడం , నిప్పుతో చెలగాటం ఆడటం ఒక్కటే అనే విషయాన్ని అన్నామలై గుర్తుంచుకోవాలన్నారు. తాము ఏ తప్పు చేయలేదన్నారు. అన్నాడీఎంకే ఒక తెరిచిన పుస్తకం అని, ఇందులోని నేతల ఆస్తుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చునని వివరించారు. ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో ఎవ్వరెవ్వరికి ఎంత ఆస్తులు ఉన్నాయో అనే వివరాలను సమర్పించి ఉన్నామని, వాటిని అన్నామలై తెరిచి చూసుకుంటే బాగుంటుందని హితవు పలికారు.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులు



అడ్మిషన్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు



ప్రచార వాహనం వద్ద మంత్రులు

రాష్ట్రంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ పిలుపునిచ్చారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోనూ ముందస్తుగానే ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం మొదలైంది. చెన్నైలో ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్, దేవదాయ శాఖమంత్రి శేఖర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు.

- అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని విద్యాశాఖ మంత్రి వెల్లడి
- 1 నుంచి 9 తరగతులకు అడ్మిషన్లు ప్రారంభం

సాక్షి, చెన్నై: రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ బడుల్లోకన్నా.. ప్రైవేటు వైపే తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా నగరాల్లో ఈ పరిస్థితి అధికంగా కనిపిస్తున్న విషయం తెలిసిందే. కార్పొరేషన్ పాఠశాలలలో వద్ద కన్నా, కార్పొరేట్ స్కూళ్ల ముందు అడ్మిషన్ల కోసం పడిగాపులు కాసే వాళ్లు ఎక్కువే. అలాగే, ప్రభుత్వ పాఠశాలలపై విమర్శలు గుప్పించే వాళ్లూ ఉన్నారు. ఇలాంటి వారి నోళ్లకు తాళం వేసే విధంగా ఇటీవల కాలంగా ప్రభుత్వ బడులు స్మార్ట్‌గా మారుతున్నాయి.

దేశ రాజధాని నగరం ఢిల్లీ తరహాలో రాష్ట్ర రాజధాని నగరం చెన్నైలో ప్రభుత్వ బడులను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దే పనిలో విద్యాశాఖ, కార్పొరేషన్ వర్గాలు నిమగ్నమయ్యాయి. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే విధంగా కార్పొరేషన్ బడులను సింగారంగా తీర్చిదిద్దుతున్నారు. అదే సమయంలో ప్రైవేటుతో పోటీ పడే విధంగా ముందుగానే ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లను పూర్తి చేయడానికి విద్యా శాఖ నిర్ణయించింది.

ముందస్తుగా..

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలో వేసవి సెలవుల అనంతరం అడ్మిషన్లు మొదలు అవుతాయి. అయితే, ఈసారి ప్రప్రథమంగా 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు వేసవి సెలవు కంటే ముందుగానే విద్యాశాఖ ప్రారంభించింది. చెన్నై కొళత్తూరులోని ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లను విద్యా మంత్రి అన్బిల్ మహేశ్, దేవాదాయ శాఖ మంత్రి శేఖర్ బాబులు ప్రారంభించారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులను సత్కరించారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలలోని వసతులు,విద్యా బోధనలు , స్మార్ట్ తరగతులు గురించిన వివరాలతో కూడిన కరపత్రాల పంపిణీకి ప్రారంభించారు. ఈసందర్భంగామంత్రి అన్బిల్ మహేశ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలోను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దే పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ , కార్పొరేషన్ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాము చేపట్టిన చర్యలతో ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు.

ఈ ఏడాది మరింతగా సంఖ్యను పెంచడం లక్ష్యంగా ముందుగానే అడ్మిషన్లకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతం 1 నుంచి 9 వతరగతి విద్యార్థుల చేరిక నిమిత్తం అడ్మిషన్లను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించామన్నారు. అలాగే, విద్యార్థుల, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించే విధంగా వాహన ప్రచారానికి జెండా ఊపినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాల మెరుగుదల, ఖాళీల భర్తీకి చర్యలు విస్తృతం చేశామన్నారు. ఉపాధ్యాయు రిక్రూట్ మెంట్ బోర్డు ద్వారా పది వేల మంది టీచర్ల నియామక పనులపై దృష్టి పెట్టామన్నారు.

సర్వేపల్లికి ఘన నివాళి

తిరుత్తణి: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా వెంకటాపురం గ్రామస్తులు సోమవారం ఆయనకు ఘన నివాళులర్పించారు. వివరాలు.. తిరుత్తణి శివారు కాశినాథపురంలో జన్మించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ తన ప్రాథమిక విద్యను తిరుత్తణి మర్రిమాను వీధిలోని ప్రభుత్వ పాఠశాలలో సాగించారు. తర్వాత అంచెలంచెలుగా ఎదిగి దేశ అత్యున్నత స్థాయికి ఎదిగి ఆ పదవికి కీర్తి తెచ్చి పెట్టారు. అయినా బోధన పట్ల పెంచుకున్న ప్రేమ కారణంతో సర్వేపల్లి పుట్టిన రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా స్వగ్రామం వెంకటాపురంలో కూలి కార్మికుడు చంద్రన్ ఆధ్వర్యంలో అలంకరించిన సర్వేపల్లి చిత్రపటానికి గ్రామీణులు ఘనంగా నివాళులర్పించారు. అదే సమయంలో సర్వేపల్లి గుర్తుగా స్మృతి వనం ఏర్పాటు చేయాలని స్థానికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే స్థానిక రాధాకృష్ణన్ ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాల ఆవరణలోని సర్వేపల్లి విగ్రహానికి ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఘన నివాళులర్పించారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెంకటాపురం గ్రామస్తులు

క్లుప్తంగా

సదరన్ రైల్వే ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సదరన్ రైల్వే జీఎం ఆర్ఎన్ సింగ్

కొరుక్కుపేట: చెన్నైలోని సదరన్ రైల్వే ప్రధాన కార్యాలయంలో భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సదరన్ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ ఎన్ సింగ్ పాల్గొని డాక్టర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇందులో సదరన్ రైల్వే అదనపు జనరల్ మేనేజర్ కౌశల్ కిషోర్, ప్రిన్సిపల్ హెడ్స్ ఆఫ్ డిపార్టుమెంట్స్, సీనియర్ అధికారులు, సిబ్బంది, ట్రేడ్ యూనియన్ల నాయకులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సదరన్ రైల్వే ప్రధాన కార్యాలయంలోని ఉద్యోగులకు, వార్డులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లను జనరల్ మేనేజర్ పంపిణీ చేశారు.

మహిళా పోలీసు భర్త ఆత్మహత్య

అన్నానగర్: నెల్లైలో ఆదివారం ఓ మహిళా పోలీసు భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. నెల్లై మేలపాళయం పోలీసు క్వార్టర్స్ ప్రాంతం సమీపంలోని ఎల్లాటైన్ పట్టణానికి చెందిన చందన్ కుమార్ (47) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య అనిత హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. వీరికి 12 ఏళ్ల కుమార్తె ఉంది. ఈ నేపథ్యంలో గత కొన్నాళ్లుగా చందన్ కుమార్‌కి అనారోగ్యంగా ఉండడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కానీ అతనికి నయంకాలేదు. దీంతో మనస్థాపానికి గురైన అతడు ఆదివారం ఇంట్లోని ప్రత్యేక గదిలోకి వెళ్లి ఏసీ యంత్రానికి వెళ్లే విద్యుత్ తీగను కాళ్లకు చుట్టుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కరెంట్ షాక్‌కు గురవడంతో పాటు మెడకు ఉరి వేసుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అంతకుముందు చందన్ కుమార్ తన శరీరంలో విద్యుత్ ప్రవహిస్తోందని, తనను ఎవరూ ముట్టుకోవద్దని లేఖ రాసి గది బయట ఉంచాడు. దీన్ని చూసిన కుటుంబీకులు దిగ్భ్రాంతి చెంది బోరున విలపించారు. మేలపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీఐటీలో బీటెక్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు ప్రారంభం



పరీక్షలను పరిశీలిస్తున్న వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్, ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్

వేలూరు: వేలూరు వీఐటీ యూనివర్సిటీలోని బీటెక్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. వీఐటీలోని 2023–24 విద్యా సంవత్సరంలో బీటెక్ సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్, బయో మెడికల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కెమికల్ ఇంజినీరింగ్, వంటి బీటెక్ ఇంజినీరింగ్ కోర్సులు చదివేందుకు గాను ప్రవేశ పరీక్షలు ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్ పరీక్షలు జరుగనుంది. ఈ ఆన్‌లైన్ పరీక్షలను దుబాయ్, కోవైట్, మస్కట్, ఖతార్ వంటి దేశాలతో పాటు ఇండియాలోని 125 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభించారు. ఈ ప్రవేశ పరీక్షల ఫలితాలను ఈ నెల 26వ తేదీన వీఐటీ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం వేలూరు వీఐటీ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన ఆన్‌లైన్ పరీక్షలను చాన్స్‌లర్ విశ్వనాథన్, బెంగళూరులో జరిగిన పరీక్ష కేంద్రాన్ని వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్ పరిశీలించారు. ఇదిలా ఉండగా జీవీ స్కూల్ ప్రత్యేక పథకం కింద ప్లస్–2 పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు వీఐటీ యూనివర్సిటీలో బీటెక్ నాలుగు సంవత్సరాల పాటు 100 శాతం స్కాలర్‌షిప్‌తో ఉచిత విద్యను అందజేయనున్నట్లు యూనివర్సిటీ యాజమాన్యం తెలిపింది. అదే విధంగా వీఐటీ ప్రవేశ పరీక్షల్లో ఒకటి నుంచి 50 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 75 శాతం ట్యూషన్ ఫీజులో రాయితీ, 51 నుంచి 100 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 50 శాతం రాయితీతో విద్యను అందజేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు స్టార్స్ పథకం కింద తమిళనాడు, ఆంధ్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు జిల్లా స్థాయి మార్కులు సాధించే వారికి ఉచితంగా విద్యను అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థులకు బహుమతులు

అన్నానగర్: కూడవాసల్ ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేస్తున్నారు. వివరాలు.. తిరువారూరు జిల్లా కూడవాసల్ యూనియన్‌లో సెంగాలిపురం పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల ఉంది. 2023 – 24 విద్యా సంవత్సరంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కొత్తగా చేరిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని, వారిలో ఒకరిని లాటరీ ద్వారా ఎంపిక చేసి గ్రాము బంగారు నాణెం అందజేస్తామని పాఠశాల తరపున కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులందరికీ బహుమతులు అందజేస్తామని, లాటరీ ద్వారా ఒకరిని ఎంపిక చేసి విద్యావికాస దినోత్సవమైన జూలై 15న బంగారు నాణెం అందజేస్తామని కరపత్రంలో పేర్కొన్నారు. ఈ ఏడాది స్వచ్ఛంద సంస్థల ద్వారా ఉచిత వ్యాన్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈమేరకు కరపత్రాలను ఇంటింటికీ ఉపాధ్యాయులు పంచుతున్నారు.


వేడుకగా చేపలు పట్టు ఉత్సవం



చేపలు పడుతున్న గ్రామస్తులు

అన్నానగర్: పుదుకోట్టై జిల్లాలో ఆదివారం 2 చెరువుల్లో చేపలు పట్టు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వివరాలు.. పొన్నమరావతి సమీపంలోని కరుగపులం పట్టిలోని ఏనాది చెరువు, మనపట్టి చెరువులో కనమాయి ఒడ్డున అధికారులు, ప్రజాప్రతినిధులు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం తెల్లటి తువ్వాలు విసిరి ఉత్సవాలను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి చెరువులోకి దిగి చేపలు పట్టారు. కాగా అధికంగా చేపలు లభిస్తే అదృష్టం వరిస్తుందని స్థానికులు భావిస్తుంటారు.

200 ఏళ్ల నాటి మర్రి చెట్టు దగ్ధం



అన్నానగర్: పుదుకోట్టై సమీపంలోని పురాతన మర్రి చెట్టుకు ఆదివారం రాత్రి మంటలు వ్యాపించాయి. వివరాలు.. కరైయూర్ సమీపంలోని చిత్తూరు పాకుసిద్రిపట్టిలో 200 ఏళ్ల నాటి మర్రి చెట్టు ఉంది. ఈ చెట్టుకు ఆదివారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు పొన్నమరావతి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అయితే మంటలు వ్యాపించడానికి కారణాలు తెలియరాలేదు.

● ఘనంగా విగ్రహ ప్రతిష్ట



కరూర్ జిల్లా కులితలై పొయ్యామణి గ్రామంలో ఆధ్యాత్మిక గురువు రాధాకృష్ణన్ స్వామి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. తమిళనాడులో సాయి నామం ప్రచారంలో , ఆలయాల నిర్మాణంలో ఆధ్యాత్మిక గురువుగా ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ కృష్ణ కుమార్, సాయి ఆధ్యాత్మిక కేంద్రం కార్యదర్శి శేఖర్, పంచాయతీ అధ్యక్షుడు బాలన్ తదితరులు పాల్గొన్నారు. - సాక్షి, చెన్నై

బస్సు డ్రైవర్‌పై దాడి

తిరువొత్తియూరు: తిరువాన్మియూర్‌లో చెప్పులు ధరించిన కాళ్లను ఇంజిన్‌పై పెట్టవద్దన్నందుకు ప్రభుత్వ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన కళాశాల విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. పుదుచ్చేరి నుంచి సోమవారం తెల్లవారుజామున ప్రభుత్వ బస్సు చెన్నైకి బయలుదేరింది. బస్సులో రద్దీ ఎక్కువగా ఉంది. డ్రైవర్ ధనశేఖర్ (48) బస్సును నడుపుకుంటూ తిరువాన్మయూరు సమీపంలోకి రాగా ముందు వరుసలో కూర్చున్న కడలూరు జిల్లా కురించి పట్టికి చెందిన అభిషేక్ (23) చెప్పుల కాళ్లను ఇంజిన్‌పై పెట్టాడు. దీంతో డ్రైవరు ఇంజిన్‌పై కాలు పెట్టవద్దని కోరాడు. తర్వాత వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన అభిషేక్ డ్రైవర్ ధనశేఖర్‌పై దాడి చేయగా, అతను తిరువాన్మయూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు యువకుడు అభిషేక్‌ను అరెస్టు చేసి విచారించగా, అతను చెన్నై కాటాన్‌కొళత్తూర్‌లోని ప్రైవేటు కళాశాలలో ఎమ్మెస్సీ చదువుతున్నట్లు తెలిసింది.

విశ్రాంత ఉపాధ్యాయుల ధర్నా



ఆర్కేపేటలో ధర్నా చేస్తున్న రిటైర్డ్ టీచర్లు

పళ్లిపట్టు: డిమాండ్ల పరిష్కారం కోసం రిటైర్డ్ టీచర్లు ఆర్కేపేటలో సోమవారం ధర్నా చేశారు. పాఠశాలలు, కళాశాలల విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ధర్నాలో 50 మందికి పైగా రిటైర్డ్ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంకే ప్రభుత్వం ఎన్నికల హామీని నెరవేర్చే విధంగా 10 శాతం పింఛన్ పెంచి అందజేయాలని కోరారు. ఇన్సూరెన్స్, మృతి చెందిన టీచర్లకు వెంటనే సహాయ నిధి అందజేయాలంటూ నినాదాలు చేశారు.

25 సెల్‌ఫోన్లు రికవరీ

అన్నానగర్: తంజావూరు ప్రజలు పోగొట్టుకున్న రూ.3 లక్షల విలువైన 25 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని వాటి యజమానులకు సోమవారం పోలీసులు అప్పగించారు. వివరాలు.. తంజావూరు కొత్త బస్టాండ్, ఆర్ఆర్ నగర్, న్యూ హౌసింగ్ బోర్డ్ రెసిడెన్సీ, శారదా నగర్, ఎలిసా నగర్, తంజావూరు మెడికల్ కాలేజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో, చాలా మంది తమ సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయని తంజావూరు మెడికల్ కాలేజీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌స్పెక్టర్ జయమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. తంజావూరులో మాయమైన మొబైల్ ఫోన్లను తిరువారూర్, తిరుచ్చి, ఈరోడ్, నమక్కల్, చెన్నైలలో నివసిస్తున్న కొందరు ఉపయోగిస్తున్నట్లు తేలింది. దీంతో పోలీసులు మొత్తం రూ.3 లక్షల విలువైన 25 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన సెల్‌ఫోన్లను వాటి యజమానులకు అందజేసే కార్యక్రమం తంజావూరు మెడికల్ కాలేజీ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఉదయం నిర్వహించారు.

విజువల్ వండర్‌గా పొన్నియిన్ సెల్వన్-2


సమావేశంలో పొన్నియిన్ సెల్వన్ చిత్ర యూనిట్



తమిళ సినిమా: ప్రఖ్యాత రచయిత కల్కి కృష్ణమూర్తి అద్భుత నవలకు దర్శకుడు మణిరత్నం తెరపై ఆవిష్కరించిన విజువల్ ట్రీట్ పొన్నియిన్ సెల్వన్. మణిరత్నం మెడ్రాస్ టాకీస్, లైకా ప్రొడక్షన్స్ సంస్థలు నిర్మించిన భారీ చిత్రం ఇది. మణిరత్నం సూత్రధారి అయితే విక్రమ్, కార్తీ, జయం రవి, విక్రమ్ ప్రభు, శరత్ కుమార్, ప్రకాష్ రాజ్, ప్రభు, నటి త్రిష, ఐశ్వర్యా రాయ్, ఐశ్వర్య లక్ష్మి తదితరులు పాత్రలు పోషించారు. ఏఆర్ రెహమాన్ సంగీతం, రవివర్మన్ ఛాయాగ్రహణం చిత్రానికి అదనపు ఆకర్షణ. కాగా రెండు భాగాలుగా రూపొందిన ఈ చిత్ర తొలి భాగం గత ఏడాది సెప్టెంబర్‌లో విడుదలై సంచలన విజయాన్ని సాధించింది. దీంతో రెండవ భాగంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాంటి అంచనాల మధ్య పొన్నియిన్ సెల్వన్- 2 చిత్రం ఈనెల 28వ తేదీన తెరపైకి రానుంది. దీంతో చిత్ర యూనిట్ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. అందులో భాగంగా సోమవారం ఉదయం చెన్నైలోని ఓ స్టార్ హోటల్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. నటుడు కార్తీ మాట్లాడుతూ పొన్నియిన్ సెల్వన్ -2 తొలి భాగం కంటే భారీ పోరాట సన్నివేశాలు ఉంటాయని చెప్పారు. అలాంటి సన్నివేశాల్లో తాను మళ్లీ నటిస్తానో లేదో అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎంజీఆర్ నటించాల్సిన వాదియదేవన్ పాత్రలో తనకు అవకాశం రావడం దేవుడి నిర్ణయమన్నారు. నటుడు జయం రవి మాట్లాడుతూ రెండవ భాగంలో పొన్నియిన్ సెల్వన్‌గా తన పాత్ర పరిధి ఎక్కువగా ఉంటుందన్నారు. నేనేంటో త్రిష ఇంతకు ముందు భేటీలో చిత్రంలో తనకూ పోరాట సన్నివేశాలు ఉంటాయని చెప్పారు. తాజాగా చిత్రంలో రొమాన్స్ సన్నివేశాలు ఎక్కువగానే ఉంటాయని చెప్పారు. మణిరత్నం మాట్లాడుతూ తొలి భాగం విడుదలైన తరువాత కొన్ని రివ్యూల కారణంగా రెండవ భాగంలో కొన్ని మార్పులు చేర్పులు చేశామనేది అవాస్తవం అన్నారు. పొన్నియిన్ సెల్వన్‌ను ఒకే చిత్రంగా తెరకెక్కించినట్లు, నిడివి ఎక్కువ కారణంగా రెండు భాగాలుగా విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పీఎస్- 1 చిత్రం పరిచయం మాత్రమే. పీఎస్- 2లోనే ప్రధాన కథ ఉంటుందని మణిరత్నం పేర్కొన్నారు.

కోలీవుడ్ టాక్స్

సిద్ధార్థ్ కథానాయకుడిగా ‘చిత్త’



తమిళ సినిమా: నటుడు సిద్ధార్థ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం చిత్త. ఈ చిత్రానికి నిర్మాత కూడా ఈయనే. ఇంతకుముందు తన ఎటకి ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కాదలిల్ సొదప్పువదు ఎప్పడి, జిల్ జంగ్ జంక్, అవళ్ వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించి నటించిన సిద్ధార్థ్ చిన్న గ్యాప్ తర్వాత మళ్లీ నిర్మాతగా రూపొందిస్తున్న చిత్రం చిత్త. కాగా ఈ చిత్రానికి పన్నైయారుమ్ పద్మినియుమ్, సేతుపతి చిత్రాల ఫేమ్ ఎస్ యు.అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. విచిత్ర టైటిల్, ఫస్ట్ పోస్టర్‌ను సిద్ధార్థ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం విశ్వనటుడు కమలహాసన్ ట్విట్టర్ ద్వారా ఆవిష్కరించారు. అనంతరం సిద్ధార్థ్ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో నటుడు కమలహాసన్ తమను ఆశీర్వదించి ఈ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. చిత్ర షూటింగ్ పూర్తి అయ్యిందని, ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో నటిస్తున్న తారాగణం, ఇతర సాంకేతిక వర్గం వివరాలను త్వరలోనే వెల్లడించినట్లు పేర్కొన్నారు. చిత్త చిత్రాన్ని త్వరలోనే పలు భాషల్లో అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సిద్ధార్థ్ తెలిపారు.

తెరపైకి ముత్తయ్య మురళీధరన్ బయోపిక్



800 చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్

తమిళ సినిమా: ప్రపంచ క్రికెట్‌లో ప్రసిద్ధి చెందిన క్రీడాకారుడు ముత్తయ్య మురళీధరన్. శ్రీలంకకు చెందిన ఈ స్టార్ క్రికెటర్ బయోపిక్‌ను ఇంతకు ముందే విజయ్ సేతుపతి కథానాయకుడిగా తెరకెక్కించే ప్రయత్నాలు జరిగాయి. అయితే ముత్తయ్య మురళీధరన్ పాత్రలో విజయ్ సేతుపతి నటించడంపై తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆ ప్రయత్నం ముందుకు వెళ్లలేదు. తాజాగా మురళీధరన్ బయోపిక్‌ను 800 పేరుతో చిత్రంగా తెరకెక్కిస్తున్నారు. అయితే ఈసారి చిత్ర కథానాయకుడు మారారు. స్లండాగ్ మిలియనర్ చిత్రం ఫేమ్ మధుర్ మిట్టల్ ఈ చిత్రంలో ముత్తయ్య మురళీధరన్ పాత్రలో నటిస్తున్నారు. కథానాయకిగా నటి మహిమ నంబియార్ నటిస్తున్నారు. నటుడు నరేన్, నాజర్, వేవేల రామ్మూర్తి, రిత్విక, వడివుక్కరసీ, అరుళ్ దాస్, హరికృష్ణ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. దీన్ని మూవీ ట్రెస్ మోషన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. దీనికి వివేక్ రంగాచారి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కాగా ఈ చిత్రానికి కనిమొళి చిత్రం ఫేమ్ ఎమ్మెస్ శ్రీపతి దర్శకత్వం వహిస్తున్నారు. ఈయన దర్శకుడు వెంకట ప్రభువు శిష్యుడు అన్నది విశేషం కాగా చిత్ర వివరాలను ఆయన తెలుపుతూ షూటింగ్ చెన్నై, శ్రీలంక, కొచ్చిన్, ఇంగ్లండ్ , ఆస్ట్రేలియా ప్రాంతాల్లో నిర్వహించి పూర్తి చేసినట్లు తెలిపారు. అదేవిధంగా చిత్రాన్ని త్వరలోనే తమిళం, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల చేయడానికి చెప్పారు. దీనికి జిబ్రాన్ సంగీతాన్ని, ఆర్ డీ.రాజశేఖర్ ఛాయాగ్రహణంను అందిస్తున్నట్లు తెలిపారు.



ఆమెనెవరూ ఆపలేరు

తమిళ సినిమా: తాజాగా నటి కీర్తిసురేష్ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారారు. కారణం ఈ బ్యూటీ తాజాగా నటుడు నానితో జత కట్టిన దసరా చిత్రం సక్సెస్ కావడమే. అలాగే ఇటీవల కీర్తిసురేష్ గ్లామర్ డోసు పెంచడం కూడా. తమిళంలో ఇంతకు ముందు నటించిన సాని కాగితం చిత్రంలో డీ గ్లామర్ పాత్రలో కీర్తిసురేష్ నటనకు సినీ వర్గాల నుంచి ప్రశంసల జల్లు కురిసింది. ఆ తరువాత తెలుగులో మహేష్ బాబు సరసన నటించిన సర్కారు వారి పాట చిత్రంలో గ్లామర్ మెరుపులు మెరిపించి అలరించింది. ప్రస్తుతం తెలుగులో చిరంజీవికి చెల్లెలిగా భోళాశంకర్ చిత్రంలో నటిస్తున్న కీర్తిసురేష్, తమిళంలో ఉదయనిధి స్టాలిన్‌కు జంటగా మామన్నన్, జయం రవి సరసన సైరన్ చిత్రాల్లో నటిస్తోంది. వీటిలో మామనిదన్ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. కాగా తరచూ సామాజిక మాధ్యమాల్లో గ్లామరస్ ఫొటోలను పోస్ట్ చేస్తూ వార్తల్లో ఉండే ఈ అమ్మడు తన ఇన్‌స్టాగామ్‌లోనూ అభిమానులతో ముచ్చటిస్తూ వారి ప్రశ్నలకు బదులిస్తుంటారు. అలా.. ఇటీవల ఆమె ఇన్‌స్టాగామ్‌లో అభిమానులతో తన భావాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఓ అభిమాని నటి సమంత గురించి అడిగిన ప్రశ్నకు కీర్తిసురేష్ బదులిస్తూ సమంత తాను అబ్బురపడే నటి అని పేర్కొన్నారు. ఆమె చాలా స్ట్రాంగ్ వ్యక్తిత్వం కలిగిన మహిళ అని కొనియాడారు. ఇంకా చెప్పాలంటే సమంతను ఎవరూ అడ్డుకోలేరని, ఎవరూ ఆపలేరని అభిప్రాయపడ్డారు.



వదంతులను పట్టించుకోను

తమిళ సినిమా: నటి పూజా హెగ్డేకు ఇటీవల సరైన హిట్టు పడలేదు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో నటిస్తున్న ప్రస్తుతం ఈ అమ్మడి కెరీర్ డౌన్ అయిందనే చెప్పాలి. అయితే చేతిలో తెలుగు, హిందీ భాషా చిత్రాలు ఉన్నాయి. తమిళంలో ఆ మధ్య విజయ్ సరసన నటించిన బీస్ట్ చిత్రం ఫ్లాప్ కావడంతో ఇక్కడ మరో అవకాశం రాలేదు. ప్రస్తుతం తెలుగులో మహేష్ బాబుకు జంటగా ఓ చిత్రంలో నటిస్తోంది. అదేవిధంగా హిందీలో సల్మాన్ ఖాన్ సరసన కీసికా భాయ్ కిసీకీ జాన్ చిత్రంలో నటిస్తోంది. దీంతో నటుడు సల్మాన్ ఖాన్ ప్రేమలో పూజా హెగ్డే ఉన్నట్టూ వార్తలు సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేస్తున్నాయి. ఆ వార్తను ఖండించిన పూజ హెగ్డే గురించి తాజాగా మరో ప్రచారం వైరల్ అవుతుంది. ఒక నిర్మాత రూ.కోట్ల ఖరీదైన కారును బహుమతిగా ఇచ్చారన్నదే ఆ ప్రచారం. ఆ కార్‌లోనే ఈమె షూటింగ్‌కు వెళుతుందనే వార్తలు వైరలవుతున్నాయి. దీనిపై స్పందించిన పూజా హెగ్డే తన గురించి చాలా వదంతులు ప్రచారం అవుతున్నాయని వాపోయారు. తనకు నిర్మాత ఖరీదైన కారును బహుమతిగా ఇచ్చారన్నది కూడా వదంతే అని తెలిపారు. తన తల్లిదండ్రులు కూడా ఈ ప్రచారాన్ని విని ఖరీదైన కారును బహుమతిగా పొందావన్నది నిజమా? అని ప్రశ్నించినట్లు వెల్లడించారు. అయితే ఇలాంటి వ్యతిరేకంగా జరుగుతున్న వదంతులకు స్పందించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. అయితే నిప్పు లేనిదే పొగ రాదు అన్న సామెతను కొందరు నెటిజన్లు పోస్ట్ చేస్తున్నారు. ఏదేమైనా నటి పూజా హెగ్డే ఇప్పుడు ఒక మంచి హిట్ కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్లుప్తంగా

దోసె వేయలేదనే కోపంతో..

అన్నానగర్: దోసె చేయలేదనే కోపంతో భర్త కత్తితో పొడవడంతో సోమవారం ఉదయం మహిళ మృతి చెందింది. కృష్ణగిరి జిల్లా మాత్తూరు సమీపంలోని ఎస్.మోటూరు గ్రామానికి చెందిన గణేశన్ (60) భార్య మాధమ్మాల్ (50) గత 11వ తేదీ పని ముగించుకుని ఇంటికి వచ్చిన గణేశన్ తనకు దోసె చేయాలని భార్యను అడిగాడు. దీంతో ఆమె మూడు దోసెలు వేసి, ఆ తర్వాత గ్యాస్ సిలిండర్ అయిపోయింది. ఇంతలో గణేశన్ మరో 3 దోసెలు అడిగాడు. సిలిండర్‌లో గ్యాస్ అయిపోయిందని చెప్పింది. దీంతో తీవ్ర కోపంతో గణేశన్ కత్తితో మాధమ్మాల్ తల, చేయి నరికాడు. దీన్ని అడ్డుకునేందుకు వెళ్లిన కోడలు విజయలక్ష్మి, చిన్నారి తానీషా(2)కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కృష్ణగిరి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న మాత్తూరు పోలీసులు గణేశన్‌ను అరెస్టు చేశారు. చికిత్స నిమిత్తం ధర్మపురి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాధమ్మాన్ చికిత్స ఫలించక సోమవారం ఉదయం మృతి చెందింది. దీంతో పోలీసులు కేసును హత్య కేసుగా మార్చారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది.

వినతిపత్రం ఇవ్వడానికి వచ్చి మృతి



వృద్ధుడు మేషాక్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

వేలూరు: వేలూరు సమీపంలోని పెరుముగై గ్రామానికి చెందిన మేషాక్(62) ఇతను పెరుముగైలో ప్రైవేటు షూ కంపెనీలో కార్మికుడిగా పని చేసి పదవీ విరమణ పొందాడు. మేషాక్ సోమవారం ఉదయం వేలూరు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్‌సెల్‌లో వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చాడు. ఆ సమయంలో ఉన్నఫలంగా స్పృహ తప్పి కింద పడ్డాడు. గమనించిన అధికారులు వెంటనే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే మేషాక్ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆ ప్రాంతంలో సంచలనం రేపింది.

చెన్నైకి చేరుకున్న జాలర్లు

తిరువొత్తియూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చొరవతో శ్రీలంక జైలులో బంధించబడి ఉన్న 11 మంది జాలర్లు విడుదలయ్యారు. వీరు విమానంలో సోమవారం చెన్నైకి చేరుకున్నారు. నాగపట్టణం, పుదుకోట్టై, కారైకాల్ ప్రాంతానికి చెందిన 11మంది జాలర్లు గత నెల మార్చి 22వ తేదీ తమిళనాడు సముద్ర హద్దులో చేపలు పడుతుండగా అర్ధరాత్రి సమయంలో శ్రీలంక నావికాదళం పోలీసులు వీరిపై దాడి చేశారు. అలాగే పడవలను ధ్వంసం చేసి 11 మందిని అరెస్టు చేసి, రెండు పడవలు, చేపల వలలను స్వాధీనం చేసుకుని శ్రీలంకకు తరలించారు. శ్రీలంక కోర్టులో 11 మందిని హాజరు పరచారు. ఈ క్రమంలో తమవారిని విడిపించాలని జాలర్ల కుటుంబసభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రధానమంత్రి మోదీ, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జయశంకర్ తదితరులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విషయాన్ని లేఖ ద్వారా తెలిపారు. శ్రీలంకలో ఉన్న భారత రాయబార అధికారి అధికారులు శ్రీలంక ప్రభుత్వంతో మాట్లాడారు. ఈ క్రమంలో గత కొన్ని రోజులకు ముందు శ్రీలంక కోర్టులో 11 మంది జాలర్లను విడిచి పెట్టాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో, వారిని శ్రీలంకలో ఉన్న భారత రాయబార అధికారి కార్యాలయంలో అప్పగించారు. అయితే 11 మందికి పాస్‌పోర్టు, వీసా లేకపోవడంతో ఎమర్జెన్సీ సర్టిఫికెట్లు అందజేసి విమానం ఎక్కించారు.

చెప్పుల దుకాణం యజమానిపై దాడి

– ఇద్దరు రౌడీల అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై వ్యాసార్‌పాడిలో దుకాణం యజమానిపై దాడి చేసి నగదు అపహరించిన ఇద్దరు రౌడీలను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నై వ్యాసార్‌పాడి కక్కన్‌జీ కాలనీ ప్రాంతానికి చెందిన బాలమురుగన్ (45) చెప్పుల దుకాణం నడుపుతున్నాడు. గత కొన్ని రోజులకు క్రితం ఉదయ సూర్యం నగర్, 82వ బ్లాక్ మార్గంగా వెళ్తున్న సమయంలో బాలమురుగన్ను అడ్డుకున్న ఇద్దరు వ్యక్తులు అతనిపై దాడి చేసి, అతని వద్ద ఉన్న రూ. 1000 అపహరించారు. దీనికి సంబంధించి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి జీవా (19), అభిషేక్ (19) అనే ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఈక్రమంలో వ్యాసార్‌పాడి పుదునగర్ 8వ వీధిలో టీ దుకాణం నడుపుతున్న లెనిన్ (44)ను ఆదివారం రాత్రి బీవీ కాలనీ 5వ వీధి మార్గంగా వెళుతుండగా షర్మా నగర్ వద్ద అజిత్ (25) అనే యువకుడు లెనిన్‌ను అడ్డుకుని అతనిపై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ. 1000 లాక్కుని పారి పోయాడు. దీని గురించి ఫిర్యాదు మేరకు ఎంకేబీనగర్ పోలీసుల కేసు నమోదు చేసి ఆదివారం సాయంత్రం అజిత్‌ను అరెస్టు చేశారు. విచారణ తర్వాత అతన్ని జైలుకు తరలించారు.

చెన్నై వేదికగా హాకీ టోర్నీ

- ఆగస్టు 3 నుంచి 12 వరకు పోటీలు
- మంత్రి ఉదయ నిధి స్టాలిన్



టోర్నీ వివరాలు వెల్లడిస్తున్న మంత్రి ఉదయ నిధి స్టాలిన్

సాక్షి, చెన్నై: అంతర్జాతీయ స్థాయి పోటీలకు మరోసారి చెన్నై వేదిక కానుంది. ఆసియా ఖండంలోని వివిధ దేశాల జట్లతో హాకీ టోర్నీ నిర్వహించనున్నారు. ఆగస్టు 8వ తేది నుంచి 12వ తేదీ వరకు ఆసియా ఛాంపియన్ షిప్ హాకీ ట్రోఫీ -2023 పోటీలు జరుగుతాయని క్రీడల మంత్రి ఉదయ నిధి స్టాలిన్ తెలిపారు. ప్రపంచ చెప్ ఛాంపియన్ షిప్ పోటీలను చెన్నై వేదికగా ప్రభుత్వం గతంలో విజయవంతం చేసిన విషయం తెలిసిందే. తమిళనాడు వేదికగా మరిన్ని అంతర్జాతీయ పోటీల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా హీరో, హాకీ ఇండియా నేతృత్వంలో తమిళనాడు ప్రభుత్వ సౌజన్యంతో ఆసియా ఛాంపియన్ షిప్ పోటీలకు చెన్నైను వేదికగా ఎంపిక చేశారు. సోమవారం ఈ వివరాలను క్రీడా మంత్రి ఉదయ నిధి స్టాలిన్ మీడియాకు వెల్లడించారు.

ఆగస్టు 3 నుంచి పోటీలు..

చెన్నై ఎగ్మూర్ మేయర్ రాధాకృష్ణన్ స్టేడియంలో ఆగస్టు 3 నుంచి 12 వతేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని ప్రకటించారు. ఇందులో ఆసియా ఖండంలోని జపాన్, మలేషియా, పాకిస్తాన్, చైనా, దక్షిణ కొరియా, భారత్ వంటి ఆరు దేశాల హాకీ జట్టులు తలపడనున్నాయని వివరించారు. చెన్నైను ఈ టోర్నీకి వేదికగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేస్తామన్నారు. ఈ టోర్నీ ద్వారా తమిళనాడులో హాకీ క్రీడపై యువతలో మక్కు పెరిగే విధంగా, ప్రోత్సాహాన్ని అందించే రీతిలో ముందుకెళ్తామన్నారు. 2007లో ఇక్కడ హాకీ టోర్నీ జరిగిందని, 16 ఏళ్ల అనంతరం చెన్నై మరోమారు వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు.

ధీరన్‌కు ఘన నివాళి



ధీరన్ చిన్నమలై చిత్రపటం వద్ద సీఎం స్టాలిన్, మంత్రుల పుష్పాంజలి

సాక్షి, చెన్నై : స్వాతంత్య్ర సమరయోధుడు ధీరన్ చిన్నమలై విగ్రహానికి సీఎం ఎంకే స్టాలిన్ సోమవారం ఘన నివాళులర్పించారు. ధీరన్ చిన్నమలై 268వ జయంతి వేడుకను అధికారిక కార్యక్రమంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారుల నేతృత్వంలో ధీరన్‌కు నివాళులర్పించే కార్యక్రమాలు జరిగాయి. చెన్నై గిండిలోని ధీరన్ చిన్నమలై విగ్రహం పరిసరాల్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి సీఎం ఎంకే స్టాలిన్ పుష్పాంజలి ఘటించారు. మంత్రులు ఎం. సుబ్రమణియన్, స్వామినాథన్, సెంథిల్ బాలాజీ, పొన్ముడి, ముత్తుస్వామి, మేయర్ ప్రియ, కొంగునాడు మక్కల్ దేశియ కట్చి నేత, ఎమ్మెల్యే ఈశ్వరన్ తదితరులు సైతం నివాళులర్పించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు అంజలి ఘటించారు. అలాగే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడపాడి కె. పళణి స్వామి సెల్వం, నేతలు జయకుమార్, తంగమణి, కేపీ మునుస్వామి, సెంగోట్టయన్ తదితరులు పుష్పాంజలి ఘటించారు.

ఇక పీఎంకే శాసన సభా పక్ష నేత జికేమణి, నేతలు ఏకే మూర్తి తదితరులు అంజలి ఘటించిన వారిలో ఉన్నారు. వివిధ పార్టీలకు చెందిన నేతలు నివాళులర్పించినానంతరం ధీరన్ చిన్నమలై సేవలను గుర్తు చేసుకున్నారు.

సకాలంలో పనులను పూర్తి చేయండి



రోడ్డు నిర్మాణపు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: తిరుపతి–చెన్నై జాతీయ రహదారి నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. అయితే ఈ పనులు ఇటీవల ప్రారంభం కావడంతో కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీష్ అధికారులతో కలిసి సోమవారం ఉదయం పరిశీలించారు. చెన్నై పాడి నుంచి తిరుపతి వరకు తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు సులభంగా రాకపోకలు సాగించడానికి జాతీయ రహదారి 205 నిర్మాణ పనులను గత పదేళ్ల కిందట ప్రారంభించారు. అయితే పాడి నుంచి తిరునింద్రవూర్ వరకు భూసేకరణ కష్టంగా మారింది. దీంతో తిరునింద్రవూర్ నుంచి తిరుపతి వరకు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే తిరునింద్రవూర్ నుంచి తిరుప్పాచ్చూర్ వరకు భూసేకరణ మళ్లీ సమస్యాత్మకంగా మారడంతో 17 కిలోమీటర్ల దూరం పనులను మినహాయించి మిగిలిన పనులను పూర్తి చేశారు. అయితే ఆగిపోయిన ఆ పనులను పునఃప్రారంభించడానికి ఉన్న అడ్డంకులు తొలగిపోవడంతో పదేళ్ల పాటు నిలిచిపోయిన పనులను ఇటీవల ప్రారంభించారు. ఇందుకోసం సుమారు 17 కి.మీ. మేర రోడ్డు వేయడానికి రూ.364.21 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ పనులను రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉండగా, ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. రోడ్డులో 2 పెద్దబ్రిడ్జి, మరో 3 చిన్న బ్రిడ్జిల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీష్ సోమవారం ఉదయం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత సమయం లోపు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారి నిర్మాణ పనులతో తిరునింద్రవూర్, తిరువళ్లూరు, వేపంబట్టు, సెవ్వాపేట, అయత్తూరు, తన్నీర్‌కుళం, కాకలూరు తదితర గ్రామాలకు లింక్ రోడ్డును సైతం ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు.

ముక్కంటి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న చెన్నై భక్తుడు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకం రూ.10,116, రుద్రాభిషేకానికి రూ.10వేలను చెన్నైకు చెందిన అనంత అప్పల నరసింహ మాధవశర్మ సోమవారం విరాళం ఇచ్చారు. ఆలయ అధికారులు దాతకు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు నాగభూషణనాయక్, గోపాల్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దొంగను పట్టుకున్న డ్రైవర్

తిరువొత్తియూరు: ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడుతున్న ఓ దొంగను, డ్రైవర్ వ్యూహం పన్ని పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. చెన్నై రామాపురం సత్యానగర్ నాలుగో వీధికి చెందిన నల్ల శివం కారు డ్రైవరు. ఇతను గత 12వ తేదీ ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా వేరేఊరికి వెళ్లాడు. రాత్రి తిరిగి వచ్చి చూడగా రూ.5000 నగదు అదృశ్యమైంది. ఇలా వరుసగా మూడుసార్లు ఇంట్లో ఉంచిన నగదు అదృశ్యమైంది. ఇంటి తాళాలు యథావిధిగా ఉండడంతో, దొంగను పట్టుకోవడానికి శివ పథకం వేసి, భార్యకు చెప్పాడు. ఇద్దరూ కలిసి దుండగున్ని పట్టుకోవాలని నల్లశివం ఇంటి లోపలే ఉండగా, భార్య ఇంటి బయట తాళం వేసుకుని వెళ్లింది. కొద్దిసేపటి తరువాత దొంగ ఆ ఇంటి తాళం తెరుచుకుని లోపలికి వెళ్లాడు. ఇంటిలో దాగి ఉన్న ఇంటి యజమానిని చూసి ఆశ్చర్యపోయాడు. నల్లశివం దొంగను పట్టుకుని, ఇరుగు పొరుగు వారు అతనికి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతన్ని పట్టుకున్నారు. విచారణలో చోరీ చేస్తోంది పక్కింటిలో ఉన్న మణికంఠన్ (26) అని తెలిసింది. అతని వద్ద నుంచి రూ.2000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

షరతులు ఉల్లంఘించిన వారిపై కేసు

కొరుక్కుపేట: హైకోర్టు విధించిన షరతులను ఆర్ఎస్ఎస్ ఉల్లంఘించడంతో నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. తమిళనాడు వ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ ర్యాలీ నిర్వహించింది. అయితే కోయంబత్తూరు నగరంలో జరిగిన ర్యాలీలో బీజేపీ సీనియర్ నేత హెచ్.రాజా, హిందూ పీపుల్స్ పార్టీ నేత అర్జున్ సంపత్ తదితరులు యూనిఫాంలో కవాతు చేశారు. కోయంబత్తూరులోని వైడ్ ది హాల్ పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లు దీనిపై ఫోరం ఇచ్చిన నిబంధనలు, షరతులను ఉల్లంఘించారని, బహిరంగ ప్రదేశంలో చుట్టూ ఆయుధాలతో కవాతు చేసినట్టు ఫిర్యాదు అందింది. జిల్లా అధ్యక్షుడు సుకుమార్, వైస్ ప్రెసిడెంట్ కుమార్, న్యూస్ పబ్లిక్ రిలేషన్స్ ఎగ్జిక్యూటివ్ విజయ్ కుమార్, కోయంబత్తూరు మున్సిపల్ సెక్రటరీ మురుగన్ అరుణ్ లిట్టర్‌పై పోలీసులు 151, 341, 290, 153 (ఏఏ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

బీజేపీ నేత ఇంట్లో కత్తులతో చొరబాటు

తిరువొత్తియూరు: రామనాథపురం జిల్లా బీజేపీ అధ్యక్షుడు కదిరవన్ నగదు బేరమాడిన ఆడియో వ్యవహారంలో మార్చి వేసి బీజేపీ జిల్లా కోశాధికారిగా ఉంటున్న ధరణి (మురుగేషన్) గత మార్చి 27వ తేదీ కొత్త జిల్లా అధ్యక్షుడిగా నియమింపబడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం రామనాథపురంలో ఆర్ఎస్ఎస్ ర్యాలీ జరిగింది. ఇందులో జిల్లా అధ్యక్షుడు ధరణి ఆర్ మొరిగేషన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తర్వాత కార్యకర్తలను పంపించి వేసి ఇంటి రాత్రి రామనాథపురం కేనిక్కరైలో ఉన్న ఇంటి వద్దకు వెళ్లారు. ఆ సమయంలో మాస్కు ధరించిన ఇద్దరు ఇంటిలోకి చొరబడ్డానికి ప్రయత్నించారు. ఆ సమయంలో ఇంటిముందు నిలబడి ఉన్న బీజేపీ నాయకులు వారిని అడ్డుకున్నారు. తనిఖీ చేయగా ఇద్దరూ కూడా కత్తులు కలిగి ఉన్నట్టు తెలిసింది. ఈ సంఘటన గురించి పోలీసులకు సమాచారం తెలిపారు. దీంతో పోలీసులు రాత్రి నుంచి వీళ్ల కోసం మురుగేశన్ ఇంటికి వెళ్లి విచారణ జరిపారు. పట్టుబడిన ఇద్దరు చెన్నై ఎన్నూరుకు చెందిన వారిగా తెలిసింది. ఈ క్రమంలో అక్కడ వున్న బీజేపీ మాజీ అధ్యక్షుడు కదిరవన్ కారణంగా ఈ సమస్యలు జరుగుతూనే ఉన్నాయా? కదిరవన్, అతని మద్దతుదారుడు న్యాయవాది షణ్ముగనాథన్ తదితరులను అరెస్ట్ చేయాలని కోరుతూ రామనాథపురం తిరుచి రోడ్డు ప్రధాన రోడ్డులో కేనికరై రోడ్డులో బీజేపీ ఆందోళన చేశారు. దీంతో ఆ ప్రాంతంలో సంచలనం కలిగించింది.

భర్త అనుమానిస్తున్నాడని..

- కన్నబిడ్డను కడతేర్చిన కసాయి తల్లి

అన్నానగర్: భర్త అనుమానిస్తున్నాడని 29 రోజుల పసికందును ఓ కసాయి తల్లి గొంతు నులిమి హత్య చేసిన ఘటన వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. చెన్నైలోని కొరటూరు ప్రాంతం సంచార తెగకు చెందిన కుమరేశన్ (32) చెన్నై పుదువాయ్‌లో రోడ్డు పక్కన నివసిస్తున్నాడు. ఇతనికి రాజేశ్వరితో వివాహం కాగా వీరికి నలుగురు కొడుకులు ఉన్నారు. అయితే సంగీత(24) అనే మహిళను రెండోపెళ్లి చేసుకున్నాడు. కొన్ని నెలల క్రితం ఈమెను తీసుకుని కుమరేశన్ పుదుచ్చేరి కిరుమామ్‌బాక్కంకి మకాం మార్చాడు. 29 రోజుల కిందట సంగీత ఓ పండంటిబిడ్డకు జన్మనిచ్చింది. శనివారం రాత్రి కుమరేశన్, సంగీత ఇద్దరూ పాపతో పడుకున్నారు. అయితే ఆదివారం ఉదయం లేచి చూసేసరికి చిన్నారి కనిపించలేదు. దీంతో వారు చిన్నారి కోసం వెతికారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో పుదుకుప్పం బీచ్ ఇసుకలో పాతిపెట్టిన ఓ చిన్నారి పాదం మాత్రమే బయటకు కనిపించడం గుర్తించారు. కిరుమామ్ బాక్కం పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ కుమార్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ లౌర్దు నాథ్ చిన్నారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. సమాచారం అందుకున్న కుమరేశన్, సంగీత దంపతులు అక్కడికి చేరుకుని మట్టిలో పూడ్చిపెట్టింది తమ బిడ్డే అని బోరున విలపించారు. ఆ ప్రాంతంలో సంచరిస్తున్న తన మామే బిడ్డను కిడ్నాప్ చేసి హత్య చేసి ఉండొచ్చని కుమరేశన్ సందేహం వ్యక్తం చేశాడు.

కసాయి తల్లి..

సంగీతపై అనుమానం వచ్చి పోలీసులు ఆమెను విచారించగా తనకు బిడ్డ పుట్టిన తరువాత నుంచి భర్త తనను అనుమానించి ప్రతి రోజూ చిత్రహింసలకు గురిచేస్తున్నాడని తెలిపింది. బిడ్డ తనకు పుట్టిందా? అంటూ తనతో భర్త వాదిస్తున్నాడని, అప్పటికే నెలలు నిండకుండానే బిడ్డకు జన్మనిచ్చిన నాకు అనారోగ్య కారణాలతో బిడ్డను పెంచడం కష్టమైందని, తన భర్తతో కూడా సమస్యలు రావడంతో చిన్నారిని చంపాలని నిర్ణయించుకున్నానని ఆమె వాంగ్మూలం ఇచ్చింది.

డబ్బు కోసం రెండో పెళ్లి



కలెక్టర్ కార్యాలయం వద్ద బిడ్డతో కలిసి ఆందోళన చేస్తున్న మహిళ

తిరువళ్లూరు: డబ్బుకు ఆశపడి మొదటి భార్య వుండగానే రహస్యంగా ఓ వ్యక్తి రెండో వివాహం చేసుకున్న ఘటన వెలుగు చూసింది. వివరాలు.. తను ఉండగా మరో మహిళను పెళ్లి చేసుకున్న తన భర్తపై చర్యలు తీసుకోవడంతో పాటు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద బిడ్డతో మహిళ ఆందోళనకు దిగింది. తిరువళ్లూరు జిల్లా పెద్దపాళ్యం సమీపంలోని వండిమేట్టు గ్రామానికి చెందిన మారియమ్మాల్ తండలం గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తిని ప్రేమించి 2007వ సంవత్సరంలో వివాహం చేసుకుంది. వీరికి రెండేళ్ల బాబు ఉన్నాడు. గత కొద్ది నెలల కిందట భార్య భర్తల మధ్య మనస్పర్థలు వచ్చినట్టు తెలుస్తుంది. ఇదే అదునుగా భావించిన రమేష్ మొదటి భార్యకు తెలియకుండా తండలం గ్రామానికి చెందిన ఓ మహిళను రెండవ వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మారియమ్మాల్ నేరుగా రమేష్ ఇంటికి వెళ్లి నిలదీయగా, దాడి చేసి గాయపరిచినట్టు తెలుస్తుంది. తనతో నీకు సంబంధం లేదని బయటకు విషయాన్ని చెబితే చంపేస్తానని బెదిరించడంతో మనస్తాపం చెందిన మహిళ సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టింది. తాను ఉండగానే రెండవ వివాహం చేసుకున్న భర్తపై చర్యలు తీసుకోవడంతో పాటు తమకు న్యాయం చేయాలని కోరుతూ నినాదాలు చేసింది. దీంతో కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మహిళను స్టేషన్‌కు తరలించారు. ఆమె ఫిర్యాదును స్వీకరించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించింది.

మరుగుదొడ్డి నిర్మాణంపై భక్తుల అభ్యంతరం



కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న పుల్లరంబాక్కం గ్రామస్తులు

తిరువళ్లూరు: ఆలయానికి సమీపంలోని భూమిలో మరుగుదొడ్డి నిర్మించాలని అదే గ్రామానికి చెందిన కొందరు ప్రయత్నం చేస్తున్నారని వాపోయిన స్థానికులు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనకు హిందూ ప్రజాపార్టీ జిల్లా అధ్యక్షుడు వేల్‌రాజ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరువళ్లూరు జిల్లా పుల్లరంబాక్కం గ్రామంలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ సత్యభామ సమేత చందన సంతాన కృష్ణుడి ఆలయం ఉంది. ఈ ఆలయానికి సమీపంలో భక్తులు నందవనం పేరిట కొంత భూమిలో పూల మొక్కలను పెంచుతున్నారు. తద్వారా వచ్చే పూలతో నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. నందనం ఉన్న ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన గోవిందరాజరెడ్డి కుటుంబ సభ్యులు ఆక్రమించుకుని అక్కడ మరుగుదొడ్డి నిర్మాణం కోసం పనులను ప్రారంభించారు. ఆలయానికి సమీపంలో మరుగుదొడ్డి నిర్మించడం ద్వారా హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని వాపోయారు. ఆక్రమణకు గురైన భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవడంతో పాటు మరుగుదొడ్డి నిర్మాణ ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు వినతిపత్రం సమర్పించారు.

హీరో మాధవన్ కొడుకు వేదాంత్ ప్రతిభ



పతకాలతో వేదాంత్

కొరుక్కుపేట: మలేషియా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 5 బంగారు పతకాలు సాధించి భారతదేశానికే గర్వకారణంగా నిలిచాడు నటుడు మాధవన్ కుమారుడు వేదాంత్. తమిళ చిత్రసీమలో హీరో మాధవన్ తనయుడు వేదాంత్ చిన్నప్పటి నుంచి స్విమ్మింగ్‌పై పట్టు సాధించాడు. 17 ఏళ్ల వయసున్న వేదాంత్ ప్రస్తుతం అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గత ఫిబ్రవరిలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జరిగాయి. ఈ టోర్నీలో 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వేలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మహారాష్ట్ర జట్టు తరఫున మాధవన్ కుమారుడు వేదాంత్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని 5 బంగారు, 2 రజత పతకాలు సాధించాడు. తాజాగా కౌలాలంపూర్‌లో జరిగిన మలేషియా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో వేదాంత్ భారత్ తరఫున 5 స్వర్ణాలు (50, 100, 200, 400, 1500 మీటర్లు స్విమ్మింగ్) సాధించాడని నటుడు మాధవన్ తన ట్విట్టర్ పేజీలో తెలిపారు. దీనికి స్పందిస్తూ పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. సంగీత దర్శకులు ఏఆర్ రెహమాన్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా వేదాంత్‌ను ఉన్నతస్థాయికి తీసుకెళ్తున్న మాధవన్ కుటుంబానికి అభినందనలు అన్నారు. దేవుడు వారిని మంచిగా ఆశీర్వదించాలని ఆకాంక్షించారు.

రవాణా సంస్థకు 145 కొత్త కార్లు

– రాష్ట్రప్రభుత్వ నిర్ణయం

కొరుక్కుపేట: డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షల కోసం కొత్తగా రవాణా సంస్థకు 145 కొత్త కార్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు కార్లు కొనుగోలుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో డ్రైవింగ్ శిక్షణ స్కూళ్లు, మరిన్ని ప్రభుత్వ అనుమతితో నడుస్తున్నాయి. ప్రతి పాఠశాలలో కోచ్‌లు, కార్యాలయ సహాయకులు పని చేస్తున్నారు. ప్రతి పాఠశాలలో శిక్షణ అందించే ఇతర సేవలు ఫీజులు మారుతుంటాయి. డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు దరఖాస్తుదారుడు చాలాఖర్చు చేయాల్సి వస్తుంది. వాహనాలు ఏర్పాటు చేయలేని వారి సౌకర్యార్థం ఢిల్లీలోని సరాయ్ కాలేగావ్ జిల్లా రవాణా కార్యాలయంలో అద్దెకు కార్లను అందించే కొత్త పథకం అమలు చేశారు. అదేవిధంగా త్వరలో తమిళనాడులో కూడా సొంతంగా కారు లేని వారు ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న కార్లను ఉపయోగించి డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షలు చేయించుకోనున్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్ మాట్లాడుతూ దరఖాస్తుదారులు స్కూళ్లకు చేరుకుని వారు అడిగిన ఫీజులు చెల్లిస్తున్నారని తెలిపారు. డ్రైవింగ్ టెస్ట్‌లో పాల్గొనేందుకు కారు లేకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. అందుకోసం తమిళనాడులో 145 ఆర్టీఓ కార్యాలయాలకు కూడా లైట్ మోటార్ వాహనాలను కొనుగోలు చేయబోతున్నామని తెలిపారు. దీంతో వృత్తి విద్యా పాఠశాలల ప్రభావం తగ్గుతుందని రవాణాశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్రైవింగ్ స్కూళ్లు దరఖాస్తుదారుడి నుంచి రూ.5000 నుంచి రూ.10,000 వరకు అడుగుతున్నాయి. చాలామంది తమ స్నేహితులు, బంధువుల సహాయంతో డ్రైవింగ్ నేర్చుకుంటున్నప్పటికీ, వారు డ్రైవింగ్ స్కూళ్లను సంప్రదించి అదనపు డబ్బు చెల్లిస్తున్నారు.

ఇచ్చిన హామీ మేరకు నిధులు ఇవ్వండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన మప్పేడు సమత్తువపురం గ్రామస్తులు

తిరువళ్లూరు: ఇంటికి మరమ్మతులు చేసుకుంటే రూ.50 వేలు సాయం అందిస్తామన్న ప్రభుత్వ హామీ మేరకు నిధులు ఇవ్వాలని సమత్తువపురం గ్రామస్తులు సోమవారం కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు వినతిపత్రం సమర్పించారు. తిరువళ్లూరు జిల్లా మప్పేడు సమీపంలోని సమత్తువపురం గ్రామంలో సుమారు వంద ఇళ్లు ఉన్నాయి. సుమారు 15 ఏళ్ల కిందట నిర్మించడంతో మరమ్మతులకు గురైంది. ఈ నేపథ్యంలో ఇటీవల సమత్తువపురం గ్రామంలో పర్యటించిన కడంబత్తూరు బీడీఓ నేతృత్వంలోని అధికారుల బృందం సమత్తువపురంలోని నివాసాలకు మరమ్మతులు చేసుకుంటే ప్రభుత్వం రూ.50 వేలను సాయంగా ఇస్తుందని ప్రకటించారు. వారి మాటలు నమ్మి గ్రామస్తులు అప్పులు చేసి ఇళ్లకు మరమ్మతులు చేసుకున్నారు.

పనులు పూర్తయినా నిధులు ఇవ్వకపోవడంతో బాధితులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇచ్చిన హామీ మేరకు తమకు నిధులు ఇవ్వాలని, లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మేల్మలయనూరు ఆలయానికి 500 బస్సులు

కొరుక్కుపేట: ఈనెల 19వ తేదీ అమావాస్య సందర్భంగా మేల్మలయనూరు ఆలయానికి 500 ప్రత్యేక బస్సులను ప్రభుత్వ రవాణా సంస్థ ఏర్పాటు చేసింది. దేశంలోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున మేల్మలయనూరు ఆలయానికి వెళ్తున్న బుధవారం (19వ తేదీ) అమావాస్య కావడంతో మేల్మలయనూరు ఆలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం విల్లుపురం ప్రభుత్వ రవాణా సంస్థ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. చెన్నై కోయంబేడు, తాంబరం, విల్లుపురం, వెల్లూరు, తిరువన్నామలై, తిరుపత్తూరు, కాంచీపురం, తిరువళ్లూరు, పుదుచ్చేరి తదితర ప్రాంతాల నుంచి మొత్తం 500 ప్రత్యేక బస్సులను నడుపున్నారు. కోయంబేడు నుంచి 500 ప్రత్యేక బస్సులు ఈనెల 22వ శనివారం రంజాన్ వరకు నడుస్తాయి. రంజాన్ సందర్భంగా సాధారణంగా నడిచే 2,100 బస్సులకు అదనంగా బుధవారం ఆలయానికి 500 ప్రత్యేక బస్సులు, చెన్నై నుంచి వివిధ ప్రాంతాలకు 500 ప్రత్యేక బస్సులు నడపాలని రవాణా సంస్థ అధికారులు నిర్ణయించారు.

అలాగే 20వ తేదీతో 10వ తరగతి సాధారణ పరీక్ష ముగియగా, ఆ తర్వాత వేసవి సెలవులు. 20, 21 తేదీల్లో చివరి పరీక్షలు ముగియనున్న నేపథ్యంలో సొంత ఊళ్లకు వెళ్లే విద్యార్థులకు ఈ ప్రత్యేక బస్సులు ఉపయోగకరంగా ఉంటాయని వెల్లడించారు.

వారంలో రెండు లివర్ మార్పిడి ఆపరేషన్లు



లివర్ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న రోగులతో డాక్టర్లు

వేలూరు: వేలూరులోని నరువి ఆస్పత్రిలో వారం రోజుల వ్యవధిలోనే రెండు లివర్ మార్పిడి ఆపరేషన్లు చేసినట్లు ఆసుపత్రి చైర్మన్ జీవి సంపత్ అన్నారు. సోమవారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలోని ఆరోగ్య రక్షణ గమ్యాలలో నరువి ఆస్పత్రి ఒకటని తెలిపారు. అతి తక్కువ కాలంలోనే తమిళనాడు ప్రభుత్వం నుంచి అవయవ మార్పిడికి అనుమతి లభించినట్లు తెలిపారు. ఒకే వారంలోనే బెంగుళూరుకు చెందిన స్మిత(24), రవీంద్రన్(63)కు లివర్ మార్పిడి చికిత్సను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. స్మితకు ఆమె తల్లి రాజాత్తి అవయం ఇవ్వగా రవీంద్రన్‌కు అతని భార్య శాంతి అవయం దానం చేశారన్నారు. ఈ ఆపరేషన్‌కు సాధారణంగా మొత్తం రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని, అయితే తమ ఆస్పత్రి ప్రత్యేక రాయితి ఇచ్చి రూ.18 లక్షలకే ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. ఆస్పత్రిలో మొత్తం వెయ్యి మంది ఉద్యోగులు ఉండగా వారిలో 150 మంది డాక్టర్లు, 300 మంది నర్సులు ఉన్నారని, 25 సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయనతో పాటు ఆస్పత్రి వైస్ చైర్మన్ అనిత సంపత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పాల్ హెన్రీ, డాక్టర్ అరవింద్ నాయక్, జాకబ్ జోస్, మణిమారన్, నితిన్ సంపత్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా...

ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇద్దరు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ ముఖ్యకార్యదర్శి, నాక్ డీజీగా, ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్‌కు రియల్‌టైమ్ గవర్నెస్ (ఆర్టీజీఎస్) శాఖ ముఖ్య కార్యదర్శిగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు వీరు ఈ అదనపు బాధ్యతల్లో కొనసాగుతారని సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులిచ్చారు.

రిమాండ్‌పై హెబియస్ కార్పస్ దాఖలుకు వీల్లేదు

మార్గదర్శి వ్యవహారంలో ఆడిటర్ రిమాండ్‌పై హైకోర్టుకు నివేదించిన సీఐడీ

సాక్షి, అమరావతి: రిమాండ్‌పై అభ్యంతరం ఉంటే బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవాలే తప్ప, హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదని సీఐడీ తరఫు న్యాయవాది వై.శివకల్పనారెడ్డి హైకోర్టుకు నివేదించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధుల మళ్లింపు వ్యవహారంలో నిందితుడు ఆడిటర్ శ్రవణ్‌కుమార్ రిమాండ్‌ను చట్ట విరుద్ధంగా ప్రకటించి, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన భార్య డాక్టర్ నర్మద దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ ధర్మాసనం సోమవారం విచారించింది. బెయిల్ విషయంలో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. అంతకు ముందు శివకల్పనారెడ్డి వాదనలు వినిపిస్తూ.. రిమాండ్‌ను ప్రశ్నిస్తూ దాఖలు చేసే హెబియస్ కార్పస్ పిటిషన్‌కు విచారణార్హత లేదని చెప్పారు. మార్గదర్శి నిధుల మళ్లింపు వ్యవహారంలో శ్రవణ్ కుమార్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని, రిమాండ్ ఉత్తర్వులు ఇచ్చిన తరువాత ఫైల్‌ను సెషన్స్ కోర్టుకు పంపామని వివరించారు. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున బెయిల్ మంజూరు చేయవద్దని అభ్యర్థించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ భర్తను అరెస్ట్ చేసిన 48 గంటల తరువాత మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారన్నారు. మేజిస్ట్రేట్ చట్ట నిబంధనలను పరిశీలించకుండా యాంత్రికంగా వ్యవహరించారన్నారు. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రకారం ఆడిటర్ శ్రవణ్ కుమార్‌ను సెషన్స్ కోర్టు ముందు హాజరుపరచాలని తెలిపారు. అందువల్ల రిమాండ్ చెల్లదన్నారు. శ్రవణ్‌కుమార్‌ను పీటీ వారెంట్‌పై విశాఖపట్నంకు తరలించారని, బెయిల్ మంజూరు చేయకపోతే ఇలాగే రాష్ట్రమంతా తిప్పే అవకాశం ఉందని తెలిపారు.

ఈ ఏడాదీ ఆర్బీకేల్లో మిరప విత్తనం

35 కంపెనీలతో ఏపీ సీడ్స్ ఒప్పందం

గతేడాది 9 వేల ప్యాకెట్ల విత్తనం విక్రయం

ఈ ఏడాది మరింత ఎక్కువగా అందుబాటులోకి

- జర్మినేషన్ టెస్ట్, నాణ్యత పరీక్షించిన తర్వాతే ఆర్బీకేలకు
- కంపెనీలు నిర్దేశించిన ధరలకే విక్రయం
- బ్లాక్ మార్కెట్‌కు చెక్ పెట్టేందుకు టాస్క్ ఫోర్స్
- కల్తీ, నకిలీ విత్తనాలకూ అడ్డుకట్ట
- అక్రమాలకు పాల్పడే డీలర్లపై కఠిన చర్యలు
- నర్సరీ యాక్టు పరిధిలోకి షేడ్‌నెట్స్
- నాణ్యమైన విత్తనం వాడని షేడ్‌నెట్స్ లైసెన్సులు రద్దు



సాక్షి, అమరావతి : ఏపీలో ప్రధాన వాణిజ్య పంట అయిన మిరప సాగు గత నాలుగేళ్లుగా పెరుగుతోంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత విత్తు నుంచి మార్కెటింగ్ వరకు ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా నాణ్యమైన దిగుబడులు పెరిగి, మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తున్నాయి. దీంతో మిరప సాగుకు రైతులు ముందుకు వస్తుండటంతో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. గతంలో ప్రతి ఏటా మిర్చి రైతులకు బ్లాక్ మార్కెట్, అధిక ధరలు, నకిలీ విత్తనాలు, కల్తీ విత్తనాలు పెద్ద సమస్యగా ఉండేవి. రైతులను ఆర్థికంగా దెబ్బతీసేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాణ్యమైన విత్తనాలను అందించడం నుంచి పంటను అమ్ముకొనే వరకు రైతులకు అండదండగా నిలుస్తోంది. దీంతో విత్తనాలు, ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, నకిలీ, కల్తీల బారి నుంచి అన్నదాత బయటపడ్డాడు. ఈ ఖరీఫ్‌లో కూడా మిర్చి రైతులకు కల్తీ, నకిలీ విత్తనాలు, బ్లాక్ మార్కెట్ బెడద లేకుండా ఈ ఏడాది కూడా ఆర్బీకేల ద్వారా సరఫరా చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా విత్తనాల కంపెనీలతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంటోంది. డిమాండ్ ఉన్న విత్తన రకాలను మార్కెట్‌లో అందుబాటులో ఉంచుతోంది. డీలర్లు అక్రమాలకు పాల్పడకుండా టాస్క్‌ఫోర్స్ బృందాలను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.

రైతులు సాధారణంగా మేలో విత్తనాలు కొని జూన్, జూలైలో నారుపోస్తారు. సాగు విస్తీర్ణంలో 30 శాతం ఓపీ (ఓపెన్ పాలినేటెడ్), 70 శాతం హైబ్రీడ్ విత్తనం వేస్తారు. సీజన్‌లో 2.57 కిలోల ఓపీ, 35 వేల కిలోల హైబ్రీడ్ విత్తనం అవసరం. ఓపీ విత్తనానికి ఢోకా లేకున్నప్పటికీ, హైబ్రీడ్ విత్తనాల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతేడాది 9 వేల ప్యాకెట్లు ఆర్బీకేల ద్వారా రైతులకు సరఫరా చేశారు. వచ్చే ఖరీఫ్‌లో డిమాండ్ ఉన్న రకాల విత్తనాలను సీజన్‌కు ముందుగానే ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఏపీ సీడ్ యాక్టు కింద 35 విత్తన కంపెనీలతో ఏపీ సీడ్స్ ఎంవోయూ చేసుకుంది. అగ్రి ల్యాబ్స్‌లో జర్మినేషన్ టెస్ట్, నాణ్యతను పరీక్షించిన తర్వాతే ఆర్బీకేల ద్వారా కంపెనీలు నిర్దేశించిన ధరలకే రైతులకు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు.

నకిలీ విత్తనాలు, బ్లాక్ మార్కెటింగ్ నియంత్రణకు టాస్క్‌ఫోర్స్

సాగు విస్తీర్ణం పెరుగుతుండటంతో విత్తనాలకు డిమాండ్ కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కల్తీ విత్తనాలు, నకిలీ విత్తనాలు అమ్మేవారు, కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెటింగ్ ద్వారా అధిక ధరలకు విక్రయించే డీలర్లు, వ్యాపారుల ఆగడాలకు చెక్ పెట్టేందుకు టాస్క్‌ఫోర్స్ టీంలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. జిల్లాలవారీగా వ్యవసాయ, ఉద్యాన శాఖల సిబ్బందితో ఏర్పాటు చేస్తున్న ఈ బృందాలు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తాయి. ఎవరైనా కల్తీ, నకిలీ విత్తనాలు విక్రయించినా, బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటాయి. మరో వైపు నకిలీ నారు కట్టడికిపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. 50 శాతం మంది మార్కెట్‌లో కొన్న విత్తనాన్ని నారు కోసం షేడ్‌నెట్స్‌కు ఇస్తారు. మిగిలిన 50 శాతం రైతులు షేడ్‌నెట్స్ నుంచి నేరుగా నారు కొంటారు. నర్సరీలతో పాటు షేడ్‌నెట్స్‌ను కూడా నర్సరీ యాక్టు పరిధిలోకి తేవడంతో విధిగా సీడ్ రిజిస్టర్లు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. నారు అమ్మే ముందు నారుకు ఉపయోగించిన విత్తనం ఏ కంపెనీదో లాట్ నంబర్లతో సహా చెప్పాల్సి ఉంటుంది. నాణ్యమైన విత్తనం వాడలేదని తనిఖీల్లో తేలితే షేడ్‌నెట్స్ లైసెన్సులను రద్దు చేస్తారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో 5 లక్షల ఎకరాల్లో మిరప సాగవుతోంది. అత్యధికంగా పల్నాడులో 1.42 లక్షల ఎకరాలు, ప్రకాశంలో 91,347 ఎకరాలు, గుంటూరులో 67,500 ఎకరాల విస్తీర్ణంలో మిరప సాగవుతుంది. గత సీజన్‌లో గుంటూరు మిర్చి యార్డులో క్వింటాలు ధర రూ.27వేలకు పైగా, వరంగల్‌లో ఏకంగా రూ.50 వేలకు పైగా పలికింది. దీంతో ప్రభుత్వ ప్రోత్సాహంతో పత్తి, వేరుశనగ రైతులు కూడా పెద్ద ఎత్తున మిరప వైపు మళ్లుతున్నారు. 2021-22 లో రికార్డు స్థాయిలో 5.62 లక్షల ఎకరాలు, 2022-23లో 5.77 లక్షల ఎకరాల్లో మిరప సాగైంది. రానున్న ఖరీఫ్‌లో మిరప సాగు విస్తీర్ణం 6 లక్షల ఎకరాలు దాటే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

విత్తనం కొరత రానీయం

రైతులకు సరిపడా హైబ్రీడ్ మిరప విత్తనాన్ని అందుబాటులో ఉంచుతున్నాం. డిమాండ్ ఉన్న విత్తన రకాలను రైతులకు అందిస్తాం. ఎక్కడైనా డీలర్లు కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీకంటే ఎక్కువ ధరకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటాం. లైసెన్సులు కూడా రద్దు చేస్తాం. బ్లాక్ మార్కెటింగ్‌ను నియంత్రించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.

– డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్, కమిషనర్, ఉద్యాన శాఖ

ఆర్బీకేల ద్వారా విత్తనం సరఫరా

విత్తనాల కోసం 35 కంపెనీలతో ఎంవోయూ చేసుకున్నాం. సర్టిఫై చేసిన తర్వాతే ఆర్బీకేల ద్వారా సరఫరా చేస్తాం. గతేడాది 9 వేల ప్యాకెట్లు ఆర్బీకేల ద్వారా విక్రయించాం. ఈ ఏడాది కూడా డిమాండ్ ఉన్న హైబ్రీడ్ రకాలను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతాం. 29 రకాల విత్తనాలు 115 క్వింటాళ్లు అవసరమని ఉద్యాన శాఖ నుంచి ఇండెంట్ ఇచ్చింది. ఆమేరకు ఏర్పాట్లు చేస్తున్నాం.

–డాక్టర్ గెద్దం శేఖర్‌బాబు, ఎండీ, ఏపీ సీడ్స్

అధిక ధరలకు కొనొద్దు



మిరప, పత్తి విత్తనాలను ఆర్బీకేల ద్వారా సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఆత్రుతపడి అధిక ధరలకు కొనుగోలు చేయవద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రైతులకు సూచించారు. కల్తీ, నకిలీ విత్తనాలను, బ్లాక్ మార్కెట్‌ను నిరోధించేందుకు జిల్లాలవారీగా టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా మిరప, పత్తి విత్తనాలను గ్రామ స్థాయిలో ఆర్బీకేల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. విత్తనం దొరకదన్న ఆందోళన అవసరం లేదని, డిమాండ్ ఉన్న రకాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు.


– రైతులకు మంత్రి కాకాణి సూచన

'కార్తికేయ'లో అవినీతి లెక్క తేలింది

- రూ.14 కోట్లకు పైగా అవకతవకల గుర్తింపు
- దారిమళ్లిన డిపాజిట్లు రూ.9.50 కోట్లు
- బినామీ పేర్లతో నొక్కేసిన రుణాలు రూ.4.50 కోట్లు
- రాష్ట్ర ప్రభుత్వం సీరియస్.. 51 ఎంక్వైరీకి ఆదేశం



కాకినాడలోని ది కార్తికేయ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్



కోడివీరవెంకటసత్య నారాయణ, కార్తికేయ మాజీ అధ్యక్షుడు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధిక వడ్డీ ఆశచూపి డిపాజిటర్లను నిలువు దోపిడీ చేసిన కార్తికేయ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ (కేసీబీఎస్)లో కొట్టేసిన నిధుల లెక్క ప్రాథమికంగా తేలింది. కాకినాడ కేంద్రంగా నడుస్తున్న ఈ సంస్థ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు వివిధ జిల్లాల్లో వందలాది మంది వ్యాపారులు, పెన్షనర్లు, విశ్రాంత ఉద్యోగులకు అధిక వడ్డీ ఎరవేసి రూ.కోట్లలో డిపాజిట్లు సేకరించింది. గడువు (మెచ్యూరిటీ) తీరినా డిపాజిట్లను తిరిగి ఇవ్వకుండా.. వడ్డీలు కూడా చెల్లించకుండా బోర్డు తిప్పేసింది. 'కొంప'ముంచిన 'కార్తికేయ' శీర్షికన ఈ అవినీతి బాగోతాన్ని ఈ నెల 2వ తేదీ సంచికలో 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే.

తక్షణ చర్యలకు సర్కారు ఆదేశం

ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని సహకార శాఖను ఆదేశించింది. దీంతో సహకార చట్టం ప్రకారం 51 ఎంక్వైరీకి అధికారులు ఆదేశించారు. డిపాజిటర్లు ఎంతమంది ఉన్నారు, ఎంత మేరకు డిపాజిట్లు కార్తికేయ సొసైటీలో జమ య్యాయి, ఎంతమంది డిపాజిటర్ల సొమ్ములు దారి మళ్లాయనే అంశాలపై రెండు వారాలుగా సహకార అధికారులు విచారణ నిర్వహిస్తున్నారు. సహకార శాఖకు మధ్యంతర నివేదిక అందటంతో 'కార్తికేయ'లో జరిగిన అవినీతి కుంభకోణం ప్రాథమికంగా లెక్క తేలింది. ఇంతవరకు కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి సహా పలు జిల్లాల నుంచి 260 మంది డిపాజిటర్లు కాకినాడ వచ్చి కార్తికేయ సొసైటీలో తమ సొమ్ము జమ అయ్యిందా లేదా అని సరిచూసుకున్నారు. ఇంత వరకు అందిన సమాచారం మేరకు సొసైటీలో మొత్తం డిపాజిట్లు రూ.15.75 కోట్లు ఉన్నాయి. వీటిలో రూ.9.50 కోట్లు అసలు కార్తికేయ సొసైటీలో జమ కాలేదు. సొసైటీ నుంచి రూ.4.50 కోట్లు రుణాలు ఇచ్చినట్టు రికార్డులలో ఉండగా.. ఇందుకు సంబంధించి సొసైటీలో ఎటువంటి డాక్యుమెంట్లు, హామీ పత్రాలు లేకపోవడాన్ని విచారణలో గుర్తించారు. బినామీ పేర్లతో రూ.4.50 కోట్లు స్వాహా అయ్యాయనే అంచనాకు సహకార శాఖ వచ్చింది. డిపాజిట్లు సొసైటీలో జమ చేయకుండా పక్కదోవ పట్టించడం, ఎటువంటి హామీ పత్రాలు లేకుండా బినామీ పేర్లతో రుణాలు నొక్కేయడం ద్వారా మొత్తం రూ.14 కోట్ల 66 లక్షల 41 వేల 716 మేర అవకతవకలు జరిగినట్టు మధ్యంతర నివేదికలో తేల్చారు. ఈ విచారణ వచ్చే నెల 17వ తేదీ వరకు కొనసాగించి నెలాఖరు నాటికి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి.



కార్తికేయ సొసైటీకి జారీ చేసిన అటాచ్‌మెంట్ నోటీసు


ఆస్తుల అటాచ్‌మెంట్‌కు నోటీసులు

మధ్యంతర నివేదిక ఆధారంగా సహకార శాఖ అధికారులు కార్తికేయ సొసైటీపై చర్యలకు ఉపక్రమించారు. సొసైటీ పేరుతో కాకినాడలో వివిధ ప్రాంతాల్లో ఉన్న రూ.10 కోట్ల విలువైన ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సోమవారం నోటీసులు జారీ అయ్యాయి. కాకినాడ జిల్లా సహకార అధికారి ఆర్.దుర్గాప్రసాద్ ఆదేశాలతో కో–ఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ బీకే దుర్గాప్రసాద్ పేరుతో కార్తికేయ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ, సొసైటీ మాజీ అధ్యక్షుడు కోడి వీరవెంకట సత్యనారాయణ పేరిట నోటీసులు జారీ అయ్యాయి. వీటిని తీసుకునేందుకు సంబంధిత వ్యక్తులెవరూ ముందుకు రాకపోవడంతో సొసైటీ ప్రధాన కార్యాలయ గోడకు అతికించారు.

వచ్చే నెలాఖరు నాటికి విచారణ పూర్తి చేస్తాం

కార్తికేయలో అవకతవకలకు సంబంధించి సమగ్ర విచారణను వచ్చే నెలాఖరుకల్లా పూర్తి చేస్తాం. నివేదిక అనంతరం సహకార చట్టాలను అనుసరించి చర్యలు ఉంటాయి. డిపాజిటర్లకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తాం.

– దుర్గాప్రసాద్, జిల్లా సహకార అధికారి కాకినాడ



అయ్యో....

మొద్దుబారుతున్న మెదడు

పెరుగుతున్న మతిమరుపురాయుళ్లు

స్మార్ట్‌ఫోన్ వినియోగంతో అధికమౌతున్న సమస్య

జీవనశైలి మార్పుతోనే సమస్యకు పరిష్కారం

పుస్తకపఠనం మేలంటున్న నిపుణులు

మరిచిపోయా..!

విశాఖ విద్య: అయ్యో...మరిచిపోయా.. ప్రతీ ఒక్కరి నోట ఏదో ఒక సమయంలో వినే మాటే ఇది. కానీ ఇదే తరచూ రిపీట్ అవుతుంటే మాత్రం కాస్తా జాగ్రత్త పడాల్సిందేనండోయ్. నేటి ఉరుకులపరుగుల జీవితంలో చిన్నా, పెద్దా తేడా లేకుండా చాలా మంది మతిమరుపు సమస్యతో బాధపడుతున్నారు. రోజు రోజుకు మతిమరుపు రాయుళ్లు ఎక్కువైపోతున్నారు. ఇది ఆందోళన కలిగించే అంశమేనని వైద్య నిపుణులు అంటున్నారు. వంట పనిపూర్తి చేసి గ్యాస్ కట్ చేయడం దగ్గర నుంచి, ఆఫీసుకు వెళ్లే సమయంలో ఇంట్లో మొబైల్ మర్చిపోవడం, జేబులో పర్స్ పెట్టుకోకపోవడం, ఏదో షాపు దగ్గర సామాన్లు కొనుగోలు చేసేటప్పుడు అది గుర్తుకురావడం ఇలా తరచూ జరుగుతుంటే మతిమరుపు (అల్జీమర్) మొదలైందన్నమాటే. గతంలో వృద్ధాప్యంలో మతిమరుపు, దృష్టిలోపం వంటివి ప్రధాన ఆరోగ్య సమస్యలుగా ఉండేవి. కానీ ప్రస్తుతం విద్యార్థులు, యువత సైతం నిండా ముప్పై ఏళ్లు నిండకముందే ఇటువంటి సమస్యలతో సతమతమౌతుండటం ఆందోళన కలిగిస్తోంది.

'స్మార్ట్'గా చిక్కులు

ప్రతీ విషయానికి స్మార్ట్‌ఫోన్, ఇంటర్‌నెట్‌పై ఆధారపడటం, పని ఒత్తిడితో సతమతమౌతుండటం వల్లనే మానసిక సమస్యలకు దగ్గరౌతున్నారు. చదువుల్లో రాణిస్తున్న విద్యార్థులు సైతం స్మార్ట్ ఫోన్‌కు ఎక్కువ సమయం వినియోగిస్తుండటంతో క్రమేపీ జ్ఞాపకశక్తి కోల్పోతున్నారు. విశాఖ పట్నంలోని మానసిక, న్యూరోసర్జన్ వంటి నిపుణుల వద్దకు 20 శాతం పైగా ప్రస్తుతం ఇలాంటి కేసులే వస్తున్నాయని పరిశోధనల్లో తేలింది.

జీవనశైలి మారాల్సిందే

తొలిదశలోనే మతిమరుపుకు చెక్ పెట్టకపోతే అది అనేక సమస్యలకు దారితీస్తోందని వైద్య నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. జీవన శైలిలో మార్పులు ద్వారానే మతిమరుపు నుంచి బయట పడవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఆయుష్మాన్ భారత్' పేరిట పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాయి. దీనిలో భాగంగానే ధ్యానం, యోగా, ప్రాణామాయం వంటి సహజసిద్ధ వ్యాయామపద్ధతులకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా ప్రభుత్వ సహకారంతో వివిధ సంస్థలు పనిచేస్తున్నాయి.

మెదడుకు తగినంత పనిఉండాలి

స్మార్ట్ ఫోన్‌లు వచ్చిన తరువాత మెదడుకు పని చెప్పడం లేదు. అంతా ఫోన్‌పైనే అధారపడుతున్నారు. ఈ కారణంగా మెదడు మొద్దుబారిపోతుంది. మానసిక ఒత్తిడి కూడా పెరుగుతుంది. గతంలో జ్ఞాపక శక్తి వల్లనే అనేక పనులు చక్కదిద్దుకునేవాళ్లం. అందుకే మెదడుకు పనిచెప్పే చదరంగం, క్యారమ్స్ ఆడటం, ఫజిల్ నింపడంపై ఆసక్తి పెంచుకోవాలి.

–డాక్టర్ బీ.రమేష్‌బాబు, మానసిక వ్యాధి నిపుణులు, విశాఖ

పిల్లలను ఆటలవైపు మళ్లించాలి

స్మార్ట్ ఫోన్‌కు పిల్లలకు కూడా బానిసలవుతున్నారు. చదువులు కూడా పక్కన పెట్టి ఆండ్రాయిడ్ ఫోన్‌లతో ఆటలాడుకుంటున్నారు. ఇది వారి మెదడుపై ఒత్తిడి పెంచుతోంది. ఈ కారణంగా మెదడు మొద్దుబారుతోంది. జ్ఞాపక శక్తి క్రమేపీ కోల్పోతున్నారు. పిల్లలకు చదువులతో పాటు రోజులో కొద్దిసేపైనా ఆడుకునేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి.

– డాక్టర్ జీ.సీతారాం, ఎస్‌సీపీసీఆర్ సభ్యుడు, విశాఖ

లైంగిక దాడి కేసులో ఇద్దరికి యావజ్జీవ శిక్ష

బాధితురాలికి నష్టపరిహారంగా రూ.7 లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశం

గుంటూరు లీగల్: బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి, అతనికి సహకరించిన మహిళకు పోక్సో కోర్టు న్యాయమూర్తి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల మేరకు.. బాధితురాలికి(16) తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నప్పటి నుంచి శారదా కాలనీలో నివాసం ఉంటున్న తాతయ్య దగ్గర ఉంటోంది. తాతయ్యతో కలిసి మిరప కోతకు, కూలి పనులకు వెళ్తూ ఉండేది. శారదకాలనీకి చెందిన కడియం కోటేశ్వరి బాధితురాలి తాతయ్య దగ్గరకు వచ్చి తాను లారీలోని మామిడి కాయలను షాపులకు దించే కూలీలకు మేస్త్రీగా వ్యవహరిస్తున్నానని చెప్పింది. అంతేకాకుండా బాధితురాలిని తన వద్దకు కూలి పనులకు పంపమని కోరింది. దీనికి బాధితురాలి తాతయ్య అంగీకరించాడు. లాలాపేటలోని మేదర బజార్‌లో మామిడి కాయలు దించే కూలి పనులకు కోటేశ్వరితో కలిసి బాధితురాలు వెళ్లేది. ఈ క్రమంలో కోటేశ్వరితో బాగా పరిచయం ఉన్న మామిడి కాయల వ్యాపారి బత్తుల అర్జున్‌రావు అలియాస్ అర్జున్ బాధితురాలిపై కన్నేశాడు. బాధితురాలిని తన వద్దకు పంపితే రూ.500 ఇస్తానని కోటేశ్వరికి చెప్పాడు. దీంతో కోటేశ్వరి బాధితురాలిని ఒత్తిడి చేయడం ప్రారంభించింది. అర్జున్‌తో గడపాలని బెదిరించింది. దీనికి బాధితురాలు తిరస్కరించింది. దీంతో ఓ రోజు అర్జున్ బాధితురాలిని అకస్మాత్తుగా గట్టిగా పట్టుకుని మామిడి కాయలు నిల్వ చేసే షాప్‌లోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు.. దీనికి కోటేశ్వరి కూడా సహకరించింది. వారి బెదిరింపులకు భయపడిన బాధితురాలు ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. 2017 మే 15న బాధితురాలికి జ్వరం రావడంతో స్థానిక ఆర్‌ఎంపీకి చూపించగా ఆమె గర్భవతి అని తేలింది. దీంతో బాధితురాలు జరిగిన విషయాన్ని తమ బంధువులకు చెప్పగా వారు లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి డీఎస్పీ బి.సీతారామయ్య దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నిందితులు బత్తుల అర్జున్‌రావు, కడియం కోటేశ్వరిపై సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు పైవిధంగా తీర్పు చెప్పారు. బాధితురాలికి నష్టపరిహారంగా రూ.7 లక్షలు చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ శ్యామల కేసు వాదించారు.

గండాలు దాటిన 'బొండాలు'

- ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ మంతనాలు
- ఈరకం ధాన్యం కొనుగోలుకు ఓకే
- కేరళతో కుదుర్చుకున్న ఒప్పందం
- అదేబాటలో ముందుకొచ్చిన ఎఫ్‌సీఐ



వాడపాలెంలో బాగా పండిన వరి చేను

సాక్షిప్రతినిధి,కాకినాడ: ముతక రకంగా ముద్రపడిన బొండాలు ధాన్యం కొనుగోలుపై సందిగ్ధత తొలగిపోయింది. రైతు పక్షాన రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవ ఫలించింది. ఈ రబీలో సాగుచేసిన బొండాలు రకం కొనుగోలుకు ఎఫ్‌సీఐ ఎట్టకేలకు అంగీకరించింది. వాస్తవానికి కొన్నేళ్లుగా బొండాలకు తమిళనాడు, కేరళ, ఒడిశా తదితర రాష్ట్రాల్లో డిమాండ్ కొరవడింది. దీంతో రైతులు నష్టపోతూ వస్తున్నారు. పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసినా సరిగా సొమ్ము చేతికందేది కాదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతంలో 2.1 లక్షల ఎకరాల్లో బొండాలు సాగుచేసేవారు. ఈ రకానికి పొరుగు రాష్ట్రాల్లో డిమాండ్ తగ్గిందని గ్రహించిన రైతులు ఐదేళ్లుగా సాగు తగ్గిస్తూ వచ్చారు. వీరి ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం గమనించి బొండాలు సాగుతో నష్టపోవద్దని వ్యవసాయశాఖ ద్వారా అవగాహన కల్పిస్తోంది. అయినా కొంతమంది కాస్త ధర ఎక్కువగా ఉంటుందనే కారణంతో ఈరకం సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఈ రబీ సీజన్‌లో కూడా వద్దువద్దంటున్నా కొందరు ఎక్కువ విస్తీర్ణంలోనే సాగు చేశారు.

కేంద్రం పచ్చజెండా

బొండాలు రకం సాగుతో నష్టాల బాటపట్టిన రైతుల విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా వ్యవహరించారు. పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ రబీలో బొండాలు సాగుచేసిన రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇటీవల పలు దఫాలు కేరళ పౌరసరఫరాల ప్రతినిధి బృందంతో కూడా చర్చలు జరిపారు. ఫలితంగా బొండాలు రకం కొనుగోలుకు అంగీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మరో అడుగు ముందుకేసింది. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది. అన్ని స్థాయిల్లో ఒత్తిడి తెచ్చింది. ఎఫ్‌సీఐ ద్వారా కూడా కొనుగోలుకు ఒప్పించగలిగింది. ఈ రకం కొనుగోలుకు బుధవారం కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచింది. పౌరసరఫరాల శాఖ ద్వారా రబీలో ఈ ధాన్యాన్ని కనీస మద్దతు ధరకే కొనుగోలు చేయనుంది. ఈ పరిణామంపై రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

పోటాపోటీ సాగు

రాష్ట్రంలో రబీ సీజన్‌లో బొండాలు రకం అత్యధికంగా సాగు చేసిన జిల్లాలో ఉమ్మడి తూర్పుగోదావరి మొదటి వరుసలో ఉంది. గతంలో కేరళ ప్రజలు ఎంతో ఇష్టంగా ఈ బియ్యాన్ని తినేవారు.దీంతో అక్కడి మార్కెట్‌లో మంచి ధర వచ్చేది. దిగుబడికి దీటుగా లాభాలు రావడంతో ఒకరిని చూసి ఒకరు బొండాలు సాగుకు పోటీపడ్డారు. రానురాను కేరళ సివిల్ సప్లయిస్ కోట్లాది రూపాయలు బకాయిల భారం పడింది. దీంతో బొండాలు కొనుగోలుకు మిల్లర్లు ఆసక్తి చూపడం తగ్గించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు అయినకాడికి అమ్ముకునేవారు. కనీస మద్దతు ధర లభించక వరుస నష్టాలను చవిచేసేవారు.

ముందుకు వచ్చిన కేరళ

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న చొరవ ఫలితంగా ఎఫ్‌సీఐతో పాటు ఈ ధాన్యం దిగుమతికి కేరళ ముందుకు వచ్చింది. ఈ రెండూ అంశాలూ కలిసొచ్చాయి. ఈ రబీ సీజన్‌లో తూర్పుడెల్టాలోని మండపేట, రామచంద్రపురం, అనపర్తి, కడియం నియోజకవర్గాలు, సెంట్రల్ డెల్టాలోని అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, పి గన్నవరం, కాకినాడ జిల్లాలో పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ రూరల్ తదితర నియోజకవర్గాల్లో బొండాలు సాగు చేశారు. ఈ సారి రబీ సీజన్‌లో కాకినాడ జిల్లాలో సైతం బొండాలు కూడా సాగు చేయడం విశేషం. కొద్దిరోజులుగా ధాన్యం కొనుగోలుపై ఏర్పడిన దిగులు తొలగిపోయిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన అడుగుల ఫలితంగా మార్గం సుగమమైందంటున్నాయి.

కోనసీమ జిల్లాలో..

సాగు విస్తీర్ణం	:1.72 లక్షల ఎకరాలు
బొండాలు సాగు	: 85,500 ఎకరాలు
బొండాలు దిగుబడి	: 3.08 లక్షల మెట్రిక్‌టన్నులు

కాకినాడ జిల్లాలో...

సాగు విస్తీర్ణం	:1.62లక్షల ఎకరాలు
బొండాలు సాగు	: 87,601 ఎకరాలు
బొండాలు దిగుబడి	: 2.60లక్షల మెట్రిక్‌టన్నులు

తూర్పుగోదావరి జిల్లా...

సాగు విస్తీర్ణం	: 1.79 లక్షల ఎకరాలు
బొండాలు సాగు	: 22 వేల ఎకరాలు
బొండాలు దిగుబడి	: 76 వేల మెట్రిక్‌టన్నులు

గిట్టుబాటు ధర

పదెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. మద్దతు ధర కష్టమని.. బొండాలు మినహా ఇతర రకాలు పండించాలని వ్యవసాయ అధికారులు చెప్పారు. సన్నాలు వంటి ఇతర రకాలు సరిగ్గా పండవు, విరిగిపోతాయి. ఈ కారణంతో ఎంటీయూ –3626 (బొండాలు) రకం పండించాను. ఎకరాకు 50 బస్తాలు పైబడి దిగుబడి వస్తుందని లెక్కలేసుకున్నాను. పౌరసరఫరాలశాఖ కొనుగోలు చేయకపోతే చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఈ విషయంలో ప్రభుత్వం ముందుకు రావడం సంతోషంగా ఉంది. కనీస మద్దతు ధరతో అదనపు ఆదాయం వస్తుంది.

–గనిశెట్టి నాగేశ్వరరావు, వాడపాలెం, కొత్తపేట మండలం



మిల్లెట్ సాగులో రైతు మహిళలు

పండించారు... వడ్డించారు!

ఒక చేత్తో నాగలి... ఇంకో చేత్తో గరిట!

రైతుకు కొత్త నిర్వచనం కావాలి.
వ్యవసాయానికి కొత్త అర్థం చెప్పాలి.
మహిళ సాగు చేస్తే నేల పులకిస్తుంది.
గాజుల చేతిలో గరిటే కాదు...
నాగలి కూడా గర్వంగా చాలుదీరుతుంది.
అనంతపురంలో మహిళలు 'ఆదర్శసాగు' చేస్తున్నారు.
ఆరోగ్యం కోసం ఏం తినాలో ఎలా తినాలో నేర్పిస్తున్నారు.

దేశానికి పట్టుగొమ్మలు గ్రామాలు. వినడానికి బావుంటుంది. దేశానికి కంచంలో అన్నంగా మారేది గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలే... కాబట్టి గ్రామానికి, రైతుకి అంతటి గుర్తింపు వచ్చింది. మరి అదే పొలం రైతుకి సమాధి అవుతుంటే వ్యవసాయం బతికి బట్టకట్టేదెలా? నాగలి కర్రు రైతు గుండెను చీలుస్తుంటే భూమిలో బంగారం పండేదెప్పుడు? రైతు వాణిజ్య పంటల మాయలో పడి అప్పుల పాలైతే ఆ రైతుని, ఎరువులతో కలుషితమైన ఆ భూమిని కాపాడేదెవరు? పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలనే కసితో రైతు మహిళలు ఆ పనిని చేపట్టారు. భర్తను మింగేసిన పంటపొలాల్లోనే భవితను వెతుక్కుంటున్నారు. సంఘటితంగా వ్యవసాయం చేస్తూ దిగుబడితో లాభాలు కళ్ల చూస్తున్నారు. ఇది అనంతపురంలోని మహిళలు సాధించిన విజయం. వాళ్లకు దారి చూపిన భానుజ సంకల్పం.

అనంతపురం జిల్లా, రూరల్ మండలం, కురుగుంట్ల గ్రామం. ఒకప్పుడు రైతుల ఆత్మహత్యలను చూసిన గ్రామం. ఇప్పుడు ఆ రైతు కుటుంబాల మహిళలు నిర్వహిస్తున్న రెస్టారెంట్‌ను చూస్తోంది. ఆ రెస్టారెంట్‌లో వంటకు అవసరమైన ధాన్యాలను పండిస్తున్న వ్యవసాయ క్షేత్రాలను చూస్తున్నారు. ఈ విజయాన్ని 'చెరువు భానుజ'... సాక్షితో పంచుకున్నారు.

'ఒంటరి' పోరాటం!

''భర్త వాణిజ్య పంటలతో నష్టాల ఊబిలో కూరుకుపోయి, అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటే... అగమ్యగోచరంగా, అచేతనంగా మిగిలిన వాళ్లకు అండగా నిలిచాను. సింగిల్ పేరెంట్‌గా పిల్లల పోషణ బాధ్యతను మోస్తున్న మహిళలే వీరంతా. భర్తను కోల్పోయిన వాళ్లకు తక్షణ సహాయం చేస్తూ, ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయం కోసం కార్యాలయాలకు వెళ్లి పని చేయించడం వరకు తోడుగా ఉంటున్నాను.



● చెరువు భానుజ

అంతటితో ఆ కుటుంబం గట్టెక్కదు. ఉపాధి కావాలి, వాళ్లకు వచ్చిన పని వ్యవసాయమే. అయితే పొలం లేదు. దాంతో కలెక్టివ్ ఫార్మింగ్ కోసం పొలం లీజుకు తీసుకున్నాం. వ్యవసాయ క్షేత్రాలకు 'పుడమి తల్లి, మన భూమి' అని పేర్లు పెట్టుకుని సేద్యం మొదలు పెట్టాం. తక్కువ ఖర్చుతో పంట చేతికి రావడానికి మిల్లెట్స్ సాగు, ఏడాది పొడవుగా రాబడి కోసం కూరగాయలు, పండ్లు సాగు చేస్తున్నాం. మా ప్రయాణంలో అసలైన టర్నింగ్ పాయింట్ ఇక్కడే. పంటతో ఆపేయకుండా వంట కూడా మొదలుపెట్టాం.



● మిల్లెట్ రెస్టారెంట్ నిర్వహణలో మహిళలు

మార్కెట్ పుట్టింది!

హరిత విప్లవంతో మనదైన సాగు కనుమరుగైంది. మిల్లెట్స్ సాగు మర్చిపోయాం. విత్తనాలు అంతరించే దశకు చేరుకున్నాయి. ఇక ఈ వంటల గురించి ఈ తరానికి తెలియనే తెలియదు. ప్రభుత్వ సంస్థల సహకారంతో విత్తనాలు సేకరించాను. సేద్యం తెలిసిన మహిళలు కావడంతో సాగులో పెద్దగా ఇబ్బందులు రాలేదు. కానీ వీటిని ఎలా వండాలో నేర్పించడానికి మాస్టర్ షెఫ్‌లతో శిక్షణ ఇప్పించి మరీ కురుకుంట్లలో రెస్టారెంట్ పెట్టాం. రెస్టారెంట్ పెట్టడానికి ముందు ఆ ఊరిని డయాబెటిక్ ఫ్రీ విలేజ్‌గా మార్చాలనే సంకల్పంతో ఉచితంగా వండిపెట్టాం. డైటీషియన్‌లు సూచించినట్లు చిరుధాన్యాల వంటలను మూడు పూటలా తినాల్సిన మెనూను వండి వడ్డించాం. నాలుగవ వారానికి షుగర్ లెవెల్స్ అదుపులోకి రావడాన్ని స్వయంగా తెలుసుకున్నారు పేషెంట్‌లు. మిల్లెట్స్ పట్ల గ్రామస్థుల్లో అవగాహన కోసం చేసిన ప్రయత్నం అది. అయితే ఆ భోజనం తిన్న వాళ్లు, తెలిసిన వాళ్లు రెస్టారెంట్ పెట్టమని సూచించారు. మా మహిళలు కూడా ఉత్సాహంగా ముందుకొచ్చారు. అలా రెండు నెలల కిందట 'పుడమి తల్లి మిల్లెట్ హోటల్' ప్రారంభమైంది. 'ఆర్థిక భద్రత, ఆహార భద్రత, ఆరోగ్య భద్రత' మా ట్యాగ్‌లైన్. ఊహించనంత గొప్ప స్పందన వచ్చింది. ఆఫీసర్‌లు కూడా వచ్చి భోజనం చేస్తున్నారు. హోటల్ అనేక ప్రదేశాల్లో శాఖలు తెరవమని అడుగుతున్నారు. కానీ అది ఇప్పట్లో సాధ్యం కాదు. ఎందుకంటే హోటల్ మరో శాఖ ప్రారంభం కావాలంటే అందుకు తగిన వ్యవసాయ క్షేత్రాన్ని విస్తరించాలి. ఇప్పుడు మేము సాగు చేస్తున్న పొలంలో సహజమైన సేంద్రియ పద్ధతుల్లో పండినవే మా రెస్టారెంట్‌లో వండుతున్నాం. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ నాలుగు శాఖల్లో మొత్తం 1800 మంది రైతుమహిళలు మాతో సంఘటితమై ఉన్నారు. వారందరికీ ఉపాధిమార్గాల అన్వేషణ కోసం విస్తృతంగా పని చేయాల్సి ఉంది.

వెలుగు పుట్టింది!

'సూర్యోదయం అవుతున్నప్పుడు పుట్టింది, ఇంటికి వెలుగు తెస్తుంద'ని... మా నాన్న నాకు భానుజ అని పేరు పెట్టారు. మాది అనంతపురం జిల్లా, నల్లమాడ మండలం, బడవాండ్ల పల్లి. నాన్న చదువుకున్నది తక్కువే, కానీ కమ్యూనిస్ట్ నేపథ్యంలో చాలా నేర్చుకున్నారాయన. పాటలు రాసి పాడేవారు. చిన్నప్పుడు నాన్నతో సమావేశాలకు వెళ్లేదాన్ని. ఆ జ్ఞానమే నన్ను ఇలా తీర్చిదిద్దింది. సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చదువుకుంటున్నప్పుడు, సందర్శనకు వచ్చిన అధికారులకు మా హాస్టల్‌లో వసతులలేమిని చెప్పే ధైర్యం ఉండేది. టెన్త్ చదువుతూనే యంగ్ ఇండియా సంస్థలో వాలంటీర్‌గా పని చేశాను. అమ్మ పట్టుపట్టి ఇంటర్‌లో చదువాపించి మరీ పెళ్లి చేసింది. కానీ నేను గృహిణిగా ఇంటికే పరిమితం కాకుండా సామాజిక కార్యకర్తనయ్యాను. మహిళలు, పిల్లలు, దళితుల ఉన్నతి కోసం పని చేయాలనే ఉద్దేశంతో 1996లో రెడ్స్ స్థాపించాను. ట్రాఫికింగ్‌కి గురైన మహిళలను కాపాడడం నుంచి, డ్వాక్రా సంఘాల ఏర్పాటు, ఉమ్మడి అటవీ సంరక్షణ వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పని చేశాను. మహిళల అక్రమ రవాణాకు పాల్పడిన ఏజెంట్‌లు కదిరిలో నా ఇంటిని కాల్చేశారు. దాంతో నా నివాసం అనంతపూర్ పట్టణానికి మారింది'' అని తన సమాజ సేవాయాత్రను వివరించారు భానుజ.

– వాకా మంజులారెడ్డి

న్యూస్‌మేకర్



రెండు రోజుల క్రితం 'మిస్ ఇండియా 2023' ఫైనల్స్ జరిగాయి. రాజస్థాన్ సుందరి నందిని గుప్తా విజేత. ఢిల్లీకి చెందిన శ్రేయా పూజా ఫస్ట్ రన్నరప్. కాని మణిపూర్ అమ్మాయి స్టెర్లా లువాంగ్ సెకండ్ రన్నరప్‌గా అందరి దృష్టిని ఆకర్షించింది. మణిపూర్ నుంచి మిస్ ఇండియా ఫైనల్స్ వరకూ చేరిన వారు ఇప్పటి దాకా లేరు. అదీగాక టీనేజ్‌లో మూర్ఛవ్యాధి వల్ల తీవ్రంగా బాధ పడిన స్టెర్లా తన అందాల కల కోసం ఆ వ్యాధితో పోరాడి గెలిచింది. స్ఫూర్తిగా నిలిచింది.

మూర్ఛ నుంచి మిస్ ఇండియా వరకు



'అది నా భవిష్యత్తుకు అడ్డంకి అనుకోలేదు. ఒక ఆశీర్వాదం అనుకున్నాను' అంది టీనేజ్‌లో మూర్ఛ వ్యాధి బారిన పడ్డ స్టెర్లా. 'అడ్డంకులు వస్తేనే కదా మనం పోరాడి మరింత శక్తిమంతులం అయ్యేది' అందామె.

ఇప్పుడు స్టెర్లా మణిపూర్‌లో క్షణం తీరిక లేకుండా జనం అభిమానంతో ఇస్తున్న విందుల్లో పాల్గొంటోంది. సీఎం ఆమెను ఆహ్వానించి ప్రభుత్వ పెద్దలతో కలిసి డిన్నర్ ఇచ్చాడు. కారణం మణిపూర్‌లాంటి అతి చిన్న రాష్ట్రం నుంచి మొదటిసారి 'మిస్ ఇండియా' పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో ఒకరుగా ఆమె నిలవడం. ఏప్రిల్ 15న ఇంఫాల్‌లో జరిగిన 'మిస్ ఇండియా 2023' ఫైనల్స్‌లో 28 రాష్ట్రాలు 2 కేంద్ర ప్రాంతాల నుంచి 30 మంది పోటీ పడితే వారితో తలపడి మూడో స్థానంలో నిలిచింది స్టెర్లా. అయితే ఈ విజయం అంత ఈజీగా రాలేదు. మానసికంగా ఆరోగ్యపరంగా ఆమె చాలా పోరాటం చేయాల్సి వచ్చింది.

వెక్కిరింతలు తట్టుకుని

14 ఏళ్ల వయసులో స్టెర్లాకు మిస్ ఇండియా కావాలన్న లక్ష్యం ఏర్పడింది. కాని ఈశాన్య రాష్ట్రాల నుంచి ఎవరూ అలాంటి కలను కనరు. ఇంకా చెప్పాలంటే 'నిర్వచనాల ప్రకారం ఉండే ముక్కు, రూపు' వారికి లేవన్న భావన వారిలో బలంగా ప్రవేశపెట్టి చాలా కాలం అవుతోంది. అందుకే అందరూ ఏడ్పించేవారు స్టెల్లాను. అది వొత్తిడిగా మారి ఆ తర్వాత నరాల జబ్బుగా పరిణమించింది. తరచూ మూర్ఛలు వచ్చేవి. ఒక్కోసారి మంచానికి అతుక్కు పోయేదాన్ని. అలాంటి స్థితిలో కూడా ఇదంతా దాటుతాను... నాకో అందమైన భవిష్యత్తు ఉంటుంది అని గట్టిగా అనుకునేదాన్ని. అదే నిజమైంది. ఇవాళ నా జబ్బును జయించాను. ఆత్మవిశ్వాసం పెంచుకున్నాను' అంటుందామె.

క్యాబిన్ క్రూగా పని చేసి

బిజినెస్ స్టడీస్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కొనసాగిస్తూనే మోడల్‌గా పని చేస్తోంది స్టెల్లా. కొంతకాలం ఒక ఎయిర్ లైన్స్ సంస్థలో క్యాబిన్ క్రూగా చేసింది. 'ఇంతకు ముందు అందం నిర్వచనం వేరే ఉండేది. ఇప్పుడు సహజ రూపాలను కూడా అందంగా చూస్తున్నారు. అందుకే నేను టాప్ 3గా నిలిచానని అనుకుంటున్నాను.' అంది స్టెల్లా.

రంజాన్ స్పెషల్ రెసిపీ

పత్థర్ కా గోష్

కావలసినవి: మటన్ (బోన్‌లెస్)– అరకేజీ ; నిమ్మకాయ – 1 ; ఉప్పు – ఒకటిన్నర టీ స్పూన్‌లు ; అల్లంవెల్లుల్లి పేస్ట్ – టేబుల్ స్పూన్ ; నూనె– టేబుల్ స్పూన్.

గరం మసాలా కోసం: దాల్చిన చెక్క – 2 అంగుళాలు ; నల్ల యాలకులు– 2 ; నక్షత్ర లవంగం – 1 ; మిరియాలు– ఒకటిన్నర టీ స్పూన్‌లు; ధనియాలు– టీ స్పూన్ ; షాజీరా– టీ స్పూన్.



తయారీ: ● మటన్ ముక్కలను శుభ్రంగా కడిగిన తరవాత ఒక్కొక్క ముక్కను చిన్న రోట్లో లేదా కటింగ్ బోర్డు మీద వేసి పూర్తిగా ముద్ద యిపోకుండా రెండు–మూడు సార్లు దంచి తీయాలి. ఇలా ముక్కలన్నింటినీ చేయాలి. ముక్క కొద్దిగా వదులైతే మసాలా బాగా పడుతుంది. ఆ ముక్కల్లో అల్లం వెల్లుల్లి పేస్ట్, నిమ్మ రసం, ఉప్పు వేసి కలిపి ఓ గంట సేపు ఉంచాలి. ● గరం మసాలా కోసం తీసుకున్న దినుసులను పెనంలో నూనెలేకుండా దోరగా వేయించి, చల్లారిన తరవాత మిక్సీలో పొడి చేయాలి. ● ఓ గంట తర్వాత అల్లం వెల్లుల్లి మిక్స్‌లో నుంచి ఒక్కొక్క ముక్కను తీసి మరొక పాత్రలో వేయాలి. ఆ ముక్కల్లో ఇప్పుడు గరం మసాలా పొడి వేసి సమంగా పట్టేటట్లు కలిపి పైన ఒక స్పూన్ నూనె వేసి రెండు గంటల సేపు నానవ్వాలి. ● ఇప్పుడు మందపాటి పెనానికి నూనె రాసి మటన్ ముక్కలను మీడియం మంట మీద కాల్చాలి. రెండు వైపులా కాలిన తరవాత వేడిగా సర్వ్ చేయాలి. పత్థర్ కా గోష్ ఉల్లిపాయ, నిమ్మకాయ ముక్కలతో కలిపి తింటే బాగుంటుంది. ● రెస్టారెంట్‌లో వీటి కోసం పెద్ద రాయి ఉంటుంది. రాతిమీద కాలుస్తారు కాబట్టి పత్థర్ కా గోష్ అనే పేరు వచ్చింది. ఇంట్లో మందపాటి ఇనుప పెనం మీద చేసుకోవచ్చు.



● పెద్ద గొడుగు నీడన మిరప కాయలు కోస్తున్న దృశ్యం

పొలంలో కూలీలకు పెద్ద గొడుగు!

- మండే ఎండ నుంచి రైతులు, వ్యవసాయ కార్మికులకు ఊరట
- పది మంది కూలీలకు నీడనిచ్చే 'సామూహిక గొడుగు'ను రూపొందించిన గ్రామీణ ఆవిష్కర్త
- రూ. 5 వేల ఖర్చుతో ఎవరైనా సులభంగా తయారు చేసుకోవచ్చు


పొలాల్లో లేదా ఆరుబయట పనులు చేసుకునే వారికి మండే ఎండ పెద్ద ఇబ్బంది కలిస్తుంటుంది. ముఖ్యంగా మిరప, పత్తి, కూరగాయలు తదితర ఆరుతడి పంటల్లో వ్యవసాయ పనులు చేసే కూలీలకు, రైతులకు ఎండ పెద్ద సమస్యగా ఉంటుంది. వేసవి వచ్చిందంటే రైతులు, వ్యవసాయ కూలీల పాట్లు, ముఖ్యంగా మహిళా కూలీల పాట్లు వర్ణించనలవి కాదు. మిట్ట మధ్యాహ్నం ఎండకు తట్టుకోలేక 2–3 గంటల సేపు పనులకు విరామం ఇచ్చి చెట్లు, షెడ్ల కింద సేదదీరాల్సిన పరిస్థితులు వచ్చాయి. కూలీల అవసరం ఎక్కువగా ఉండే మిరప, పత్తి, కూరగాయ తోటల్లో ఎండాకాలంలో సకాలంలో పనులు పూర్తికావటం లేదు. రైతులు, రైతు కూలీల ఎండ కష్టాలను తీర్చడానికి ఓ గ్రామీణ మోటారు మెకానిక్ చక్కటి ఆలోచన చేసి శభాష్ అనిపించుకుంటున్నారు. ఈ అద్భుత ఆవిష్కరణను అందించిన సృజనశీలి పేరు రేపల్లె షణ్ముగరావు. ఊరు కంబాలపల్లి. జిల్లా మహబూబాబాద్.

పొలంలో పక్కపక్కన సాళ్లలో పది మంది పనులు చేసుకోవడానికి సరిపోయేంత నీడనిచ్చే చక్రాలతో కూడిన 'సామూహిక గొడుగు'ను రూపొందించారు. 20 అడుగుల వెడల్పున 6 అడుగుల మేరకు నీడనిస్తుంది. 7 అడుగుల ఎత్తు ఉంటుంది. అవసరం మేరకు ముందుకు జరుపుకోవడానికి 4 చక్రాలను అమర్చారు. 6 అడుగులు నీడ పడే స్థలంలో పని పూర్తి చేసుకున్న తర్వాత ముందుకు తోస్తే గొడుగు సులభంగా ముందుకు జరుగుతుంది. ఆ విధంగా నీడలోనే వ్యవసాయ పనులు చేసుకోవచ్చని షణ్ముఖరావు తెలిపారు. ఇనుప పైపులతో చేసే దీని ఖరీదు రూ. 5–6 వేలు. బరువు 15–18 కిలోలు మాత్రమే. విడిభాగాలను 10 నిమిషాల్లో ఒకచోట చేర్చి గొడుగును నిలబెట్టుకోవచ్చు. పని పూర్తయ్యాక వేటికవి విడదీసి మడిచి ఇంటికి తీసుకెళ్లొచ్చు. చక్రాల దగ్గర, పైకప్పు దగ్గర రెండు చోట్ల మాత్రమే వెల్డింగ్ ఉంటుంది. మిగతా అన్ని చోట్లా నట్లు, బోల్టులే. తయారీ ఖర్చు రూ. 5–6 వేలు. ఖాళీ సంచులను కుట్టి పై కప్పుగా వేసుకుంటే ఖర్చు తగ్గుతుంది.

దగ్గర్లో ఉండే వారికి షణ్ముఖరావు తయారు చేసి ఇస్తున్నారు. అయితే, దూరప్రాంతాలకు దీన్ని పంపాలంటే (పొడవు 20 అడుగులు ఉంటుంది కాబట్టి) రవాణా చార్జీ తయారీ ఖర్చంత అవుతోంది. దీన్ని గమనించిన షణ్ముఖరావు రైతులు ఎవరికి వారు తయారు చేసుకోవటం మేలని సూచిస్తున్నారు. ఏయే కొలతల్లో ఎలా ఈ పెద్ద గొడుగును తయారు చేసుకోవాలో చెబుతూ డిజైన్‌ను బహిరంగ పరిచారు. ఈ వివరాలు చూపిస్తే గ్రామాల్లో స్థానికంగా ఉండే వెల్డర్ ఎవరైనా సులభంగా దీన్ని తయారు చేసేయగలుగుతారు. ఇప్పటికే పలువురు రైతులు తయారు చేయించుకొని వాడుతున్నారని షణ్ముఖరావు సంతోషంగా చెప్పారు. ఎర్రని ఎండ కాచే మిట్ట మధ్యాహ్న వేళల్లో కూడా నిశ్చింతగా వ్యవసాయ పనులను సులువుగా, భద్రంగా పూర్తి చేసుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతోందని దీన్ని వాడుతున్న రైతులు తెలిపారు.

కలుపు లేదా పత్తి తీయటమో, మిరపకాయలు కోయటమో, కల్లాల్లో తాలు ఏరటమో, కూరగాయలు కోయటమో ఏ పనులైనా ఈ 'సామూహిక గొడుగు' నీడన చేసుకోవచ్చు. కరోనా అనంతర కాలంలో ఎండను పెద్దగా తట్టుకోలేకపోతున్నామని కొందరు రైతులు వాపోతున్నారు. ఎండ తీవ్రత ప్రతి ఏటా పెరుగుతున్న నేపథ్యంలో షణ్ముఖరావు ఆవిష్కరణ ప్రజలకు ఉపయోగకరంగా మారటం సంతోషదాయకం.

● చక్రాలతో కూడిన పెద్ద గొడుగు నమూనా



1) 1 1\2" x 1" x 7' స్క్వేర్ పైపు
2) 1 1\2" x 1" x 3' స్క్వేర్ పైపు
3) 12" ఐరన్ వీల్స్
4) 20mm x 20' సెంటర్ పైపు
5) 20mm x 20' సైడ్ పైపు
6) 20mm x 3' సపోర్ట్ పైపు
7) 20mm x 6' వింగ్ పైపు

ఎవరైనా తయారు చేసుకోవచ్చు



30 ఏళ్లుగా మోటారు మెకానిక్‌గా రైతులు, కూలీలు ముఖ్యంగా మహిళల బాధలను దగ్గరి నుంచి చూస్తున్నాను. ఎండ తీవ్రత పెరుగుతున్నందు వల్ల తట్టుకోలేకపోతున్నారు. వారి బాధను కొంతైనా తగ్గించాలని ఈ ఆవిష్కరణ చేశా. ఇటు 20 అడుగులు, అటు 6 అడుగుల మేరకు నీడనిస్తుంది. ఎత్తు 7 అడుగులు ఉంటుంది. కొలతలు పొలంలో సాళ్లను బట్టి మార్చుకోవచ్చు. బొమ్మలో చూపిన విధంగా కొలతల ప్రకారం ఎవరైనా గ్రామాలు, పట్టణాల్లోనే దీన్ని తయారు చేసుకోవచ్చు. వెల్డింగ్ చేసే వ్యక్తికి సందేహాలుంటే నాతో ఫోన్‌లో మాట్లాడిస్తే వివరంగా చెబుతాను. నాకు రూపాయి ఇవ్వక్కర్లేదు. రైతులు సంతోషంగా ఉంటే అంతే చాలు. ఇప్పటికే అనేక మంది రైతులు తయారు చేయించుకొని వాడుతున్నారు. గత ఐదేళ్లలో 8 ఆవిష్కరణలు చేశాను. వరుసగా 4 ఏళ్లు ఉత్తమ ఆవిష్కర్తగా కలెక్టర్ నుంచి అవార్డులు తీసుకున్నాను.

– **రేపల్లె షణ్ముఖరావు** (94921 13609), పెద్ద గొడుగు ఆవిష్కర్త, కంబాలపల్లి, మహబూబాబాద్ జిల్లా

మూడేళ్ల నుంచి వాడుతున్నాం.. చాలా సంతోషంగా ఉంది..



పత్తి, మిరప, వేరుశనగ పంటలు పండిస్తున్నాం. మూడేళ్ల క్రితం షణ్ముఖరావు చెప్పినట్లు మా ఊళ్లోనే 15x7x7 అడుగుల కొలతతో తయారు చేయించుకున్నాం. ఎండ బాధ లేకుండా సంతోషంగా పనులు చేసుకుంటున్నాం. మా పనులకు కూలీలు పిలిస్తే చాలు వస్తున్నారు. మధ్యాహ్నం కూడా పని ఆపకుండా కొనసాగిస్తున్నాం. 2 గంటలు పని కలిసి వస్తోంది. ఈ పెద్ద గొడుగును పది నిమిషాల్లో బిగించుకొంటున్నాం. పని పూర్తి చేసుకున్నాక పది నిమిషాల్లో మడిచి ఇంటికి తెచ్చుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉన్నాం.

– **గడ్డం జైపాల్‌రెడ్డి** (97019 26657) రైతు, మణుగూరు

సాగుబడి

అశ్విని కార్తె: ఏప్రిల్ 27 వరకు

లాభదాయకంగా సుగంధ పంటల సాగు

హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగానికి స్వస్తి చెప్పిన గమిని రాఘవ చైతన్య భార్య రాణి తోడ్పాటుతో ఐదేళ్ల క్రితం సుగంధ పంటల సాగు చేపట్టారు. లెమన్ గ్రాస్ (నిమ్మ గడ్డి), పామ రోజా (కాశాగడ్డి)ని సాగు చేస్తూ సుగంధ తైలాలతో పాటు మరో 4 ఉప ఉత్పత్తులను సైతం తయారు చేసి స్వయంగా విక్రయిస్తూ మంచి ఆదాయం గడిస్తున్నారు. 5 ఏళ్ల క్రితం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బందారం గ్రామ శివారులో 50 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. 30 ఎకరాల్లో లెమన్ గ్రాస్ (నిమ్మగడ్డి), మరో 20 ఎకరాల్లో పామారోజా పంటలను సాగు చేస్తున్నారు. అంతకుముందే బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ, సుగంధ పంటల పరిశోధనా స్థానం (సీమాప్)లో శిక్షణ పొందారు. 25 దేశీ ఆవులను పెంచుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. దేశీ ఆవుల నెయ్యిని విక్రయిస్తున్నారు. ఎండాకాలంలో వారానికి రెండు సార్లు రెయిన్ గన్స్ ద్వారా నీటితో కలిపిన జీవామృతాన్ని పంటలకు అందిస్తున్నారు. లెమన్ గ్రాస్, పామ రోజా.. ఈ రెండు పంటలూ ఒకసారి నాటితే ఐదేళ్ల పాటు ప్రతి 65–70 రోజులకోసారి కోతకు వస్తాయి. ఏటా 5 సార్లు కత్తిరించి, డిస్టిల్లరీ ద్వారా సుగంధ తైలాలను తయారు చేసుకోవాలి. ఈ పంటలకు అడవి పందులు, కోతులు, పక్షులు, పశువుల బెడద లేదు. పామరోజా లేతగా ఉన్నప్పుడు పశువులు తింటాయన్నారు రాఘవ.

లెమన్‌గ్రాస్ ఆకులు, పామరోజా విత్తనాల సుగంధ తైలాన్ని వెలికి తీసేందుకు స్వయంగా ఆధునిక డిస్టిల్లరీని ఆయన ఏర్పాటు చేసుకున్నారు. పామరోజాను ట్రాక్టర్‌కు అమర్చిన రీపర్‌తో కోయవచ్చు. లెమన్ గ్రాస్‌ను కూలీలతో కోయించాల్సి ఉంటుందన్నారు. లెమన్‌గ్రాస్, పామరోజా పంటల ద్వారా ఎకరానికి ఏడాదిలో 50–60 కిలోల వరకు ఆయిల్ దిగుబడి వస్తున్నదన్నారు. జిరేనియల్, సిట్రల్ శాతాన్ని బట్టి ధర పలుకుతుంది. లెమన్ గ్రాస్ ఆయిల్ ధర కిలో ప్రస్తుతం రూ. వెయ్యి–1,100 వరకు ఉంది. పామరోజా కిలో ధర రూ. 2 వేలు–2,300 వరకు ఉంది. సేంద్రియ పద్ధతుల్లో పండిస్తే కిలోకు రూ. 500 వరకు అదనపు ఆదాయం వస్తుందని ఆయన అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌ను బట్టి ఏటా ఈ ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటాయన్నారు. డిస్టిల్లరీ ద్వారా ఆయిల్ తీసిన తర్వాత మిగిలే వ్యర్థాలతో మస్కిటో రెపల్లెంట్ లిక్విడ్, డిష్‌వాష్ లిక్విడ్, ఫ్లోర్ క్లీనర్, ఫినాయిల్, లెమన్‌గ్రాస్ పిడకలను తయారు చేస్తున్నారు. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో దుకాణాన్ని తెరిచి గోడైవిక్ బ్రాండ్ పేరుతో విక్రయిస్తుండటం విశేషం.

– గజవెల్లి షణ్ముఖరాజు, సాక్షి, సిద్దిపేట
ఫోటోలు: కె. సతీష్ కుమార్



● లెమన్ గ్రాస్ పంట



● పామరోజా పంట



5-10 ఎకరాల రైతులకు లాభదాయకం


లెమన్ గ్రాస్ ద్వారా ఏడాదిలో ఐదు పంటలు తీసి అన్ని ఖర్చులు పోను ఏడాదికి రూ. 40–45 వేల ఆదాయం వస్తుంది. 5–10 ఎకరాల సొంత భూమిలో సాగు చేసే రైతులకు లాభదాయకం. ఔత్సాహిక రైతులకు సూచనలు ఇవ్వటంతో పాటు తైలం వెలికితీయటం, మార్కెటింగ్‌లో తోడ్పాటు నందిస్తా.

– **గమిని రాఘవ చైతన్య** (97014 19007), సుగంధ పంటల రైతు



● అధునాతన డిస్టిల్లరీ

మే 5-7 తేదీల్లో గ్రామభారతి కిసాన్ ఎక్స్‌పో



● పాలేకర్

గ్రామభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మే 5,6,7 తేదీల్లో హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో కిసాన్ ఎక్స్‌పో–2023 జరగనుంది. ఇది రైతుల కోసం రైతులే నిర్వహిస్తున్న వ్యవసాయ ప్రదర్శన కావటం విశేషమని గ్రామభారతి కార్యదర్శి సామ ఎల్లారెడ్డి తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తదితర రాష్ట్రాల నుంచి రైతులు, వ్యవసాయ అధికారులు తరలివస్తారన్నారు. సేంద్రియ రైతుల ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. మే 5న ఉ. 10 గం.కు జరిగే ప్రారంభోత్సవంలో తెలంగాణ వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ పితామహులు పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. ఖాదర్ వలి, బయోచార్ నిపుణులు డా. నక్కా సాయిభాస్కర్ రెడ్డి, ప్రకృతివనం వ్యవస్థాపకులు ఎంసీవీ ప్రసాద్ తదితరులు ప్రసంగిస్తారని ఎల్లారెడ్డి తెలిపారు. సందర్శకులు (ఫోన్ ద్వారా/ వచ్చిన తర్వాతయినా) పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రవేశ పాసులను వెబ్‌సైట్ నుంచి కూడా పొందవచ్చు. వివరాలకు.. జ్యోత్స్న – 74161 60182.
www.gramabharathinaturalfpc.com

నిర్వహణ:
పంతంగి రాంబాబు,
సాగుబడి డెస్క్



మూడో సీడ్‌పై సాకేత్ జోడీ విజయం

జీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ సంచలన విజయంతో శుభారంభం చేసింది. జర్మనీలోని మ్యూనిక్‌లో సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-యూకీ ద్వయం 6-3, 7-6 (7/4)తో మూడో సీడ్ నథానియల్ లామోన్స్-జాక్సన్ విత్రో (అమెరికా) జోడీని ఓడించి క్వార్టర్ ఫైనల్ చేరింది. 93 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్, యూకీ జోడీ ఆరు ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1 టోర్నీ బరిలో సురేఖ

కొన్నేళ్లుగా ఆర్చరీ ప్రపంచకప్ టోర్నీలలో నిలకడగా పతకాలు సాధిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ వెన్నం జ్యోతి సురేఖ మరో కొత్త సీజన్‌కు సిద్ధమైంది. అంటాల్యాలో నేటి నుంచి వరల్డ్‌కప్ స్టేజ్-1 టోర్నీ జరగనుంది. జ్యోతి సురేఖతోపాటు అవ్‌నీత్ కౌర్, అదితి స్వామి, సాక్షి చౌదరీ మహిళల కాంపౌండ్ టీమ్, వ్యక్తిగత విభాగాల్లో బరిలోకి దిగుతారు. 52 దేశాల నుంచి 394 మంది ఆర్చర్లు రికర్వ్, కాంపౌండ్ ఈవెంట్స్‌లో ఈ టోర్నీలో ఆడనున్నారు.



చాంపియన్ గుకేశ్



చెన్నై: భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ మెనోర్కా ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో వరుసగా రెండో ఏడాది టైటిల్ సాధించాడు. స్పెయిన్‌లో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత గుకేశ్‌తోపాటు మరో తొమ్మిదిమంది ఏడు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... గుకేశ్, ప్రణవ్‌లకు తొలి రెండు ర్యాంక్‌లు లభించాయి. విజేతను నిర్ణయించేందుకు గుకేశ్, ప్రణవ్ మధ్య రెండు బ్లిట్జ్ టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల గుకేశ్ 1.5–0.5తో ప్రణవ్‌ను ఓడించి చాంపియన్‌గా నిలిచాడు. గుకేశ్‌కు 3,000 యూరోలు (రూ. 2 లక్షల 69 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. తొమ్మిది రౌండ్లలో గుకేశ్ ఐదు గేముల్లో గెలిచి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు. ఇదే టోర్నీలో పాల్గొన్న తెలంగాణ ప్లేయర్లు హర్ష భరతకోటి 6.5 పాయింట్లతో 11వ ర్యాంక్‌లో, వుప్పాల ప్రణీత్ 6 పాయింట్లతో 19వ ర్యాంక్‌లో, రాజా రిత్విక్ 5.5 పాయింట్లతో 37వ ర్యాంక్‌లో నిలిచారు.

రన్నరప్ అనిరుధ్ జోడీ



సాక్షి, హైదరాబాద్: స్ప్లిట్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-75 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. క్రొయేషియాలో జరిగిన ఈ టోర్నీలో అనిరుధ్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ ఫైనల్లో ఓడిపోయింది. 70 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో అనిరుధ్-విజయ్ సుందర్ ప్రశాంత్ 4-6, 4-6తో సాదియో డుంబియా-ఫాబ్లెస్ రెబూల్ (ఫ్రాన్స్) ద్వయం చేతిలో ఓటమి పాలైంది. తొలి రౌండ్‌లో భారత జోడీ 6-2, 6-1తో ఆర్టెమ్ సితాక్ (న్యూజిలాండ్)-కైచి ఉచిడా (జపాన్) జంటను ఓడించింది. క్వార్టర్ ఫైనల్లో, సెమీఫైనల్లో అనిరుధ్-విజయ్‌లకు తమ ప్రత్యర్థుల నుంచి వాకోవర్ లభించడంతో నేరుగా ఫైనల్ ఆడారు. అనిరుధ్-విజయ్‌లకు 2,450 యూరోల (రూ. 2 లక్షల 20 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 50 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

బెంగళూరు చిన్నబోయింది!

- ఉత్కంఠ పోరులో ఓడిన ఆర్‌సీబీ
- 8 పరుగులతో చెన్నై గెలుపు
- కాన్వే, దూబే మెరుపులు
- మ్యాక్స్‌వెల్, డుప్లెసిస్ శ్రమ వృథా

బెంగళూరు: పరుగుల వరద పారిన పోరు... ఏకంగా 33 సిక్సర్లు నమోదు... చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) భారీ స్కోరు సాధిస్తే మేమేం తక్కువ అన్నట్లుగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) కూడా విరుచుకుపడింది. అయితే తుది ఫలితంలో మాత్రం సూపర్ కింగ్స్‌దే పైచేయి అయింది. ఒకదశలో గెలుపు ఖాయమనిపించిన ఆర్‌సీబీ ఓటమి బాట పట్టడంతో చిన్నస్వామి మైదానంలో అభిమానులకు తీవ్ర నిరాశ ఎదురైంది. సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో చెన్నై 8 పరుగుల తేడాతో బెంగళూరును ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (45 బంతుల్లో 83; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), శివమ్ దూబే (27 బంతుల్లో 52; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీలు సాధించగా, అజింక్య రహానే (20 బంతుల్లో 37; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లకు 218 పరుగులు చేసి ఓడిపోయింది. గ్లెన్ మ్యాక్స్‌వెల్ (36 బంతుల్లో 76; 3 ఫోర్లు, 8 సిక్స్‌లు), డుప్లెసిస్ (33 బంతుల్లో 62; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) మూడో వికెట్‌కు 61 బంతుల్లోనే 126 పరుగులు జోడించారు.

సమష్టి ప్రదర్శన...

సిరాజ్ తొలి ఓవర్లోనే రుతురాజ్ (3) అవుట్ కావడంతో చెన్నైకి సరైన ఆరంభం లభించలేదు. అయితే రహానే, కాన్వే భాగస్వామ్యంలో స్కోరు జోరందుకుంది. వీరిద్దరు పోటీ పడి పరుగులు సాధించడంతో పవర్‌ప్లేలో స్కోరు 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 53 పరుగులకు చేరింది. హసరంగ తన తొలి ఓవర్లో చక్కటి బంతితో రహానేను బౌల్డ్ చేయడంతో 74 పరుగుల (43 బంతుల్లో) భాగస్వామ్యం ముగిసింది. అయితే ఆ తర్వాత కాన్వే, దూబే మరింత ధాటిగా పరుగులు సాధించారు. వైశాక్ ఓవర్లో కాన్వే 2 ఫోర్లు, సిక్స్ కొట్టగా, సిరాజ్ ఓవర్లో దూబే ఫోర్, సిక్స్ బాదాడు. వైశాక్ తర్వాతి ఓవర్లో వీరిద్దరు 19 పరుగులు రాబట్టారు. కాన్వే 32 బంతుల్లో, దూబే 25 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. మూడో వికెట్‌కు 80 పరుగులు (37 బంతుల్లో) జోడించిన వీరిద్దరు ఎనిమిది బంతుల వ్యవధిలో వెనుదిరిగినా... చివర్లో అంబటి రాయుడు (6 బంతుల్లో 14; 1 ఫోర్, 1 సిక్స్), మొయిన్ అలీ (9 బంతుల్లో 19 నాటౌట్; 2 సిక్స్‌లు) వేగంగా ఆడి కీలక పరుగులు జోడించారు. దాంతో ఐపీఎల్ చరిత్రలో చెన్నై జట్టు 25వసారి 200 అంతకంటే ఎక్కువ స్కోరు చేసింది.

శతక భాగస్వామ్యం...

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆర్‌సీబీకి షాక్ తగిలింది. ఆకాశ్ సింగ్ తొలి ఓవర్లోనే కోహ్లి (6) షాట్‌ను వికెట్లపైకి ఆడుకోగా, ఆ వెంటనే లోమ్రోర్ (0) వెనుదిరిగాడు. అయితే డుప్లెసిస్, మ్యాక్స్‌వెల్ అద్భుత భాగస్వామ్యం జట్టును నడిపించింది. వీరిద్దరు చెన్నై బౌలర్లందరిపై విరుచుకుపడి పరుగుల వర్షం కురిపించారు. 'సున్నా' వద్ద డుప్లెసిస్ క్యాచ్‌ను ధోని వదిలేయడం కూడా కలిసొచ్చింది. ఆకాశ్ ఓవర్లో మ్యాక్స్‌వెల్ 2 సిక్స్‌లు బాదగా, అతని తర్వాతి ఓవర్లో డుప్లెసిస్ 2 ఫోర్లు, సిక్స్ కొట్టాడు. తుషార్ ఓవర్లో డుప్లెసిస్ వరుస బంతుల్లో 4, 4, 6... తీక్షణ ఓవర్లో మ్యాక్సీ 2 సిక్స్‌లు కొట్టడంతో ఆరు ఓవర్లలోనే స్కోరు 75 పరుగులకు చేరింది. ఈ క్రమంలో డుప్లెసిస్ 23 బంతుల్లో, మ్యాక్స్‌వెల్ 24 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నారు. 12వ ఓవర్ వరకు వీరి ధాటి కొనసాగింది. అయితే వరుస ఓవర్లలో వీరిద్దరిని అవుట్ చేయడంతో చెన్నైకి మళ్లీ పట్టు చిక్కింది. ఆఖర్లో దినేశ్ కార్తీక్ (14 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) గెలిపించేందుకు ప్రయత్నించినా చెన్నై కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఉత్కంఠ క్షణాలను దాటి మ్యాచ్‌ను కాపాడుకుంది.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కాన్వే



మ్యాక్స్‌వెల్



డుప్లెసిస్



శివమ్ దూబే

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) పార్నెల్ (బి) సిరాజ్ 3; కాన్వే (బి) హర్షల్ 83; రహానే (బి) హసరంగ 37; దూబే (సి) సిరాజ్ (బి) పార్నెల్ 52; రాయుడు (సి) కార్తీక్ (బి) వైశాక్ 14; అలీ (నాటౌట్) 19; జడేజా (సి) (సబ్) ప్రభుదేశాయ్ (బి) మ్యాక్స్‌వెల్ 10; ధోని (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 226. వికెట్ల పతనం:** 1-16, 2-90, 3-170, 4-178, 5-198, 6-224. **బౌలింగ్:** సిరాజ్ 4-0-30-1, పార్నెల్ 4-0-48-1, వైశాక్ 4-0-62-1, మ్యాక్స్‌వెల్ 2.4-0-28-1, హసరంగ 2-0-21-1, హర్షల్ పటేల్ 3.2-0-36-1.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (బి) ఆకాశ్ 6; డుప్లెసిస్ (సి) ధోని (బి) అలీ 62; లోమ్రోర్ (సి) రుతురాజ్ (బి) తుషార్ 0; మ్యాక్స్‌వెల్ (సి) ధోని (బి) తీక్షణ 76; షహబాజ్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 12; కార్తీక్ (సి) తీక్షణ (బి) తుషార్ 28; ప్రభుదేశాయ్ (సి) జడేజా (బి) పతిరణ 19; పార్నెల్ (సి) దూబే (బి) తుషార్ 2; హసరంగ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 218. వికెట్ల పతనం:** 1-6, 2-15, 3-141, 4-159, 5-191, 6-192, 7-197, 8-218. **బౌలింగ్:** ఆకాశ్ సింగ్ 3-0-35-1, తుషార్ దేశ్‌పాండే 4-0-45-3, తీక్షణ 4-0-41-1, జడేజా 4-0-37-0, పతిరణ 4-0-42-2, మొయిన్ అలీ 1-0-13-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	5	4	1	8	1.354
లక్నో	5	3	2	6	0.761
చెన్నై	5	3	2	6	0.265
గుజరాత్	5	3	2	6	0.192
పంజాబ్	5	3	2	6	-0.109
కోల్‌కతా	5	2	3	4	0.320
బెంగళూరు	5	2	3	4	-0.318
ముంబై	4	2	2	4	-0.389
హైదరాబాద్	4	2	2	4	-0.822
ఢిల్లీ	5	0	5	0	-1.488

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ × ముంబై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

శ్రీలంక 591/6 డిక్లేర్డ్

చండీమల్, సమరవిక్రమ సెంచరీలు



చండీమల్ సమరవిక్రమ

గాలె: ఐర్లాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టుపై శ్రీలంక రెండో రోజే పట్టు బిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 386/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 6 వికెట్లకు 591 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. దినేశ్ చండీమల్ (102 నాటౌట్; 12 ఫోర్లు), సమరవిక్రమ (104 నాటౌట్; 11 ఫోర్లు) అజేయ సెంచరీలు సాధించారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 183 పరుగుల భాగస్వామ్యం జోడించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఐర్లాండ్ ఆట ముగిసే సమయానికి 7 వికెట్లు కోల్పోయి 117 పరుగులు చేసి కష్టాల్లో పడింది. జేమ్స్ మెకొల్లమ్ (35; 5 ఫోర్లు), హ్యారీ టెక్టర్ (34; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. టకెర్ (21 బ్యాటింగ్), మెక్‌బ్రైన్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. లంక బౌలర్లలో ప్రభాత జయసూర్య 5 వికెట్లు, ఫెర్నాండో 2 వికెట్లు పడగొట్టారు. లంక స్కోరుకు ఐర్లాండ్ మరో 474 పరుగులు వెనుకబడి ఉంది.

సినిమా




సెంథిల్ దంపతులతో రామ్‌చరణ్



పార్టీలో ఓ సెల్ఫీ

'ఆర్ఆర్ఆర్' ఆస్కార్ సాధించిన నేపథ్యంలో వరుస పార్టీలు జరుగుతున్నాయి. ఆదివారం చిత్ర ఛాయాగ్రాహకుడు సెంథిల్ కుమార్ ఓ గ్రాండ్ పార్టీ ఏర్పాటు చేసి, 'ఆర్ఆర్ఆర్' టీమ్‌తో పాటు పలువురు చిత్రరంగ ప్రముఖులను ఆహ్వానించారు. రాజమౌళి, కీరవాణి సతీ సమేతంగా పార్టీకి హాజరయ్యారు. రామ్‌చరణ్ స్టయిలిష్ ఎంట్రీ ఇచ్చారు. కాలభైరవ, ప్రేమ్ రక్షిత్.. ఇలా 'ఆర్ఆర్ఆర్' టీమ్‌లో కొందరు పాల్గొనగా.. లక్ష్మీప్రసన్న, నూతన దంపతులు మంచు మనోజ్, మౌనిక, అడివి శేష్ తదితరులు ఈ పార్టీలో సందడి చేశారు.

కేజీఎఫ్ నేపథ్యంలో...



విక్రమ్

పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేస్తారు విక్రమ్. ఇప్పటికే పలు వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ఆయన తాజాగా 'తంగలాన్' చిత్రం కోసం ఊర మాస్ లుక్‌లోకి మారిపోయారు. పా. రంజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పార్వతి, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సోమవారం విక్రమ్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఓ మేకింగ్ గ్లింప్స్‌తో పాటు వీడియోను విడుదల చేసింది యూనిట్. ఇందులో ఊర మాస్ లుక్‌లో కనిపిస్తున్నారు విక్రమ్. ''కోలార్ గోల్డ్ ఫీల్డ్ (కేజీఎఫ్) నేపథ్యంలో కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా కంప్లీట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు రంజిత్. పాన్ ఇండియన్ సినిమాగా బహు భాషల్లో ఈ చిత్రం విడుదలవుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. హాలీవుడ్ నటుడు డేనియల్ కాల్టాగిరోన్ కీలక పాత్ర చేస్తున్న ఈ చిత్రానికి నిర్మాణ సంస్థలు: స్టూడియో గ్రీన్ (కేఈ జ్ఞానవేల్ రాజా), పా. రంజిత్ (నీలం ప్రొడక్షన్స్), యూవీ క్రియేషన్స్.

లవ్ అంటేనే ఇష్టం లేదు



సిద్ధార్థ్, దివ్యాంశా కౌశిక్

'నేనంటే ఇష్టం లేదా' అని అబ్బాయి అంటే... 'లవ్ అంటేనే ఇష్టంలేదు' అని అంటుంది అమ్మాయి. ఈ ఇద్దరి కథ ఏంటనేది 'టక్కర్'లో తెలుస్తుంది. సిద్ధార్థ్, దివ్యాంశా కౌశిక్ జంటగా రూపొందుతున్న చిత్రం 'టక్కర్'. సోమవారం సిద్ధార్థ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టీజర్ పైన పేర్కొన్న సంభాషణలతో సాగుతుంది. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వ ప్రసాద్ తెలుగులో విడుదల చేస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం మే 26న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: నివాస్ కె. ప్రసన్న, కెమెరా: వాంచినాథన్ మురుగేశన్.


ముచ్చటగా మూడు



విజయ్ రెడ్డి, మిత్ర, బాబూమోహన్

తెలుగు పరిశ్రమలోకి 'రెడ్డీస్ మల్టీప్లెక్స్ మూవీస్' అనే నిర్మాణ సంస్థ ఎంట్రీ ఇచ్చింది. సోమవారం హైదరాబాద్‌లో మూడు సినిమాల్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు సంస్థ అధినేత విజయ్ రెడ్డి. తొలి ప్రయత్నంగా ప్రసాద్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ 'సోషల్ వర్కర్స్' సినిమా నిర్మిస్తున్నారు. ఇందులో ఎనిమిది మంది హీరోయిన్లు ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. అలాగే మహేందర్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ మిత్ర ప్రధాన పాత్రలో మిత్ర మూవీస్ భాగస్వామ్యంతో 'కోబలి'ని రెండో చిత్రంగా నిర్మిస్తున్నారు. మూడో మూవీగా 'హ్యాపీ విమెన్స్ డే' రూపొందనుంది. తొలి సీన్‌కి నటుడు బాబూ మోహన్ క్లాప్ కొట్టారు. విజయ్ రెడ్డి మాట్లాడుతూ– ''రెడ్డీస్ మల్టీప్లెక్స్ మూవీస్ ఆఫీసులను ముంబై, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నంలో ప్రారంభించాం. ఔత్సాహిక దర్శకులు, నూతన నటీనటులు మమ్మల్ని సంప్రదించవచ్చు'' అన్నారు.

అంజనాద్రి కోసం పోరాటం



తేజ సజ్జ

తేజ సజ్జ హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'హను–మాన్'. అమృతా అయ్యర్ కథానాయిక. శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ సోమవారంతో పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''హనుమంతుని శక్తులను పొందిన హీరో అంజనాద్రి కోసం ఎలా పోరాటం చేశాడు? అనేది చిత్ర కథాంశం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ, కన్నడ, మలయాళ, ఇంగ్లిష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్‌తో సహా పలు భారతీయ భాషల్లో పాన్ వరల్డ్‌గా ఈ చిత్రం విడుదల కానుంది. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తాం'' అన్నారు.

అందుకే మాకు హిట్లు ఎక్కువ!

– నిర్మాత టీజీ విశ్వప్రసాద్

''గోపీచంద్, శ్రీవాస్‌గార్ల కాంబినేషన్‌లో వచ్చిన 'లక్ష్యం, లౌక్యం' సూపర్ హిట్ అయ్యాయి. ఆ చిత్రాల తరహాలోనే ఫ్యామిలీ, యాక్షన్, బ్రదర్ సెంటిమెంట్ నేపథ్యంలో 'రామబాణం' ఉంటుంది. ఈ చిత్రంతో గోపీచంద్-శ్రీవాస్‌గార్లు హ్యాట్రిక్ హిట్ కొడతారు'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. గోపీచంద్, డింపుల్ హయతి జంటగా జగపతిబాబు, ఖుష్బూ ప్రధాన పాత్రల్లో శ్రీవాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మించిన ఈ సినిమా మే 5న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా టీజీ విశ్వప్రసాద్ చెప్పిన విశేషాలు.



- సినిమాలపై ఉన్న ప్యాషన్‌తో సాఫ్ట్‌వేర్ రంగం నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టడానికి ముందే ఫిల్మ్ ఇండస్ట్రీ గురించి పరిశోధన చేసి, ఫ్యాక్టరీ మోడల్‌లో ప్రొడక్షన్ స్టార్ట్ చేశాం. మిగతా కొత్త నిర్మాతల్లాగా ఒకట్రెండు సినిమాలు కాకుండా ఎక్కువ తీస్తున్నాం. మంచి విజయాలతో విజయవంతమైన సంస్థగా ఎదగడం హ్యాపీ.
- శ్రీవాస్‌గారు 'రామబాణం' కథ చెప్పినప్పుడు ఇదొక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అవుతుందనిపించింది. క్రియేటివ్ సైడ్ ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం.. మంచి ఔట్‌పుట్ తీసుకొచ్చారు.
- కాన్సెప్ట్ నచ్చితే చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అన్ని రకాల సినిమాలు నిర్మిస్తున్నాం. అయితే సినిమా విజయం అనేది మన చేతుల్లో ఉండదు.. కానీ వంద శాతం మన ప్రయత్నం చేయాలి. మేం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుండటంతో విజయాల శాతం ఎక్కువగానే ఉంది. మా అబ్బాయి వ్యాపారం చూసుకుంటున్నాడు. మా అమ్మాయికి సినిమాపై ఆసక్తి ఉంది. శర్వానంద్‌తో చేస్తున్న సినిమా విషయంలో తన ప్రమేయం ఉంది. ప్రస్తుతం ప్రభాస్‌గారు హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా షూటింగ్ జరుగుతోంది. చిరంజీవిగారు, అల్లు అర్జున్.. ఇలా అందరి హీరోలతో సినిమాలు నిర్మించాలనుంది.. ఆ ప్రయత్నాలు చేస్తున్నాం.

ముత్తయ్యగా మధుర్



మధుర్ మిట్టల్

క్రికెట్ ప్రపంచంలో ఎన్నో రికార్డులు సాధించిన ప్రముఖ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం '800'. సోమవారం (ఏప్రిల్ 17) ముత్తయ్య పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ఎంఎస్ శ్రీపతి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. 'స్లమ్‌డాగ్ మిలియనీర్'లో చేసిన సలీమ్ మాలిక్ పాత్ర ద్వారా గుర్తింపు తెచ్చుకున్న మధుర్ మిట్టల్ ఈ బయోపిక్‌లో ముత్తయ్య పాత్రను పోషిస్తున్నారు. ముత్తయ్య భార్య మదిమలర్ పాత్రను మహిమా నంబియార్ చేస్తున్నారు. శ్రీపతి మాట్లాడుతూ – ''కెరీర్‌లో 800 టెస్ట్ వికెట్స్ తీసిన ఏకైక ఆఫ్ స్పిన్నర్ బౌలర్‌గా మురళీధరన్ అరుదైన రికార్డు సాధించారు. అందుకే ఈ చిత్రానికి '800'నే టైటిల్‌గా పెట్టాం. మురళికి తమిళనాడులో మూలాలు ఉన్నాయి. అతని తాతలు భారతీయులు. బ్రిటిష్ వారు అక్కడి టీ తోటలలో పని చేయడానికి వారిని శ్రీలంకకు తీసుకెళ్లారు. ఇలా ముత్తయ్య మురళీధరన్‌లోని పలు కోణాలను చూపించే చిత్రం ఇది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అన్నారు. వివేక్ రంగాచారి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.

తొలి అడుగు!



జాన్వీ కపూర్

తెలుగు సెట్స్‌లోకి జాన్వీ కపూర్ తొలి అడుగు సోమవారం ఆరంభమైంది. శ్రీదేవి ఫ్యాన్స్ అందరూ ఆమె కుమార్తె జాన్వీ దక్షిణాదికి ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ సరసన జాన్వీ సినిమా కమిట్ కావడం ఫ్యాన్స్‌ని ఆనందపరిచింది. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సెకండ్ షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ షూటింగ్‌లోకి జాన్వీ తొలి అడుగు వేశారు. ఎన్టీఆర్, జాన్వీపై కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారు కొరటాల శివ.

మంచి శకునములే...



సంతోష్ శోభన్, మాళవిక

సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నందినీ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'అన్నీ మంచి శకునములే...'. ప్రియాంక దత్ నిర్మించిన ఈ సినిమా మే 18న రిలీజ్ కానుంది. కాగా 'ఏప్రిల్ 20న మీట్ రిషి– ఆర్య ఇన్ ఇటలీ' అంటూ ఓ వీడియో ద్వారా అనౌన్స్ చేసింది యూనిట్. ''ఫీల్ గుడ్ ఎమోషన్స్‌తో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే...'. విభిన్న మనస్తత్వాలు కలిగిన రిషి, ఆర్యల మధ్య అందమైన బంధం ఎలా ఏర్పడింది? వారి జర్నీ ఎలా సాగింది? అన్నది ఆసక్తిగా ఉంటుంది. మిక్కీ జె. మేయర్ సంగీతం అందించారు. రిలీజ్ చేసిన రెండు పాటలు బ్లాక్ బస్టర్ అయ్యాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సన్నీ కూరపాటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దివ్య విజయ్.

సాక్షి బిజినెస్
మంగళవారం
18-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	520	59,911
నిఫ్టీ ▽	121	17,707

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,094	▽	30
డోజోన్స్	33,864	▽	23
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,880	△	8
డాక్స్	15,790	△	18
షాంఘై	3,386	△	46
నికాయ్	28,515	△	21

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	60,629
బంగారం (22 క్యారట్)	60,386
వెండి (కిలో)	75,530

విశాఖ ఉక్కు ఈవోఐలకు గడువు పెంపు



న్యూఢిల్లీ: కొత్త వ్యాపార విధానానికి సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణ పత్రాల (ఈవోఐ) దాఖలుకు గడువును ఏప్రిల్ 20 వరకు పొడిగించినట్లు విశాఖ ఉక్కు (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్-ఆర్‌ఐఎన్‌ఎల్) వెల్లడించింది. వాస్తవానికి ఇది ఏప్రిల్ 15తో ముగిసింది. తమకు వర్కింగ్ క్యాపిటల్ లేదా ఒకటికి మించి ముడి వస్తువులను సమకూర్చే సంస్థలకు ఫినిష్డ్ స్టీల్ ఉత్పత్తులను సరఫరా చేసేలా విశాఖ ఉక్కు వినూత్న ప్రతిపాదనతో ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. నిబంధనల ప్రకారం ఈవోఐ సమర్పించే సంస్థకు ఉక్కు వ్యాపారంలో లేదా ఉక్కు తయారీలో ఉపయోగించే ముడి వస్తువుల వ్యాపారంలో కార్యకలాపాలు ఉండాలి. వైజాగ్ స్టీల్ వార్షిక సామర్థ్యం 7 మిలియన్ టన్నులుగా ఉంది.

భారత్‌లో మిత్సుబిషి ప్లాంటు



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉన్న జపాన్ కంపెనీ మిత్సుబిషి భారత్‌లో ప్లాంటు నెలకొల్పుతోంది. చెన్నై సమీపంలో ఉన్న మహీంద్రా వరల్డ్ సిటీ డెవలపర్స్ ఇండస్ట్రియల్ పార్కులో 52 ఎకరాల్లో ఇది ఏర్పాటవుతోంది. ఏసీలతోపాటు కంప్రెసర్లను ఇక్కడ తయారు చేస్తారు. భారత్‌లో సంస్థకు ఏసీల తయారీలో తొలి ప్లాంటు కానుంది. 2025 అక్టోబర్‌లో ఈ కేంద్రంలో ఉత్పత్తి కార్యకలాపాలు మొదలు కానున్నాయి. ప్లాంటు కోసం కంపెనీ రూ.1,820 కోట్లు ఖర్చు చేస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-4-2023	
విశాఖ	390-00
చిత్తూరు	408-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	355-00
విజయవాడ	355-00
రిటైల్ ధర (డజను)	60.00
17-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	350-00
వరంగల్	352-00
రిటైల్ ధర	4.10

2025 నాటికే 20 శాతం ఇథనాల్

- పెట్రోల్‌లో కలిపే లక్ష్యాన్ని చేరుకుంటాం
- కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్‌పురి



న్యూఢిల్లీ: పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపే లక్ష్యాన్ని 2025 నాటికే సాధిస్తామని పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్‌పురి తెలిపారు. ముందుగా నిర్దేశించుకున్న 2030తో పోలిస్తే ఐదేళ్లు ముందుగానే చేరుకుంటామని ప్రకటించారు. దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ విక్రయాలను ఈ ఫిబ్రవరిలో ప్రయోగాత్మకంగా ఆరంభించడం గమనార్హం. కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు, పెట్రోల్ దిగుమతుల భారాన్ని తగ్గించుకోవాలన్న రెండు లక్ష్యాలు ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం 10 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను దేశవ్యాప్తంగా విక్రయిస్తున్నారు. వచ్చే ఏడాదికే 20 శాతం పెట్రోల్‌ను సరఫరా చేయగలమన్న నమ్మకంతో ఉన్నట్టు పురి చెప్పారు. పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్ మిశ్రమంతో రూ.41,500 కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఒక ఏడాదిలో ఆదా అవుతుండగా, దేశీయ రైతులకు, పరిశ్రమలకు ఈ మేరకు ప్రయోజనం లభించనుంది. చెరకు, విరిగిన, తినడానికి అనుకూలం కాని బియ్యంతో ఇథనాల్‌ను ప్రస్తుతం మన దేశంలో తయారు చేస్తున్నారు. 20 శాతం ఇథనాల్ కలపడం వల్ల ద్విచక్ర వాహనాల నుంచి కార్బన్ మోనాక్సైడ్ విడుదలను 50 శాతం, నాలుగు చక్రాల వాహనాల నుంచి 30 శాతం మేర తగ్గించొచ్చని అంచనా. మన దేశ ముడి చమురు అవసరాల్లో 85 శాతాన్ని దిగుమతి చేసుకుంటున్న విషయం తెలిసిందే. 2021-22లో ముడి చమురు దిగుమతుల కోసం మన దేశం 120.7 బిలియన్ డాలర్లు వెచ్చించింది.

టోకు ద్రవ్యోల్బణం @ 29 నెలల కనిష్టం

- మార్చిలో 1.34 శాతం
- తగ్గిన ఇంధనం, తయారీ ఉత్పత్తుల భారం
- ఆహార ఉత్పత్తులు ప్రియం



న్యూఢిల్లీ: టోకు ధరల ఆధారిత (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం మార్చిలో 29 నెలల కనిష్టానికి దిగి వచ్చింది. 1.34 శాతానికి పరిమితమైంది. ఇంధనాలు, తయారీ ఉత్పత్తుల ధరలు తగ్గగా, ఆహార ఉత్పత్తుల భారం మాత్రం పెరిగింది. డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 3.85 శాతంగాను, గతేడాది మార్చిలో 14.63 శాతంగాను నమోదైంది. ఇది తగ్గడం వరుసగా పదో నెల. చివరిసారిగా 2020 అక్టోబర్‌లో డబ్ల్యూపీఐ ఆధారిత ధరల పెరుగుదల 1.31 శాతంగా నమోదైంది. '2023 మార్చిలో ద్రవ్యోల్బణం రేటు తగ్గడానికి ప్రధానంగా ప్రాథమిక లోహాలు, టెక్స్‌టైల్స్, ఆహారయేతర ఆర్టికల్స్, ఖనిజాలు, రబ్బర్.. ప్లాస్టిక్ ఉత్పత్తులు, క్రూడ్ పెట్రోలియం .. సహజ వాయువు, పేపర్ .. పేపర్ ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టడమే కారణం' అని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సోమవారం తెలిపింది. తాజాగా ఫుడ్ బాస్కెట్‌లో గోధుమలు వంటి ధాన్యాల ధరలు నెమ్మదించగా.. కూరగాయలు, పండ్లు, పాలు, పప్పులు మొదలైన వాటి రేట్లు పెరిగాయని ఈక్విరస్ సెక్యూరిటీస్ ఒక నోట్‌లో పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఇప్పుడు కూడా వడ్డీ రేట్ల పెంపు విషయంలో నిర్ణయం తీసుకునే ముందు డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం స్థిరపడేలా చూడటంపైనా, వినియోగ ధరల ఆధారిత (సీపీఐ) ద్రవ్యోల్బణం మరింత తగ్గేలా చూడటంపైనా దృష్టి పెట్టాల్సి ఉంటుందని టీఐడబ్ల్యూ క్యాపిటల్ సీఈవో మోహిత్ రాల్హన్ అభిప్రాయపడ్డారు.

– ఆహార ఉత్పత్తుల రేట్ల పెరుగుదల ఫిబ్రవరిలో 3.81 శాతంగా ఉండగా, మార్చిలో 5.48 శాతంగా నమోదైంది. కూరగాయల ధరలు ఫిబ్రవరిలో 21.53 శాతం తగ్గగా (2022 ఫిబ్రవరి ధరతో పోలిస్తే), మార్చిలో ఈ తగ్గుదల రేటు 2.22 శాతంగానే ఉంది. ఉల్లి విషయంలో ఫిబ్రవరిలో 40.14 శాతం ధరలు తగ్గగా, మార్చిలో తగ్గుదల రేటు 36.83 శాతంగానే నమోదైంది.

– గోధుమల ధరలు 9.16 శాతం, పప్పుల రేట్లు 3.03 శాతం పెరిగాయి.

మార్కెట్ ర్యాలీకి ఐటీ షేర్ల బ్రేక్..!

- 9 రోజుల వరుస లాభాలకు విరామం
- సెన్సెక్స్ నష్టం 530 పాయింట్లు
- మళ్లీ 60 వేల దిగువకు
- 121 పాయింట్లు పతనమైన నిఫ్టీ
- ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్లకు డిమాండ్

ముంబై: స్టాక్ మార్కెట్లో గడచిన రెండేళ్లలో మునుపెన్నడూ సాగని తొమ్మిది రోజుల సుదీర్ఘ ర్యాలీకి సోమవారం బ్రేక్ పడింది. ఐటీ, టెక్నాలజీ, టెలికం షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సూచీలు దాదాపు ఒకశాతం నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఇన్ఫోసిస్ క్యూ4 క్వార్టర్ ఆర్థిక ఫలితాలు అంచనాల కంటే తక్కువగా నమోదవడంతో సెంటిమెంట్ బలహీనపడినట్లు నిపుణులు తెలిపారు. ఉదయం సెన్సెక్స్ 45 పాయింట్ల నష్టంతో 60,385 వద్ద, నిఫ్టీ 35 పాయింట్లు లాభంతో 17,863 వద్ద మిశ్రమంగా మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే బలహీనంగా కదలాడిన సూచీలు చివరి దాకా అదే వైఖరిని ప్రదర్శించాయి. ఒక దశలో సెన్సెక్స్ 989 పాయింట్లు క్షీణించి 59,442 వద్ద, నిఫ్టీ 254 పాయింట్లు పతనమై 17,574 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. చివరి గంటలో కనిష్ట స్థాయి వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాలు కొంతమేర తగ్గాయి. ఆఖరికి సెన్సెక్స్ 520 పాయింట్లు నష్టపోయి 59,911 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121 పాయింట్లు పతనమై 17,707 వద్ద నిలిచింది. ప్రభుత్వరంగ బ్యాంక్స్, ఇంధన, మెటల్, ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్ సూచీలు అరశాతం చొప్పున లాభపడ్డాయి. పదిరోజుల వరుస కొనుగోళ్ల తర్వాత విదేశీ ఇన్వెస్టర్లు తొలిసారి రూ.533 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.269 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 16 పైసలు క్షీణించి 82.01 వద్ద నిలిచింది.

సూచీలకు నష్టాలు ఎందుకంటే

మొత్తం 9 ట్రేడింగ్ సెషన్లలో సూచీలు ఐదుశాతం ర్యాలీ చేసిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. సూచీల్లో అధిక వెయిటేజీ ఇన్ఫోసిస్(9%), హెచ్‌డీఎఫ్‌సీ(2%) షేర్లు పతనమవడంతో సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. ఐటీ, ప్రైవేట్ రంగ బ్యాంక్ దిగ్గజ కంపెనీలు అంచనాల కంటే తక్కువగా త్రైమాసిక ఫలితాలను వెల్లడించడంతో ఈ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. రానున్న రోజుల్లో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపునకు అనువుగా అమెరికాలో మెరుగైన ఉద్యోగాల గణాంకాలు నమోదయ్యాయి. రేట్ల పెంపు అంచనాలతో ఇన్వెస్టర్లు ఈక్విటీలను విక్రయించి సురక్షితమైన బాండ్లలో పెట్టుబడులకు మొగ్గుచూపారు. ఆర్థిక మాంద్య భయాలు, వడ్డీరేట్ల పెంపు ఆందోళనలతో ఆసియా మార్కెట్లు 1.50-1% పతనమయ్యాయి. యూరప్ సూచీలు పావు శాతం క్షీణించాయి.



ఇన్ఫోసిస్‌కి క్వార్టర్ ఫలితాల షాక్

దేశీయ రెండో అతిపెద్ద ఐటీ దిగ్గజం నాలుగో క్వార్టర్ ఫలితాలు అంచనాల కంటే తక్కువగానే నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి అంచనాలు మార్కెట్ అంచనాల కంటే తక్కువగా 4-7% ఉంటుందని పేర్కొంది. దీంతో పలు బ్రోకరేజ్ సంస్థలు ఈ షేరుకు డౌన్‌గ్రేడ్ రేటింగ్‌ను కేటాయించడంతో పాటు టార్గెట్ ధరను తగ్గించాయి. ఫలితంగా బీఎస్‌ఈలో ఈ షేరు 12% క్షీణించి రూ.1,219 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది. చివర్లో తేరుకొని 9.5% నష్టపోయి రూ.1,258 వద్ద నిలిచింది. షేరు భారీ పతనంతో ఒక్కరోజులోనే కంపెనీ రూ.59,350 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయింది. ఈ ప్రభావం ఇదే రంగానికి చెందిన ఇతర ఐటీ కంపెనీల షేర్లపై పడింది. ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, టెక్ మహీంద్రా, పర్సిస్టెంట్, హెచ్‌సీఎల్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, ఎంఫసిస్ షేర్లు 7-2% చొప్పున నష్టపోయాయి. ఫలితంగా నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా ఐదుశాతం నష్టపోయింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నష్టాల మార్కెట్లోనూ ఐటీసీ షేరు జీవితకాల గరిష్టాన్ని తాకింది. 0.5% లాభంతో రూ.393 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 2% బలపడి రూ.402 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. చివరికి 1% లాభపడి తొలిసారి రూ.400 స్థాయి వద్ద ముగిసింది.
- చివరి క్వార్టర్ ఆర్థిక ఫలితాలపై సానుకూల అంచనాలతో ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్లు భారీగా లాభపడ్డాయి. అత్యధికంగా పంజాబ్ సింధ్ బ్యాంక్ షేరు 18 శాతం ర్యాలీ చేసింది. ఇండియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, ఐఓబీ, మహారాష్ట్ర బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఇండియా, షేర్లు 8-4% చొప్పున పెరిగాయి.

యాపిల్ స్టోర్ ప్రారంభం నేడే



ముంబై: టెక్నాలజీ దిగ్గజం యాపిల్ తొలి స్టోర్ నేడు (మంగళవారం) ముంబైలో ప్రారంభం కానుంది. సంస్థ సీఈవో టిమ్ కుక్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. దేశంలో కంపెనీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ స్టోర్‌ను ప్రారంభిస్తోంది. ఈ కేంద్రంలో 18 భాషలకు చెందిన 100 మంది సిబ్బంది ఉన్నారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఔట్‌లెట్‌ను ఏప్రిల్ 20న ప్రారంభించనున్నారు. 'భారతదేశం చాలా అందమైన సంస్కృతి, అద్భుత శక్తిని కలిగి ఉంది. సుదీర్ఘ చరిత్రను నిర్మించడానికి సంతోషిస్తున్నాం. మా వినియోగదారులకు మద్దతు ఇవ్వడం, స్థానిక కమ్యూనిటీలలో పెట్టుబడి పెట్టడం, మానవాళికి సేవ చేసేందుకు ఆవిష్కరణలతో మెరుగైన భవిష్యత్తును నిర్మించడానికి కలిసి పని చేస్తాం' అని ఈ సందర్భంగా టిమ్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత్‌లో యాపిల్‌కు 2,500 మంది ఉద్యోగులు ఉన్నారు. యాప్ వ్యవస్థ ద్వారా పరోక్షంగా 10 లక్షల ఉద్యోగాలను సృష్టించామని సంస్థ రిటైల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డియోడ్రా ఓబ్రాయెన్ వెల్లడించారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

సిల్వర్ సెట్-2023

కర్నూలులోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల (కోఎడ్యుకేషన్, అటానమస్) 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి సిల్వర్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా వివిధ డిగ్రీ కోర్సు(ఇంగ్లిష్ మీడియం)ల్లో ప్రవేశాలు పొందవచ్చు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత బోధన,భోజన,వసతి, శిక్షణ అందుతుంది.

» **అర్హత:** మార్చి-2023లో 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అర్హులు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరీ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.05.2023.
» **హాల్ టికెట్/అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేది:** 18.05.2023.
» **కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష తేది:** 25.05.2023.
» **వెబ్‌సైట్:** www.sjgckurnool.edu.in

ఐఐఎస్‌ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఐఏటీ-2023)

కేంద్ర విద్యాశాఖ పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్‌ఈఆర్) 2023 విద్యాసంవత్సరంలో బీఎస్, బీఎస్-ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకోసం ఐసర్ అప్టిట్యూడ్ టెస్ట్-2023ని నిర్వహిస్తుంది. కేవైపీవై, జేఈఈ అడ్వాన్స్‌డ్, ఐసర్ అప్టిట్యూడ్ టెస్టు విధానాల్లో అడ్మిషన్ కల్పిస్తారు.

» **అర్హత:** ఏదైనా బోర్డు నుంచి అభ్యర్థులు సైన్స్ గ్రూప్‌లో10+2/ ఇంటర్మీడియెట్ 2022 లేదా 2023లో ఉత్తీర్ణులై ఉండాలి. 12వ తరగతి/ఇంటర్‌లో బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్‌లలో ఏవైనా మూడు సబ్జెక్టులు చదివి ఉండాలి.
» **పరీక్ష విధానం:** పరీక్షలో 60 ప్రశ్నలు ఉంటాయి. బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులలో ప్రతీ సబ్జెక్టు నుంచి 15 ప్రశ్నలు ఉంటాయి.
» **దరఖాస్తు ప్రారంభతేది:** 15.04.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 25.05.2023
» **పరీక్ష తేది:** 17.06.2023.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.iiseradmission.in

కేంద్ర కొలువుల్లో.. వేస్తారా పాగా!

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కొలువుల నగారా మోగించింది! కేంద్ర ప్రభుత్వ శాఖల్లో.. మొత్తం 7,500 గ్రూప్-బి, గ్రూప్-సి పోస్టుల భర్తీకి కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ (సీజీఎల్‌ఈ) నోటిఫికేషన్ విడుదల చేసింది! వీటికి బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో పోటీ పడొచ్చు! ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ -సీజీఎల్‌ఈ-2023 నోటిఫికేషన్ సమాచారం, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 7,500 పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ సీజీఎల్‌ఈ నోటిఫికేషన్
» కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్-బి, గ్రూప్-సి ఉద్యోగాలు
» డిగ్రీ అర్హతతో దరఖాస్తుకు అవకాశం
» రెండు దశల రాత పరీక్షతో ఎంపిక ప్రక్రియ

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ప్రతి ఏటా క్రమం తప్పకుండా సీజీఎల్‌ఈ నోటిఫికేషన్ విడుదల చేస్తోంది. తాజాగా 2023 సంవత్సరానికి సంబంధించి 7,500 పోస్టుల భర్తీకి ప్రకటన ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల్లో వివిధ రకాల ఉద్యోగాలకు నియామక ప్రక్రియ నిర్వహిస్తుంది. వీటిల్లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్,అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సీబీడీటీలో ఇన్‌కం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ (గ్రూప్-సి), అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్(గ్రూప్-బి),సీబీఐలో సబ్ ఇన్‌స్పెక్టర్(గ్రూప్-బి) తదితర పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఆగస్ట్ 1, 2023 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యుఏ, ఎంకాం, బిజినెస్ స్టడీస్‌లో పీజీ లేదా ఎంబీఏ(ఫైనాన్స్) లేదా బిజినెస్ ఎకనామిక్స్‌లో పీజీ చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.
- జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్మీడియెట్ స్థాయిలో మ్యాథమెటిక్స్‌లో 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసుకోవాలి.
- స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్-2 పోస్టులకు స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి
- జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు బ్యాచిలర్ డిగ్రీతోపాటు గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూట్‌లో కనీసం ఏడాది రీసెర్చ్ అనుభవం, ఎల్ఎల్‌బీ లేదా హ్యూమన్ రైట్స్‌లో డిగ్రీ అభిలషణీయం అని పేర్కొన్నారు.
- అన్ని పోస్టులకు డిగ్రీ చివరి సంవత్సరం అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

- గ్రూప్-సి కేడర్ పోస్టులకు ఆగస్ట్ 1, 2023 నాటికి 18-27 ఏళ్లు ఉండాలి.
- మిగతా పోస్టులకు ఆయా పోస్టులను అనుసరించి 18-20ఏళ్లు, 20-30ఏళ్లు, 18-32ఏళ్ల మధ్యలో ఉండాలి.
- అన్ని పోస్టులకు గరిష్ట వయో పరిమితిలో ఎస్‌సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ(జనరల్) అభ్యర్థులకు పదేళ్లు, పీడబ్ల్యూడీ(ఓబీసీ) అభ్యర్థులకు 13 ఏళ్లు, పీడబ్ల్యూడీ (ఎస్‌సీ/ఎస్టీ) అభ్యర్థులకు 15 ఏళ్ల సడలింపు లభిస్తుంది.

వేతనం

- కనిష్ట ప్రారంభ వేతన శ్రేణి రూ.25,500 -రూ.81,100, గరిష్ట ప్రారంభ వేతన శ్రేణి రూ.47,600 -రూ.1,51,100గా ఉంది.

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ



ఎస్ఎస్‌సీ సీజీఎల్‌ఈ 2023

సీజీఎల్‌ఈ పరీక్షను టైర్-1, టైర్-2 పేరుతో రెండు దశల్లో నిర్వహిస్తారు. ఆ వివరాలు..

టైర్-1 ఇలా

ఎంపిక ప్రక్రియలో తొలి దశ పరీక్ష టైర్-1. ఇందులో 100 ప్రశ్నలు-200 మార్కులకు ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(25 ప్రశ్నలు-50 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు-50 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు- 50 మార్కులు), ఇంగ్లిష్ కాంప్రహెన్షన్(25 ప్రశ్నలు-50 మార్కులు) విభాగాల్లో పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి ఒక గంట. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది.

నాలుగు పేపర్లుగా టైర్-2

- టైర్-1లో చూపిన ప్రతిభ, నిర్దేశిత కటాఫ్‌లను పరిగణనలోకి తీసుకుంటూ.. మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి టైర్-2 పరీక్ష ఉంటుంది. టైర్-2 పరీక్షను నాలుగు పేపర్లుగా నిర్వహిస్తారు. వివరాలు..
- **పేపర్-1:** పేపర్-1ను సెషన్-1, సెషన్-2 లుగా నిర్వహిస్తారు. అదే విధంగా ప్రతి సెషన్‌ను రెండు సెక్షన్‌లుగా వర్గీకరించారు. ప్రతి సెక్షన్‌లోనూ రెండు మాడ్యూల్స్ విధానాన్ని అనుసరిస్తారు.
- సెషన్-1(సెక్షన్-1)లో.. మ్యాథమెటికల్ ఎబిలిటీస్(మాడ్యూల్-1), రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్(మాడ్యూల్-2) విభాగాల నుంచి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 60 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 180 మార్కులు ఉంటాయి.
- సెషన్-1(సెక్షన్-2)లో మాడ్యూల్-1లో.. ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌లో 45 ప్రశ్నలు, మాడ్యూల్-2లో జనరల్ అవేర్‌నెస్ విభాగాల్లో 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. మొత్తం 70 ప్రశ్నలకు 210 మార్కులు ఉంటాయి.
- సెషన్-1(సెక్షన్-3) మాడ్యూల్-1లో.. కంప్యూటర్ నాలెడ్జ్ నుంచి 20 ప్రశ్నలతో 60 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- సెషన్-2 సెక్షన్-3 మాడ్యూల్ 2లో.. డేటాఎంట్రీ స్పీడ్ టెస్ట్‌ను 15 నిమిషాల వ్యవధిలో నిర్వహిస్తారు. అభ్యర్థులు రెండు వేల పదాలతో ప్యాసేజ్‌ను టైప్ చేయాల్సి ఉంటుంది.
- పేపర్-2.. స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్‌పై 100 ప్రశ్నలు-200 మార్కులకు ఉంటుంది.
- పేపర్-3.. జనరల్ స్టడీస్(ఫైనాన్స్ అండ్ ఎకనామిక్స్)పై 100 ప్రశ్నలు- 200 మార్కులకు ఉంటుంది. ఈ పేపర్‌ను పార్ట్-ఎ(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్-80 మార్కులు); పార్ట్-బి(ఎకనామిక్స్ అండ్ గవర్నెన్స్-120 మార్కులు)గా రెండు విభాగాలుగా నిర్వహిస్తారు.
- పేపర్-1లోని అన్ని సెషన్స్, సెక్షన్స్, మాడ్యూల్స్‌కు అన్ని పోస్టుల అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుంది.
- పేపర్-2ను జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్, స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్-2 పోస్టుల అభ్యర్థులకు మాత్రమే నిర్వహిస్తారు.
- పేపర్-3ని అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు మాత్రమే ఉంటుంది.

నిర్దిష్ట ప్రణాళికతోనే రాణింపు

దాదాపు అయిదు లక్షల మంది పోటీ పడే ఎస్ఎస్‌సీ సీజీఎల్‌ఈలో రాణించాలంటే.. అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌ల వారీగా నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి. సబ్జెక్ట్‌ల వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు..

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

అభ్యర్థుల్లోని విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో స్కోర్ కోసం కోడింగ్, డీ-కోడింగ్, అనలిటికల్ పజిల్స్, క్రిటికల్ రీజనింగ్ బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇంగ్లిష్ అక్షర క్రమాన్ని ముందు నుంచి వెనుకకు, వెనుక నుంచి ముందుకు ప్రాక్టీస్ చేయాలి. దీంతోపాటు ఏ అక్షరం ఎన్నో స్థానంలో ఉందో సులువుగా గుర్తించాలి. అదే విధంగా అనలిటికల్ రీజనింగ్, సిలాజిజమ్స్, ఇనీక్వాలిటీస్, ఇన్‌పుట్ అవుట్‌పుట్, డేటా సఫిషియెన్సీ విభాగాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో రాణించేందుకు హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా స్టాక్ జీకే, కరెంట్ అఫైర్స్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం హైస్కూల్ స్థాయి మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజెస్, యావరేజెస్, రేషియో-ప్రపోర్షన్, ప్రాఫిట్-లాస్, సింపుల్-కాంపౌండ్ ఇంట్రెస్ట్, టైమ్-వర్క్, టైమ్-డిస్టెన్స్, పర్ముటేషన్స్-కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, మిక్చర్ అండ్ అలిగేషన్స్, పార్టనర్ షిప్‌పై దృష్టిపెట్టాలి. భాగహారాలు, కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక అంశాలను నోటితో గణించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. సింప్లిఫికేషన్స్‌కు సంబంధించి బోడ్‌మస్ రూల్స్‌ను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యల వర్గాలు, ఘనాలు గుర్తించుకోవాలి.

ఇంగ్లిష్ కాంప్రహెన్షన్

అభ్యర్థులు బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, రీడింగ్ కాంప్రహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు స్పెల్లింగ్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, టెన్సెస్, ప్రిపోజిషన్స్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, వొకాబులరీ, రీ రైటింగ్ ద సెంటెన్స్, సెంటెన్స్ రీ-అరేంజ్‌మెంట్, ఆల్ఫాబెటికల్ ఆర్డర్, ప్రెసిస్ రైటింగ్, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, కాంప్లెక్స్ సెంటెన్సెస్ వంటి ముఖ్యాంశాలపై దృష్టి సారించాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, వొకాబ్యులరీల్లోనూ పూర్తి స్థాయిలో నైపుణ్యం పొందాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగంలో రాణించేందుకు కంప్యూటర్ ఫండమెంటల్స్, బేసిక్ కంప్యూటర్ స్ట్రక్చర్, ఆపరేటింగ్ సిస్టమ్, నెట్‌వర్క్, ఇంటర్నెట్, సాఫ్ట్‌వేర్ కాన్సెప్ట్స్, డీబీఎంఎస్, ఎంఎస్ ఆఫీస్‌లకు సంబంధించి బేసిక్ టెర్మినాలజీపై పట్టు సాధించాలి. సిస్టమ్‌కు సంబంధించి హార్డ్‌వేర్ టూల్స్, వాటి ఉపయోగాలు వంటి వాటిపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

పేపర్-2, పేపర్-3లకు ఇలా

జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్, స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే పేపర్-2, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు జరిపే పేపర్-3లలో రాణించేందుకు అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో అకడమిక్ పుస్తకాలను చదవాలి. అదే విధంగా గత ప్రశ్న పత్రాలు, నమూనా ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** మే 3, 2023
- **దరఖాస్తు సవరణ:** మే 7, 8 తేదీల్లో
- **టైర్-1 పరీక్ష:** జూలై, 2023లో నిర్వహించే అవకాశం
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి,విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in

క్లుప్తంగా...

నేటి నుంచి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ

సాక్షి, అమరావతి: ఉమ్మడి రాష్ట్రానికి పంపిణీ చేసిన కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణలకు కేటాయింపులు చేయడంపై మంగళవారం, బుధవారం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ చేపట్టనుంది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు తెలంగాణ సర్కార్ 90 టీఎంసీలను కేటాయిస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన ఇంటర్ లొకేటరీ అప్లికేషన్‌పై ఈనెల 12, 13న ట్రిబ్యునల్ విచారించింది. ఈ అంశంపై రెండు రాష్ట్రాల వాదనలు విన్న ట్రిబ్యునల్.. విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

మే 10న కృష్ణా బోర్డు సర్వ సభ్య సమావేశం

సాక్షి, అమరావతి: కృష్ణా బోర్డు సర్వ సభ్య సమావేశం మే 10న నిర్వహించాలని బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ నిర్ణయించారు. రెండు రాష్ట్రాల జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శుల సమ్మతి మేరకు ఈ నెల 27న నిర్వహించాల్సిన సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆయన ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖల ముఖ్య కార్యదర్శులకు సోమవారం లేఖ రాశారు. బోర్డు పరిధిని ఖరారు చేస్తూ 2021, జూలై 15న కేంద్ర జల్ శక్తి శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలే ప్రధాన అజెండాగా ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను బోర్డు అధీనంలోకి తేవడంపై ఇందులో చర్చిస్తారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో 2 రాష్ట్రాలు వినియోగించుకున్న నీటి లెక్కలను తేల్చి.. 2023–24 నీటి సంవత్సరంలో నీటి పంపిణీపై చర్చించనున్నారు.

సీబీఏ-3, ఎస్‌ఏ-2 పరీక్షల సమయాల్లో మార్పు

సాక్షి, అమరావతి: ఏపీలో ఈ నెల 20 నుంచి నిర్వహించే క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ)–3, సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ)–2 పరీక్షల సమయాల్లో మార్పులు చేశారు. గతంలో ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12.15 వరకు నిర్వహించేలా షెడ్యూల్ ఇచ్చారు. ఎండలు పెరుగుతున్నందున ఈ సమయాల్లో మార్పులు చేస్తున్నట్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి సోమవారం తెలిపారు. 1వ తరగతి నుంచి 8వ తరగతి పిల్లలకు ఉదయం 8–11 గంటల వరకు, 9వ తరగతి పిల్లలకు ఉదయం 8–11.15 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తారు.

25 వరకు ఏయూఈఈటీ దరఖాస్తుకు గడువు

- మే 3న పరీక్ష

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)లో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏయూఈఈటీ–2023 ప్రవేశ పరీక్షకు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం ఏయూ సెనెట్ మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఈ పరీక్షకు ఇంటర్ విద్యార్హత కలిగిన, ఇంటర్ చివరి సంవత్సరం పరీక్షలు రాసిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.750 అపరాధ రుసుముతో ఈ నెల 30 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. మే 3న విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప కేంద్రాల్లో పరీక్షను నిర్వహించి, మే 5న ఫలితాలు విడుదల చేస్తామన్నారు. ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులు నాలుగేళ్ల అనంతరం బీటెక్ డిగ్రీతో వెళ్లే అవకాశం ఉందన్నారు. విద్యార్థి కోరితే ఎంటెక్ కోర్సునూ పూర్తిచేసే అవకాశం కల్పిస్తామన్నారు. www.audoa.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అవినీతి రాజకీయాల ప్రక్షాళన: సోము వీర్రాజు



సోము వీర్రాజును సత్కరిస్తున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, నేతలు

గుంటూరుమెడికల్: అవినీతి మయమైన భారతదేశ రాజకీయాలను కమలం ప్రక్షాళన చేస్తున్నదని, సావర్కర్‌ను విమర్శించే అర్హత రాహుల్‌గాంధీకి లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ కార్యాలయంలో సోమవారం పలు పార్టీల నుంచి మైనారిటీ నేతలు సోము వీర్రాజు సమక్షంలో బీజేపీలో చేరారు. సోము వీర్రాజు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గుంటూరు నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్త బీజేపీలో చేరబోతున్నారని తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత లిక్కర్ పాలసీలో అడ్డంగా దొరికిపోయారని పేర్కొన్నారు. పులివెందుల విషయంలో కానీ, ఢిల్లీ కేజ్రీవాల్ విషయంలో కానీ చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేనతో కలిసి పోటీ చేయబోతున్నట్లు చెప్పారు. బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బిట్రా శివన్నారాయణ, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, యడ్లపాటి స్వరూపరాణి, బాషా, షేక్ గౌస్ పీరా పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఇఫ్తార్ విందు సందర్భంగా నమాజులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్రాభివృద్ధికి అందరూ ప్రార్థించాలి

దేవుని ఆశీస్సులతో అందరూ బాగుండాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆకాంక్ష

రంజాన్ సందర్భంగా ఏపీ ప్రభుత్వం ఇఫ్తార్ విందు

సాక్షి, అమరావతి: రాష్ట్రాభివృద్ధి కోసం అందరూ ప్రార్థించాలని, దేవుని ఆశీస్సులతో అందరూ బాగుండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆత్మీయత, స్నేహభావాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఇచ్చింది. విజయవాడ విద్యాధరపురంలోని మినీ స్టేడియంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేలాది మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఉర్దూలో ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. 'ఈ రంజాన్ మాసంలో మీరంతా సంతోషంగా ఉండాలి, మీ అందరి ప్రార్థనలు ఫలించాలి, మీకు అంతా శుభం కలగాలి' అని సీఎం జగన్ ఆకాంక్షించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలోని మైనార్టీలకు సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో మైనార్టీలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ముస్లింల సంక్షేమం కోసం అత్యధిక నిధులిచ్చిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. ముస్లింలకు ఉపముఖ్యమంత్రి పదవి, శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని.. రాజకీయ, ఆర్థిక, సామాజికంగా ముస్లిం మైనార్టీలకు జగన్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన వివరించారు. గత ప్రభుత్వం మైనార్టీలకు తీవ్ర ద్రోహం చేసిందని, ముస్లింలకు మంత్రి పదవి కూడా ఇవ్వని చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చి మభ్యపెట్టేందుకు ప్రయత్నించారని అంజాద్ బాషా గుర్తుచేశారు. పలువురు ముస్లిం ప్రతినిధులు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ పాలన ముస్లింలకు స్వర్ణయుగమని, మరో మూడు పర్యాయాలు వైఎస్ జగన్ సీఎంగా ఉండేలా అల్లాను ప్రార్థించాలన్నారు.

టోపీ, కండువా ధరించి సీఎం నమాజ్

ఇక ముస్లిం సంప్రదాయం ప్రకారం టోపీ, పవిత్ర కండువా ధరించిన సీఎం వైఎస్ జగన్ ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ ఆచరించారు. అనంతరం వారితో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జోగి రమేష్, కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, ముస్తఫా, నవాజ్ బాషా, వెలంపల్లి శ్రీనివాస్, కె. రక్షణనిధి, ఎమ్మెల్సీలు రుహుల్లా, లేళ్ల అప్పిరెడ్డి, పోతుల సునీత, ప్రభుత్వ సలహాదారులు హబీబుల్లా, ఎస్ఎం జియాఉద్దీన్, అలీ, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ విభాగం చైర్మన్ వి.ఖాదర్‌బాషా, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికారాము తదితరులతో పాటు పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మరికొన్ని రోజులు భగభగ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో మరో 3 రోజులు అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు, రాయలసీమ జిల్లాల్లో 38 నుంచి 42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. మంగళవారం రాష్ట్రంలోని 117 మండలాల్లో వడగాడ్పులు వీయడంతోపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు.

ప్రధాన కేంద్రాల్లో సోమవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	45.6	25.8
రాజమహేంద్రవరం	43.5	26.0
నంద్యాల	42.7	24.8
కర్నూలు	42.6	27.4
విజయవాడ	42.0	26.0
శ్రీకాకుళం	42.0	26.0
ఏలూరు	42.0	26.0
మార్కాపురం	42.0	24.0
కడప	41.0	22.5
అనకాపల్లి	40.5	26.8
నెల్లూరు	40.0	25.5
తిరుపతి	40.0	22.0
విశాఖపట్నం	39.8	27.4
విజయనగరం	39.0	30.0
తెలంగాణలో..		
ఆదిలాబాద్	42.5	23.5
రామగుండం	41.0	23.4
హైదరాబాద్	38.7	24.2

ఏపీపై పవన్‌కు ఎందుకంత కోపం?

▶ మొదటి పేజీ తరువాయి

కొందరు స్పందించారు. అయితే, తెలంగాణ మంత్రి ఏపీని అవమానిస్తూ మాట్లాడితే కోపం రాని పవన్.. ఏపీ మంత్రులకు, వైఎస్సార్‌సీపీకి ఒక వీడియో ద్వారా వార్నింగ్ ఇస్తారా? అంటే పవన్ ఎవరికి వకాల్తా పుచ్చుకున్నారు? ఎవరి పక్షాన మాట్లాడుతున్నారు? అసలు తన పరిస్థితి ఏమిటో పవన్ చూసుకున్నారా? నిజానికి.. ఆయన ఇల్లు, కాపురం అన్నీ హైదరాబాద్‌లో ఉన్నాయి. అక్కడే సినిమాలు కూడా చేసుకుంటున్నారు. అందుకే తెలంగాణపై ప్రేమ, గౌరవం చూపుతారా? మరి, అలాంటప్పుడు ఆంధ్ర రాష్ట్రంపై మమకారంలేని వ్యక్తి రాజకీయ ప్రేమలెందుకు ప్రదర్శిస్తున్నారు?

తెలంగాణపై బంధం ఎప్పుడు బలపడిందో చెప్పాలి..

తెలంగాణ ప్రజలను మేం ఏమీ అనకపోయినా వైఎస్సార్‌సీపీపై పవన్‌కళ్యాణ్ బురద జల్లుతున్నారు. అసలాయన తెగ బాధ పడిపోవడానికి కారణమేంటో చెప్పాలి. రాష్ట్రాన్ని విడగొడితే ఆయనకు ఏడుపొచ్చిందని, 11 రోజులు అన్నం తినడం మానేశానని గతంలో పవన్ స్వయంగా చెప్పారు. మరిప్పుడు కొత్తగా తెలంగాణ పక్షాన ఈ ప్రేమలేంటో? ఈ బంధం ఎప్పుడు బలపడిందో ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు తెలియాల్సిన అవసరముంది. అలాగే, 'అరేయ్ కేసీఆర్.. నువ్వు నన్ను తిడితే నేను భరిస్తాను.. ప్రధానమంత్రిని తిడితే మాత్రం తాటతీస్తాను..' అని బహిరంగంగా ఒక సభలో పెద్దగా కేకలేస్తూ మరీ తిట్టిన పవన్.. ఈరోజు ఇలా భిన్నమైన స్వరం వినిపిస్తుండటంలో ఆంతర్యం ఏమిటో అందరికీ అర్థమైంది. తెలంగాణకు వైఎస్సార్‌సీపీ నేతలు క్షమాపణలు చెప్పాలని పవన్ డిమాండ్ చేస్తున్నారట? ఆయన దృష్టిలో క్షమాపణలు ఎలా ఉంటాయంటే.. 'అమ్మా కవిత, తెలంగాణ ప్రజలకు నేను క్షమాపణ చెప్పాల్నా.. క్షమాపణ చెప్పాల్నా వద్దా అనేది మా వ్యక్తిగత విషయం..' అని పవన్ గతంలో అన్నారు. అందుకే, ఈరోజు ఆయనకు మేమిచ్చే సమాధానం కూడా అదే. పవన్ ఈ విషయం తెలుసుకోవాలి. ఇప్పటికైనా ఆయన నిజాయితీగా వ్యవహరిస్తే బాగుంటుంది. అంతేగానీ.. లేనిపోని ఆరోపణలతో అటు చంద్రబాబు కోసమో.. ఇటు తెలంగాణ కోసమో రాజకీయం నడపడం పద్ధతికాదు.

కిరాయి మాటలు మాట్లాడొద్దు..

ఇక విశాఖ స్టీల్‌పై పవన్‌వి గాలి మాటలు. దానిపై చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీ వెళ్లి నిలదీయాలి కానీ, కిరాయి మాటలు మాట్లాడొద్దు. ఆయనకు తెలంగాణపై ప్రేమ ఎందుకో ఏబీఎన్ రాధాకృష్ణ తన పలుకుల్లో చెప్పారు. 'రూ.వెయ్యికోట్లు ఖర్చయినా పర్లేదు మీరు నాతో చేతులు కలపండని పవన్ వద్దకు కేసీఆర్ దూతల్ని పంపారు..' అని ఏబీఎన్ రాధాకృష్ణ పలుకుల్లో అందరూ విన్నారు. రాష్ట్ర ప్రజలంతా పవన్ నిజస్వరూపం తెలుసుకున్నారు. ఇక వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణ వక్రమార్గం పట్టింది. చంద్రబాబు కనుసన్నల్లోనే ఈ దర్యాప్తు జరుగుతోంది. మీడియా సమావేశంలో పవన్ గతంలో కేసీఆర్‌పై, తెలంగాణ గురించి, ఆంధ్రుల ఆత్మగౌరవం గురించి.. మాట్లాడిన మాటల వీడియోలను ప్రదర్శించారు.

వైఎస్సార్‌సీపీ నేతలు తెలంగాణకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

- జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: తెలంగాణ మంత్రి హరీష్‌రావు ఏపీకి సంబంధించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ పలువురు రాష్ట్ర మంత్రులు, అధికార వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు మాట్లాడడాన్ని జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ తప్పుబట్టారు. వైఎస్సార్‌సీపీ నేతలు తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన వీడియో సందేశంతో ఓ మీడియా ప్రకటనను ఆ పార్టీ సోమవారం విడుదల చేసింది. అందులో పవన్ ఏమన్నారంటే.. 'మొన్న ఈ మధ్య మంత్రి హరీష్‌రావు ఏ సందర్భంలో ఏమి మాట్లాడారో అవన్నీ వేరే ఇది.. కానీ, దానికి ప్రతిస్పందిస్తూ, ప్రతి విమర్శలు చేస్తూ వైఎస్సార్‌సీపీ మంత్రులు, నాయకులు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడడం నాకు వ్యక్తిగతంగా మనస్తాపం కలిగించింది. తెలంగాణ మంత్రి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ నాయకులు హద్దులు దాటి మాట్లాడారు. మీరందరూ కొంచెం నోరు అదుపులో పెట్టుకోండి. మీరు తిట్టాలి అనుకుంటే, ఆ వ్యాఖ్యలు మీకు కించపరిచేలా ఉన్నాయి అనుకున్నప్పుడు ఆ సదరు మంత్రినిగానీ, వ్యక్తినిగానీ అనండి.. ఇలాంటి వివాదాల్లోకి తెలంగాణ, తెలంగాణ ప్రజానీకాన్ని దయచేసి లాగకండి. దయచేసి వైఎస్సార్‌సీపీ నాయకులందరికీ నా విన్నపం. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కూడా దీనిపై స్పందించాలి. ఒక జాతిని తిడుతున్నప్పుడు ఏం చేస్తున్నారు? మీ అందరికీ తెలంగాణలో వ్యాపారాలు లేవా... మీ అందరికీ తెలంగాణలో ఇళ్లులేవా, బొత్సలాంటి వారు కేబుల్ వ్యాపారాలు చేసిన వాళ్లేగా ఒకప్పుడు. ఇప్పటికీ ఉన్నాయేమో తెలీదు. మంత్రివర్గంలో ఎవరైనా, ఎమ్మెల్యేలుగానీ అదుపుతప్పి మాట్లాడితే, ముఖ్యమంత్రి సహా దానిని ఖండించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిన అవసరం ఉంది'.. అంటూ పవన్ ఆ వీడియోలో వ్యాఖ్యానించారు.

ఉషోదయ పిటిషన్ ఢిల్లీ హైకోర్టుకు బదిలీ

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో వార్తాపత్రిక కొనుగోలు నిమిత్తం వలంటీర్లకు రూ.200 ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ (ఈనాడు ప్రచురణ సంస్థ) దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేసింది. ఈ పిటిషన్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్డీ వాలాలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని భావిస్తున్నామని ధర్మాసనం వ్యాఖ్యానించగా.. ఏపీ హైకోర్టుపై దుమారం లేపినట్లుగా ఉంటుందని ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏపీ హైకోర్టుకు ఎలాంటి ఉద్దేశాలు ఆపాదించడం లేదని, అలా జరగకుండా చూస్తామని సీజేఐ పేర్కొన్నారు. ఇది ఈనాడు వర్సెస్ సాక్షిలా కాకుండా రెండు రాజకీయ పార్టీల మధ్య వ్యవహారంలా ఉందన్నారు. ఇతర హైకోర్టులపై ఎక్కువ భారం ఉండడంతో ఢిల్లీ హైకోర్టుకు ఈ పిటిషన్‌ను బదిలీ చేస్తున్నామని తెలిపారు. సాక్షి తరపున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ ఫిర్యాదులో వాస్తవం లేదని తేలిందన్నారు. ఓ ప్రైవేటు సంస్థపై ఉషోదయ పిటిషన్ దాఖలు చేసిందని.. అసలు ఉషోదయ ఏం కోరుకుంటోందని ప్రశ్నించారు? ఆడిట్ బ్యూరో ఆడిట్ చేయలేదా అని ప్రశ్నించారు. పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయడం న్యాయ ప్రయోజనాల దృష్ట్యానే ఉంటుందని సీజేఐ చంద్రచూడ్ తెలిపారు. ఈ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారించాలని ఆదేశించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు పొడిగింపు

- వచ్చే ఏడాది మార్చి 31 వరకు కొనసాగింపు
- ఆర్థికశాఖ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: వివిధ శాఖలు, శాఖాధిపతుల కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. శాఖాధిపతులు, సచివాలయ శాఖలు, జిల్లా కలెక్టరేట్లలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగుల పదవీకాలం ఈ ఏడాది మార్చి 31వ తేదీతో ముగిసింది. ఈ నేపథ్యంలో వారి పదవీకాలాన్ని వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తూ ఆర్థికశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు సంబంధిత శాఖల ప్రత్యేక సీఎస్‌లు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులు, కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో సూచించింది. అనుమతించిన దానికన్నా కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు పొడిగించరాదని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

మే 3న భోగాపురం విమానాశ్రయానికి శంకుస్థాపన

- ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా



సింధియాను ఆహ్వానిస్తున్న అమర్‌నాథ్

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం భోగాపురం విమానాశ్రయ నిర్మాణానికి మే 3వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా జరిగే ఈ భూమిపూజ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా హాజరుకానున్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాలవలవన్ సోమవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి సింధియాను కలిసి భోగాపురం విమానాశ్రయ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. దీంతో పాటు రాష్ట్ర విమానయాన రంగానికి సంబంధించిన ఇతర సమస్యలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ 2,200 ఎకరాల్లో భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నామని, 30 నెలల్లోగా ఇది అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

ఏపీ ప్రజలకు పవన్ క్షమాపణ చెప్పాలి

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు హెచ్చరిక

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజలను కించపరిచేలా మాట్లాడిన పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పాకే ఈ రాష్ట్రంలో పర్యటనకు రావాలని.. పైగా ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి హెచ్చరించారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో చంద్రబాబు దగ్గర, తెలంగాణలో కేసీఆర్ వద్ద ప్యాకేజీ తీసుకుని పవన్ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలతో ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం రాష్ట్ర మంత్రులు నిరంతర కృషిచేస్తున్న విషయం పవన్‌కు కనిపించడంలేదన్నారు. ఏపీలో అభివృద్ధి లేదని తెలంగాణ మంత్రి హరీష్ మాట్లాడితేనే రాష్ట్ర మంత్రులు బదులిచ్చారన్నారు. కేవలం ఆయన చేసిన వ్యాఖ్యలకు మంత్రులు బదులిచ్చారే తప్ప, తెలంగాణ ప్రజలను ఏమి అనలేదని పవన్‌కు తెలీదా? అని శేషు ప్రశ్నించారు. ఇదిసాకుగా తీసుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై పవన్ తన అక్కసు మరోసారి బయటపెట్టాడని ఎద్దేవా చేశారు. కలలో కూడా పవన్‌కు వైఎస్సార్‌సీపీ, సీఎం వైఎస్ జగనే గుర్తొస్తున్నట్లు ఉందన్నారు. ఏపీని కించపరిచేలా హరీష్‌రావు వ్యాఖ్య చేసినా స్పందించని పవన్‌కు ఏపీ మంత్రుల గురించి మాట్లాడే స్థాయి లేదన్నారు. రాజకీయ కక్షతో మంత్రులపై పవన్ బురద చల్లుతున్నాడన్నారు.

ఏపీ మంత్రులపై మళ్లీ నోరు పారేసుకున్న హరీశ్

ఉన్న మాటంటే ఎగిరెగిరి పడుతున్నారంటూ వ్యాఖ్యలు

సాక్షి, సిద్దిపేట: ఆంధ్రప్రదేశ్ మంత్రులపై తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు మళ్లీ నోరు పారేసుకున్నారు. ఇటీవల ఏపీని ఉద్దేశించి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ ఏపీ మంత్రులు స్పందించడం తెలిసిందే. దీనిపై సోమవారం సిద్దిపేట అర్బన్ మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు మాట్లాడుతూ తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకునేందుకు ప్రయత్నించారు. తాను తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ మాట్లాడాను తప్ప ఏపీ ప్రజలు, మంత్రుల గురించి తప్పుగా మాట్లాడలేదని, కానీ దీనికి ఏపీ మంత్రులు ఎగిరెగిరి పడుతున్నారని, ఉన్నది అంటే ఉలిక్కి పడుతున్నారంటూ ఆయన ఎదురుదాడికి దిగారు. 'ఏపీ మంత్రులకు చేతనైతే ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కుపై పోరాడండి. పోలవరం త్వరగా పూర్తి చేసి కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగా నీళ్లు అందించండి' అని అన్నారు.

పేదల బియ్యాన్ని దోచేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు: నారా లోకేశ్

కర్నూలు(అర్బన్)/ఆలూరు: పేదల బియ్యాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు దోచేస్తున్నారని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి రూ.6,700 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. యువగళం పాదయాత్రలో భాగంగా సోమవారం ఆయన ఆలూరు నియోజకవర్గంలోని దేవనకొండ మండలం గుండ్లకొండ, గుడిమిరాళ్ల, వెంకటాపురం, నేలతలమర్రి గ్రామాల్లో ప్రజలు, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ ఇంటింటికీ రేషన్ వాహనాల్లో రూ.200 కోట్లు దోచేశారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రేషన్ బియ్యంలో అక్రమాలకు పాల్పడిన వైఎస్సార్‌సీపీ నేతలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం వైఎస్ జగన్ రైతు రహిత పాలన సాగిస్తున్నారని చెప్పారు. వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్ కోర్టు దొంగ అని, ఆయన రైతుల దగ్గరకు ఏనాడైనా వచ్చాడా... అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక పంటలకు గిట్టుబాటు ధర ఇస్తామని, టమోటా రైతులను ఆదుకునేందుకు జ్యూస్ ఫ్యాక్టరీ పెడతామన్నారు. తన పాదయాత్ర పూర్తయ్యాక చర్చించి రాయలసీమకు ఏమి చేయాలనేది మేనిఫెస్టోలో పెడతామన్నారు. కాగా, 'మీ నాన్న సీఎంగా ఉన్నప్పుడు రైతులు, కూలీలు, మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చినా ఒక్కటీ నెరవేర్చలేదు...' అని లోకేశ్‌ను కె.వెంకటాపురంలో మహిళలు ప్రశ్నించారు. 'చాలా ఏళ్ల కిందట మీ నాన్న ఇక్కడ జింకల పార్కు ఏర్పాటు చేస్తానని చెప్పినా పట్టించుకోలేదు...' అని రైతులు ఆంజనేయులు, శాంతమ్మ, లక్ష్మన్న చెప్పారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ జింకలపార్కు గురించి తనకు అవగాహన లేదన్నారు.

హైకోర్టు విచారణ ఎదుర్కోండి

- గల్లా జయదేవ్ పిటిషన్ కొట్టేసిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ ఎన్నికను సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఆయన హైకోర్టులో విచారణ ఎదుర్కోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీనికి సంబంధించి జయదేవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. తన ఎన్నికను సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మోదుగల వేణుగోపాల్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కొట్టేయాలంటూ గల్లా జయదేవ్ తొలుత ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. మెరిట్స్‌పై విచారణ చేస్తామంటూ ఏపీ హైకోర్టు గల్లా జయదేవ్ పిటిషన్ కొట్టేసింది. దీంతో జయదేవ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జె.కె.మహేశ్వరి ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. హైకోర్టులో విచారణ ఎదుర్కోవాలని స్పష్టం చేస్తూ ధర్మాసనం ఆ పిటిషన్‌ను కొట్టేసింది.

ఏపీ ఈఏపీసెట్‌కు దరఖాస్తుల వెల్లువ

- ఇంజనీరింగ్ విభాగానికి గతేడాది కంటే అధికం
- సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సి.శోభాబిందు

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్–2023కు భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సి.శోభాబిందు వెల్లడించారు. సోమవారం అనంతపురంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో గతేడాది కంటే అధికంగా విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. గతేడాది ఇంజనీరింగ్ విభాగంలో 2,06,579 దరఖాస్తులు రాగా.. ఈసారి ఇప్పటికే 2,32,064 దరఖాస్తులు అందాయి. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 15తో దరఖాస్తుకు గడువు ముగిసింది. ఇక అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 96,250 దరఖాస్తులు వచ్చాయి. ఇంజనీరింగ్, అగ్రికల్చర్– ఫార్మసీ రెండు విభాగాలకు దరఖాస్తు చేసుకున్నవారు 939 మంది ఉన్నారు. మొత్తం మీద అన్ని విభాగాలకు 3,29,253 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 30 వరకు, రూ.1,000 అపరాధ రుసుముతో మే 5 వరకు, రూ.5 వేల అపరాధ రుసుముతో మే 12 వరకు, రూ.10 వేల అపరాధ రుసుముతో మే 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని శోభాబిందు తెలిపారు. మే 4 నుంచి 6 వరకు విద్యార్థుల డేటాలో మార్పులుచేర్పులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి దరఖాస్తులు అధికంగా రావడంతో 9 సెషన్లలో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గతంలో 8 సెషన్లలోనే పరీక్ష నిర్వహించాలని భావించినప్పటికీ దరఖాస్తులు అధికంగా రావడంతో మరో సెషన్ అందుబాటులోకి తెచ్చామన్నారు. విద్యార్థులు ఇచ్చిన తొలి మూడు ఆప్షన్లలోనే పరీక్ష కేంద్రం ఉంటుందని చెప్పారు. పూర్తి చేసిన ఈఏపీసెట్ దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించాలని విద్యార్థులకు సూచించారు. మే 15 నుంచి ఇంజనీరింగ్ విభాగంలో ప్రవేశపరీక్షలు ప్రారంభమవుతాయన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943